# ప్రభుత్వ డిగ్రీ కళాశాల

ISO 50001:2011, ISO 14001:2015, ISO 9001:2015, NAAC - B

అవనిగడ్డ, కృష్ణా జిల్లా, ఆంధ్రప్రదేశ్

Vol. : 26    Issue : 6 (2)    Spl. Edition ఏప్రిల్ - 2023    ISSN No. : 2457-0796


Azadi Ka Amrit Mahotsav

## జాతీయ సదస్సు

# తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు


## "They Mirrored the Struggle"

8 ఆగస్టు, 2022


UGC APPROVED JOURNAL

మూసీ ప్రత్యేక సంచిక

సాహిత్య సాంస్కృతిక చారిత్రక మాస పత్రిక

నిర్వహణ

తెలుగు శాఖ

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ, కృష్ణా జిల్లా




**జ్యోతి ప్రజ్వలన :** ప్రొ. కె.వి.బి. చంద్రశేఖర్, వైస్ ఛాన్స్లర్, ప్రొ. ఎన్. ఉషారాణి, ఆంగ్లశాఖ, కృష్ణా విశ్వవిద్యాలయం, మచిలీపట్నం, డా. ఎస్. జగన్మోహనరావు, ప్రిన్సిపాల్, జి.డి.సి; బంటుమిల్లి




స్వాగత వచనాలు : వర్ల అరుణ కుమారి

**పుష్పగుచ్ఛం అందజేత :** ప్రొ. కె.వి.బి. చంద్రశేఖర్, వైస్ చాన్స్లర్, డా. నాళేశ్వరం శంకరం, తెరసం అధ్యక్షులు గార్లకు








ముఖ్య అతిథిగా విచ్చేసిన కృష్ణా విశ్వవిద్యాలయం, ప్రొ.కె.వి.బి.చంద్రశేఖర్ గారి చేతుల మీదుగా సదస్సు పత్రసంగ్రహాల సంచిక ఆవిష్కరణ, తదనంతరం వారి ప్రసంగం

Scanned with OKEN Scanner



వ్యవస్థాపకులు

**శ్రీ బి.ఎన్.శాస్త్రి**



# మూసీ

సాహిత్య సాంస్కృతిక చారిత్రక

చదివి దాచుకోదగిన ఏకైక తెలుగు మాసపత్రిక

**సంపుటి : 26 సంచిక : 6 (2) ఏప్రిల్ - 2023**

**సంపాదకులు** (EDITOR)
సాగి కమలాకర శర్మ
**SAGI KAMALAKARA SHARMA**

**సహ సంపాదకులు (ASSOCIATE EDITOR)**
డా. దత్తయ్య అట్టెం
**Dr. DATTAIAH ATTEM**

**Printed and Published by**
**B. Anantha Laxmi**

*Type Setting at :*
**Kavyasree Graphics**
**Ph: 934 797 1177**

**Printed at : Sri Sai Process Ph. 27563075**

**విడిప్రతి : 20/-**
**సంవత్సర చందా : 200/-**
**శాశ్వత సభ్యత్వం : 2500/-**
**(పది సంవత్సరాలు మాత్రమే)**

చెక్కులు, డి.డి.లు **'మూసీ తెలుగు మాసపత్రిక' (MUSI Telugu Monthly Magazine)** పేరుపై మాత్రమే పంపాలి.

వివరాలకు : **మేనేజర్, మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట, బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013


**ఈ పత్రికలోని వ్యాసాలు, అభిప్రాయాలు ఆ యా రచయితల సొంతమే కాని పత్రికకు ఆ అభిప్రాయాలతో ఎటువంటి సంబంధం లేదు.**


*Printed, Published and Owned by* : **B. Anantha Laxmi,**
3-4-245/1, Lingampally, Kachiguda, Hyderbad - 500 027. Telangana.
*Office :* 2-2-1109/BK-LIG 10, Bathukammakunta, Bagh Amberpet, Hyderabad - 13.
*Printed at* Sri Sai Process, 3-4-612/1, Narayanguda, Hyderabad - 500 029. Telangana.
*Editor :* **Dr. Sagi Kamalakara Sharma. RNI No. 37723/80**


Scanned with OKEN Scanner

# జాతీయ సదస్సు ప్రత్యేక సంచిక

# తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు

8 ఆగస్టు, 2022

**మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక**

ప్రథమ ముద్రణ : ఏప్రిల్, 2023

ప్రతులు : 500

కాపీలకు : ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ, కృష్ణాజిల్లా, ఆం.ప్ర.

**గమనిక :** ఈ సంచికలోని వ్యాసకర్తల అభిప్రాయాలతో సంపాదక వర్గానికి సంబంధం లేదు.

ఎడిటోరియల్ చిరునామా
మేనేజర్, **మూసీ మాసపత్రిక,**
2-2-1109/బికె - ఎల్ఐజి-10, బతుకమ్మకుంట,
బాగ్ అంబర్‌పేట, హైదరాబాద్ - 500 013
ఫోన్ : 934 797 1177
email : editormusi@gmail.com

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ, కృష్ణాజిల్లా

ISO 50001:2011, ISO 14001:2015, ISO 9001:2015

NAAC - B

# తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు

8 ఆగస్టు, 2022

గౌరవ సంపాదకులు

**డా. డి. ఉమారాణి,** ఎం.ఏ, పిహెచ్.డి., ప్రిన్సిపల్

ప్రధాన సంపాదకులు

**డా. కే. వి. శాంత కుమారి,** ఎం.ఏ, ఎం.ఫిల్, పిహెచ్.డి., తెలుగు శాఖాధ్యక్షులు

సహాయ సంపాదకులు

**అన్నపరెడ్డి వీరకుమారి,** ఎం.ఏ, సహాయ అధ్యాపకులు, అర్థశాస్త్ర విభాగం

**శ్రీమతి వర్ల అరుణ కుమారి,** ఎం.ఏ, సహాయ అధ్యాపకులు, ఆంగ్లశాఖ

**తెలుగు శాఖ**

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల**

**అవనిగడ్డ, కృష్ణాజిల్లా**

Scanned with OKEN Scanner

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

**One Day BilingualNational Seminar On**

# *They Mirrored the Struggle*

# సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు

**As a part of Celebration of Azadi ka Amrit Mahotsav**

**on**

**8th AUGUST 2022**

Quit India Day




Organized by

Department of Telugu & Department of English

GOVERNMENT DEGREE COLLEGE

AVANIGADDA-521121, Krishna dt, AP

**ISO 50001:2011, ISO 14001:2015, ISO 9001:2015 NAAC- B**

Scanned with OKEN Scanner

భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు పూర్తయ్యాయి. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం దేశవ్యాప్తంగా 'ఆజాదీ కా అమృత మహోత్సవ్' పేరుతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న విషయం మనందరికీ తెలిసిందే. ఈ ఉత్సవాలు మార్చి 12,2021 న ప్రారంభమై ఆగస్టు 15,2022న ముగుస్తున్నాయి. అనగా 75 వారాలపాటు ఈ ఉత్సవాలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా దేశ భవిష్యత్తును నిర్దేశించే మానవ వనరులను తీర్చిదిద్దే విద్యా శాఖ సైతం తన వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించ పూనుకుంది .దీనిలో భాగంగా స్వాతంత్ర పోరాటం చేసిన దేశ భక్తులను స్మరించుకునే విధంగా విద్యార్థులకు కొన్ని కార్యక్రమాలను నిర్వహించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ,అవనిగడ్డ నిర్ణయించింది. జాతీయోద్యమ నేపథ్యంలో వెలువడిన స్ఫూర్తిదాయకమైన సాహిత్యాన్ని విద్యార్థులకు అవగతం చేయడం ద్వారా వారిలో స్వాతంత్ర్యం యొక్క విలువను పెంపొందించవచ్చు అని భావించింది. దీనికోసం తెలుగు మరియు ఆంగ్లంలో వెలువడిన సాహిత్యాన్ని విద్యార్థులకు అందించాలనే సదుద్దేశంతో ఒకరోజు జాతీయ సదస్సును నిర్వహించ తల పెట్టింది. ఈ సదస్సులో ప్రధాన వక్తలు ,అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు, విద్యార్థులు తమ తమ పత్రాలను సమర్పించే క్రమంలో స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని పొందుతారు .దానిని కాపాడుకోవాలని విద్యార్థులు అర్థం చేసుకుంటారు .తద్వారా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల లక్ష్యాలు నెరవేరుతాయి. ఈ సదస్సు ద్వారా యువతలో స్వాతంత్ర్య కాంక్ష రగుల్కొని దాని విలువను గ్రహించి కాపాడుకోవాలనే సదుద్దేశాన్ని కలిగించ గలుగుతాము.

Scanned with OKEN Scanner

"ఆజాదీ కా అమృత మహోత్సవ్" 'లో భాగంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవనిగడ్డ తెలుగు మరియు ఆంగ్ల శాఖల సంయుక్త ఆధ్వర్యంలో ఆగస్టు 8వ తేదీ 'క్విట్ ఇండియా' దినోత్సవాన్ని పురస్కరించుకొని "సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు" అనే అంశంపై ఒక్క రోజు జాతీయ సదస్సు నిర్వహించనున్నాము . స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంతో వచ్చిన ఏ ప్రక్రియ నైనా పరిశోధనాంశం గా తీసుకొని వ్యాసాన్ని రాయవచ్చు .

**ఉప అంశాలు**:

1 పద్యాలు, గేయాలు

2 కథలు

3 నవలలు

4 నాటకాలు

5 వ్యాసాలు, పీఠికలు ,ఉపన్యాసాలు

పై అంశాలలో ఏదో ఒక అంశాన్ని ఎంచుకొని పరి శోధనా పత్రాన్ని సమర్పించవచ్చు .మీ పరిశోధనా పత్రాలను యూజీసీ రిఫర్డ్ జర్నల్ లో తదుపరి ప్రచురించగలము. పూర్తి పత్రాలను పంపుటకు తగిన సమయం లేనందున ఆగస్టు 6వ తేదీ లోపు పత్రసంగ్రహాన్ని మేము కింద ఇవ్వబోయే ఈమెయిల్ ఐడి కి పంపగలరు .పూర్తి పరిశోధనా పత్రాలను 31 ఆగస్టు 2022 లోపు పంపించవచ్చు .మీ పరిశోధనా పత్రాలను, పత్ర సంగ్రహాలను కూడా అను 7 ,ప్రియాంక ఫాంట్ 18, లైన్ స్పేస్ 21తో పంపించాలి. వ్యాసరచనలో తప్పనిసరిగా మెథడాలజీ ని పాటిస్తూ చివరిలో ఆధార గ్రంథాలను పుటంకించాలి. పరిశోధనా పత్రం 5 నుండి ఆరు పేజీలు వరకు ఉండవచ్చు. పిడిఎఫ్ మరియు వర్డ్ ఫైల్ లేదా యూనికోడ్ లో వ్యాసాలు పంపవద్దు. సదస్సు నమోదు రుసుమును అధ్యాపకులకు **రూ 200** /-పరిశోధక విద్యార్థులకు **రూ 100**/- విద్యార్థులకు **రూ 50**/- గా నిర్ణయించడమైనది. ఈ రుసుమును **ఫోన్ పే,** లేదా **గూగుల్ పే** చేయ వచ్చు .లేదా సదస్సు జరిగే రోజు కళాశాలలో నేరుగా చెల్లించి

Scanned with OKEN Scanner

,రసీదు ను పొందవచ్చు. ఆన్లైన్లో రుసుము చెల్లించిన వారు వాట్సాప్ ద్వారా రసీదు ను పొందవచ్చు. ఈ క్రింది లింకు ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు.

https://docs.google.com/forms/d/e/1FAIpQLSfe7C2N30ytD5TRD4BpbuHWWVbGJNfxzYqsU2_4xgtbhRBfXg/viewform

సదస్సుకు ప్రత్యక్షంగా హాజరు కాలేని వారు యూట్యూబ్ లింకు ద్వారా ఆన్లైన్లో పాల్గొనవచ్చు.

**ఈమెయిల్ ఐడి** : Seminar.gdcavanigadda@gmail.com

**Details for Payment :**
**Phone number: 9177678905**
**(Phone Pay, Google Pay, Paytm.)**
**B.JAYASAI**
**AccountNo:38719506293**
**IFSCCode:SBIN0000911**

**సదస్సు అధ్యక్షులు:**

**డాక్టర్ డి ఉమారాణి**

**ప్రిన్సిపాల్**

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవనిగడ్డ**

**సదస్సు సంచాలకులు:**

**1 .డాక్టర్ కె.వి శాంతకుమారి,**

**తెలుగు శాఖాధిపతి , ప్రభుత్వ డిగ్రీ కళాశాల ,అవనిగడ్డ.7780422101**

**2 . జి.మణి బాబు,**

**ఆంగ్ల శాఖాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ,అవనిగడ్డ.9440138968**

**3 . వర్ల అరుణకుమారి ,**

**ఆంగ్ల శాఖ ,ప్రభుత్వ డిగ్రీ కళాశాల ,అవనిగడ్డ.9603993132**

**గమనిక** :ఎంపిక చేసిన వ్యాసాలు యూజీసీ రిఫర్డ్ జర్నల్ లో ముద్రించ గలము .దాని ముద్రణ రుసుము తదుపరి తెలియజేయగలము.

Scanned with OKEN Scanner

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# Govt. Degree College
Avanigadda-521121,
Krishna Dt, A.P

**ISO 50001:2011, ISO 14001:2015, ISO 9001:2015**
**NAAC- B**

## *Invitation*

**Dept. of Telugu & English**

invite Teachers, Scholars and Students to

## **Inaugural Function** of

## **One Day Bilingual National Seminar**

## ***They Mirrored the Struggle***

## తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు

**On 08-08-2022 Quit India Day @ 10:00 AM**

***Chief Guest***

**Prof.K.B.Chandra Sekhar.**
**Vice –Chancellor**
**Krishna University, Machilipatnam.**

Scanned with OKEN Scanner

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - ౨౦౨౩

# Govt. Degree College

**Avanigadda-521121,**
**Krishna Dt, A.P**

**ISO 50001:2011, ISO 14001:2015, ISO 9001:2015**

**NAAC- B**

## *Invitation*

**Dept. of Telugu & English**

invite Teachers, Scholars and Students to

## Valedictory Function of

## One Day Bilingual National Seminar

## *They Mirrored the Struggle*

## తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు

**On 08-08-2022 Quit India Day @ 4:00 PM**

*Chief Guest*

## Vadrevu Sundara Rao.

**Writer & Critic in Telugu.**
**Popular Actor.**

Scanned with OKEN Scanner

# GOVERNMENT DEGREE COLLEGE

AVANIGADDA -521121, Krishna Dt, A.P
ISO 50001:2011, ISO 14001:2015, ISO 9001:2015 NAAC-B
One Day Bilingual National Seminar
They Mirrored the struggle

**తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు**

On 08-08-2022 Quit India Day

……………………………………………………………………………………

- 9:30 to 10:00 - Receiving the Guest
- 10:00 to 10:30 - Inauguration
  Lighting of lamp
  Prayer song.
- 10:30 to 11:30 - Inaugural Address by chief Guest

Chief Guest
**Prof. K.B.Chandra Sekhar.**
Vice-Chancellor
Krishna Universiry, Machilipatanam.

- 11:30 to 11:45 - Break
- 11:45 to 1:15 - Key note address by

**Dr. Naleswaram Sankaram.**
Famous Telugu poet, President,
Telangana Writers Association,
Lecturer in Telugu
Tara Govt.UG&PG College (A),
Sangareddy dt, Telangana.

- 1:15 to 2:00 - Lunch
- 2:00 to 3:30 - Address by Resources Persons

**Prof.N.Usha**
Prof.in English
Krishna University,Machilipatnam.
**Dr.Anuradha**
Lecture in English,
Govt.Degree College,Ganapavaram.

- 3:30 to 3:45 - Break
- 3:45 to 4:30 - Valedictory Address by

**Vadrevu Sundara Rao.**
Lecturer (Rtd) Popular Actor, Writer & Critic in Telugu.

- 5:00 to 5:15 - Vote of Thanks

***

Scanned with OKEN Scanner

# విషయసూచిక


| | | | |
|---|---|---|---|
| 1. | ఆశంశ | – డా. పోల భాస్కర్ | xii |
| 2. | అభినందనలు | – ప్రొ. కె.వి.బి. చంద్రశేఖర్ | xiii |
| 3. | కీలకోపన్యాస సంగ్రహం | – డా. నాళేశ్వరం శంకరం | xiv |
| 4. | సమాపనోత్సవ ప్రసంగం | – శ్రీ వాడ్రేవు సుందర్రావు | vii |
| 5. | సందేశం | – డా. డి. ఉమారాణి | xx |
| 6. | ముందుమాట | – డా. కె.వి. శాంతకుమారి | xxi |
| 1. | ఆంధ్ర మహాభ్యుదయ కావ్యంతో పొట్టి శ్రీరాములుకు.... | – వాడ్రేవు సుందర్రావు, డా. వందనావర్మ | 25 |
| 2. | సమాజపరిణామక్రమంలో జాతీయోద్యమ కవిత్వపాత్ర | – డా. పి. విజయకుమార్ | 31 |
| 3. | మాతృ సంగీతం – అమృత సందేశం | – డా. మోగంటి సుధామయి | 37 |
| 4. | స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు కవుల రచయితల పాత్ర | – డా. దండెబోయిన పార్వతీదేవి | 40 |
| 5. | తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు | – డా. కె.వి.శాంత కుమారి | 46 |
| 6. | జాతీయోద్యమంలో కృష్ణాపత్రిక | – డా. అడప కేదారి | 48 |
| 7. | జాతీయోద్యమంలో విభిన్న వ్యవస్థల మిశ్రిత సంఘర్షణ | – డా. టి. జాన్ కిరణ్‌బాబు | 50 |
| 8. | జాతీయోద్యమం – ఆంధ్రప్రశస్తి | – డా. కానుకొల్లు బాలకృష్ణ | 55 |
| 9. | జాతీయోద్యమ సాహిత్య భూమిక | – డా. పి.ఎ. సత్యనారాయణ, డా. డి. నాగేశ్వరరావు | 59 |
| 10. | మాతృభూమి నవలా జాతీయోద్యమం | – డా. వింధ్యవాసినీ దేవి | 61 |
| 11. | తెలుగు మొలక సాహితీరుద్రమ – ఊటుకూరి ... | – డా. కమ్ముల రవి గంగాధర శేషుకుమార్ | 66 |
| 12. | చారిత్రిక కావ్యాలు – జాతీయోద్యమ ప్రతిఫలాలు | – డా. కవాడపు లలిత | 68 |
| 13. | జాతీయోద్యమ కథాసాహిత్యం – పరిశీలన | – డా. రాచపూడి జయ సుశీల | 73 |
| 14. | స్వాతంత్ర్య దీప్తిలో – జాతీయోద్యమ స్ఫూర్తి | – డా. జి. శ్రీనివాస్ | 77 |
| 15. | దళిత తలరాత తిరగ రాసిన పాలేరు | – డా. మెండా దేవానంద్ కుమార్ | 81 |
| 16. | తెలుగు కవిత్వంలో అల్లూరి సీతారామరాజు | – డా. హరీష్ కుమార్ శ్రీధర | 85 |
| 17. | స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు సాహిత్యం | – డా. నేలటూరి అనిత మార్గరేట్ | 91 |
| 18. | ఉన్నవ లక్ష్మీనారాయణగారి సాహిత్యోపన్యాసములలో... | – డా. యన్. బేబీరమణి | 95 |
| 19. | జాతీయోద్యమ చైతన్య ప్రతిఫలనం – అనిశెట్టి అగ్నివీణ | – శ్రీకాంత్ నామ | 98 |
| 20. | భారత స్వాతంత్రోద్యమంలో సాహిత్యం పాత్ర | – తోట నరసింహారావు | 102 |
| 21. | జాతీయోద్యమంలో దేశభక్తి గేయం | – డా. జి. భాస్కర్ రావు | 105 |
| 22. | ఆధునిక తెలుగు సాహిత్యంలో దేశభక్తి | – ఈశ్వరరావు రేపల్లె | 108 |
| 23. | జాతీయోద్యమ కథలు – అంశ విశ్లేషణ | – డా. ఎన్. సుభాషిణి | 110 |
| 24. | తెలుగు నాటకాలు – జాతీయోద్యమం | – డా. ఎం.ఎల్.ఎన్. కుమారి | 118 |
| 25. | ప్రజల మనిషి – ఉద్యమ స్ఫూర్తి | – డా. డి. ఉమారాణి | 121 |
| 26. | స్వాతంత్ర్యోద్యమంలో గ్రంథాలయోద్యమం | – ముప్పరాజు కిషోర్‌బాబు, డా. కమ్ముల రవి గంగాధర శేషుకుమార్ | 123 |


Scanned with OKEN Scanner

ISSN 2457-0796 | UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక | సంపుటి -26 : సంచిక - 6 (2) | హైదరాబాద్ | ఏప్రిల్ - 2023

## ఆశంస

**Dr. POLA BHASKAR,** I.A.S. Commissioner, Collegiate Education,
KK Garudadri Towers, Sri Lakshmi Narasimha Colony, Mangalagiri,
Guntur Dist - 522503 ANDHRA PRADESH Email : Peshi.cce@gmail.com



ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ తెలుగు విభాగం వారు 'ఆజాద్ కా అమృత మహోత్సవ్' సందర్భంగా 'తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు' అనే అంశంపై ఒక్క రోజు జాతీయ సదస్సును నిర్వహింప తలపెట్టినందుకు ముందుగా వారికి శుభాకాంక్షలు.

బానిసత్వంలో మగ్గిపోతున్న భారత జాతిలో స్వాతంత్ర్యోద్యమ కాంక్షను రగిల్చే విధంగా రచనలు చేసిన మహానుభావులెందరో! అటువంటి రచయితల రచనలను యీ సందర్భంగా స్మరించుకోవడమే మనం వారికి ఇవ్వగలిగిన నివాళి. ఇటువంటి చక్కని అంశంపై జాతీయ సదస్సును నిర్వహిస్తున్న నిర్వాహకులకు అభినందనలు. అవనిగడ్డ కళాశాల వారు అనేక కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ వస్తున్నారు. అందులో భాగంగా 'తెలుగు శాఖ' నిర్వహిస్తున్న విద్యార్థి చేతిరాత పత్రిక 'దివిసీమ దివిటీలు' విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసే చక్కని ప్రయత్నం. ఈ విషయన్ని నేను వారి కళాశాలకు తనిఖీ నిమిత్తం వెళ్లినప్పుడే చూసి, చెప్పడం జరిగింది. ఇలాంటి మరిన్ని ప్రయత్నాలు యీ శాఖలో జరుగుతున్నట్లు చెప్పారు. అందుకు వారికి శుభాభినందనలు.

విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీసే ప్రయత్నాలతో పాటు ఇటువంటి సదస్సుల ద్వారా అధ్యాపకులకు, విద్యార్థులకు స్వాతంత్ర్య పోరాట సందర్భాన్ని గుర్తు చేయడం, వారిలో దేశభక్తిని నిద్రలేపడం మంచి ప్రయత్నం. భవిష్యత్తులో అధ్యాపకులకూ, విద్యార్థులకూ ఉపకరించే మరిన్ని కార్యక్రమాలను ఈ కళాశాల చేపట్టాలని ఆకాంక్షిస్తున్నాను. ఈ సదస్సు విజయవంతం కావాలని మనస్ఫూర్తిగా అభిలషిస్తున్నాను.

ధన్యవాదాలతో...



**(డా. పోల భాస్కర్),** ఐ.ఏ.ఎస్,
కమీషనర్, కళాశాల విద్యాశాఖ,
మంగళగిరి.

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023



## అభినందనలు

**ప్రొ. కె.వి.బి.చంద్రశేఖర్,** వైస్ ఛాన్సలర్, కృష్ణా విశ్వవిద్యాలయం,
మచిలీపట్నం, అవనిగడ్డ, ఆం.ప్ర.

'తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు' అనే అంశంపై ఒక్కరోజు ద్వి భాషా జాతీయ సదస్సును నిర్వహిస్తున్న ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ, తెలుగు శాఖ వారిని ముందుగా అభినందిస్తున్నాను.


ఈ సదస్సుకు నన్ను ముఖ్య అతిథిగా ఆహ్వానించడం పట్ల నా సంతోషాన్ని వ్యక్తం చేస్తున్నాను. మాతృభాషల పట్ల ఆదరణ తగ్గిన యీ సమయంలో మా విశ్వవిద్యాలయ అనుబంధ కళాశాలలో తెలుగు శాఖ వారు ఈ జాతీయ సదస్సును నిర్వహించడం శుభ పరిణామంగా నేను భావిస్తున్నాను.

స్వాతంత్ర్య భారతావనిలో పుట్టిపెరిగిన మనమందరం ఆనాటి పోరాటాలను, ఆ పోరాటాలకు, ఉద్యమాలకు ఊపిరిలూదిన మన స్వాతంత్ర్యోద్యమ కవులను ఈ 'ఆజాది కా అమృత మహోత్సవ్' సందర్భంగా సంస్మరించుకోవడం మన కనీస కర్తవ్యం... మిక్కిలి సందర్భోచితం. ఆ వైపుగా ఈ సదస్సు ద్వారా ప్రయత్నిస్తున్నందుకు నిర్వాహకులు మిక్కిలి అభినందనీయులు.

నిద్రాణ స్థితిలో ఉన్న తెలుగు జాతిని మేల్కొలిపి ఆనాటి స్వాతంత్ర్య వీరుల్లో చైతన్యాన్ని నింపిన ఆనాటి రచనలను మరోసారి గుర్తుచేసుకునే అవకాశం ఈ సదస్సు కల్పించింది. వాటిని నెమరువేసుకోవడం ద్వారా స్వాతంత్ర్యం యొక్క విలువను, ఆవశ్యకతను మరోసారి అందరం గుర్తించే అవకాశం కల్పించిన ఈ సదస్సు అనుకున్న లక్ష్యాన్ని సాధిస్తుందనడంలో సందేహం లేదు. ప్రత్యక్షంగా హాజరుకాలేని వారికి 'యూ ట్యూబ్ లైవ్' ద్వారా వీక్షించే అవకాశం కూడా కలిగించిన నిర్వాహకులు మిక్కిలి అభినందనీయులు. ఈ సదస్సు విజయవంతం కావాలని భవిష్యత్తులో ఇలాంటివి మరిన్ని చేపట్టాలని మనసారా అభిలషిస్తూ, ఆకాంక్షిస్తూ, అభినందిస్తూ...

ఈ కళాశాలలోని తెలుగుశాఖ నిర్వహిస్తున్న విద్యార్థి చేతిరాత పత్రిక దివిసీమ దివిటీలు విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసుకురావడంలో ఎంతో ఉపకరిస్తుందనడంలో సందేహం లేదు.

ఇటువంటి మరికొన్ని సృజనాత్మక కార్యక్రమాలు ఈ శాఖలో చూసియున్నాను. అందుకు తెలుగుశాఖకు ప్రత్యేక శుభాభినందనలు...



అవనిగడ్డ,
18.08.2022.

**(ప్రొ.కె.వి.బి.చంద్రశేఖర్)**
వైస్ ఛాన్సలర్




Scanned with OKEN Scanner

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# కీలకోపన్యాస సంగ్రహం

**డా. నాళేశ్వరం శంకరం,** అధ్యాపకులు,
తారా ప్రభుత్వ మరియు పి.జి. కళాశాల (స్వ.ప్ర.), సంగారెడ్డి



***కీలకోపన్యాసకులు డా. నాళేశ్వరం శంకరం గారి వివరాలు***

డా. నాళేశ్వరం శంకరం 10 ఏప్రిల్ 1955 నిజామాబాదు జిల్లా నవీపేట మండలంలోని 'నాళేశ్వరం' గ్రామంలో జన్మించారు. శంకరం గారికి ఊరుపేరే ఇంటి పేరయింది. వీరు జంగం కులంలో జన్మించారు. వీరిది నిరుపేద కుటుంబం కావడం వల్ల కులవృత్తిని వదులుకోక భిక్షాటన చేస్తూ చదువుకోవలసి వచ్చింది. బాల్యంలోనే భిక్షాటన చేయటం వల్ల ఊరు ప్రజలు ఈయనని బాల శివుడిగా భావించేవారు. వీరి తాత గారైన రేవయ్య కొంత మంది ఊరు పిల్లలకు ఖానిక్‌బడి లాగా (ప్రైవేటు బడి వంటిది) ఇంటి వద్ద చదువు నేర్పేవారు. తాతగారు నేర్పిన చదువు వల్ల కొంత నేర్చుకుని, సరాసరి అయిలాపూర్ హైస్కూల్లో నాల్గో తరగతిలో చేరారు. ఏడవ తరగతిలో ఉన్నపుడు తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున లేవడంతో బడులు బందయ్యాయి. శంకరం చదువు అర్ధాంతరంగా ఆగిపోయింది. తండ్రిగారు జంగం లింగయ్య చదువుకన్నా కులవృత్తే మిన్న అన్న భావనతో చదువుకు అడ్డుపడ్డారు. కులవృత్తిలో పెట్టాలని పట్టుపట్టినా శంకరం కష్టపడి ప్రైవేటుగా ఆంధ్రా మెట్రిక్యులేషన్ 1972లో పూర్తి చేశారు. ఆ తరువాత నిజామాబాద్‌లో చిన్నచిన్న ఉద్యోగాలు చేసి ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. కులాంతర వివాహం చేసుకోవాలనుకున్నారు. అమ్మా నాన్నలు లింగయ్య సంగవ్వ నిరాకరించినా ప్రేమించిన అమ్మాయినే పెళ్ళి చేసుకోవాలన్న తలంపుతో ఇంటిని వదిలేశారు. ఆ తర్వాత కె.వివేకానంద రెడ్డి, సునీతమ్మల సహకారంతో ఎం.ఏ చదువుకున్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయంలోనే చలం కథానిక స్త్రీ చిత్రణ అనే అంశంపై ఎం.ఫిల్, చలం సాహిత్యంలో స్త్రీ చిత్రణ అంశంపై పిహెచ్.డి చేశారు. 1981 నుండీ 2013 వరకు వివిధ ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లోను, డిగ్రీ కళాశాలల్లోను తెలుగు ఉపన్యాసకులుగా పనిచేసి పదవీ విరమణ చేశారు గానీ వృత్తి మీద ప్రేమ వల్ల తారా ప్రభుత్వ డిగ్రీ మరియు పి.జి. కళాశాల, సంగారెడ్డిలో ఎం.ఏ విద్యార్థులకు అధ్యాపకునిగా పని చేస్తున్నారు. శంకరం వృత్తిరీత్యా ఉపన్యాసకుడు గాని ప్రవృత్తిరీత్యా బాల్యం నుంచే కవి. వీరు ప్రముఖ కవిగా, విమర్శకుడిగా, కాలమిస్టుగా శ్రమించారు. వీరి కవిత్వం వివిధ భాషల్లోకి అనువాదమైంది. శంకరం గారి ప్రసిద్ధ కవితా సంపుటం దూదిమేడపై తెలుగు విశ్వ విద్యాలయం, బొమ్మూరు సాహిత్య పీఠంలో ఎం.ఫిల్ చేశారు. ఈ దూదిమేడ గ్రంథం కపాస్‌కీ అటారి పేరుతో హిందీలోకి అనువాదమైంది. అజంతా లాగా తక్కువ కవిత్వం రాసినా కవిత్వంలో ఆయనకంటూ ఓ ప్రత్యేకమైన దారి గల కవి.

నాళేశ్వరం శంకరం తొలి రోజుల్లో నాల్గయిదు కథలు రాసినా కవిత్వానికీ, కవిత్వ విమర్శకే జీవితాన్ని అంకితం చేసుకున్నారు. ఈయన నిబద్ధకవి. కవిత్వంలోనే కాక నిత్య జీవితంలోనూ ఆదర్శజీవే. ఆదర్శ వివాహం చేసుకున్నారు. ఈయన కవే కాదు సాహిత్య కార్యకర్త కూడ. శంకరం చలం భావనకు కన్వీనర్. తెలంగాణా రచయితల వేదికకు ఉపాధ్యక్షుడు. సోయి పత్రికకు సంపాదకులుగా శ్రమించారు. ప్రస్తుతం తెలంగాణా రచయితల సంఘానికి రాష్ట్ర అధ్యక్షులుగా శ్రమిస్తున్నారు.



Scanned with OKEN Scanner

నాళేశ్వరం దాదాపు మూడు సంవత్సరాల పాటు వారం వారం మూవీ ముచ్చట్లు పేరుతో ఒక శీర్షిక నిర్వహించారు. వివిధ సాహిత్య సామాజిక, సాంస్కృతిక ఉద్యమ వైతాళికుల ఇంటర్వ్యూలు చేశారు. మరికొంత, కాలం ఒక మాస పత్రికలో అద్దంలో ఆకాశం శీర్షికన సాహిత్య కాలమిస్టుగా శ్రమించారు. ఈయన ఉస్మానియా విశ్వ విద్యాలయం, తెలంగాణా విశ్వ విద్యాలయం పిహెచ్.డి విద్యార్థులకు సూపర్ వైజర్గా పని చేస్తున్నారు. అంబేద్కర్ విశ్వ విద్యాలయం ఎం.ఏ విద్యార్థుల ఆధునిక కవిత్వం పేపర్లో వీరి కవిత పాఠ్యాంశంగా ఉంది. అలాగే బి.ఏ విద్యార్థుల సాహిత్య పాఠ్యాంశాలలో వీరి రచన ఒక పాఠ్యాంశంగా ఉంది.

నాళేశ్వరం శంకరం గారికి ప్రతిష్ఠాత్మకమైన ఫ్రీవర్స్ ఫ్రంట్ అవార్డు, తెలుగు విశ్వ విద్యాలయం ఉత్తమ కవితా సంపుటం అవార్డు, సినారె అవార్డు, ఉమ్మడి శెట్టి అవార్డు, సహృదయ సాహితీ అవార్డు, పులికంటి సత్కృతీ అవార్డు, తెలుగు విశ్వ విద్యాలయం ధర్మరధి పురస్కారం, అల్లూరి సీతారామరాజు సాహిత్య కళాపీఠం అవార్డు, శ్రీశ్రీ అవార్డు, నిజామాబాద్ వారిచ్చే కాళోజీ స్మారక పురస్కారం, సదాశివ గారి పేరున నెలకొల్పిన హరిదా సాహిత్య అవార్డు, చింతలపల్లి నిర్మలాదేవి, నారాయణరావు జీవన సాఫల్య పురస్కారంతో పాటు మరిన్ని పురస్కారాలు వీరికి లభించాయి. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ఏనాడో ఈయనను ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుతో సత్కరించింది. ఇటీవల ఈయనను కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సభ్యులుగా నియమించడం ద్వారా తెలంగాణా ప్రభుత్వం తెలుగు సాహిత్యం పట్ల తనకు గల చిత్త శుద్ధిని ప్రకటించుకుంది. కవితా ఓ కవితా అంటూనే నన్ను కడచేర్చేది కవిత్వమేనంటారు కవిత్వాన్ని నమ్ముకున్న ఈ కవి.

✦✦✦

1857 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామ పరాజయం వలన 9 దశాబ్దాలు పాటు మనకు స్వాతంత్ర్యం ఒక మేడిపండు అయ్యింది. బ్రిటీష్ పాలన రాచపుండుగా మారింది. దేశమాత దాస్య శృంఖలాలు ఛేదించుటలో ఎందరో వీరులు అమరులు అయ్యారు. ఆ అమర వీరుల త్యాగాలను నేటి తరానికి జ్ఞప్తికి తెచ్చి వారిలో అకుంఠిత దేశభక్తిని పెంపొందించవలసిన అవసరం ఎంతైనా కలదు. 'ఆజాదీ కా అమృత మహోత్సవ్'లో భాగంగా జాతీయోద్యమ ప్రతిఫలనాల పేరిట అలనాటి వీరుల త్యాగ చరితని సంస్మరించు కొనేలా ప్రభుత్వ డిగ్రీ కళాశాల అవనిగడ్డలో ఒకరోజు ద్విభాషా జాతీయ సదస్సుని తెలుగు మరియు ఆంగ్ల శాఖలు నిర్వహించుట ముదావాహం.

జాతీయోద్యమంను విస్తృత వ్యాప్తి చేయడంలో పత్రికలు, కవులు, సాహిత్యం ద్వారా ఆ సేతు హిమాచల పర్యంతము దేశభక్తిని ప్రోది చేశారు. జాతీయోద్యమ ప్రజాచైతన్య యుద్ధం. జపాన్ రష్యాని ఆక్రమించడం భారతీయులలో స్ఫూర్తి నింపింది. బసవరాజు అప్పారావు గారి 'కొల్లాయి గట్టితేనేమి మా గాంధీ కోమటై పుట్టితేనేమి', గరిమెళ్ళ గారి 'మా కొద్దీ తెల్లదొరతనము', బంకించంద్రచటర్జి గారి వందేమాతరం, చిలకమర్తి గారి 'భరతఖండబు చక్కని పాడియావు', త్రిపురనేని వారి 'వీరగంధము తెచ్చినారము వీరులెవ్వరో తెలుపుడీ' అనేవి యావత్ప్రజానీకములో జాతీయోద్యమ భావాన్ని వెల్లువెత్తించిన కవితాకుసుమాలు.

శ్రీశ్రీ, రాయప్రోలు, దువ్వూరి, ఉన్నవ, వేములవల్లి, ధాశరథి, కవితలు దేశభక్తిని పరవళ్ళు త్రొక్కించినవి. బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి విచ్చేసినపుడు ఆయన ఉపన్యాసంను చిలకమర్తి తెనుగించారు. ఆ సందర్భాలలో చిలకమర్తి వ్రాసిన 'చెరసాలల్ పృధు చంద్రశాలలేయగున్ ' పద్యం భారతీయుల దేశభక్తిని తెలుపుతుంది.

అలాగే భావకవులు దేవులపల్లి, సంస్కరణాభిలాషులు కందుకూరి తమ తమ రచనలలో అంతర్లీనంగా జాతీయోద్యమంను పరవళ్ళు త్రొక్కించారు. విశ్వనాధ, సినారె, జాషువా వంటి వారల రచనలు దేశభక్తిని ప్రేరేపించినవి. 'ఏ పూర్వ పుణ్యమో ఏ యోగబలమో జనియించినాడవి పుణ్యభూమిలో ' అంటారు రాయప్రోలు. 'గంగా సింధూ జలక్షీరములనెపుడు కలగి తన బిడ్డలను పోషించుకొను పచ్చి బాలింత మా భరతమాత మాతలకు మాత సకలసంపత్సమేత' అంటారు జాషువా.



Scanned with OKEN Scanner


నేతాజీ సుభాష్ చంద్రబోస్, భగత్‌సింగ్, సూర్యసేన్, చారులత, కల్పనాదత్, ప్రీతిలతా, ఉద్ధమ్ సింగ్, మదన్‌లాల్ ధింగ్రా, మంగల్‌పాండే, ఖుదీరాంబోస్, చంద్రశేఖర్ ఆజాద్ విప్లవ ఉద్యమాలు చరిత్ర విస్మరించరాదు.

'జల్ జంగిల్, జమీన్' అంటూ అసిఫాబాద్ అడవులలో కొమరం భీముడు, 'తన శరీరం నుండీ కారే ఒక్కో రక్తపుబొట్టు ఒక్కో విప్లవవీరుడై జనిస్తాడ' ని విశాఖ, రంప అడవులలో ఉద్యమాలు నడిపిన అల్లూరి, బ్రిటిష్ సామ్రాజ్య పునాదులని పెకలించే స్థాయి ఉద్యమం పెదనందిపాడులో నడిపిన పర్వతనేని, మించాలపాడులో పన్ను వ్యతిరేక ఉద్యమాన్ని నడిపిన కన్నెగంటి భరత మాత కీర్తికిరీటంలో కలికితురాయిలు వంటివారు.

'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరియసే' అన్న సూక్తి మరవకుండా బెంగాల్ విభజన ఉద్యమాన్ని నడిపితే, భగత్ సింగ్ మరణం భారతీయుల రక్తాన్ని మరిగించింది. పలనాటి పౌరుషం మనకి తెలియంది కాదు. శివభారతం ద్వారా గడియారం, రాణా ప్రతాప్‌సింగ్ చారిత్రక గ్రంథం, వేదులవారి ప్రతాపరుద్వీయం, ద్రౌపదీ సందేశం అనే పౌరాణిక నాటకం ఆ నాటి ప్రజలలో దేశభక్తిని ఉరకలెత్తించినవి.

'పాడవోయి భారతీయుడా', 'తెలుగు వీర లేవరా దీక్షబూని సాగరా' అంటూ శ్రీశ్రీ, 'పుణ్య భూమి నాదేశం నమోనమామి' అంటూ జాలాది, 'భారత మాతకి జేజేలు బంగారు భూమికి జేజేలు' అంటూ ఆత్రేయ, 'గాంధీ పుట్టిన దేశమా' అంటూ గోపి, 'నీ సంఘం నీ ధర్మం నీ దేశం నువ్వు మరవద్దు' అంటూ సినారె, ఇంకా మరెందరో సినీ కవులు సైతం తమ కలం ద్వారా ప్రతి హృదిలో దేశభక్తిని నిరంతరం ప్రజ్వలింపచేస్తున్నారు.

నకారాత్మకమై బానిసత్వంలో మృగ్గుతున్న మహోన్నత సంస్కృతీ వారసత్వం గల జాతి సాహిత్యంతో సకారాత్మకరూపం దాల్చి దేశమాత నుదుటన వీరతిలకంగా దిద్దినది.



**(డా. నాళేశ్వరం శంకరం)**
అధ్యాపకులు,
తారా ప్రభుత్వ మరియు పి.జి. కళాశాల (స్వ.ప్ర.)



Scanned with OKEN Scanner

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# సమాపనోత్సవ ప్రసంగం

శ్రీ వాడ్రేవు సుందర్రావు, విశ్రాంత అధ్యాపకులు, తణుకు
చరవాణి : 9440543860



### సమాపనోత్సవ ముఖ్య అతిథి వాడ్రేవు సుందర్రావు గారి పరిచయం, వివరాలు

వ్యక్తిగత మరియు ఉద్యోగ వివరాలు :

| | | |
|---|---|---|
| పేరు | : | వాడ్రేవు సుందర్రావు |
| తల్లిదండ్రులు | : | కీ.శే. వాడ్రేవు విశ్వేశ్వర వెంకట చలపతి, సత్యవతీదేవి |
| జననం | : | 26-12-1956 |
| వయస్సు | : | 66 సంవత్సరాలు |
| విద్యార్హతలు | : | ఎమ్.కాం. (ఆంధ్ర విశ్వవిద్యాలయం - విశాఖపట్నం<br>ఎమ్.ఎ. (తెలుగు) (ఉస్మానియా విశ్వవిద్యాలయం, హైదరాబాద్)<br>ఎమ్.ఫిల్. (మధురై కామరాజ్ విశ్వవిద్యాలయం, మధురై) |
| ఉద్యోగం | : | ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తణుకు, పశ్చిమగోదావరిలో కామర్స్ లెక్చరర్‌గా పనిచేసి, 31-12 2016వ తేదీన ఉద్యోగ విరమణ. |

రేడియో రచయితగా :

ఆకాశవాణిలో ఎన్నో నాటికలను మరెన్నో రూపకాలను రాయడం నటించడం జరిగింది. భారత స్వాతంత్ర్య 40వ వార్షికోత్సవ సందర్భంగా వీరపాండ్య కట్టబ్రహ్మణ, వందేమాతరం వంటి భారత స్వాతంత్ర్య పోరాట సంఘటనలతో ఎన్నో రూపకాలను రచించి నటించడం జరిగింది.

నాటక రంగం : వాడ్రేవు సుందర్రావు గారు నాటకరంగంలో సాంఘిక, పౌరాణిక, పద్యనాటకాలకు రచయితగానూ మరియు నటుడుగానూ వ్యవహరించారు. రాష్ట్ర ప్రభుత్వ నంది అవార్డు కూడా పొందారు. అటుపైన ఎన్నో నాటికలను, స్వాతంత్రోద్యమ సంఘటనల ఆధారంగా ఎన్నో రూపకాలనూ రచించారు.

ఈటీవి, టి.టి.డి, సోనోపిక్స్ మొదలగు ఛానల్స్‌కి అనేక కార్యక్రమాలకు రచయితగా పని చేశారు. బాల్యం నుండీ నేటి వరకూ నాటకాలలో నటిస్తూ అనేక బహుమతులు పొందారు. తెలుగు నాటకరంగ ప్రముఖుల గురించి ఎన్నో పరిశోధక వ్యాసాలను రచించారు. ఏక పాత్రాభినయంలో నాలుగు బంగారు గరుడ అవార్డులు పొందారు. ఏక పాత్రలను అభినయించడమేకాక రచయితగా, పరిశోధకుడిగా, గుణనిర్ణేతగా కూడా వ్యవహరించారు.

తెలుగు జాతి ఔన్నత్యాన్ని పెంచిన ఎందరో మహనీయుల డిజిటల్ చిత్రపటాల్ని దేశ విదేశాల్లో ప్రదర్శించి, తెలుగు జాతి వెలుగుల్ని దశ దిశలా వ్యాపింపజేశారు. అనేక భారత స్వాతంత్ర్యపోరాట యోధుల చిత్రపట ప్రదర్శనల్ని బాపూ చిత్రపట ప్రదర్శనల్ని ఏర్పాటు చేశారు.



Scanned with OKEN Scanner

తెలుగులో విశ్వవిద్యాలయ స్థాయి విద్యార్థులకు ప్రహేళికలను కూర్చడం, తెలుగువారి చరిత్రకు సంబంధించిన యాభైకథల్ని రచించడం ద్వారా తెలుగు సంస్కృతీ సాహిత్యాలకు సేవ చేస్తున్నారు. 1969లో మహాత్మాగాంధీ శతజయంతి ఉపన్యాస పోటీల్లో ద్వితీయ బహుమతి గెలుచుకుని బహుమతిగా ఉత్తర భారతదేశమంతా పర్యటించి, ఢిల్లీలో ఆ నాటి ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ గృహంలో ఆతిథ్యం అందుకున్నారు.

జన్మభూమి కార్యకర్తగా, వ్యాఖ్యాతగా నిర్వాహకుడిగా ఎన్నో కార్యక్రమాలకు సారథ్యం వహించడం జరిగింది. గత నాలుగు దశబ్దాలుగా వెయ్యికి పైగా ఉపన్యాసాలను ఇవ్వడం ద్వారా వేలాది మంది విద్యార్థినీ విద్యార్థులను, అధ్యాపకులను పరవసింపచేశారు. ఇంకా చేస్తున్నారు. జీవితాంతం ఇలాంటి కార్యక్రమాలు చేస్తూనే వుండాలనేది వీరి ఆకాంక్ష.

+++

స్వాతంత్ర్య పోరాట స్ఫూర్తిని ఈ తరానికి పంచడానికి, యువతీ యువకుల్లో స్వాతంత్ర్య సమర దీప్తిని ప్రకాశింప చేయడానికి, దేశమంతా స్వాతంత్ర్య అమృతోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఎందరో వీరుల త్యాగంతో, ఎందరో దేశభక్తుల బలిదానంతో లభించిన మన స్వాతంత్ర్యానికి ఇది అమృతోత్సవం. దేశ స్వాతంత్ర్యానికి డెబ్బై అయిదు వసంతాల పండుగ. ఈ దివ్య ఘడియల్లో స్వాతంత్ర్య అమృతోత్సవ పండుగని కళాశాలల అధ్యాపకులు మరియు విద్యార్థినీ విద్యార్థులందరితో కలసి నిర్వహించుకోవడానికి సంకల్పించిన అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు శాఖ, ప్రిన్సిపాల్ మరియు అధ్యాపక అధ్యాపకేతర సిబ్బందికి నా హృదయ పూర్వక అభినందనలు. స్వాతంత్ర్య అమృతోత్సవ శుభాకాంక్షలు.

కన్నతల్లీ, పుట్టిన ఊరూ స్వర్గం కన్నా గొప్పవి. ప్రపంచంలో ఎవరికైన వారి కన్నతల్లీ, వారు జన్మించిన నేల ఎంతో ఇష్టమైనవి. ఆవిధంగానే మనకు మన జన్మ భూమి గొప్పది. ప్రపంచంలోని అనేక దేశాలలో నాగరికత గురించి ఏ మాత్రం తెలియని రోజుల్లోనే భారతదేశంలో నాగరికత విలసిల్లింది. చాలా దేశాలలో, ప్రదేశాలలో అక్షరం ఆవిర్భవించకముందే భాషా భాషాసాహిత్యాలు వర్ధిల్లాయి. ఎన్నో దేశాలలో ప్రజలకు శాస్త్ర విజ్ఞానం గురించిన అవగాహన లేనప్పుడే మన దేశంలో అపూర్వమైన నిర్మాణాలు జరిగాయి.

ఆర్థికంగా వైభవంగా వెలిగిన గొప్ప దేశం మనది. అయితే ఇంత గొప్ప దేశము, సంస్కృతీ పరాయి పాలకుల దౌష్ట్యానికి గురైపోయింది. వర్తకం కోసం ఈ దేశానికొచ్చిన విదేశీ కంపెనీలలో బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఈ దేశాన్ని క్రమంగా ఆక్రమించింది. దేశీయుల మధ్యనున్న అంతఃకలహాలను ఆసరా చేసుకొని, దేశాన్ని కొల్లగొట్టింది. రత్నగర్భలాంటి ఈ దేశం, ఆర్థికంగా క్షీణించిపోయింది. ఆకలిగొన్న వారికి అన్నం పెట్టి ఆదరించిన ఈ అన్నపూర్ణ, అన్నమోరామచంద్రా అంటూ ఆకలితో శోకించే కోట్లాది నిరుపేదలతో నిండిపోయింది.

ఈ దుస్థితిని తొలగించడానికి, స్వాతంత్ర్యోద్యమం ఉవ్వెత్తున సాగింది. బ్రిటిష్ దురంహంకారాన్ని తుదముట్టించడానికి, దాదాపుగా రెండు వందల సంవత్సరాల పాటు దేశమంతా స్వాతంత్ర్యపోరాటం నడచింది. కులమత వర్గవర్ణలింగ వివక్షతలు లేకుండా, ప్రాంతీయ భాషా బేధాలకు తావీయకుండా ఐకమత్యంతో, ఏకతాభావనతో సాగిన మహాఉద్యమం భారత జాతీయోద్యమం. ఆ మహాపోరాటంలో లక్షలాది మంది దేశభక్తులు తమ జీవితాలను ధారపోశారు. బ్రిటిష్ పాలక దమననీతితో ప్రాణాలుకోల్పోయిన వారెందరో. ఉరికంబాల మీద అసువులు బాసిన అమరవీరులు ఎందరో. జైళ్లలో చిత్రహింసలకు గురైపోయిన దేశ ప్రేమికులు ఇంకెందరో. లక్షలాది దేశభక్తులు స్త్రీలు, పురుషులు, పిల్లలు, వృద్ధులు...

ఇలా ఎందరో తమ రక్తాన్ని ధారపోసి అందించిన స్వరాజ్యం మనది. కొన ఊపిరి ఉన్నంత వరకూ వీరులు సాగించిన చిరస్మరణీయమైన పోరాటం మన భారత స్వాతంత్ర్యపోరాటం.




Scanned with OKEN Scanner

దురదృష్టవశాత్తూ ఈ వీరుల గాథలు ఈ తరానికి తెలియకుండా పోయాయి.ఆ త్యాగధనుల వీరోచిత గాథలు ఈ యువతీ యువకులకు చేరకుండా మరుగునపడ్డాయి. మనం ఈనాడు ఇంత స్వేచ్ఛగా అనుభవిస్తున్న ఈ స్వాతంత్ర్యం యొక్క విలువ పిల్లల దృష్టికి రాకుండా మిగిలిపోయింది. ఇంతకన్నా దురదృష్టం ఏముంది? ఇంతకు మించిన దౌర్భాగ్యం ఇంకేముంది?

ఈ స్వాతంత్ర్య అమృతోత్సవ సందర్భంగానైనా దేశ వ్యాప్తంగా అటువంటి నిర్మాణాత్మకమైన కృషి, సమగ్రమైన ప్రయత్నం జరగవలసి ఉంది. ఆ బాటలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు అనే పేరిట తెలుగు మరియు ఆంగ్ల భాషా జాతీయ సదస్సును నిర్వహించడం ఒక గొప్ప కార్యక్రమం. స్వాతంత్ర్య వీరుల త్యాగాలకు ఇది సరైన నివాళి. ఇంత మంచి పనికి సంకల్పించిన అందరికీ మరొక్క మారు అభినందనలు. ఈ సదస్సులో సమాపన ప్రసంగం చేసే అవకాశాన్ని అందించినందుకు కృతజ్ఞతలు.

జై భరతమాతా ! జై హింద్ !



**(శ్రీ వాడ్రేవు సుందరరావు)**

విశ్రాంత అధ్యాపకులు, తణుకు.



# సందేశం

**డా. డి. ఉమారాణి,** ప్రాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ

'తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు' అన్న అంశంపై వివిధ రకాలైన సాహితీ వ్యాసాలు అందించిన అధ్యాపకులకు అభినందనలు. ఈ సంకలనం అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాల తెలుగు మరియు ఇంగ్లీషు శాఖల వారి సంకల్ప బలం. ఆధునిక విజ్ఞానం అంతరిక్ష అంచులకు ఎగురుతుండగా మన మూలాలను మరింత బలంగా రూపొందించుకోవాలనేది 2020 నాటి నూతన విద్యా విధానము తీసుకున్న నిర్ణయం. ఆ ఆలోచనలకు అనుగుణంగా సమసమాజం మరియు దాని పునాదులను విద్యార్థులు అవగాహన చేసుకునేలా అనేక కార్యక్రమాలను రూపొందిస్తూ కళాశాల తెలుగు శాఖ ముందుకు దూసుకుని వెళుతుంది. ఇపుడు కళాశాల విద్యార్థులే కాక దేశంలోని ఇతర తెలుగు సాహితీ విమర్శకులను కూడా గత చరిత్రవైపు దృష్టి మరల్చే ప్రయత్నం చేసింది. అతి తక్కువ సమయంలో కళాశాలలో ఏర్పాటు చేసిన జాతీయ సదస్సుకు ఇరవై ఐదు పైగా పరిశోధనా పత్రాలు అందాయి. ఈ విషయమై కళాశాల వారందరికీ మనఃపూర్వక అభివందనాలు సమర్పిస్తున్నది. అయితే సేకరించిన పత్రాలను యు.జి.సి రిఫర్డ్ సంచికలో ముద్రించడం ఒక బృహత్ కార్యంగా మారింది.

దానికై ఎంతో సమయాన్ని, వ్యయప్రయాసలను వెచ్చించ వలసి వచ్చింది. ఏది ఏమైనప్పటికి పట్టుదలగా ఈ సంచిక ఆవిర్భావానికి చివరివరకు కృషిచేసి విజయం సాధించిన డా. కె.వి. శాంతకుమారి గారు అభినందనీయురాలు.

దివిసీమలోని చిన్న పట్టణంలో నెలవైయున్న అవనిగడ్డ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఒక యు.జి.సి రిఫర్డ్ సంచిక రావడం ఇదే ప్రథమం. దీని వెనుక ఉన్న కృషిని పాఠకులు అర్థం చేసుకుని, ప్రోత్సహించగలరు. మరిన్ని సంచికలు మా కళాశాల ద్వారా విడుదల కావాలని ఆకాంక్షిస్తూ...



**(డా. డి. ఉమారాణి)**

ప్రిన్సిపాల్



Scanned with OKEN Scanner

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# ముందుమాట

**డా. కె.వి. శాంతకుమారి,** తెలుగుశాఖాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ
జాతీయ సదస్సు సంచాలకులు, చరవాణి : 99125 79570



భువన విజయమనే పేరుగల తన సభలో అష్టదిగ్గజ కవులను కలిగియుండి, తాను స్వయంగా కవియై, అజరామరమైన ప్రబంధాలనందించి, తన కాలాన్ని ప్రబంధ యుగంగా సాహితీ చరిత్రలో లిఖించుకున్న ఆంధ్రభోజుడు, సాహితీ సమరాంగణ సార్వభౌముడు శ్రీకృష్ణదేవరాయలు స్వయంగా నడయాడిన నేల... అతి పురాతన కాలం నుండీ కవులకూ, కళాకారులకూ, స్వాతంత్ర్య సమరయోధులకూ, ప్రాచీన ఆలయ సంస్కృతికీ, ఆలవాలమైన అవని....పౌరుషాలగడ్డ.... నాటి 1977 ఉప్పెనలో కొడిగట్టుకు పోయిన దీవి... నేడు పడి లేచిన కెరటంలా ఉవ్వెత్తున ఎగిసి పోటెత్తిన విద్యలగడ్డ..... అవనిగడ్డ. గతమెంతో ఘనమైన అవనిగడ్డలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పని చేసిన మహానుభావులు ఎందరో...చదువుకుని ఉన్నతమైన స్థితిలో వున్న గొప్పవారు మరెందరో... అందరికీ వందనాలు... ఇటువంటి ఘన చరిత్ర కలిగిన యీ కళాశాలలో తెలుగుశాఖలో గత దశాబ్ద కాలం పైగా పని చేస్తున్న అదృష్టం నాది.

జాతికి జీవనాడి భాష. జాతిని ఏకం చెయ్యడంలో దాని పాత్ర అద్వితీయం. అందుకే భారతీయ కవులు, రచయితలు అందరూ వారి వారి మనసులోని స్వాతంత్ర్య కాంక్షను వివిధ భారతీయ భాషల్లో వ్యక్తం చేశారు. ఎన్ని భాషల్లో చెప్పినా భావం ఒక్కటే. 'స్వాతంత్ర్యం మా జన్మహక్కు, సుపరిపాలన కన్నా స్వపరిపాలన మిన్న' అనే భావజాలాన్ని భారతీయులందరిలో నింపడంలో సాహిత్యానిది మరువలేని పాత్ర. అందుకే దీన్ని చదివిన వారందరూ స్వాతంత్ర్యకాంక్షతో రగిలారు. ఉప్పెనై విరుచుకుపడ్డారు. ఉరి కొయ్యల ఉయ్యాలలూగారు. విప్లవజ్వాలలై మండారు. స్వాతంత్ర్య సముపార్జనతో గానీ చల్లబడలేదు. మరి ఇంతటి మహత్తర కార్యాన్ని సాధించడంలో ప్రధానపాత్ర వహించిన భాష, సాహిత్యాలను జ్ఞాపకం చేసుకుంటూ యీ **'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'** సందర్భంలో **'తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతి ఫలనాలు'** పేరుతో జాతీయ సదస్సును నిర్వహించాలని తలపెట్టాం. ఈ అంశానికి భావప్రాధాన్యతే గానీ భాషా ప్రాధాన్యత లేదనే ఉద్దేశంతో ఏ భాషా సాహిత్యాన్నైనా తీసుకొని, తెలుగు లేదా ఆంగ్లంలో వ్యాసాలు రాసి పంపమని కోరడం జరిగింది. కోరిన వెంటనే అధ్యాపక మిత్రులందరూ ప్రతిస్పందించిన తీరు మాకు ధైర్యాన్నిచ్చి, ముందుకు నడిపించింది.

'ధైర్యాన్నిచ్చింది అనే మాటను ఎందుకు వాడానంటే ప్రభుత్వ కళాశాలల్లో జాతీయ సదస్సుల నిర్వహణ తలకుమించిన భారమన్నది జగమెరిగిన సత్యం. కానీ అటువంటి భారాలను సునాయాసంగా తాను మోస్తూ, మా చేత మోయించడం మా కళాశాల ప్రధానాచార్యుల వారికి నిత్యకృత్యం. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు అయిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 75 వారాల పాటు నిర్వహిస్తున్న 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' లో భాగంగా మన కళాశాల తెలుగు – ఆంగ్ల భాషా విభాగాలు కలసి ఒక రోజు జాతీయ సదస్సును నిర్వహించమని ప్రధానాచార్యుల వారి సూచన... పధ్నాలుగు రోజుల గడువుతో ముహూర్త నిర్ణయం. చారిత్రాత్మకమైన 'క్విట్ ఇండియా డే' అయిన అగష్టు 8న సదస్సు నిర్వహణా తేదీగా నిర్ణయించడం జరిగింది. కేవలం పధ్నాలుగు రోజుల్లో జాతీయ సదస్సును నిర్వహించగలమా ఏర్పాట్లు హడావిడిగా చేసుకున్నప్పటికీ సదస్సుకు పేపర్లు



Scanned with OKEN Scanner

పంపవలసిన అధ్యాపకులను తొందరపెట్టలేము కదా! అందుకే సదస్సు రోజుకు కేవలం పత్ర సంగ్రహాలను పంపమని, ఆ తరువాత నెల రోజుల సమయం తీసుకుని పూర్తి పత్రాలు పంపించమనీ కోరాం. అందరూ సహకరించారు. సదస్సురోజు పత్ర సంగ్రహాల సమాహార పత్రికను ముఖ్య అతిథి చేతుల మీదుగా ఆవిష్కరించాం.

ఇక సదస్సుకు ముఖ్య అతిథిగా విచ్చేసి, సదస్సు గౌరవాన్ని పెంచిన పెద్దలు ఆచార్య శ్రీ కె.బి.చంద్రశేఖర్, (ఉపకులపతి, కృష్ణా విశ్వ విద్యాలయము, మచిలీపట్నం) గారికి ప్రత్యేక కృతజ్ఞతలు. సదస్సులో కీలకోపన్యాసం చేసిన సాహితీ దిగ్గజం, తెలంగాణా రచయితల సంఘ అధ్యక్షులు, నిరాడంబరులు, నిగర్వి శ్రీ నాళేశ్వరం శంకరం (లెక్చరర్, తారా డిగ్రీ మరియు పి.జి. (స్వయం ప్రతిపత్తి) కళాశాల, సంగారెడ్డి, తెలంగాణా)గారికి గౌరవాభి వందనాలు. సదస్సులో ఆంగ్ల విభాగం తరపున ఉపన్యసించిన ఆచార్య ఎన్. ఉషారాణి (ఆంగ్ల ఆచార్యులు, కృష్ణా విశ్వ విద్యాలయం, మచిలీపట్నం) గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. మధ్యాహ్న సమావేశానికి విచ్చేసిన డా. హెచ్. అనూరాధ (ఆంగ్లోపన్యాసకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, గణపవరం) గారికి ధన్యవాదాలు.

సదస్సు సమాప నోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఉపన్యాస కేసరి, ఆకాశవాణి నాటక ప్రయోక్త, ప్రముఖ రంగస్థల నటులు, శ్రీ వాడ్రేవు సుందరరావు (విశ్రాంత వాణిజ్యశాస్త్ర అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, తణుకు) గారికి కృతజ్ఞతాభి వందనాలు. సభికులనుద్దేశించి వీరందరూ ఇచ్చిన ఉపన్యాసాలు, సలహాలు, సూచనలు చేసిన సదా అనుసరణీయాలు. కోరిన వేంటనే యీ పెద్దలందరూ పెద్దమనసు చేసుకొని, మా సభను పెద్ద చేసినందుకు నా కృతజ్ఞతాభి వందనాలు.

జాతీయ సదస్సును మా కళాశాలలో నిర్వహించడం ఇదే తొలిసారి. ఆ అవకాశం మా భాషా శాఖలకు రావడం మా అదృష్టం. కేవలం పధ్నాలుగు రోజుల్లో అన్ని ఏర్పాట్లూ సకాలంలో చేసుకొని, సదస్సును దిగ్విజయం చేసుకోవడం అంటే మాటలు కాదు. దీని వెనుక ఎందరివో చేతలు... చేతులు... మరెందరివో సహృదయ ఆశీర్వాదాలు... ఈ సందర్భంగా నేను చెప్పవలసిన కృతజ్ఞతలెన్నో!

'కదనరుద్రమ'లా మా కళాశాలను వివిధ కార్యక్రమాలలో నిత్యం కదం తొక్కించే మా కళాశాల ప్రధానాచార్యులు, నా సోదరి డా. డి. ఉమారాణి గారికి ప్రథమ కృతజ్ఞతలు. నేను చేతల్లో కాదు కదా! కనీసం ఊహల్లో కూడా చేయడానికి భయపడే అనేక కార్యక్రమాలకు నన్ను సాహసింప చేసిన ఘనత ఆమెది. అందుకే ఆమెది మొదటి స్థానం.

కార్యక్రమం అనుకున్నది మొదలు ఇప్పటి యీ పుస్తక రూపకల్పన వరకూ తన మృదు స్వభావంతో తన మొత్తం సహకారాన్ని సుతిమెత్తని చిరునవ్వుతో అందించిన శ్రీమతి వర్ల అరుణ కుమారి (అధ్యాపకులు, ఆంగ్లశాఖ, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ) గారికి ప్రత్యేక కృతజ్ఞతలు.

సదస్సుకు ఫైల్స్ నిమిత్తం ఆర్థిక సహకారం అందించిన మా కళాశాల పూర్వవిద్యార్థి ప్రగతి విద్యా సంస్థల అధినేత శ్రీ సనకా పూర్ణచంద్రరావు గారికి హార్దిక ధన్యవాదాలు. సదస్సుకు ప్రారంభం నుండీ ఇప్పటి వరకూ మా కళాశాల టెక్నికల్ టీం సహాయం మరువలేనిది. కార్యక్రమాన్ని 'యూ ట్యూబ్' లైవ్ ఏర్పాటుతో సహకారం అందించిన వారికి తప్పక కృతజ్ఞతలు చెప్పాలి.

దీనిలో శ్రీ పి.అరుణ్ కమార్, శ్రీ రామారావు (అధ్యాపకులు, కంప్యూటర్ విభాగం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ) వారికి, శ్రీ ఎ.శివ నాగరాజు, శ్రీ సిహెచ్. చింతారావు, చి. జుగన్‌కుమార్ (నవకోణ్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్, విజయవాడ) వారికి, శ్రీ బి. జయ సాయి (అధ్యాపకులు ఆక్వాకల్చర్ విభాగం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల) గారికి శ్రీ సునీల్ (హార్డ్‌వేర్ నిపుణులు), చి.పావని (జె.కె.సి.మెంటార్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ) గారికి, హృదయ పూర్వక ధన్యవాదాలు.

పుస్తక ముద్రణా సమయంలో తన అమూల్యమైన సలహాలు మరియు సహాయాన్ని అందించిన మా కళాశాల అర్థశాస్త్ర అధ్యాపకురాలు, నా మరో సోదరి కుమారి అన్నపరెడ్డి వీరకుమారికి నా ఆశీఃపూర్వక కృతజ్ఞతలు.



Scanned with OKEN Scanner

సదస్సు ఏర్పాట్ల నుండీ ముగింపు వరకూ వివిధ దశల్లో తమ తమ సహాయ సహకారాలందించిన నా సహాధ్యాయులందరికీ, మొత్తం మా కళాశాల విద్యాకుటుంబానికీ నా హృదయ పూర్వక కృతజ్ఞతాభి వందనాలు.

చివరగా చెప్పినా చిన్నది కానిది... సదస్సులో విజయానికి అతి ముఖ్యులు... కోరిన వెంటనే తమ తమ పత్ర సంగ్రహాలను పంపి, ఆపై తమ పరిశోధక పత్రాలను పంపి, పత్రిక ప్రచురణలో జరిగిన అనివార్య జాప్యాన్ని పెద్ద మనసుతో అర్థం చేసుకొని, మాపై నమ్మకంతో ఓర్పు వహించి, వేచివుండి సహకరించిన నా తెలుగు అధ్యాపక, పరిశోధక విద్యార్థి మిత్రమండలికి నా నమఃపూర్వక, మనఃపూర్వక కృతజ్ఞతాభి వందనాలు.

నా కార్యక్రమాలన్నింటికి నా విద్యార్థులే నా బలం.

తెలుగు టైపు అందంగా, ఓపిగ్గా చేసి ఇచ్చే చి.యన్. గురుప్రసాద్ (బి.యస్.సి. తృతీయ) వంటి విద్యార్థులందరికీ నా ఆశీఃపూర్వక కృతజ్ఞతలు.

తెలుగులో ప్రచురించబడుతున్న సాహిత్య, సాంస్కృతిక, చారిత్రక తెలుగు మాసపత్రిక మూసీ. తెలుగుల వైభవాన్ని ముప్పిధాలుగా చాటుతున్న పత్రిక. ఇటువంటి గొప్ప పత్రిక ద్వారా మా జాతీయ సదస్సు ప్రత్యేక సంచికను ప్రచురించుకోగలగడం మా అదృష్టం. ఈ అవకాశాన్ని మాకు కలిగించిన మూసీ పత్రిక ప్రధాన సంపాదకులు డా. సాగి కమలాకరశర్మ గారికి, సహ సంపాదకులు డా. అట్టెం దత్తయ్య గారికి నా ధన్యవాదాలు. మూసీ పత్రిక వారిని సంప్రదించి, అనుమతి పొందడంలో సహకరించి, నాకు మరువలేని సహాయం చేసిన సహనశీలి, స్నేహశీలి డా. ఎస్. రఘు గారికి ప్రత్యేక హృదయపూర్వక కృతజ్ఞతలు. అతితక్కువ కాలంలో పత్రికను అందంగా కంపోజింగ్ చేసి, మాకు అందించడంలో ఎంతగానో సహకరించిన శ్రీమాన్ గ్రాఫిక్స్ యెల్చాల నర్సింలు గారికి నా ధన్యవాదాలు.

నా పనుల ఒత్తిడిలో ఎంతో కాలాతీతమైనప్పటికీ ఓర్పుతో వేచివుండి, నన్ను నిరంతరం సురక్షితంగా గమ్యాలకు చేరవేసే నా వాహన చోదకుడు చి. బి.వీరబాబుకు నా కృతజ్ఞతలు.

నేను ఇన్ని పనులు చేయడానికి నిరంతరం నాకు వెన్నుదన్నుగా వుండి ధైర్యాన్నిచ్చి, ప్రోత్సాహిస్తూ, కనిపించే దైవాలుగా వుండే నా నేస్తం రచ్చ సుమతి దేవి మరియు కుటుంబసభ్యులు, ఆపై సర్వ ప్రణాళికా కర్త అయిన భగవంతునికి పాదాభివందనాలు.

స్వస్తి.

డా. కె.వి. శాంతకుమారి

**(డా. కె.వి. శాంతకుమారి)**

తెలుగు విభాగాధిపతి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ

GOVT. DEGREE COLLEGE, AVANIGADDA

"తేజస్వినావధీతమస్తు"

MAY YOUR KNOWLEDGE BECOME BRILLIANT

Scanned with OKEN Scanner

# ఆంధ్ర మహాభ్యుదయ కావ్యంతో పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి

**వాడ్రేవు సుందర్రావు,** స్కాలర్, చరిత్ర విభాగం, డా॥ ఎ.పి.జె.అబ్దుల్ కలాం యూనివర్సిటీ, ఇండోర్, మధ్యప్రదేశ్
**డా॥ వందనావర్మ** ప్రొఫెసర్, చరిత్ర విభాగం, డా॥ ఎ.పి.జె.అబ్దుల్ కలాం యూనివర్సిటీ, ఇండోర్, మధ్యప్రదేశ్

## 1.1 ఉపోద్ఘాతం

తెలుగువారికి ఒక ప్రత్యేకమైన అస్తిత్వం ప్రసాదించాలని, తెలుగు భాషా వికాస అభ్యుదయాలకు తగిన స్ఫూర్తి నివ్వాలని, తెలుగువారికి ప్రత్యేక పాలనాధికారం అందించాలని, ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఆవిర్భవించాలని మనసారా వాంఛించిన మహనీయుడు పొట్టి శ్రీరాములు. మహాత్మాగాంధీజీ శిష్యుడై, తన జీవితాన్ని సత్యధర్మాలకే అంకితం చేసిన ధన్యపురుషుడు పొట్టి శ్రీరాములు. సబర్మతీ ఆశ్రమంలో సత్యాగ్రహిగా శిక్షణ పొంది, ఉత్తమ సత్యాగ్రహిగా గౌరవించబడిన ఉత్తమోత్తముడు. ఆయన జీవితంలో ఎన్నో ఎత్తు పల్లాలు, ఎన్నో కష్టాలు, మరెన్నో సమస్యలు. మరీముఖ్యంగా కష్టాలు శ్రీరాములుతో సహజీవనం చేశాయి. బాధలు, వేదనలు అడుగడుగునా ఆయనను పరిహసించాయి. కానీ, ఆ బాధల నుండి, వేదనల నుండి, దుఃఖం నుండి ఆయనలోని సంకల్పశక్తి ఎంతగానో వికసించింది. ఆయన సహనం, సౌశీల్యం ఎంతగానో వృద్ధి చెంది దేశసేవ వైపు నడిపించాయి. సత్యాగ్రహిగా సబర్మతీ ఆశ్రమంలో, ఆలీపూర్ కేంప్ జైల్లో ఆయన ప్రవర్తన అందరి మన్ననలందుకొంది. ఆయన సంఘసేవానురక్తి హరిజనులకు దేవాలయ ప్రవేశంలో ప్రతిఫలించింది. అంతిమంగా ఆంధ్రులకొక ప్రత్యేక రాష్ట్ర సాధనా యజ్ఞంలో ఆయన పట్టువీడని వీరుడయ్యాడు. 19-10-1952 నుండి ఏభై ఎనిమిది రోజులు ఉపవసించి, ఆంధ్రులకు ప్రత్యేక రాష్ట్రం అందించి, తానుమాత్రం అంతరించారు. అమరజీవిగా జాతి చరిత్రలో చిరస్మరణీయులయ్యారు. ఈ మహాత్యాగి జీవితాన్ని ఒక మహాకావ్యంగా అందించారు కీ॥శే॥ బండ్ల సుబ్రహ్మణ్యం, ప్రకాశం జిల్లాలోని, వేటపాలెం గ్రామంలో జన్మించి, జీవించిన బండ్ల సుబ్రహ్మణ్యం తన కావ్యంతో పొట్టి శ్రీరాములు బలిదానాన్ని శాశ్వతం చేశారు. పొట్టి శ్రీరాములుకు ఘన నివాళి సమర్పించిన తెలుగు కావ్యాలలో అగ్రస్థానం ఆంధ్ర మహాభ్యుదయానిదే ననడం నిస్సందేహం. ఈ మహాకావ్యంలో పొట్టి శ్రీరాములు జీవితం, సంస్కరణ, త్యాగంతోపాటుగా, ఆంధ్రవీర అల్లూరి సీతారామరాజు చేసిన మన్య పోరాటాన్ని కూడా ఎంతో హృద్యంగా వర్ణించారు. అంతేకాదు, ఆనాటి స్వాతంత్ర్య పోరాట ఘట్టాలు, మహానాయకుల త్యాగాలు కూడా ఈ కావ్యంలో పద్యరూపంలో ఎంతో హృద్యంగా కనిపిస్తాయి. స్వాతంత్ర్యోద్యమ ప్రతిఫలనాలలో ఆంధ్ర మహాభ్యుదయం చిరస్మరణీయమైంది. ఆ మహాకావ్యం యొక్క ఔన్నత్యాన్ని, కవితా మాధుర్యాన్ని, రచనా వైశిష్ట్యాన్ని పరిశీలించడమే ఈ పరిశోధనా పత్రం యొక్క ప్రధానలక్ష్యం.

## 1.2 ఆంధ్ర మహాభ్యుదయ కావ్యం – మహాకవి బండ్ల సుబ్రహ్మణ్యం

పొట్టి శ్రీరాములు సాగించిన మహోద్యమాన్ని ఎంతో అద్భుతంగా ఆవిష్కరించిన ఆంధ్ర మహాభ్యుదయ కావ్య రచయిత విద్వాన్ బండ్ల సుబ్రహ్మణ్యం. తెలుగుజాతి అభ్యుదయాన్ని, తెలుగునేల వైభవాన్ని మనసారా దర్శించిన బండ్ల సుబ్రహ్మణ్యం అదృష్టవంతులు. తాను దర్శించిన తెలుగునేల అభ్యుదయ వికాసాల కథను ఎంతో హృద్యంగా, ఆంధ్ర మహాభ్యుదయ కావ్యంలో ప్రతిఫలింప చేసిన ఘనత కీ॥శే॥ సుబ్రహ్మణ్యందే. అమరజీవి పొట్టి శ్రీరాములు జీవితం, బలిదానంపై తెలుగులో వచ్చిన పద్య కావ్యాలలో ఆంధ్ర మహాభ్యుదయం అగ్రశ్రేణిన నిలబడే కావ్యం. ఆమాటకొస్తే, దీనికి సరిసమానమైన కావ్యం మరొకటి లేదేమో కూడా! ఇందులో కేవలం శ్రీరాములు కథ మాత్రమే కాకుండా, ఆనాటి స్వరాజ్య సంగ్రామాన్ని ఎంతో వివరంగా వర్ణించడం



Scanned with OKEN Scanner

జరిగింది. దానికితోడు స్వరాజ్యం కోసం బ్రిటిష్ ప్రభుత్వాన్ని ఎదిరించి సాయుధ పోరాటం చేసిన ఆంధ్ర వీరుడు అల్లూరి సీతారామరాజునూ కీర్తించడం జరిగింది. విశాలాంధ్ర ఆవిష్కరణ వరకూ సాగిన కథనీ వివరించడం జరిగింది.

ప్రకాశం జిల్లా వేటపాలెం బండ్ల సుబ్రహ్మణ్యం స్వగ్రామం 15-7-1912వ తేదీన ఒక సామాన్య మధ్య తరగతి కుటుంబంలో సుబ్రహ్మణ్యం జన్మించారు. వేటపాలెం సముద్రతీర ప్రాంతం. బంగాళాఖాతం యొక్క ప్రభావం వేటపాలెం గ్రామం మీద అనేక రకాలుగా కన్పిస్తుంది. అంతేకాక, వేటపాలెం తొలినుండే చేనేతలకు ప్రసిద్ధి చెందింది. ఆ గ్రామంలో చేనేతపైన ఆధారపడిన కుటుంబాలు ఎక్కువ ఉండేవి. అటువంటి కుటుంబాలలో ఒకటి బండ్లవారి కుటుంబం. బండ్ల వేంకట సుబ్బయ్య, ఆదెమ్మ దంపతులు నేతపనినే తన వృత్తిగా జీవన ప్రయాణాన్ని సాగిస్తున్నవారు. ఆ పుణ్యదంపతులకు పుత్రుడిగా జన్మించారు సుబ్రహ్మణ్యం. వేటపాలెంలో ప్రాథమిక మాధ్యమిక విద్యలు పూర్తిచేశాక 1938లో మద్రాసులో విద్వాన్ పట్టా పొందారు. వేటపాలెం తిరిగివచ్చి ఉపాధ్యాయుడిగా తన ఉద్యోగ జీవితాన్ని ఆరంభించారు. సుబ్రహ్మణ్యంలో బాల్యం నుండే కవిత్వాభిరుచి మొగ్గ తొడిగింది. చిన్ననాటనే ఆయనకు పద్యవిద్య అలవడింది. యవ్వనపు తొలిరోజుల్లోనే పద్యకావ్యాలు చెప్పడం ఆరంభించారు. వారి తొలి రచన "విశ్వేశ్వర శతకం", మలిరచన "వేమన కావ్యం". ఆ తరువాత "తులసీదాసు, కుమారవిజయం, బుద్ధావతారం, ప్రహ్లాద, కళాశ్రీ" కావ్యాలు వెలువడ్డాయి. సుబ్రహ్మణ్యానికి పద్యకవిగా, పండితుల గుర్తింపు, ప్రశంస, గౌరవం లభించాయి. ఈ అన్ని ప్రయత్నాలలో గెలిచిన తర్వాతనే ఆంధ్ర మహాభ్యుదయం వంటి మహా కావ్యానికి అంకురార్పణ చేశారు బండ్ల సుబ్రహ్మణ్యం.

### 1.3 ఆంధ్ర మహాభ్యుదయానికి అసలైన ప్రేరణ

బండ్ల సుబ్రహ్మణ్యం ఆంధ్ర మహాభ్యుదయానికి ప్రేరణ లభించడం వెనుక ఓ చిత్రమైన సంఘటన ఉంది. అందులో భగవత్సంకల్పం కూడా ఉంది. 1952వ సంవత్సరం అక్టోబర్ 19వ తేదీన, ఆంధ్రరాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు, మద్రాసులో నిరాహారదీక్ష ఆరంభించారు. పొట్టి శ్రీరాములు ప్రాయోపవేశ దీక్షారంభం గురించి పత్రికల్లో చదివిన బండ్ల సుబ్రహ్మణ్యం ఎంతగానో ఉత్తేజితుడయ్యారు. ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఆమరణ నిరాహార దీక్షకు ఉద్దేశించిన శ్రీరాములు దీక్షా యజ్ఞంలో రోజులు గడుస్తున్న కొద్దీ, జరుగుతున్న ప్రతి సంఘటనా సుబ్రహ్మణ్యాన్ని ఎంతగానో ఉత్తేజితుడ్ని చేస్తూ వచ్చేయి. కఠోరమైన ఉ పవాస దీక్షతో శ్రీరాములు క్రుంగి కృశించిపోవడం బండ్ల సుబ్రహ్మణ్య కవి గుండెను కరిగించింది.

పొట్టి శ్రీరాములు దీక్ష ఏభై ఎనిమిది రోజులకు చేరింది. 15-12-1952న వేటపాలెంలోని సారస్వత నికేతనం గ్రంథాలయంలో రోజంతా ఆవేదనతో గడిపాడు సుబ్రహ్మణ్యం. దీక్షలో ఉన్న శ్రీరాములు వార్తలే తప్ప అతడి మనసుకి ఇంకేమీ పట్టడం లేదు. ఆ రోజంతా నిరాహారంగానే ఉండిపోయారు. ఆ సాయంకాలం ఆ ఆలోచనలతోనే వేటపాలెం నుండి మద్రాసు వెళ్లే రహదారిపైన చాలా దూరం నడచివెళ్ళాడు. బాగా చీకటి పడింది. అప్పుడు ఒక అద్భుతమైన దృశ్యం కనిపించింది. ఆకాశం నుండి ఒక విద్యుల్లత తీవ్రమైన వేగంతో నేలకు పడిపోతూ కన్పించిందట. ఆ దృశ్యాన్ని వేటపాలెం గ్రామస్తులు అందరూ చూశారు కూడా. ఆ తరువాత ఆకాశవాణి వార్తల్లో అమరజీవి పొట్టి శ్రీరాములు జీవించే ఆశలేదన్న విషయం వినవచ్చింది. ఆ రాత్రి 11.23 నిముషాలకు పొట్టి శ్రీరాములు ప్రాణాలు, పాంచభౌతిక శరీరాన్ని వీడిపోయాయి. ఆంధ్రుల కోసం ఆయన అమరుడయ్యారు. ఆ రాత్రి తెల్లవార్లూ, బండ్ల సుబ్రహ్మణ్యం హృదయం ఎంతగానో క్షోభించింది. అమరజీవి బలిదానంతో ఆయన మనసు ఆర్ద్రమై మూగగా రోదించింది. ఆ ఆవేదనలోంచే అప్రయత్నంగా తొలి పద్యం వెలువడింది.

**శ్రీలాలిత్య కలావిలాసముల వాసింగన్న యాంధ్రావనిన్**
**జాల మేలొనగూర్పఁ జెన్నపురము -స్థాపించెఁ జెన్యాఖ్యుఁడా**
**ప్రోలాపుణ్యుని పేరనే పరగెఁ దన్ముఖ్యాంకధర్మాంశముల్**
**గ్రాల రాములు రాష్ట్రసిద్ధికొఱకై-ప్రాయోపవేశుండుగా**

భావావేశంలో ఆరోజే బండ్ల సుబ్రహ్మణ్యం నోటివెంట ఏకధాటిగా ఏభై రెండు పద్యాలు వెలువడ్డాయి. శ్రీరాములు త్యాగాన్ని ఒక చిన్న పద్యంలో ఎంతో గొప్పగా వర్ణించాడు సుబ్రహ్మణ్య కవి.



Scanned with OKEN Scanner

**కత్తియుఁ గలమును బట్టక**
**చిత్తం బుత్తమజనాళి సేవాధర్మా**
**యత్తమొనరించి రాష్ట్రముఁ**
**దెత్తువనుచు నెవ్వరైనఁ దెలియరు రామా!**

బండ్ల సుబ్రహ్మణ్యం చెప్పిన పద్యాలు, క్రమంగా వేటపాలెంలో అందరి ఆదరణా పొందాయి. పండితులు, పామరులు అనే బేధం లేకుండా అందరూ ఆ పద్యాలు చదువుతూ వచ్చేరు. పాఠశాలల్లో ఉపాధ్యాయులు తమ విద్యార్థుల చేత ఈ పద్యాల్ని కంఠతా చేయించారు. అన్నివైపుల నుండీ లభిస్తున్న ప్రశంసలతో బండ్ల సుబ్రహ్మణ్యం మనసులో మహాకావ్య నిర్మాణ సంకల్పం మొగ్గ తొడిగింది. అమరజీవి దివ్యకథని ఆంధ్ర మహాభ్యుదయ కావ్యంగా రాయడానికి ఆయన సంకల్పించారు. పొట్టి శ్రీరాములు జీవితంలోని యదార్థమైన విషయాలను తెలుసుకోవడానికి, శ్రీరాములు సోదరుడైన డా॥పొట్టి రంగయ్య గుప్తాతో ఉత్తర ప్రత్యుత్తరాలు చేశారు. ఈ విషయంలో వారికి గొల్లపూడి రాధాకృష్ణయ్య శ్రేష్ఠి సహాయం లభించింది. క్రమంగా "ఆంధ్ర మహాభ్యుదయ" కావ్యం ప్రథమ భాగం రూపుదిద్దుకొంది.

### 1.4 ఆంధ్ర మహాభ్యుదయ కావ్యం – ప్రథమ భాగం

అచిరకాలంలోనే ఆంధ్ర మహాభ్యుదయం ప్రథమ భాగం వెలువడింది. వేటపాలెంలోని సాహితీమిత్రులు ఎంతో ఇష్టంగా ఆవిష్కరణ కార్యక్రమం చేశారు. ఆనాటి ఆవిష్కరణ సభలో సుప్రసిద్ధ కవి పండితులైన ఆచార్య దివాకర్ల వెంకటావధాని ముఖ్య అతిథిగా పాల్గొని, మంచి ప్రసంగం చేసి, పద్యకావ్యాన్ని ఆవిష్కరించారు. అంతేకాక, బండ్ల సుబ్రహ్మణ్యానికి సువర్ణ ఘంటా కంకణం తొడిగి సత్కరించారు.

ఈ ప్రథమ భాగంలో నాలుగు ప్రకరణాలున్నాయి

ప్రథమ ప్రకరణం పొట్టివారి వృత్తాంతంతో ఆరంభమై, పొట్టి గురవయ్య మరణంతో ముగుస్తుంది. రెండవ ప్రకరణం అంతా మొదటి ప్రపంచ యుద్ధం గురించి వివరిస్తుంది. ఆ యుద్ధ కాలంలో మద్రాసు నగర భీభత్సాన్ని కళ్లకు కట్టినట్టు చూపిస్తుంది. తృతీయ ప్రకరణం శ్రీరాములు పాఠశాల విద్యతో ఆరంభమై, సీతారాముల కళ్యాణంతో ముగుస్తుంది.

ప్రథమ ప్రకరణంలో ఎన్నో మంచి పద్యాలున్నాయి.

**నవమాసంబులు నిండ నొక్క శుభలగ్నంబందుఁ దత్సాధ్వి సం**
**స్తవ నీయుండగు పుత్రునింగనియె నాంధ్రశ్రీ నవోన్మేషయై**
**జవసత్వమ్ములువొంది సర్వదిశల సత్కీర్తి సాధించుకో**
**నవకాశమ్ము లభించె నంచు మది బ్రహ్మానందముం బొందఁగా.**

తృతీయ ప్రకరణంలో సీతారాముల వివాహ ఘట్టాన్ని ఎంతో అందంగా వర్ణించాడు కవి.

**ప్రాంచదఖండశిల్పకళ రాజితరాజత భాజనంబులం**
**దుంచిన సేసఁబ్రాలు గొని యొండొరుగెల్వఁగఁ బ్రోత్సహింప న**
**భ్యంచితరీతి దంపతు లనంతముదమ్మున నొక్కరొక్కరి**
**మించఁగఁ బోసికోఁ దలలఁ మేలని మెచ్చిరి మిత్రబృందముల్.**

### 1.5 ఆంధ్ర మహాభ్యుదయం – ద్వితీయ భాగం

ఆ తరువాత రోజుల్లో ఆంధ్ర మహాభ్యుదయానికి ద్వితీయ భాగం వెలువడడం నిజంగా ఆంధ్రులకు పండుగే. అందరూ ఆ క్షణం కోసమే ఎదురుచూశారు. ఆంధ్రరాష్ట్ర పూర్వ ముఖ్యమంత్రి, సుప్రసిద్ధ సాహితీవేత్త డా॥బెజవాడ గోపాలరెడ్డి ద్వితీయ



Scanned with OKEN Scanner

భాగాన్ని ఆవిష్కరించారు. ఇందులో పన్నెండు ప్రకరణాలున్నాయి. ప్రథమ ప్రకరణంలో సీతారాముల వైవాహిక జీవితం కన్పిస్తే, ద్వితీయ ప్రకరణం అంతా శ్రీరాములు విషాద గాథ కన్పిస్తుంది. కన్నతల్లి, కట్టుకొన్న భార్య, కన్నకొడుకు ఇలా ఒక్కరొక్కరే శ్రీరాములు నుండి దూరమైపోయారు. వారందరి మరణంతో పొట్టి శ్రీరాములు జీవితం దుఃఖంతో నిండిపోయింది. కరుణారసార్ద్రమైన ఈ ఘట్టాన్ని కవి ఎంతో వేదనాభరితంగా రచించారు. బండ్ల సుబ్రహ్మణ్యం రచనా సవ్యసాచి. ఆయన పద్యం ఎంత హృద్యమో, ఆయన వాక్యం కూడా అంతటి రసాత్మకం. గాంధీజీ గురించి కవి రాసిన గద్యం చదివితే చాలు, ఆయన ప్రతిభ స్పష్టమవుతుంది.

"ఆ పరమపూజ్యుని వాక్కు వేదవాక్కు. ఆ నిష్ఠాగరిష్ఠుని దృష్టి నూతన రాజకీయ చైతన్య కళాసృష్టి. అమ్మహామహుని దీక్ష భారతీయ జనతా రక్ష. ఆ జితేంద్రియుని నడక స్వరాజ్య సంపాదనపుం గడక"

తృతీయ ప్రకరణంలో గాంధీజీని ఒక పద్యంలో ఎంతో అందంగా వర్ణిస్తాడు కవి.

**సుమనోభిరామ భా - సుర ధర్మగుణవర్తి**
**సాధు సజ్జనలోక - చక్రవర్తి**
**శాసనోల్లంఘన - సత్యాగ్రహాస్త్రప్ర**
**యోగ చాతురి జయో - ద్యోగియోగి**
**దిగ్దంతిదంత ము - ద్రిత యశోభాసుందు**
**సకలార్థసాధక - సత్యమూర్తి**
**నిర్మలీకృత మనః - కర్మ నిష్ఠానిధి**
**మానవకళ్యాణ - మార్గదర్శి**

**విశ్వసౌభ్రాతృతా సిద్ధి - వేఁడి కూడి**
**దైవమును నిచ్చ ప్రార్థించు - తాపసేంద్రుఁ**
**డతని వాక్సుధ ప్రవహించి - నట్టి పట్టు**
**ధర్మదేవత నాల్గు - పాదముల నడచు.**

ఆంధ్ర మహాభ్యుదయం తెలుగు పద్యానికి పట్టాభిషేకం చేసింది. నవీన రీతుల్లో ఎన్నో పద్యాలు చెప్పిన ఘనత ఆయనది. ఇది "ద్విముఖపది" పద్యరీతి. ఈ పద్యాలలో పదాలు ముందునుండి వెనక్కి చదివినా అర్థం మారదు. ఇలాంటివెన్నో చమత్కారాలు ఈ కావ్యంలో అడుగడుగునా కనిపిస్తాయి.

**కనక లతల మిసిమి - కనక గట్టిగ నన**
**కుఱుకు సరస మహిమ - విరివి కనక**
**నళిన నయన యదియ - నవన నవీన జ**
**లజ ముఖము కులుకు త - లంత కనఁక.**

**జలజ నయన కణిక - కులుకు లకుముకుల**
**కనక ముదము కళిక - కనక వలవ**
**వారెవా నవీన - వల్లవ కన్యక**
**నళిన లతల మహిమ - నటన కుసుకు.**

చతుర్థ, పంచమ ప్రకరణాలలో, బ్రిటిష్ సామ్రాజ్య శక్తిని ఎదిరించి పోరాడిన అల్లూరి సీతారామరాజు పోరాటాన్ని, మన్యవీరుల పోరాట పటిమను వారి దేశభక్తిని ఎంతో గొప్పగా వర్ణించాడు కవి.



Scanned with OKEN Scanner

షష్ఠ ప్రకరణంలో సంపూర్ణ స్వాతంత్ర్య చర్చ, సప్తమ ప్రకరణంలో స్వాతంత్ర్య పోరాటం, అష్టమ ప్రకరణంలో హరిజనోద్ధరణం, ఆంధ్రరాష్ట్ర సాధనాయత్నం ఎంతో వివరంగా వర్ణించబడ్డాయి. నవమ ప్రకరణంలో పొట్టి శ్రీరాములు దీక్షారంభం కనిపిస్తుంది. 1952 అక్టోబర్ 19న, బలిపూజా దినోత్సవం నాడు శ్రీరాములు దీక్షారంభం జరిగింది. దాన్ని కవి ఎంతో అందంగా వర్ణించాడు.

**చెదరఁగనీకధైర్య మతి - సాహసలీలఁ బరాత్పరున్మదిం**
**బదిలముగాఁగ నిల్పి నిజ - వాంఛ ఫలోన్ముఖమౌ తెఱంగుకై**
**యదనెది మార్గమెద్ది యని - యద్భుత యోచనమున్నొనర్చి తాఁ**
**దుదకిటు నిర్ముఖఖడ్గమును - దూసె స్వదేశము దద్దరిల్లఁగ .**

దశమ ప్రకరణంలో పొట్టి శ్రీరాములు సాగించిన ఆమరణ నిరాహారదీక్ష ఎంతో వేదనాభరితంగా దర్శనమిస్తుంది. ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ఏభై ఎనిమిది రోజులు కఠోరమైన నిరాహారదీక్ష సాగించి అమరుడయ్యారు శ్రీరాములు. ఆ మహనీయుడి బలిదానంతో ఆంధ్రదేశం ఆగ్రహావేశాలతో ఊగిపోయింది. ఆంధ్రుల క్రోధాగ్నిని బండ్ల సుబ్రహ్మణ్యం అద్భుతంగా వర్ణించారు.

**పక్షీంద్ర ధ్వజసంభవాద్భుత తపో - భంగోద్భవక్రోధరూ**
**క్షాక్షోగ్రార్భటి తుల్యభీషణ మహో - హంకారహుంకార వా**
**గ్దక్షక్షోభితమర్త్యమై తెలుఁగు మ - ర్త్యవ్రాత ముప్పొంగెఁ ద**
**ద్దీక్షాభక్షిత రామవాంఛిత ఫలో - ద్దిష్టాశయోద్రిక్తమై.**

అమరజీవి బలిదానంతో ఆంధ్రులకు ఒక రాష్ట్రం ఆవిర్భవించింది. చిరకాలపు మహాస్వప్నం సాకారమయ్యింది. చిన్న చిన్న మాటలతో ఎంతో గొప్పగా అమరజీవికి అంజలి ఘటించాడు సుబ్రహ్మణ్యం.

**పాపపంకిలమైన ప్ర - పంచమందు**
**స్వచ్ఛసద్గుణీ దొఱకుట - చాలయరుదు**
**సద్గుణియకాక ప్రజలకై - సాహసమునఁ**
**బ్రాణమర్పించె రాములు - పరమ ఘనుడు.**

**1.6 ముగింపుమాటలు**

భారత స్వాతంత్ర్య పోరాటం చారిత్రక మహాకావ్యాలకు వేదికయ్యింది. వర్తకం కోసం వచ్చి, మనదేశాన్ని ఆక్రమించి, భారతీయుల్ని బానిసల్ని చేసిన విదేశీ దురంహంకార సామ్రాజ్యవాద శక్తిని తరిమివేసిన మహాపోరాటం భారత స్వాతంత్ర్య పోరాటం. దేశం కోసం తమ జీవితాలను తృణప్రాయంగా ధారపోసిన మహనీయ దేశభక్తులెందరో దేశస్వాతంత్ర్య పోరాట చరిత్రలో అడుగడుగునా కన్పిస్తారు. ఆ మహనీయుల త్యాగాన్ని, బలిదానాన్ని స్మరించడమే ప్రధాన లక్ష్యంగా సాహిత్యం సృష్టించబడాలి. అప్పుడే రాబోయే తరాలకు ఆ కథలు తెలిసే అవకాశం ఉంటుంది. వాటినుండి ప్రేరణ పొందే అవకాశం లభిస్తుంది. దేశాన్ని, సమాజాన్ని, కన్న తల్లిదండ్రుల్ని, పెద్దల్ని ప్రేమించే తరాన్ని చూడాలనుకొంటే, వారికి దేశభక్తుల కథలు చెప్పే తీరాలి. ఏ కావ్యాలైతే ఈ సదాశయంతో వెలువడుతాయో, అవి స్వాతంత్ర్యోద్యమ ప్రతిఫలనాలై, దేశానికి, దేశీయులకు సత్ఫలితాల నందిస్తాయి. దురదృష్టవశాత్తూ స్వాతంత్ర్యానంతరం ఈ విషయంలో కవులు, రచయితలు పొందవలసినంత స్ఫూర్తిని, చేయవలసినంత కృషిని చేయలేదనే చెప్పాలి. స్వరాజ్య వీరుల దివ్యకథల్ని భక్తితో స్మరించవలసినంతగా మనం స్మరించుకోలేకపోయాం. అయినా విద్వాన్ బండ్ల సుబ్రహ్మణ్యం వంటి సహృదయులు. తాము ఆర్థికంగా నష్టపోయినా, తెలుగువారికి "ఆంధ్ర మహోభ్యుదయం" వంటి ఉత్తమోత్తమ కావ్యాన్ని అందించి చిరస్మరణీయులయ్యారు. మహాకవి బండ్ల సుబ్రహ్మణ్యం బాట, తెలుగునాట వర్తమాన కవులకు, రచయితలకు మర్గదర్శకం కావాలని మనసారా ఆశిస్తున్నాను.



Scanned with OKEN Scanner

ఈ వ్యాస రచనలో నాకు సహాయపడిన గ్రంథాలు – గ్రంథ రచయితలు – ప్రచురణ కర్తలు

వీరందరికీ నా కృతజ్ఞతలు అర్పిస్తున్నాను

1. ఆంధ్ర మహాభ్యుదయము – పద్య కావ్యము; మహాకవి శ్రీ బండ్ల సుబ్రహ్మణ్యం గారు, వేటపాలెం, ప్రకాశం జిల్లా.

2. అమరజీవి పొట్టి శ్రీరాములు "90వ జయంతి సంచిక" 1992 మరియు "బలిదానం" (శ్రీరాములు గారి చరిత్ర); రచయితలు: శ్రీ వై.ఎస్. శాస్త్రి గారు, విద్వాన్ ఎ. సుబ్బరాయ గుప్త గారు; ప్రచురణ: అమరజీవి పొట్టి శ్రీరాములు మెమోరియల్ సొసైటి (రి) మద్రాసు.

3. ఆంధ్రజ్యోతి–అమరజీవి; రచయిత చిప్పాడ సూర్యనారాయణమూర్తి; ప్రచురణ : గాంధీ సాహిత్య ప్రచురణాలయం, హైదరాబాదు.

4. అమరజీవి పొట్టి శ్రీరాములు గారి జీవిత చరిత్ర; పరిశోధనా గ్రంథము, రచయిత: డా॥ బాదం శ్రీరాములు, లెక్చరర్, మార్కాపురం; ప్రచురణ : అఖిల భారత వైశ్య యువజన సంఘం, హైదరాబాదు.

5. మన జాతీయ నాయకులు – అమరజీవి పొట్టి శ్రీరాములు
రచయిత : శ్రీ పురాణపండ రంగనాథ్ గారు; ప్రచురణ: ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, విజయవాడ – 2.

6. ఆంధ్ర రాష్ట్రావతరణ సంచిక – 1953; ప్రకాశకులు : వెంకట్రామా అండ్ కో బుక్ పబ్లిషర్స్, ఏలూరు,

7. అమరజీవి; రచన : శ్రీ దరువూరి వీరయ్య గారు – స్వాతంత్ర్య సమరయోధులు.

8. ఆంధ్రరాష్ట్రావతరణ సంచిక – ప్రజాపత్రిక – రాజమండ్రి. ప్రస్తుత సంపాదకులు శ్రీ దేవీ సుదర్శన్.

9. వాసవీ స్రవంతి – దశాబ్ది ఉత్సవ సంచిక – వ్యాస రచయిత : శ్రీ ఎం.ఆర్.కె. మూర్తి గారు.

10. సుప్రసిద్ధుల జీవిత విశేషాలు – రచయిత శ్రీ జానమద్ది హనుమచ్ఛాస్త్రి గారు, కడప; ప్రచురణ : విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, హైదరాబాదు.

11. తెలుగు వెలుగులు – వ్యాస సంపుటి; ప్రచురణ: అమరావతీ పబ్లికేషన్స్, గుంటూరు.

12. నా జీవితయాత్ర (టంగుటూరి ప్రకాశం గారిది); ప్రచురణ : ఎమెస్కో, హైదరాబాదు.

13. వైశ్య ప్రబోధినీ సంచిక – జయనగర్ కాలనీ – కడప.

14. పూర్ణాహుతి (శ్రీ పొట్టి శ్రీరాములు జీవితచరిత్ర); రచన : శ్రీ కె.సభా గారు; ప్రచురణ : ఆత్మారాం అండ్ కో – అనంతపురం.

15. జాతి నిర్మాతలు. రచన : శ్రీ తుర్లపాటి కుటుంబరావు గారు. ప్రచురణ : దేశీ బుక్ డిస్ట్రిబ్యూటర్స్, విజయవాడ–2

16. "ఆంధ్రప్రభ" దిన పత్రిక, మద్రాస్ వారి సంచికలు 1952 వ సంవత్సరం.

17. "ఆంధ్రప్రభ" ఆంధ్రరాష్ట్రావతరణ సంచిక, 1953.

18. "ఆంధ్రపత్రిక" ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ సంచిక – 1956.

19. "ఆంధ్రప్రభ" ఆంధ్రప్రదేశ్ రాష్ట్రావతరణ సంచిక – 1956.

20. "ఆంధ్రరాష్ట్రోద్యమం పై వ్యాసం" శ్రీ చట్టి నరసింహారావు గారిది – 1912వ సంవత్సరం, దర్బారు పత్రిక, గుంటూరు.

21. శ్రీ గాంధీ ఆశ్రమం, కొమరవోలు వారి పత్రికలు "దరిద్రనారాయణ", "గ్రామ స్వరాజ్యం" సంపాదకులు : ప్రఖ్యాత స్వాతంత్ర్య సమరయోధులు కీ॥శే॥ ఎర్నేని సుబ్రహ్మణ్యం గారు.



Scanned with OKEN Scanner

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# సమాజపరిణామక్రమంలో జాతీయోద్యమ కవిత్వపాత్ర

**డా. పి. విజయకుమార్,** తెలుగుశాఖాధిపతి, ఎస్.ఎమ్.ఎల్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల, ఎమ్మిగనూరు

దేశభక్తి ప్రపూరితమైన జాతీయోద్యమం 20వ శతాబ్ది తొలి దశాబ్దంలోనే ఆరంభమైంది. 'జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి' అనే సూక్తి అక్షరాక్షర సత్యమని జాతీయోద్యమ చరిత్రవల్ల తెలుస్తుంది. మాతృభూమిని దాస్యశృంఖలాల నుంచి విముక్తి చేయించాలని ఎందరో తహతహలాడారు. దేశంకోసం ఆత్మార్పణం గావించుకున్నారు. తెలుగు కవులు ఈ పవిత్ర యజ్ఞంలో పాలుపంచుకున్నారు. తమకలాల్ని తుపాకీలుగా చేసుకొని ప్రబోధగీతాన్ని తూటాలుగా ఆంగ్లేయులపైకి వదిలారు. ఎందరో కవులు జాతీయోద్యమ కవితా రథసారధులయ్యారు. సమాజంలోని మార్పును ఆకాంక్షించారు.

The instinct of freedom is perhaps the noblest of all human instincts because it inspires, enlarges and elevates as well as gives meaning and content to life

– డాక్టర్ జాకీర్ హుస్సేన్

(In this forward to songs of freedom)

The forest of independence is better than the cage, though, made of gold

– వీర సావర్కార్

(Indian war of Independence)

జాతీయత అంటే ఒక జాతి ఆత్మ గౌరవానికి, ఔన్నత్యానికి సంబంధించిన స్థితి. జాతి, సంస్కృతి, సంప్రదాయాలను, సహజత్వాన్ని ప్రవహింపచేసే జీవనది జాతీయత. గురజాడ వారి 'దేశభక్తి' గీతం జాతీయతకు వివరణే. "ఒకే మనుగడ, ఒకే విశ్వాసం గల మానవ సమూహపు భావజాలమే జాతీయత భిన్నత్వంలో ఏకత్వమే జాతీయత." హాన్స్‌కోన్ జాతీయతను చక్కగా నిర్వచించడం జరిగింది.

తన జన్మభూమికి ఎప్పుడూ వినయంగా ఉండి అవ్యాజమైన ప్రేమ కలిగి ఉండటం, ఆ నేలను, అక్కడి సంప్రదాయాలనూ, చారిత్రకతను అభిమానిస్తూ గాఢమైన అనురాగం ఉండటం ఇదే జాతీయత.

మనమంతా ఒక్కటే అనే భావమే జాతీయత అవుతుంది. తమ మాతృదేశం ఒక్కటే. అందరి కష్ట సుఖాలను పాలుపంచుకోవటం అనేది జాతీయత అవుతుంది. భిన్న జాతులు, భిన్న మతాలు, భిన్న భాషలు ఉన్నా 'జాతీయత' అలవడుతుంది" అని భారతదేశం ప్రపంచానికి చాటి చెప్పింది.

సమాజంలో ఆనాడు జాతీయ భావాలున్న వారికి స్వాతంత్ర్యకాంక్ష తప్పనిసరిగా ఉంటుంది స్వాతంత్ర్యం అనేది జన్మతః సంక్రమించే సహజ లక్షణం అంటే జీవధర్మం. 'స్వాతంత్ర్యం నాజన్మహక్కు' అని తిలక్ ఎలుగెత్తి చాటాడు. సమాజంలో మానవుని



Scanned with OKEN Scanner

ఆర్థిక, సామాజిక, రాజకీయ, మానసిక, ఆత్మీయ, ఆధ్యాత్మిక స్వాతంత్ర్యాలే అసలైనవి. అందుకే బాల గంగాధర్ తిలక్ 'స్వరాజ్యం నాజన్మహక్కు' అని ఎలుగెత్తి చాటాడు. స్వాతంత్ర్యంలేని మానవ జీవితం ఒడ్డునపడ్డ చేపలాంటిది. తరతరాల దాస్యశృఖలాల నుంచి, జాతి విముక్తి కోసం, మాతృభూమి స్వేచ్ఛ కోసం అనే సామాజిక పరిణామం కోసం కవులు కలం పట్టి రాసిన కవిత్వమే జాతీయోద్యమ కవిత్వం.

ఆంగ్లేయులు రాజకీయంగాను, సాంస్కృతికంగా, ఆర్థికంగా, భాషాపరంగా అన్ని రంగాలలో భారతీయులను బానిసలుగా చేశారు. విభజించి పాలించు అనే సిద్ధాంతాన్ని అవలంభిస్తూ భారతజాతి జాతిసమైక్యతకు భంగం కల్గించారు. ఆ స్థితిలో భారతీయులు స్వరాజ్యం కోసం పోటెత్తిన సముద్రాల్లో విజృంభించి ఉద్యమం చేపట్టారు. ప్రతి భారతీయుడు యోధుడై వారిలో నాదేశం, నాజాతి అనే భావన పవిత్ర ధారగా ప్రవహించింది. ఆంగ్లేయుల పాలనను అంతం చేసి స్వాతంత్ర్యం సంపాదించడానికి జాతీయోద్యమం ప్రారంభమైంది. 1857 సిపాయిల తిరుగుబాటు (ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం) భావి సంగ్రామానికి కరదీపిక అయింది. అరవిందఘోష్, తిలక్ మొదలగు వారు ఉద్యమతత్వాన్ని ప్రచారం చేసి చైతన్యవంతమైన ప్రజాఉద్యమానికి పురికొల్పారు. శ్రీమతి అనిబిసెంట్ హోంరూల్ ఉద్యమాన్ని ప్రారంభించి జాతీయోద్యమానికి ప్రదీపకురాలయింది. గాంధీజీ ప్రవేశంతో జాతీయోద్యమం గొప్ప మలుపు తిరిగింది. జాతిని జాగృతపరిచి 1920 లో మహాత్మాగాంధీ సత్యాగ్రహ స్వర్ణశంఖాన్ని పూరించాడు.

రైతు జనసేన, అస్పృశ్యతా నివారణ, మద్యపాన నిషేదం, జాతీయవిద్య వంటి సామాజిక కార్యక్రమాలను గాంధీజీ రూపొందించి జాతినంతటిని ఏకం చేశాడు. సైమన్ కమీషన్ బహిష్కరణ భారతీయులలో ఉత్సాహాన్నిచ్చింది. ఉప్పు సత్యాగ్రహోద్యమంలో ఆంధ్రదేశం పాత్ర మరువలేనిది. 1942 క్విట్ ఇండియా ఉద్యమాన్ని ప్రారంభించారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ యుద్ధాన్ని ప్రకటిస్తే, గాంధీజీ అహింసా యుద్ధాన్ని ప్రకటించాడు. మహాత్మాగాంధీ ఇరవై ఒక్కరోజులు నిరసన వ్రతం చేయడంతో ప్రభుత్వం దిగి వచ్చింది. 1947లో స్వరాజ్యమనే బంగారు కల ఫలించింది.

ఒక అజ్ఞాత కవి బంకిం చంద్రుని "వందేమాతరం" ప్రేరణతో డిసెంబరు 15, 1905 న కృష్ణా పత్రికలో "ది క్రై ఆఫ్ మదర్ ఇండియా" అనే పేరుతో ఒక గీతం ప్రచురితమైంది.

**"హిందువులారా ఎన్నాళ్లీ గతి**
**మందమతులై మాటికి చెడెదరా**
**నందనులగు మీరందరు స్రుక్కగా**
**ఎందుకు నా బ్రతుకితరుల కోసమా ?**
**దూడనోరు గట్టిన ద్రోహంబు గొల్లలు**
**పాడి సమస్తము పరులకమ్మ గతి**
**కూడు లేని నా కొడుకుల గాధని**
**మేలుకో సాధన మెల్లను బోయెడి"**

ఈ గీతం ఎవరు రాసిందో తెలియదుగానీ ఇదే జాతీయోద్యమ సాహిత్యంలో బహుశా తొలి తెలుగు గీతం. సమాజంలోని జన జీవన వ్యవస్థలో చైతన్య పరిణామాన్ని కాంక్షించిందీ గేయం. చిలకమర్తి లక్ష్మీ నరసింహం పంతులు 1907లో ఆశువుగా చెప్పిన 'భరత ఖండంబు చక్కని పాడియావు' అనే తేటగీతి పద్యానికి ప్రేరణ కూడా ఈ గీతంలో కనబడుతుంది. జాతీయోద్యమం స్వాతంత్ర్యోద్యమంగా పరిణమిస్తూ అనేకమంది రచయితలను ప్రభావితం చేసింది. దేశవ్యాప్తంగా కవులు, రచయితలు చదివే చదువులనూ, చేసే ఉద్యోగాలను వదిలి స్వాతంత్ర్యోద్యమ సమరంలో దూకారు, జైళ్ళకెళ్ళారు, సాహిత్యాన్ని సృష్టించారు. తీవ్ర



Scanned with OKEN Scanner

నిర్బంధాల నెదుర్కొన్నారు. బెంగాల్లో నజ్రుల్ ఇస్లాం ఉత్తేజకరమైన గీతాలు రాయడమేకాక, కఠిన కారాగార శిక్షల్ని భరించారు. తమిళంలో సుబ్రహ్మణ్య భారతి, మలయాళంలో శంకర్ కురూప్, సంస్కృతంలో గణపతి ముని, తెలుగు నేలపై గరిమెళ్ళ సత్యనారాయణ, అడవి బాపిరాజు, రాజశేఖర శతావధాని, వడ్డాది సీతారామాంజనేయులు మొదలయిన వారు స్వాతంత్ర్యోద్యమ సాహిత్యాన్ని సృష్టించారు.

జాతీయోద్యమంతో ప్రభావితులైన వారిలో ఉన్నవ లక్ష్మీనారాయణ, మహీధర రామ్మోహనరావు, అడవి బాపిరాజు మొదలైన వారు ‘ నవల’ను, ముట్నూరు కృష్ణారావు ‘వ్యాసాన్ని’ దామరాజు పుండరీకాక్షుడు ‘నాటకాన్ని’; గరిమెళ్ళ, మంగిపూడి సోదరులు, వడ్డాది సీతారామాంజనేయులు, గురజాడ రాఘవవర్మ మొదలైన కవులు ‘గీతాన్ని’; కాశీనాధుని నాగేశ్వరరావు, సురవరం ప్రతాపరెడ్డి ‘పత్రిక’లను తమ సాధనాలుగా చేసుకుని జాతీయోద్యమానికి జవాన్నీ, జీవాన్నీ సమకూర్చారు. ఈ రచయితల్లో కొందరు విద్యాధికులు, మరికొందరు కేవలం ప్రాథమిక విద్యావంతులు, ఇంకొందరు విశేష విద్యాయోగ్యతలు కానీ, సాహిత్య దక్షత కానీ లేకపోయినా పరాయి పాలకుల అన్యాయాలను, అక్రమాలను చూసి ఆగ్రహంతో కవిత్వాన్ని అల్లిన స్రష్టలు. వీరందరూ ప్రజల్లో ఉన్న వేర్వేరు పొరలను తట్టి లేపి, ఆయాస్థాయి భేదాలతో ఉన్న జన సమూహంలో చైతన్యం కలిగించారు. నిరాడంబరత, సారళ్యం, సూటిదనంగల జాతీయోద్యమ సాహిత్యం ఆనాటికి ప్రజల మనోభావాలకు ప్రతిధ్వనిగా సామాన్య జనబాహుళ్యంలోకి చొచ్చుకు పోయింది.

విషయాన్ని బట్టి స్వాతంత్ర్యోద్యమ సాహిత్యాన్ని అనేక అంశాలుగా వర్గీకరించవచ్చు. ఆనాటి అన్ని సాహిత్య ప్రక్రియల్లోను ప్రధాన ధ్వని ‘జాతీయోద్యమమే’ అయినప్పటికీ వస్తువును బట్టి చేసుకునే విభజన సౌలభ్యానికి మూల హేతువు.

1. దేశమాత స్తుతి
2. మేలుకొలుపు సాహిత్యం
3. ఆంధ్రమాత స్తుతి
4. నాయక స్తుతి
5. నాయిక స్తుతి
6. పంజాబ్ దురంతాలు
7. జాతీయ జెండాపై సాహిత్యం
8. సహాయ నిరాకరణోద్యమ సాహిత్యం
9. నిర్మాణ కార్యక్రమాలపై సాహిత్యం
10. స్వాతంత్ర్య సమర సాహిత్యం

భారతీయుల దేశాన్ని ‘తల్లి’గా భావిస్తారు. ‘మాతృదేవోభవ’ అనేది భారతీయులకు శిరోధార్యం. కాబట్టి దేశాన్ని దేశమాతగా భావించి ఆరాధించడం జాతీయోద్యమ సాహిత్యంలో కనబడుతున్న విశిష్ట లక్షణం, దీనిని కొనసాగించే దేశాన్ని ‘దేశమాత’గా, రాష్ట్రాన్ని ‘రాష్ట్రమాత’గా కీర్తించి ఆరాధించడం.

1921కి ముందే బాలకవి వడ్డాది సీతారామాంజనేయులు, పూడిపెద్ది కాశీ విశ్వనాథ శాస్త్రి.

**“దండాలు దండాలు భారతమాత**
**అవి అందుకొని దీవించు భారతమాత”**

అంటూ ‘భారతమాత గీతాన్ని గానం చేశారు. ఈ గీతం మరికొన్ని గీతాలు కలిపి 1921లో ఈ జంట కవులు ‘స్వరాజ్యగీతామృతం’ అనే పుస్తకాన్ని అచ్చువేశారు. దండాలు దండాలు ‘భారతమాత’ పాటలో మొత్తం 326 పాదాలున్నాయి. ఆపాట ఆనాడు పట్టణాలను దాటి పల్లె పల్లెకూ విస్తరించింది. విశేష ప్రజాదరణ పొందింది. అది సహించలేని బ్రిటీష్ ప్రభుత్వం ఆ పాటనూ ఆ పుస్తకాన్ని నిషేధించింది. 1921 నాటికే ‘గరిమెళ్ళ సత్యనారాయణ రాసిన దేశమాత స్తుతి గీతం



Scanned with OKEN Scanner

**"వందన మిదె గైకొను మీ భారత జనని**

**భారత జననీ మా పాలిట రాణీ"** ఆంధ్రుల నాలుకల మీద నాట చేసింది. అలాగే సత్యాగ్రహోద్యమంలో 'మంగిపూడి' వారు అరెస్టయి, రాయవెల్లూరు సెంట్రల్ జైల్లో ఉన్నప్పుడు

**"సతత భారత వీర సుతులము**
**వితత సర్వార్పణోద్యతిమతిని నీదరికి**
**కుతుకమున వచ్చినామే తల్లీ "**

అని గానం చేశారు. దేశమాత సంకెళ్ళను తెంచడానికి తాము ఎన్ని సార్లు సంకెళ్ళను ధరించాల్సి వచ్చినా వెనుకాడబోమని మంగిపూడి ప్రతిజ్ఞ చేశారు.

ఇంకా దేశమాతను స్తుతిస్తూ తెలుగు కవుల వేదుల సత్యనారాయణ, గురజాడ రాఘవ శర్మ, కాటూరి వెంకటేశ్వరరావు ప్రభృతులు ప్రఖ్యాత గీతాలు రాశారు. అలాగే దేశమాతను స్తుతించిన గేయాల్లో ప్రముఖంగా పేర్కొనవలసినవి దువ్వూరి వారి 'జాతీయ గీతం' రాయప్రోలువారి 'జన్మభూమి', తమ్ముడా ! కాటూరి వారి 'మాతృస్తవం', కవి కొండల వెంకట రావు 'ఉయ్యాలా జంపాలా ! వేదులవారి 'మా తల్లీ, ప్రియభారతావనీ'; దేవులపల్లి కృష్ణశాస్త్రి 'జాతీయగీతం' మొదలైనవి. ఇవన్నీ మాతృదేశ గీతాలాపనల్లో పునీతమయ్యాయి. దేశమాతను స్తుతించిన గీతాల్లో తలమానికమైన ప్రసిద్ధ గీతం దేవులపల్లి కృష్ణశాస్త్రిది.

**"జయ జయ జయ ప్రియ భారత జనయిత్రీ, దివ్యధాత్రి**
**జయ జయ జయ శత సహస్ర నరనారి హృదయనేత్రి"**

అంటూ ఆ మహాకవి దేశమాతకు నివాళులర్పించాడు. 1940 దశకంలో జరిగిన అనేక విద్యార్థి సమావేశాల్లో ఈ గీతం ప్రార్థనా గీతమయింది. ఉద్యమానికి ఆరంభ సూచన మేల్కొలుపు. ఉద్యమ సాహిత్య ప్రాదుర్భావానికి ప్రారంభసూచన 'మేల్కొలుపు సాహిత్యం'. జాతీయోద్యమంలోకి జన సమీకరణ కోసం ప్రజాకవులు ప్రజల్ని మేల్కొలిపారు. పోరాట పథాన్ని చూపారు.

**"పొడుపు కొండ మీద పొడిచె నల్లదె ప్రొద్దు**
**తడయకింకను వేగలేరా. భారత తల్లికి పుట్టివౌరా** ॥పొడుపు॥

**వేగుచుక్క ఓ తడ వేకువ మేల్కాంచి యోగ ముద్రలు**
**మరిచినావు ఓరి భోగాసక్తుడవై చెడ్డావు.**
**రోగాలకెల్లను జాగా చేసితి విల్లు – పోగాల యెదురైన**
**పొలము చేసె విధాన** ॥పొడుపు॥

అనే 'మేలుకొలుపు' గీతాలు పాడుతూ గరిమెళ్ళ సత్యనారాయణ జాతిని జాగృతపరిచారు. త్యాగాలతో తల్లి ఋణాన్ని తీర్చుకొమ్మనే తత్వాన్ని ప్రబోధించారు. '

"మేలుకొనుడు ! మేలుకొనుడు ! మేల్మి బంగారు ఉషస్సిద్ధి" అంటూ దేశీయుల్ని మేల్కొలిపి బెల్లంకొండ చంద్రమౌళి శాస్త్రి ఆకులు మేల్కొంటున్నవి, పక్షులు మేల్కొంటున్నవి, గుడిగంటలు మేల్కొంటున్నవి, పిల్ల పూవులు మేల్కొంటున్నవి, నరపాయపు కాల్వవలె పథము మేల్కొంటున్నది' అనే ఆశాపథాన్ని నిర్దేశించాడు.

కవి కుమారులు ముట్నూరి వేంకట సుబ్బారాయుడు, మంగిపూడి వెంకట శర్మ రాసిన గీతం



Scanned with OKEN Scanner

**"దేశాభిమానంబు, దీపింపజేయమం**
**త్రంబు వందేమాతరంబు నుండు**
**సాహ సౌదార్యమున్ సమకూర జేయు మం**
**త్రంబు వందేమాతరంబు నుండు"**

అంటూ స్వాతంత్ర్యాన్ని చేతికందించే తంత్రంగా, ఐకమత్యాన్ని సాధించే, దేశాభిమానాన్ని దీపింపజేసే జంత్రంగా 'వందేమాతరం' 'నినాదాన్నీ , వందేమాతరం ఉద్యమాల్ని వర్ణిస్తుంది. ఒక వైపున మేల్కొలుపు సాహిత్యాన్ని సృష్టిస్తూనే, మరోవైపు, 'భానిస భారతం' యొక్క దైన్యాన్నీ, దయనీయతనూ వర్ణిస్తూ జాతీయోద్యమ రచయితలు ప్రజల్ని కర్తవ్యోన్ముఖుల్ని చేశారు.

**"కనరా కనరా భారతదేశపు - పారతంత్ర్య బ్రతుకు ॥కనరా॥**
**బానిస విద్య బానిసకూడూ భారత దేశము నేడూ**
**బయలుదేరు నీ భాగ్యోన్నతికై భావి పౌరుడవురా" అంటూ కర్తవ్య బోధ చేస్తూ ...**
**తెల్లవాడే వట్టికల్ల వాడె - మన తల్లిదేశమంతా కొల్లగొట్టువాడే ॥తెల్ల॥**

అని 'నల్లవాడె గొల్ల పిల్లవాడే' అనే జానపదబాణీలో.. బేరగాడుగా వచ్చి, ప్రజలకు మత్తు మందును నూరిపోసి, అన్నదమ్ముల మధ్య తగవులు బెట్టి, మనమీద పెత్తనాన్ని చెలాయిస్తున్న 'తెల్లవాడి' అసలు రూపాన్ని ప్రదర్శింపజేశాడు మిక్కిలినేని భగవంతరావు.

జాతీయోద్యమానికి నాయకత్వం వహిస్తూ అనేక త్యాగాలు చేసి, కారాగార క్లేశాలనుభవించి, జాతి జనులను స్తుతిస్తు, ఎన్నో కావ్యాలు, ఖండ కావ్యాలు, గీతాలు వెలువరించారు. తెలుగు సాహిత్యంలో 'గాంధీజీ' పొందిన సాహిత్య గౌరవం మరే ఇతర జాతీయ నాయకుడు కూడా పొందలేదు.

తుమ్మల సీతారామమూర్తి గాంధీజీ 'ఆత్మకథ'ను 'మహాత్మకథ'గా కావ్యరూపం కల్పించారు ఆతరువాత 'మహత్మకథ' పేరుతో మరో స్వతంత్ర కావ్యం వెలువరించారు. యుగ పురుషులు ఉత్తమాదర్శ జీవిత పద్ధతులను జన సామాన్యానికి ఉత్తమరీతిని ప్రదర్శించవలసిన బాధ్యతను వహించిన మరింగంటి శేషాచార్యులు 'శ్రీ గాంధీ భారతం' కావ్యాన్ని రచించాడు. 1921లో శ్రీ మహాత్మాగాంధీ 'భజన కీర్తనలు' అనే కావ్యం వెలువడింది. మద్దూరి పాపారావు ఈ కావ్యాన్ని రచించాడు. మరోవైపు

**"గాంధీనైపోతానే అమ్మా - గాంధీనైపోతా**
**నేనే హిందూ ముస్లిం క్రైస్తవ సిబ్ఖు లందరై పోతా నేనే**
**సత్యమైపోతానే అమ్మా - శాంతినైపోతా నేనే**
**సర్వలోక సేవలోనే సొంతమై పోతా నేనే"**

అంటూ గాంధీజీ గుణ గణాలను ప్రతిబాలుడు ఆవాహన చేసుకోవాలన్న ఆకాంక్షను శిష్టా సత్యనారాయణ రాజశేఖరం 'గాంధీనై పోతానే' గీతంలో వ్యక్తం చేశారు. వీరశైవ వచనాల్లోని ఆవేశం, వైష్ణవ పద సాహిత్యంలోని తాదాత్మ్యం ఈ గీతంలో స్ఫురిస్తుంది. మరో గీతంలో దామరాజు పుండరీకాక్షుడు

**"శ్రీ గాంధీ నామం - మరువాం మరువాం**
**సిద్ధము జైలుకు - వెరువాం వెరువాం**
**మరి ఇతరుల మేము నమ్మం నమ్మం"**



Scanned with OKEN Scanner

అంటూ లాఠీ దెబ్బలతో బెదరమనీ, తుపాకులతో బెదరమనీ గాంధీజీ చూపిన మార్గంలో స్వరాజ్యాన్ని సాధిస్తామని ప్రకటించారు. ఉద్యమంలో క్రియాశీలంగా పాల్గొన్న జాతీయ నాయకుల మరణాలపట్ల ఆర్ద్రమైన హృదయాలతో రచయితలు వెలువరించిన సాహిత్యాన్ని 'నాయిక స్మృతి సాహిత్యం' అంటున్నారు. 1918 నాటి రౌలట్ చట్టం. 1919 ఏప్రిల్ నాటి జలియన్ వాలాబాగ్ మారణహోమం భారతీయుల గుండెల్లో బ్రిటీషు వ్యతిరేకాగ్నికి ఆజ్యం పోశాయి. కలకత్తా కాంగ్రెస్ (1920) సమావేశం సత్యాగ్రహోద్యమాన్ని ముమ్మరం చేయాలని తీర్మానించింది. సహజంగానే తెలుగు రచయితలు తమ కలాలకు పదును పెట్టారు.

జాతీయ గేయకవి 'గరిమెళ్ళ సత్యనారాయణ' రాసిన 'మా కొద్దీ తెల్లదొరతనం' 'గీతం ఊరూరా వాడవాడా ప్రజల గొంతుల్లో ప్రతిధ్వనించింది. స్వాతంత్ర్య సమర శంఖారావంగా జానపద బాణీలో హృదయాలను తాకే రీతిలో 'గరిమెళ్ళ' ఈ గీతాన్ని పాడుతుండే ప్రజలు ఉద్రూతలూగేవారు.

**"మాకొద్దీ తెల్ల దొరతనము – దేవ మాకొద్దీ తెల్ల దొరతనము**
**మాప్రాణాలపై పొంచి – మానాలు హరియించే"**

అనే పల్లవితో సాగే ఈ 39 చరణాల గీతంలో దాదాపు 162 గేయ పాదాలున్నాయి. ఈ గీతాన్ని పాడిన వారినే ఆనాటి తెల్ల ప్రభుత్వం జైళ్లకు పంపిందంటే, ఇక రచించిన రచయిత సంగతి వేరే చెప్పనవసరం లేదు. జాతీయోద్యమ పరాకాష్ఠ 'క్విట్ ఇండియా ఉద్యమం' (1942) 'ఆగస్టు విప్లవం'గా ప్రసిద్ధి కెక్కిన ఈ ఉద్యమ ప్రారంభం మొదట దేశం స్వతంత్రమయ్యే దాకా ఐదేళ్ళపాటు వెలువడిన సాహిత్యాన్ని స్వాతంత్ర్య సమర సాహిత్యమంటున్నాం. వస్తువులోనూ, భాషలోనూ, భావ ప్రకటనలోనూ అంతకు ముందున్న సాహిత్య రూపం కన్నా భిన్నంగా, తీవ్రతరంగా స్పష్టమైన సమర మార్గాన్ని నిర్దేశించిందీ కాలం నాటి సాహిత్యం.

ఆగస్టు విప్లవ ప్రతిధ్వనిగా 'నెత్తురు కలం' అనే గుప్తనామంతో కాశీ విశ్వనాథం 'ఆగస్టు గేయాలు' రచించారు. 'ఆగస్టు వీరుడ నేనేరా – ఆగస్టు విప్లవం నాదేరా – కరోమరో కథనంబిదనే – కదన భూమిలో కదిలిరా. మర ఫిరంగులను మార్కొనినే – మహిలో ఖ్యాతిని బొందితిరా'' అంటూ ఆగస్టు విప్లవంలో బలైన 949 మంది భారతీయులు, 39 మంది తెలుగు వీరుల ఆత్మ బలిదానాలను ఆవాహన చేసుకొని ఆగస్టు వీరుడిగా తనను తాను ఈ కవి ప్రకటించుకున్నారు.

ఈ ఉద్యమంలో తమ ప్రాణాలను పణంగా పెట్టి బలైన వీర విద్యార్థులకు అంకితం చేస్తూ మిక్కిలినేని భగవంతరావు, 'విద్యార్థుల వీరగేయాలు' వెలువరించారు. క్విట్ ఇండియా ఉద్యమ కాలంలో పైడిపాటి సుబ్బ రామశాస్త్రి 'దేశం' అనే గేయకావ్యం, టేకుమళ్ళ కామేశ్వరరావు 'వెలుగు' అనే గేయకావ్యం, విశాలాక్షి 'అభ్యుదయ గీతాలు' కరుణశ్రీ 'అరుణ కిరణాలు' తెన్నేటి సూరి 'అరుణ రేఖలు' వెలువడ్డాయి. సమాజపరిణామక్రమంలో జాతిచైతన్యానికి జాతీయోద్యమ కవిత్వం క్రియాశీలకపాత్ర వహించింది.

# మాతృసంగీతం - అమృత సందేశం

**డా. మోగంటి సుధామయి,** తెలుగుశాఖాధిపతి, రీసెర్చ్ సూపర్ వైజర్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ.ప్ర.),
రాజమహేంద్రవరం, చరవాణి : 9440543860, msudhamayitelugu@gcrjy.ac.in

స్వాతంత్ర్యోద్యమ చరిత్రను ఒక తరం నుండి మరొక తరానికి తెలియజేయడం, జాతికి ధైర్య సాహసాలను నూరిపోసే ఉద్యమకారుల వీరోచిత గాథలు, సన్నివేశాలను వెలుగులోకి తేవడం గతాన్ని భద్రంగా యువతకు అప్పగించడం జాతి ఔన్నత్యానికి ప్రతిరూపం. చరిత్ర గత పరిణామాలను నమోదు చేసి ప్రగతిదాయకమైన బాటను చూపిస్తుంది. గతంపైనే వర్తమానం, భవిష్యత్తు ఆధారపడి ఉంటాయి. స్వాతంత్ర్య సమరంలో మన భారతీయులు చూపిన అసమాన ధైర్యసాహసాలు, సహనం, త్యాగం, క్రమశిక్షణ, పోరాటాలు, దేశభక్తి నేటి యువతకు మార్గదర్శకాలు. దేశభక్తిని రగిలించే అలాంటి సాహిత్యాన్ని చదవని యువత దేశాన్ని సరైన పథంలో నడిపించలేదు సరికదా దేశాన్ని అధోగతిపాలు చేస్తుంది. అలాంటి దిశానిర్దేశం చేసే సాహిత్యంలో అనిశెట్టి సుబ్బారావు గారి అగ్నివీణ కవితా సంపుటిలోని “మాతృ సంగీతమనే గేయం తలమానికమైనది. 1922 అక్టోబరు 23న గుంటూరు జిల్లా పురుషోత్తమ పట్నంలో జన్మించిన అనిశెట్టి 1942లో నరసరావు పేటలో నవ్యకళాపరిషత్తును నెలకొల్పి తెలుగులో తొలి అభ్యుదయ కవితా సంకలనమైన “నయాగరా”ను ప్రచురించారు. స్వాతంత్రోద్యమంలో పాల్గొని 1942-44 ల్లో జైలు జీవితాన్ని అనుభవించారు. ధనవంతులైన పేదల పక్షపాతిగా వారి జీవితానుభవాలను స్వకీయం చేసుకుని అభ్యుదయ భావాలతో కవితలు రాసారు. శ్రీశ్రీ, ఆరుద్రలకు అత్యంత సన్నిహితులైన వీరు అనుభూతి ప్రధానంగా అగ్నివీణలోని మాతృసంగీతంలో భారతదేశాన్ని తల్లిగా భావించి ఆమె హృదయాన్ని సహజంగా ఆవిష్కరించి సాహిత్య చరిత్రలో ఒక అమృత సందేశాన్నిచ్చారు.

అభ్యుదయ కవి శ్రేష్ఠులు అనిసెట్టి సుబ్బారావు, కుందుర్తి ఆంజనేయులు, రెంటాల గోపాలకృష్ణ, బెల్లంకొండ రామదాసు, మాచిరాజు దేవీ ప్రసాద్ నరసారావుపేట మునిసిపల్ ఉన్నత పాఠశాలలో అనిసెట్టికి సహాధ్యాయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం, స్వామి కేశవతీర్థ సీనియర్ విద్యార్థులు. 1942 ఆగష్టు 8న గుంటూరులో క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొనడం వల్ల, బెంగాలీ విప్లవకారుడు రతన్‌కుమార్ చటర్జీ కి ఆశ్రయమిచ్చి బెంగాలీ కరపత్రాలను అనువాదం చేయడం వల్ల రెండేళ్ళు, రాయవెల్లూరులో జైలు శిక్ష ననుభవించారు. జైలు శిక్షననుభవించినట్లు ఋజువులు చూపిస్తే స్వాతంత్ర్య సమరయోధుల పెన్షన్ వస్తుంది కదా యని సన్నిహితులడిగినా దానిని అంగీకరించని దేశభక్తుడు అనిసెట్టి. అభ్యుదయ సాహిత్యాన్ని నడిపిన నాయకునిగానే కాక కవిత్వం, నాటకం, గేయం, కథల్లాంటి అనేక సాహిత్య ప్రక్రియలను ప్రగతిశీల భావాలతో పరిపుష్టం చేసి సమకాలీనుల మెప్పుపొందారు.

భారతదేశం ముప్ఫైయేళ్ళ బానిసత్వంలో మగ్గి స్వాతంత్ర్యకాంక్షతో ఉప్పెనలా విరుచుకుపడిన తరుణంలో మార్క్సిస్టు భావాలకు కట్టుబడ్డ అభ్యుదయ రచయితలంతా బానిసత్వ విముక్తికి మార్క్సిజమే దిక్సూచిగా భావించారు. స్వాతంత్ర్యకాంక్షను తమ రచనల ద్వారా ప్రేరేపించి ప్రజల్లో చైతన్య దీపాలు వెలిగించేందుకు తమ కలాలనే కత్తులుగా దూసారు. అభ్యుదయ కవి అనిసెట్టి 1941 నుండి 1947 వరకు రాసిన కవితలన్నీ అగ్నివీణగా రూపొందాయి. వారి కవితలు దేశాభిమానంతో, దాస్య శృంఖలాల అధిక్షేపంతో, బానిసత్వాన్ని, దోపిడీతత్వాన్ని నిరూపిస్తూ, విప్లవాన్ని ప్రబోధిస్తూ, స్వాతంత్ర్య దీక్షతో ప్రజ్వరిల్లుతున్నాయి.



Scanned with OKEN Scanner

అగ్నివీణ కవితా సంపుటిలో మాతృసంగీతం కవితాఖండిక జాతీయోద్యమ కాలంలో బిపిన్ చంద్రపాల్ రాజమండ్రి వచ్చినపుడు చిలకమర్తి లక్ష్మీనరసింహం ఆశువుగా చెప్పిన భరతఖండంబు చక్కని పాడియావు అనే పద్య ప్రభావంతో "పాలపొదుగు నాతల్లీ ప్రాణదాత నా తల్లీ" అనే ఆశుకవితగా ప్రభవించింది.

మాతృ సంగీతంలో 18 చరణాల్లో తల్లి భారతిని దేవిగా సంభావిస్తూ కుమారులైన భారతీయుల కర్తవ్యాలను మహోన్నతంగా నిర్దేశించారు. అలతి అలతి పదాలతో తేటతెనుగులో రచించిబడిన మాతృసంగీతం నేటి డిగ్రీ విద్యార్థులకు రెండవ సెమిస్టరులో బోధించగల్గడం అధ్యాపకులుగా మన అదృష్టం "పాలపొదుగు నా తల్లీ! ప్రాణదాత నా తల్లీ" అనే సంబోధనతో ప్రారంభమైన ఈ గేయం ఎంతో స్ఫూర్తిని నింపుతుంది. భారతమాత హృదయాన్ని కుమ్మినవారెవరు? తన శరీరాన్ని అమ్మిన వారెవరు? తన నట్టింటి దీపమార్పినదెవరు? తనకట్టుబట్ట లాగినదెవరు? ప్రళయశక్తిగా, విలయకాళిగా భరతమాత విజృంభించాలని తలుస్తూ కవి భారతీయులంతా ఏకమై తమను ఆక్రమించిన ముష్కరులపై పగతో, ముట్టడించడానికి కదులు తున్నారని, తమను ఆశీర్వదించమని కోరాడు.

మాతృభూమి పిలుస్తున్నా మారుపలకని సోమరులను కవి హెచ్చరిస్తూ అడుగడుగునా కంఠమెత్తి ఆకాసాన్ని కదిలించమని, అణువణువునా ఆయువూది అగ్నిని రగిలించమని ప్రబోధిస్తున్నాడు. పురాదాస్య పరాభవాన్ని కడిగివేయడానికి పుడమి నిండా భారతీయుల నెత్తురును చిమ్మమంటున్నాడు, ఉక్కు బందిఖానాలు ముక్కలు చేసి, గడియసేపు కాలమాపి గతలోకాన్ని మార్చమని, ఒక్క బానిస ఉన్నా ఈ లోకానికి ముక్తి లేదని, పిడికెళ్ళెత్తి జగత్తును పిండిగొట్టమని ప్రోద్బలం చేస్తున్నాడు.

ఈ మాతృ సంగీత గీతం నలభై కోట్ల మంది ప్రజల విప్లవకంఠమని, ఈ మట్టి పై హక్కు వేరెవరికీ లేదని ఘోషిస్తున్నాడు, భారత సంపద కగ్గిపెట్టే నీచులను బలిస్తానని, మరచక్రం, క్రు అనే పదాలతో కార్మిక కర్షక సోదరులను కలుపు కుంటున్నాడు. తనయుగాన్ని బంధించే సంకెళ్ళను ఛేదిస్తానని, దేశంకోసం ప్రాణాలర్పించిన వీరుల సమాధుల్లో తన గీతం మ్రోగుతుందని, జీవన్మృతుల హృదయాలను చీల్చుతుందని, వర్గాలు, సరిహద్దులు తనకు లేవని, దేశాన్ని వల్లకాడుగా, పౌరులను అస్థి పంజరాలుగా దోచిందెవరని తీవ్రంగా గద్దిస్తున్నాడు. ఈ విశ్వంలో తను సంపూర్ణమైన మానవుడని, తనరక్తం ధార పోసి నవలోకం స్థాపిస్తానని మాటయిస్తున్నాడు.

కూడు లేని నిర్భాగ్య సోదరులకు సాంత్వన కలిగేలా లోకంలో సిరిసంపదలన్నిటి పైనా మనకూ హక్కుందని బంగారం లాంటి మట్టి, పాలలాంటి నదులు, ప్రాణమున్న సముద్రాలు ఈ దేశపు మూలాలని నినదిస్తున్నాడు. బడబాగ్ని లేచి శత్రువుల కోటలను దహించివేయాలని, భారతీయులను కారాగారాల్లో బంధించి, స్త్రీలను ఇళ్ళలోనే మగ్గించిన కిరాతకం నేటిలో పటాపంచలవ్వాలని ఆశాభావం వ్యక్తం చేస్తున్నాడు.

శత్రువుల కోట మీద వారి జండా ఎగురు తోందని, పౌరుషాగ్నితో గుండెలు మండుతుండగా ఒక్క తన్నుతో కోటగోడ ముక్కలై పోవాలని, కోట బురుజులు నాశనమై పోవాలని, గుండెలను పణంగా పెట్టి, సింహాసన పీఠాన్ని కదిలించాలని, కోట పైకెక్కి విజయధ్వానాలు చేస్తూ దిక్కులు మారు పలికేటట్లు నినదించాలని, తుపాకీ గుళ్ళతో శరీరం తూట్లుపడి, ధూళిలో కలిసినా పిడికిలి అనే పిడుగుతో జెండాను పెకలించి తేవాలని ఉచ్చైస్వరంతో పిలుపునిస్తున్నాడు.

భావకవుల కాల్పనికవాదుల కలల మధుర సంగీతంలా కాక తన దేశానికింకా వసంత రాలేదని, పూలై విచ్చుకోలేదని వాస్తవ పరిస్థితిని ధైర్యంగా ప్రకటిస్తున్నాడు. దేశప్రజలంతా ఆకలితో ఆలమటిస్తున్నారని, కడుపునిండని ప్రజలను స్వేచ్ఛకోసం ఎలా నృత్యం చేస్తారని మార్మికంగా ప్రశ్నిస్తున్నాడు. దేశం కులాల మతాల ప్రాంతాలవారీగా చీలిపోతుందని తాను నమ్మనని, ఇలాంటి అసత్యాలను తమలాంటి దేశభక్తకవుల ఎముకలు నిప్పుకణికలై ఎదుర్కొంటాయని, తమని ప్రగతి శక్తులుగా



Scanned with OKEN Scanner

అభివర్ణించుకున్నాడు. సంపూర్ణ స్వరాజ్యం వచ్చిననాడే ఉత్సవాలు, వసంత నాట్యాలు సంబరం చేసుకుంటాయని, అంతవరకూ కర్తవ్య దక్షతో ముందుకు సాగమని హెచ్చరిస్తున్నాడు. దేశభక్తులైన వీరులు వేలాది మంది మరణించగా వారి నెత్తురులు ఓడికలు కట్టి ఎర్రటిపూలై నేలపై వికసించాయని, లోకాన్నెదిరించే దీక్షతో సగర్వంగా ఎగురుతున్న మానవత్వపు జెండా తనకు బాగా పరిచితమేనని, నేలకొరిగిన భారతీయ స్వాతంత్ర్య సమర యోధుల త్యాగనిరతిని కొనియాడుతున్నాడు. దేశమాత విముక్తి కోసం లక్షలాది దేశభక్తులు ప్రాణత్యాగం చేయగా అనాథులైన లక్షల ప్రజల స్వాతంత్ర్యసిద్ధి రగలించిన అనంతమైన అగ్నిజ్వాల తనకు తెలుసని, బాధాతప్త హృదయంతో ఎలుగెత్తి చాటుతున్నాడు. మునుముందు లోకాన్ని ఆక్రమించబోతున్న ఎర్రని శుభోదయం తనకు ముందే తెలుసని, ఫలించబోతున్న స్వాతంత్ర్య సిద్ధిని ప్రతీకాత్మకంగా చెబుతున్నారు. తనలాంటి కారాగారాలకెళ్ళిన స్వాతంత్ర్య సమరయోధులు చేసిన త్యాగాలువృధా కావని, ముందు తరాలు ఎర్రని ముఖాలతో నవ్వుతాయని తనకు తెలుసని కవి అనిసెట్టి చెప్పడం ద్వారా ఎరుపు అనేది పరాయి పాలనలో మగ్గిన భారతీయుల భావి ఆకాంక్షల అభ్యుదయ భావమని చెప్పకనే చెప్పాడు.

బహుముఖ ప్రజ్ఞాశాలి అనిసెట్టి అనేక సాహితీ ప్రక్రియల్ని తన సృజనాత్మక తత్వంలో స్వర్ణమయం చేశాడు. అనేక పత్రికల్లో రాసిన కవితలను అగ్నివీణ కవితా సంపుటిగా అభ్యుదయ భావాలతో వెలిగించాడు. 55 మంది యువ కవుల రచనలను 'కల్పన' సంకలనంగా వెలువరించాడు. శ్రీశ్రీయుగం అనే ఆధునిక కవితా సంకలనాన్ని, 199 మంది సమకాలీన యువకుల కవితలను 'యువకవిత' పేరుతో వెలువరించాడు. అనేక అనువాద కవితలు వెలువరించడమే గాక 48 చిత్రాలకు మాటలు పాటలు రాసి 300 చిత్రాలకు డబ్బింగ్ చేశారు. శాంతి లేదు లాంటి నాటకాలు, కథలు, వ్యాసాలు అనేకం వారి ప్రగతిశీల భావాలతో సమాజానికి సరైన సందేశమివ్వడంతో సఫలమయ్యాయి.

ప్రజాశక్తి, అభ్యుదయ పత్రికలకు సంపాదకునిగా, గుడి గంటలు లాంటి 42 సినిమాలకు సంభాషలు రాసిన సృజనశీలిగా, 300 పైగా డబ్బింగ్ చిత్రాలకు సంభాషణలు సమకూర్చిన కళాతత్త్వజ్ఞులు అనిసెట్టి మాత్రమే ఇలాంటి గేయం రాయగల మహాకవి. అందుకే వారు అఖిలభారత అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శిగా, దక్షిణ భారత చలన చిత్ర మండలి ఉపాధ్యక్షులుగా, ఆం.ప్ర సంగీత నాటక, అకాడమీ సభ్యులుగా పలు పదవులను పొంది బహుముఖీనమైన తన కవన చాతుర్యంతో, ప్రగతి కాముక అభ్యుదయ సిద్ధాంతాల నిప్పులు కురిపించే అగ్ని వీణను మీటి మాతృసంగీతాన్ని వీరరస సమ్మిళితంగా ప్రవహింపజేసి, స్వాతంత్ర్య కర్తవ్య దీక్ష అనే అమృత సందేశాన్ని గానం చేయగలిగారు. ఆ గానాన్ని నేటికి సజీవ స్రవంతిలా నిలపగలిగారు.

**ఆధార గ్రంథాలు :**

1) అనిసెట్టి సుబ్బారావు – అగ్నివీణ

2) అనిసెట్టి సాహిత్యం – సమాలోచనం – డా॥ సుబ్బారావు

# స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు కవుల రచయితల పాత్ర

డా. దండెబోయిన పార్వతీదేవి, చరవాణి : 94408 34017, మెయిల్ : drparvathidevi123@gmail.com

**శ్రీ చక్రాంకిత విశ్వదివ్యనగరీ సింహాసనాధ్యాసినీం**
**అంకేలాలిత రామకృష్ణచరితాం బౌద్ధైర్జినైర్మండితాం**
**ఆచార్య ప్రవరైశ్చ నానక దయానందాదిభిర్నందితాం**
**వందే భారతమాతరం వాత్సల్యపూర్ణాం ధరాం !!**

'వందే భారతమాతరం' అంటూ కోట్లాది భారతీయులు ఏకోన్ముఖంగా పాడుతూ పరవశిస్తున్న సమయమిది. స్వర్ణభారతికి అమృతోత్సవ వేడుకల శుభతరుణమిది. దాస్యబంధాల నుండి విముక్తయై డెబ్భైఐదు వసంతాలను పూర్తి చేసుకుంటున్న పరిపూర్ణ భరతమాతను తలచుకొన్న ఏ భారతీయుడి గుండెల్లో ఆనందం పొంగుకురాదు. ఉద్వేగం ఉప్పొంగదు. మహావైభవంతో మన మువ్వన్నెల జాతిపతాకం రెపరెపలాడుతూ ప్రతి వూరూ, వాడా, ఇంటింటా వూరేగుతూ వుంటే అమృతోత్సవ వేడుకలు మహోత్సవాలు కావా మరి! ఈవేళ ఆకాశం ప్రాతః కాషాయవర్ణాన్ని అద్దుకుంటే, నేలమ్మ తన ఒంటినిండా సస్యశ్యామలమైన పచ్చదనాన్ని కప్పుకుంది. ఇక మధ్యలో వున్న మన అఖండ భరతజాతి మదినిండా చల్లని వెన్నెలవంటి తెల్లదనాన్ని పాలపొంగులా నింపుకుంది. ఇంకేముంది! కలగలసి సప్తవర్ణాలుగా మన బతుకులను మలిచే మహాపండుగ, అదిగో ఒక పూర్ణకుంభంలా వేంచేస్తూ ఉంది. మన ఎన్నెన్నో ఆశలను ఆకాంక్షలను మోసుకొని వస్తున్నట్లు గంభీరంగా సాగివస్తోంది.

అదిగో ఒక్కసారి చూడండి. ఆ ఎగురుతున్న జాతిపతాకం రెపరెపలు. చూస్తేనే హృదయం గంభీరమౌతుంది. మనల్ని నిటారుగా నిలబెడుతుంది. ఒక అచంచల దేశభక్తి క్షణాల్లో మన నరనరాల్లో పాకుతుంది. మనలో దృఢమైన ఆత్మవిశ్వాసాన్ని నింపుతుంది. క్షణాల్లో చేతులెత్తి నమస్కరించేలా చేస్తుంది.

ఇలాంటి ఓ జీవశక్తి గల జెండాపండు గను అత్యంతఘనంగా ఆజాదీ కా అమృత మహోత్సవంగా జరుపుకోవటంలో దాని వెనుక వున్న హేతువు సామాన్యమైనది కాదు. అతి కర్కశులైన తెల్లదొరల పాలనలో మ్రగ్గిన భారతావనికి స్వేచ్ఛను సాధించుకున్న మన నేలగర్వాన్ని, మన జాతి ధైర్యాన్ని ప్రపంచానికి చాటడం కోసమే ఈ వేడుక. స్వేచ్ఛకోసం అహరహం పోరాడిన వీరులను, వారి త్యాగాలను హృదయగతం చేసుకోవటము కోసం, వారి బలిదానాలకు నివాళులివ్వటం కోసమే. అగ్రనాయకులే కాదు అతి సామాన్యులు, మహిళలు కూడా చేసిన నిస్వార్థ స్వాతంత్ర్యదీక్షలను గొంతెత్తి పాడటం కోసమే; తిరుగులేని తెల్లవాళ్ళ దౌష్ట్యకాండలో మరఫిరంగులకు, తూటాలకు, ఉరికొయ్యలకు తృణప్రాయంగా ప్రాణాలర్పించిన అమరవీరులకు అంజలులెత్తటం కోసమే; 'వందేమాతర'మంటూ సంతోషంగా నేలకొరిగి మనకు స్వేచ్ఛనుసాధించిన మన పూర్వీకులకు స్వర్ణభవిష్యత్తును నిర్మించుకుంటామని మనం భరోసా నివ్వటం కోసమే. నేలపైనే స్వర్గాన్ని నిర్మించుకునే భావిచైతన్యయజ్ఞంలో సమిధలవటం కోసమే. ఇందుకోసం ప్రతిఒక్కరూ దృఢదీక్ష తీసుకోవటం కోసమే.



Scanned with OKEN Scanner

"దాస్యబంధ స్వతంత్రభరత మాతృకంఠాన ఒక పుష్పమాలనగుచు
తల్లి ఆనందభాష్పాల తడిసి తడిసి పులకరింపగ నభిలాషకలదు మాకు"

అన్న కరుణశ్రీ పులకరింత మనదందరిదీనూ అవుతున్న సమయమిది. నిజమే యావన్మంది భారతీయులు ఒక తోటలో పూలలా ఎదిగి పెరిగి భరతమాత మెడలో పరిమళభరితమైన ముత్యాలపేటలా అల్లుకుపోవాలని ఆశపడుతున్న ఈ శుభతరుణాన ఆంధ్రరాష్ట్రంలో కవులు తమ కలాన్ని గళాన్ని స్వాతంత్ర్యపోరాటంలో ఎలా వినిపించారు. ఎలా ఒక చైత్యప్రభంజనాన్ని జాతిగుండెల్లో నింపారన్నది తప్పక తెలుసుకోవాలి.

అంతకంటె ముందు దాదాపు రెండువందల ఏళ్ళ పాటు తెల్లవారి పాలనలో దాస్యబంధనాల్లో చిక్కుకుంది భరతావని. ఆ చరిత్ర పరిణామాల్లోకి వెళితే ప్రత్యేకించి మన ఆంధ్రదేశం 19వ శతాబ్ది ఆరంభానికి అత్యధికభాగం బ్రిటిష్ పాలనలోకి వెళ్ళింది. ఇక తెలంగాణాలో నిజాముల ఏలుబడివున్నా సార్వభౌమాధికారం మాత్రం తెల్లవారిదే. 1849 నాటికి మనమే కాదు భారత ఉపఖండమంతా బ్రిటిష్ సామ్రాజ్య అంతర్భాగాన దాస్యంలోకి వెళ్ళింది. మనకు తెలుసు పరాయి పాలన స్వలాభం కోసమేనని. అదే మనల్ని దుర్భర దారిద్ర్యంలోనికి; అవమానాల్లోకి నెట్టిందని కూడా తెలుసు. అయితే భారతదేశంలో ఏ రాష్ట్రానికి తీసిపోకుండా ఆంధ్రరాష్ట్రం అన్ని ఉద్యమాల్లో 1885లో కాంగ్రెస్‌స్థాపనతో మొదలుపెట్టి చురుకుగానే పాల్గొంది. 1905లో వందేమాతర ఉద్యమంలో తొలిరాజకీయఖైదీగా జైలుకు వెళ్ళిన గాడిచర్ల హరిసర్వోత్తమరావు మొదలు 'భరతఖండంబె ఒక బందిఖానా' అని చాటిన చిలకమర్తి వంటివారు ఉన్నారు. అలాగే 1916వూరి హోంరూల్ ఉద్యమంలో తెలుగువాళ్ళ పాత్ర చాలా వుంది. 1906-20ల మధ్య జరిగిన స్వరాజ్యోద్యమంలో పురుషులతోపాటు స్త్రీలు జైలుశిక్షలకు కూడా వెరవకుండా విశేషంగా పాల్గొన్నారు. ఇక పెదనందిపాడు ప్రాంతంలో 80 గ్రామాల పన్నుల నిరాకరణోద్యమం తీవ్ర తిరుగుబాటుగా యావత్తు బ్రిటిష్ వారి పునాదులను కదలించి వేసిందని లార్డ్ వెల్లింగ్టన్ బ్రిటిష్ పార్లమెంటులో అన్నారట. 1922లో అల్లూరి తిరుగుబాటు; 1923లో నాగపూర్ జెండా సత్యాగ్రహం; 1927లో మదరాసులో జరిగిన నీల్ సత్యాగ్రహం, సైమన్ కమీషన్‌ను తిప్పికొట్టిన ఆంధ్రకేసరి-ఇలాంటిఘట్టాలను అభివర్ణించగలమా! గాంధీగారి వెంట ఉప్పుసత్యాగ్రహంలో పాల్గొన్న 70మందిలో యర్నేని సుబ్రహ్మణ్యం అనే మన ఆంధ్రుడున్నాడంటే ఎంత గర్వం. ఎంత ఆశ్చర్యం. 1932 శాసనోల్లంఘనంలో కొండా వెంకటప్పయ్య గారు, 1941 వ్యక్తి సత్యాగ్రహం, 1942లో క్విట్ ఇండియా ఉద్యమాల్లో మన తెలుగువాళ్ళ పాత్ర ప్రముఖమైంది.

ఇదంతా జాతీయోద్యమకారుల సిద్ధాంతాల నిర్మాణం. ఇది ఒక ఎత్తైతే, ఆచరణ వైపు మళ్ళించే ప్రబోధాత్మక కవితా ఇంధనం మరోఎత్తు. ఈ రెండూ స్వాతంత్ర్య సమరరథానికి ఇరుచక్రాలయ్యాయి. తెల్లవారిని తరిమికొట్టే దాకా పట్టువీడక ముందుకురికాయి.

జాతీయోద్యమ చరిత్రలో ప్రబుద్ధ భారతాన్ని మేల్కొల్పిన వైతాళికులు రచయితలేనని ఘంటాపథంగా చెప్పవచ్చన్నది పరిశోధకుల మాట. యావద్భారతంలోని వివిధ రాష్ట్రాలు, విభిన్న జాతులు ఏకీకృతం కావడంలో; ఏకత్రాటిపై నడవటంలోనూ అత్యంత కీలకపాత్ర వహించి సాహితీక్షేత్రమేనన్నది వాస్తవం. కరుణశ్రీ, జాషువా, బసవరాజు అప్పారావు, రాయప్రోలు సుబ్బారావు, గురజాడ, దువ్వూరి, విశ్వనాథ, తుమ్మల, పుట్టపర్తి, గరిమెళ్ళ సత్యనారాయణ, చిలకమర్తి లక్ష్మీనరసింహం వంటి ఎందరో చిన్న పెద్ద రచయితలందరూ విశేషంగా జాతిని జాగృతం చేశారు.

నిజానికి ఒక జాతి చరిత్రను నిర్మించటంలో రచయితల పాత్ర గొప్పది. రూసో వాల్టేరు రచనలు ఫ్రెంచి విప్లవానికి కారణభూతమయ్యాయి కదా! టాల్‌స్టాయ్, మాక్సింగోర్కీ, డాస్టోవాస్కి మొదలైన వారి రచనలు రష్యా ప్రజల్లో అద్భుత ప్రబోధాన్నిచ్చాయి.

అలాంటి ప్రబోధాన్ని తెలుగువాళ్ళ కిచ్చిన గేయం చిలకమర్తి లక్ష్మీనరసింహం గారిది.

**"భరతఖండం చక్కని పాడియావు**
**హిందువులు లేగదూడలై ఏడ్చుచుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియట్టి"**

తొలి విప్లవకంఠంలా చిలకమర్తి చేసిన ఈ సాహసభావ ప్రకటనపద్యం హరికథల్లో బుర్రకథల్లో కూడా పాడారు. ఇది నానని నోరు లేదంటే ఆశ్చర్యం లేదు. అంత ప్రభావితం చేసింది జనాన్ని.

**మా కొద్దీ తెల్లదొరతనము దేవ!**
**మా కొద్దీ తెల్లదొరతనము**
**మా మానాలుపై పొంచి ప్రాణాలు హరియించె ॥ మా ॥**
**నూట నలువదినాల్గు నోటికి తగిలించి**
**మాటలాడవద్దంటాడు; మమ్ము**
**పాటపాడవద్దంటాడు; టోలీ**
**తీసి వీపున బాదుతాడు!**

ఆంధ్రుల దైన్యాన్ని కళ్ళముందుంచటమే కాక తిరుగుబాటు ధోరణికి దీటుగా ప్రకటించాడు. గరిమెళ్ళ సత్యనారాయణగారు. ఈ గేయాన్ని 1921, 22, 23 సంవత్సరాలలో పాడని యువకుడుగానీ, వినిపించని సభగానీ లేదంటే అతిశయోక్తి కాదు.

వందేమాతరం – మందే రాజ్యం అనే పాట చిన్న పిల్లలకు చివరకు గోరువంకలకు కూడా పాటయిందట. వెన్న పెట్టినట్లు రౌలట్ చట్టాన్ని పెడుతూ మరోవైపు జలియన్‌వాలాబాగ్ దురంతాన్ని చూచిన కవుల కలం ఇలా గరగరలు చిమ్మంది.

1912లో రవీంద్రుడు ధర్మసంగీతో అనే శీర్షికతో వ్రాసిన "జనగణమన అధినాయక జయహే" అన్న గేయం అఖండ భరతావనితో పాటు మనలోనూ స్ఫూర్తిని రగిలించింది. ఆ వరుసలో పుట్టినదే రాయప్రోలు సుబ్బారావు గారి దేశభక్తి గేయం

**"ఏ దేశమేగినా ఎందుకాలిడినా**
**ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా**
**పొగడరా నీ తల్లి భూమి భారతిని**
**నిలుపరా నీ జాతి నిండు గౌరవము"**

జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపీ గరీయసి అన్నట్లు ఎవరూ అందించని చైతన్యాన్ని అందించిందీ గేయం.

**"ఏ మంచి పూవులన్ ప్రేమించినావో**
**నిను మోసె ఈ తల్లి కనకగర్భమున**
**లేదురా ఇటువంటి భూదేవి ఎందు**
**లేరురా మనవంటి పౌరులింకెందు"**
**అవమానమేలరా! అనుమానమేలరా!**
**భరతవీరుడనంచు భక్తితో పాడరా!**



Scanned with OKEN Scanner

అని తరగలెత్తిన గీతం. అగ్రపంక్తిలో నిలిచిన గీతం. ఆంధ్రుల హృదయాల్లో గూడు కట్టుకున్న గీతం. దీనిని ఆంధ్రకవితా శిరోమణికి భూషణం వంటిదన్నారు సినారె)

స్వాతంత్ర్యరథాన్ని వినువీధుల్లో దర్శింపజేసిన దువ్వూరి రామిరెడ్డి సామాన్యులా!

**పూజనీయాలన్న ప్రబోధం జనంలో ధైర్యాన్ని నింపింది.!**
**నీచపు దాస్యవృత్తి మననేరని శూరత మాతృదేశ సే**
**వాచరణమ్ము వందసువులర్పణ జేసిన వారి పార్థివ**
**శ్రీ చెలువారు చోట దదసృగ్రుచులన్ వికసించి; వాసనల్**
**వీచుచు; రాలిపోవగవలెం దదురాత్త సమాధిమృత్తికన్**

దాస్యవృత్తి కన్న ఎదురు పోరాటం చేసి మృతిచెందిన వీరులే పూజనీయాలన్న ప్రబోధం జనంలో ధైర్యాన్ని నింపింది. ఇక భరతమాత వైభవాన్ని చెబుతూ దేశప్రేమను జాతిలో ప్రోది చేశారు జాషువా వంటివారు. నిలువెల్లా పులకింపజేశారు.

**"సింధు గంగానదీ జలక్షీరమెపుదు**
**కురిసి బిడ్డల పోషించుకొన్నయట్టి**
**పచ్చి బాలెంతరాలు మా భరతమాత!"**

అయ్యా! కళ్లు మూసుకొని యోగ్యులంతా బ్రతికితే ఫలంలేదంటూ హెచ్చరించారు పార్వతీశ్వర కవులు.

**పరమార్థనిధయైన భారతభూమి పైసకు కొరగాక పొడగుచుండ**
**పరమధామంబైన భరతభూమి బానిస తనములో బడి క్రుంగుచుండ**
**ఆర్యసంతతివారు . . . . . . . . కనుమూసి కాలంబు గడుపుట తగునె ....**

అని పార్వతీశ్వరకవులు హెచ్చరించిన వైనం అందరిని మేల్కొల్పింది. బాపూజీ నాయకత్వాన్ని శ్లాఘిస్తూ జాషువా ఇలా అంటారు.

**"గోచిపాత కట్టికొని జాతి మానంబు**
**కాచినట్టి ఖదరు నేతగాడు**
**విశ్వసామరస్య విజ్ఞానసంధాత**
**కామితప్రదాత గాంధి తాత !**

కాగా బసవరాజు అప్పారావుగారు మరింత ప్రేమతో

**'కొల్లాయి గట్టితే నేమీ! మా గాంధి కోమటై పుట్టితే నేమీ**
**వెన్నపూసామనసు; కన్న తల్లీ ప్రేమ**
**పండంటి మోముపై బ్రహ్మతేజస్సు'**

అని గొప్పదైన మహాత్ముని నాయకత్వంపై భక్తిని పెంచారు.

**"ఉప్పు పన్ను, పప్పు పన్ను; ఊరికెళితే పన్ను బాబు**
**కొప్పుకాస్త దేముడికి మొక్కుకుంటే పన్ను బాబు"**



Scanned with OKEN Scanner

అన్న మాధవపెద్ది సుందరం గారి పాట తెల్లవాళ్ళ దుశ్చర్యలను నిలదీసి ప్రశ్నించే తత్త్వాన్ని జనానికి అబ్బేట్టు చేసింది.

దుర్భాక రాజశేఖర శతావధాని భారతీయుల త్యాగాలను పడిన యిడుములను అడుగడుగునా స్ఫురింపజేస్తూ వ్రాసిన 'రాణా ప్రతాపసింహచరిత్ర' ఎంతో గొప్ప కావ్యం. 'అస్వతంత్ర జాతికిది ఒక స్మృతి గ్రంథం' లాంటిదని అనాడు కొనియాడబడింది. గడియారం వేంకటశేషశాస్త్రిగారి శివభారతం ఈ వరుసలో అత్యధిక ప్రజాదరణ పొందింది.

ఆనాడు మన పాట్లను చూచి విశ్వనాథ సత్యనారాయణగారు పొందిన ఉద్వేగం ఈ పద్యంలో చెలియలి కట్ట దాటిందని చెప్పవచ్చు.

**"తెలుగు నదులెల్ల పొంగెత్తి ప్రళయవారి**
**కెరలిపడి తెల్గునేల ముగించనిమ్ము**
**నేటితో అస్వతంత్రా నియతమైన**
**ఈ బ్రతుకు తెల్గువారు భరించలేరు"** ...ఇంతలా విజృంభించింది వారి కలం గళం.

ఇక గురజాడ అప్పారావు వారి దేశభక్తి గేయం జాతిమీద చూపిన ప్రభావం అంతా ఇంతా కాదు. భారత సాహిత్యంలోనే బకించంద్ర ఛటర్జీ వందేమాతర గేయం; రవీంద్రుని జనగణమన, ఇక్బాల్ గారి సారే జహాసె అచ్ఛా అనేవి గొప్ప మాతృదేశ జాతీయగీతాలు. అయితే గురజాడవారి గేయం మాత్రం మాతృదేశాన్నే కాక ఎల్లలు దాటి విశ్వమానవ కోటిలో చైతన్యాన్ని నింపిన విశ్వమానవ వికాసగేయం.

**దేశమును ప్రేమించుమన్నా**
**మంచియన్నది పెంచుమన్న**
**ఒట్టిమాటలు కట్టి పెట్టోయ్**
**గట్టిమేల్ తలపెట్టవోయ్'**
**దేశాభిమానము నాకు కద్దని**
**ఒట్టిగొప్పలు చెప్పుకోకోయ్**
**పూని యేదైనాను వొకమేల్**
**కూర్చిజనులకు చూపవోయ్**
**ఆకులందున అణగిమణగి**
**కవిత కోయిల పలుకవలెనోయ్**
**పలుకులను విని దేశమందభి**
**మానములు మొలకెత్తవలెనోయ్ . . . . . . . .**

అలా దేశాభిమానాన్ని, విశ్వమానవ ప్రేమను మొలకెత్తించిన మహాగేయం గురజాడ అప్పారావు గారి కలం నుండి గంగాక్షీరంలా ఉద్భవించింది.

తుమ్మల సీతారామమూర్తి చౌదరిగారి దేశప్రేమ అనూహ్యము. 'చావలేదు చావలేదు ఆంధ్రుల మహోజ్వల చరిత్ర' "దండాలు దండాలు భరతమాత" 'వీరగంధము తెచ్చినారము వీరుదెవ్వడొ తెల్పుడీ" వంటి గేయాలు, ఉపన్యాసాలు, కావ్యాలు, వ్యాసాలు ఎన్నో జాతిని మేల్కొల్పాయి. స్వాతంత్ర్యసాధనంలో నిత్యచైతన్యాన్ని నింపాయి. 'చెరశాలల్ పృథుచంద్రశాలలెయగు..'



Scanned with OKEN Scanner

అన్నట్లు ధైర్యాన్ని నూరిపోశాయి. ఇక స్వాతంత్ర్య పోరాటం గురించి వ్రాయని పత్రిక లేదంటే ఆనాడు ఆశ్చర్యమేమీకాదు.ఇలా కవులు రచయితలు మేముసైతం అన్నట్లు స్వాతంత్ర్యకాంక్ష రగిలించటంలో అసామాన్యమైన పాత్ర పోషించారు. వారందరికీ కైమోడ్పులు చెల్లిద్దాం.

పానుగంటి లక్ష్మీనరసింహంగారన్నట్లు కలిగిన స్వాతంత్రాన్ని కనుగలిగి రక్షించుకుందాం.

**స్వాతంత్ర్యం బనసఖుడా స్వైరవిహారంబుగాదు**
**స్వైరవిహారాలకెప్పుడు స్వాతంత్ర్యంబచ్చిరాదు**
**బాధ్యత యెరిగిన స్వేచ్ఛ స్వాతంత్ర్యపు రక్షణము**
**బాధ్యత యెరుగని స్వేచ్ఛ బానిసత్వ లక్షణము**

క్షమ ఇంద్రియనిగ్రహం ఉండాలి. స్వార్థపరిత్యాగం ఉండాలి. శమ దమాదులుండాలి. తల్లిదండ్రుల యెడల భక్తి ఉండాలి. విశ్వాసం ఉండాలి. జన్మభూమిపట్ల, జననిపట్ల గౌరవం ఉండాలి. తోటివాడిని ప్రేమించాలి. ఆత్మస్థైర్యం, ధైర్యం ఉండాలి. సాహసం ఉండాలి. ఇవి కల్గిననాడే స్వరాజ్యలక్ష్మిని స్వర్ణలక్ష్మిగా మలుచుకోగలము.మన భరతావనిని భూతలస్వర్గంగా మలుచుకోగలము. అప్పుడిక 'అజాదీ కా అమృతోత్సవ్'లు అనుదినమూ జరుపుకున్నట్టే.

*వందేమాతరం*

**ఆధార గ్రంథాలు**

1. సమగ్రాంధ్ర సాహిత్యం – ఆరుద్ర

2. ఆధునికాంధ్ర కవిత్వం సంప్రదాయాలు–ప్రయోగాలు

3. పానుగంటి లక్ష్మీ నరసింహం గారి సాక్షివ్యాసాలు

4. గుఱ్ఱం జాషువా రచనలు

5. దేవులపల్లి రామానుజరావు గారు – సారస్వత నవనీతం

6. విజ్ఞాన సర్వస్వం–తెలుగు సంస్కృతి మొదటి సంపుటి



Scanned with OKEN Scanner

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు

**డా. కె.వి. శాంత కుమారి,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ, కృష్ణాజిల్లా

జాతీయోద్యమ వాహికగా సాహిత్యం భారతీయ భాషలలో సృజించబడి ఉద్యమాన్ని ముందుకు తీసుకు వెళ్ళిందని తెలిసిందే. అయితే ఈ సాహిత్య సృజనకు వస్తువు, అలంకార సామగ్రి స్థానిక సంస్కృతుల నేపథ్యంలోంచి వెలువడిందే! ఇక్కడ వస్తువు, స్థానికజాతులన్నిటిని ఒక్క తాటిమీదకు తీసుకువచ్చే ప్రక్రియలో వాటిమధ్య ఒక ఉమ్మడి జాతీయ భావనను కలిగించడం, ఉమ్మడి శత్రువును పెనుభూతంగా అభివర్ణించడం, కోల్పోయినదాన్ని, తిరిగి పునర్నిర్మించుకునే విధానం గురించి ప్రజల్లో చైతన్యం తీసుకురావటానికి తగినవిధంగా వస్తువు ఎంపిక నిర్ణయించబడింది.

ఈ క్రమంలో అలంకార సామగ్రి కూడా స్థానిక సంస్కృతుల నుంచి వచ్చిందే కాబట్టి సాహిత్య సృజనలో అలాంకార సామగ్రికి కూడా ఆ సాంస్కృతిక వాసనలు అంటడం అనివార్యం. ఈ నేపథ్యంలో జాతీయోద్యమసాహిత్యాన్ని, వస్తు అభివ్యక్తుల్ని విభిన్న దృక్కోణాల్లోంచి పరీక్షించేప్రయత్నం చేస్తే నిబిడీ కృత సాంస్కృతిక అంశాలు తేటతెల్లమవుతాయి.

విభిన్న సమూహాల మధ్య ఐక్యతను ఒక ఉమ్మడి ప్రయోజనం కోసం తీసుకొచ్చే క్రమంలో ఆలోచనాత్మక రంగంకంటే భావావేశరంగం శక్తింతమైన ఉపకరణంగా పనిచేస్తుంది. ఇక్కడ ఉమ్మడిప్రయోజనాన్ని స్పష్టీకరించడం, దాన్ని సాధించే విధానాలను, ప్రణాళికను ఏకరువు పెట్టడంలాంటి వివేచనకంటే ఉమ్మడి శత్రుపీడను వర్ణించడానికి, వదిలించుకోవటానికి భావావేశరంగం సాహిత్యంలో, సమాజంలో ప్రధాన భూమికాగలుగుతుంది. కులం, మతం సమూహాలను ఏకంచేయటంలోను, విడదీయటంలోను ప్రముఖ పాత్ర పోషించగలుగుతాయి. కులం కంటే మతం పరిధి విశాలమైంది. ఎక్కువ వ్యాప్తి కలిగింది. స్థానిక జాతుల్ని ఏకం చేయడానికి, ఉద్యమంలో భాగస్వామ్యంచేయడానికి కులం కంటే మతం కార్చిచ్చులాగ శక్తిమంతమైన ఉపకరణంగా పనికొస్తుంది.

సాహిత్య సృజనలో సహజంగా వస్తువు ఆ సమకాలీన సమాజంలోది అయివుంటుంది. దాని అభివ్యక్తి దాని సంస్కృతిలోది అయివుంటుంది. మతం సంస్కృతిలో భాగం కాబట్టి దానివాసనలు సృజనలో అవి తరచు అభివ్యక్తం అవుతూవుంటాయి.

'భరతఖండము చక్కనిపాడియావు/ హిందువులులేగ దూడలై మేధ్పు చుండ/తెల్లవారను గడుసరి గొల్ల వారు / పితుకుచున్నారు మూతులు బిగియగట్టి''. ఈ దృశ్యచిత్రణలో వస్తువు దోపిడి, పీడకులు గొల్లవారు, లేగదూడలు. ఈ రచనలో అభివ్యక్తికి వాడుకున్న అలంకారసామగ్రి హిందూమతం తాలూకు వర్ణ వ్యవస్థనేపథ్యంలోనుండీ తీసుకోబడింది. భరతఖండంలో భిన్న జాతులు, భిన్న సంస్కృతులు వాటి తాలూకు మతాలు,భాషలు, ప్రాంతీయతలు కలగలిసి ఉన్నాయి. ఉమ్మడి శత్రువును చూపించి వాటి మధ్య ఐక్యతను తీసుకొచ్చేక్రమంలో ఇలాంటి సాహిత్యం విఫలమవుతుంది. శూద్రవర్ణానికి చెందిన గొల్ల వాళ్ళతో బ్రిటీష్ వారు పోల్చబడటం, హిందువులు మాత్రమే బాధితులు అనటం వర్ణ వ్యవస్థ ప్రభావానికిలోనుకావటమే. బ్రిటీష్ వారి బాధితులు హిందువులు మాత్రమేకాదన్న వివేచన పీడకులకు వాడిన ఉపమ బాధితవర్గానికి చెందిందే అన్న స్పృహ ఇక్కడ కొరవడటం చూస్తాం.

అలాంటప్పుడు ఆ ఉద్యమ స్ఫూర్తి భిన్నమతాల మధ్యమాత్రమే కాదు భిన్న కులాల మధ్య కూడా తీసుకురావడానికి ఇలాంటి రచనలు విపల యత్నంచేస్తాయని చెప్పడం పాక్షిక సత్యమే అవుతుంది. కనీసం సంబంధిత వర్గంలో ఐక్యతను తీసుకురావడం



Scanned with OKEN Scanner

నిస్సందేహం. మతాంతర, కులాంతర ఏకత్వాన్ని తీసుకురావటంలో ఆశించిన ప్రయోజనం తీసుకురాలేకపోయినప్పటికీ అంతే కాకుండా జాతి, మత, కుల, ప్రాంత భాషా సమైక్యతను పెంపొందించిన సాహిత్యం సృజించబడకపోలేదు.

"హిందూ ముసల్మానులేకమై యున్నాము / సందేహమేల నిశ్చయము స్వరాజ్యము"
"నారాయణ నారాయణ అల్లా అల్లా / మాపాలిటి తండ్రీ నీ పిల్లలమేమెల్లా"
"అన్ని మతాలకు-అన్ని తెగలకు / ఆశ్రయమీ జండా ఒక టేనోయ్"

పైన ఉదాహరించబడిన పంక్తులు దేశ పమైక్యతను పెంచిపోషించిన సాహిత్యం వెలువడిందనటానికి మచ్చుతునకలుగా చెప్పవచ్చు. ఈ విధంగా భిన్న జాతులు భిన్న సంస్కృతుల ప్రతిఫలనాలు జాతీయోద్యమసాహిత్యంలో కనిపించి అవి చివరకు వాటి సమైక్యతకు దారి తీశాయి. ఒక ప్రాదేశిక ఏకత్వం దాన్ని మరింతబలపరచిన బ్రిటీష్‌వాళ్ళ (స్థానికులను ఉమ్మడిగా దోపిడి చేయడానికి నెలకొల్పిన) రవాణావ్యవస్థ, (రోడ్డు, రైళ్ళు, నౌకాయానం) మాధ్యమాలు (పత్రికలు, టెలిఫోన్) మాత్రమే కాకుండా విస్తృతంగా వ్యాపించిన ఉద్యమ వాహిక అయిన సాహిత్యం భిన్నత్వంలో ఏకత్వాన్ని ప్రతిష్ఠించే పనిలో పడింది.

వస్తువు సమాజంలోంచిపుడితే దాని అభివ్యక్తి ఆ సమాజపు సంస్కృతిలోంచి పుడుతుంది. వస్తువు అభివ్యక్తీకరణకు ముడిసరుకుగా అలంకార సామగ్రి పనికొస్తుంది. సామగ్రి శబ్దార్థాల్లో ఉనికిలోకివచ్చే ఈ అలంకార సామగ్రి సమకాలీన సమాజపు సాంస్కృతిక నిబద్ధతకులోబడి ఉంటుంది. వస్తువు అది సమాజంలో నెరవేర్చాల్సిన పని నిమిత్తం ఆవిష్కృతమవుతుంది. అందుకు తగినట్టుగా అది దాని అభివ్యక్తిని ఎంపిక చేసుకుంటుంది. అప్పటి సమాజానికి చిరపరిచితమైన అభివ్యక్తుల్లో అది ఉనికిలోకివచ్చే నేపథ్యంలో మనం ప్రక్రియ, శబ్దజాలం పరిశీలనార్హాలు అవుతాయి.

ప్రక్రియ ఆనాటి మధ్యతరగతి విద్యావంతుల అభీష్టాన్ని అనుసరించి ఉంటుంది. ఎందుకంటే సంబంధితరచనల్ని సృజించేది వాళ్ళే కాబట్టి. సహజంగా వస్తుప్రాముఖ్యాన్ని, దాని ఆవశ్యకతను, లక్ష్యాన్ని, నిర్దేశించేది వాళ్లే కాబట్టి వాళ్ళకు చిరపరిచితమైన, వస్తు లక్ష్యానికనుగుణమైన ప్రక్రియలు ఎంపిక చేయబడతాయి. అందుకే జాతీయోద్యమకాలంలో వెలువడిన సాహిత్యం పద్యకావ్యాలలో, గేయాలలో ఎక్కువగా ఉంది. పద్యకావ్యాలు మధ్యతరగతివిద్యావంతుల జాతీయోద్యమ స్ఫూర్తినే కాకుండా పద్యవిద్యాభినివేశ ప్రకటనకు కూడా ఉద్దేశించబడ్డాయి. అదేవిధంగా సామాన్యులైన వృత్తివ్యవసాయ కార్మిక కష్టజీవుల్ని కూడా ఉద్యమంలో భాగ్యస్వామ్యంచేయకపోతే ఉద్యమంనీరుగారే అవకాశం ఎక్కువగా ఉంటుంది కాబట్టి జాతీయోద్యమస్ఫూర్తి వాళ్ళకు చేరేలా, వారు ఉద్యమంలోకి వచ్చేలా పురికొల్పే సాహిత్యప్రక్రియలను ఎంపిక చేసుకోవలసిన అవసరం ఏర్పడింది.

తద్వారా సామాన్యులకు చిరపరిచితమైన గేయం, పాటలాంటి దేశిప్రక్రియలు ఉద్యమ ప్రచారవాహికలుగా వెల్లువెత్తాయి. అంటే వస్తుశిల్పాలు వస్తులక్ష్యానికనుగుణంగా తయారుచేయబడతాయని అర్థమవుతుంది. ఈ నేపథ్యంలో దేశిప్రక్రియ లేకాకుండా జనం భాషకు పట్టం కట్టబడింది అంటే జాతీయోద్యమ స్ఫూర్తి వ్యావహారిక భాషోద్యమానికి స్నేహహస్తంచాచిందన్నమాట.

ఈ విధంగా సాంస్కృతిక, ఆర్థిక, రాజకీయ దోపిడికి వ్యతిరేకంగా కేవలం భౌగోళిక ఏకత్వం కలిగిన భిన్నజాతులు ఏకమై ఉమ్మడి శత్రువును సమర్థవంతంగా తిప్పికొట్టే ఆయుధంగా సాహిత్యాన్ని తయారుచేయడానికి భావం, భాషలలో వినూత్న మార్పులు సమకూరాయి. చారిత్రక పౌరాణిక, సమకాలీన సమాజ నాయకుల్ని స్తుతించడం దగ్గర నుంచి సాంస్కృతిక, భౌగోళిక మూర్తిమత్వాలను కీర్తించడం దాకా వెల్లువెత్తిన జాతీయోద్యమ సాహిత్యం ఉపఖండం అంతటినీ పూలదండలో దారంలాగ ఏకంచేసి సంపూర్ణ స్వాతంత్ర్యానికి పాదులు వేసింది.

**ఆధార గ్రంథాలు :**

1. భారతదేశ చరిత్ర సంస్కృతి – తెలుగు అకాడెమి ప్రచురణలు
2. తెలుగులో కవిత్వోద్యమాలు – తెలుగు అకాడెమి ప్రచురణలు



Scanned with OKEN Scanner

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# జాతీయోద్యమంలో కృష్ణాపత్రిక

డా. అడప కేదారి, తెలుగు శాఖాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
పామర్రు, కృష్ణాజిల్లా, చరవాణి : 9542943322

**పత్రికకొకటియున్న పదివేల సైన్యము**
**పత్రికొక్కటున్న మిత్రకోటి**
**ప్రజకు రక్షలేదు పత్రిక లేకున్న**
**వాస్తవంబు నార్ల వారి మాట**

అన్నారు ప్రముఖ సంపాదకులు నార్ల వెంకటేశ్వరరావు గారు వారి నార్ల శతకంలో పత్రిక లేకపోతే ప్రజలకు రక్షణే కొరవడుతుంది అని ఉద్ఘాటించారు. నేడు ఆధునిక సమాజంలో శాస్త్ర సాంకేతిక రంగాల అభివృద్ధి వలన ప్రపంచం మన చేతిలో ఇమిడి ఉన్నది కానీ ఒక శతాబ్దం క్రితం అనగా స్వాతంత్ర్యపూర్వం ప్రజలకు ఉన్న ఏకైక సమాచార మాధ్యమం పత్రిక మాత్రమే.

పత్రిక అనేది ప్రజలకు ప్రభుత్వ విధానాలను, ప్రభత్వానికి ప్రజల అవసరాలను తెలిపే వారధిగా పనిచేస్తుంది. దేశంలో ఎక్కడ ఏయే సంఘటనలు జరుగుతున్నాయి, వాటి మంచి చెడులు, సమాజం మీద వాటి ప్రభావాన్ని తెలిపి ప్రజలను చైతన్యపరచటం, ప్రభుత్వ విధానాలలో కల లోపాలను ఎత్తిచూపి వాటివలన కలిగే దుష్ప్రభావాలను పాలకులకు తెలియజేయటం, అలాగే ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించే బాధ్యతను పత్రికలు చేపట్టాలి.

స్వాతంత్ర్య పూర్వం ఇంగ్లీషు చదువు వచ్చిన వారికి 'మద్రాసు మెయిలు' వంటి పత్రికలుండేవి. తెలుగువారి కోసం 19వ శతాబ్దంలో పత్రికలు వచ్చినా అవన్నీ గ్రాంధిక భాషలో ఉండి సామాన్య సమాజం అర్థం చేసుకునేవిగా ఉండేవి కాదు. ఈ సందర్భంలో 1902లో కృష్ణాపత్రిక, 1908లో ఆంధ్రపత్రిక వంటివి వచ్చి తెలుగులో వార్తలను ప్రజలకు చేరవేసే బాధ్యతను స్వీకరించాయి.

కృష్ణాపత్రిక 1902 ఫిబ్రవరి 1న కొండ వెంకటప్పయ్య, దాసు నారాయణ గార్ల సంపాదకత్వంలో పక్ష పత్రికగా, కృష్ణాజిల్లా సంఘము తరపున యువజన చైతన్యం మరియు జాతీయోధ్యమ ప్రచారం వంటి లక్ష్యాలతో ఏర్పడింది. దీని ప్రతిపాదన 1900లో రెంటాల వెంకట సుబ్బయ్య గారు చేశారు. వారు దీనికి 100 రూపాయల మూలధనం అందించారు.

జాతీయోధ్యమ సాహిత్యం వెలువడింది. మొదటగా కృష్ణా పత్రికలోనే 1905 డిసెంబరు 15 నాటి కృష్ణా పత్రికలో అచ్చుయిన 'ది క్రై ఆఫ్ మదర్ ఇండియా' గీతంలో కనబడుతున్నాయి. బెంగాల్ విభజనతో జాతిజనుల సమలనాదంగా మారిన బంకించంద్రుని 'వందేమాతరం' ప్రేణతో ఒక అజ్ఞాత కవి ఈ ప్రబోధ గీతాన్ని ప్రకటించారు. గీతం ఈ విధంగా సాగుతుంది.

**"హిందువులారా! ఎన్నాళ్ళీగతి**
**మందుమతులరై యాటికి జెడెదరో నందనలగు**

**మీఅందరు స్రుక్కగ యెందుకు నా బ్రతుకితరుల కోసమ**
**నా వంటను గల సారంబంతయు నావంతయు లేకే వెలికేగెను**
**చేవ చెడిన నేనే విధిబ్రతుకుదు జీవించిన సార్ధక్యంబేమిక దూడనోరుగొట్టి**
**ద్రోహంబు గొల్లలు పాడి సమస్తము పరులకమ్మ గతి కూడులేని నా కొడుకుల గాదని**
**యేదకో నా ధనమెల్లను బోయెడి చీము నెత్తురు చిక్కెనో లేదో**
**ఏమేయి బ్రతుకుదు - నీ దర్దశతో ప్రేమ జూపరే - ప్రేమ జూపరే రామ! రామ!**
**నా లావు చెడియెనిక ఇకనైనను మీరెల్లరు సొదరులై ప్రకటింపుడు నాపై ప్రేమమ్మును"**

అంటూ సాగుతుంది గీతం.

1905లోనే ముట్నూరి కృష్ణారావు పంతులు గారు కృష్ణా పత్రిక సంపాదకత్వం వహించారు. వీరు రాజకీయంపైన, జాతీయ పోరాటంపైన, ఆంధ్రోద్యమంపైన, సమాజిక సమస్యలపైన, ఉద్యమాలపైన, ప్రపంచ యుద్ధాల పైన చక్కటి సంపాదకీయాలు రచించారు. కృష్ణారావు గారు తమ సంపాదకీయాలను అన్వయకాఠిన్యం లేకుండా, మృధు మధురశైలిలో హృదయమంగమంగా పాఠకుని అలరించే రీతిలో వ్రాశారు. తద్వారా తెలుగు చదవటం వచ్చిన ప్రజలందరూ ఆయన రచనల వలన ప్రబావితమయ్యేవారు. 'కబుర్లు' అనే శీర్షిక వ్యావహారిక భాషలో వెలువరించి పాఠకునికి మరింత చేరువయ్యారు.

వీరి సంపాదకీయాలలో దేశ భక్తికి సంబంధించినవి మాతృభిక్ష, భారత శక్తి, తల్లి పిలుపు మున్నగునవి మంచి పేరు పొందాయి. రథోత్సవం అనే సంపాదకీయంలో కాంగ్రెసు విజయాలు, ఢిల్లీ శాసనసభ, మహాత్ముని నిరసన వ్రతం, క్రిప్సు రాయబారం, జిన్నాజిత్తులు, క్విట్ ఇండియా మున్నగు వ్యాసాలు, నాటి స్వరాజ్య పోరాటంలోని వివిధ ఘట్టాల మన ప్రజలను చైతన్య పరచడానికి వెలువడిన సంపాదకీయాలు.

1908లో కృష్ణారావు గారు 'తెల్లవారిని తుపాకులతో కాల్చుట' అను శీర్షికతో ఒక వ్యాసం కృష్ణాపత్రికలో ప్రచురించారు. ఆ విధంగా ప్రకటించడం వలన కలిగే ఇబ్బందిని గ్రహించి దానిని నిలిపివేశారు. కానీ రెండు ప్రతులు ఆనాటి కలక్టరు కంటబడ్డాయి. కలక్టరు స్కాట్ ఆగ్రహించి జిల్లా సంఘాధ్యక్షుడైన శెడింబి హనుమంతరావుని పిలిచి పత్రికా సంపాదకుడిని తొలగించవలసిందిగా ఆదేసించగా తాత్కాలికంగా కృష్ణారావుగారు 1908 - 1911 మధ్య సంపాతక్వం నుండి తప్పుకున్నారు.

1929లో గాంధీజీ దివిసీమను సందర్శించినపుడు గాంధీజీ గురించి సంపాదకీయాలు రాశారు. వారి పర్యటన మొత్తాన్ని, వారి ప్రసంగాలను సంపాదకీయాలు ద్వారా ప్రజలకు కళ్ళకు కట్టినట్టు చూపించారు. వీరి సంపాదకీయాలను గాంధీగారు హిందీలోనికి అనువదింపచేసుకుని వినేవారు. ఆంధ్రదేశంలోని సామాన్య ప్రజానీకానికి జాతీయోధ్యమాన్ని అత్యంత చేరువ చేసింది కృష్ణాపత్రిక.

**ఆధార గ్రంధాలు:**

1. తెలుగు జర్నలిజం పరిచయం - డా॥ బూదరాజు రాధాకృష్ణ
2. భారతీయ పత్రికారంగ చరిత్ర - మాడభూషి కృష్ణప్రసాద్
3. మన ప్రముఖ పత్రికా సంపాదకులు - రాపాక ఏకాంబరాచార్యులు



Scanned with OKEN Scanner

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ UGC Care List Approved Journals ఏప్రిల్ - 2023

# జాతీయోద్యమంలో విభిన్నవ్యవస్థల మిశ్రిత సంఘర్షణ

**డా. టి. జాన్ కిరణ్‌బాబు,** అకడెమిక్ ఆఫీసర్, కళాశాల విద్య కమీషనర్, విజయవాడ, ఆం.ప్ర.
చరవాణి : 9440382140, 9182324062

జాతీయోద్యమ ప్రభావంతో వచ్చిన నవలల్లో వేలూరి శివరామశాస్త్రి-ఓబయ్య, ఆచార్య రంగా – హరిజననాయకుడు, ఉన్నవలక్ష్మీనారాయణ – మాలపల్లి, ఉప్పల లక్ష్మణరావు – అతడు ఆమె, అడవి బాపిరాజు – కోనంగి మొదటివరుసలో ఉంటాయి. వైవిధ్యభరితమైన బృహద్వ్యవస్థల ప్రవేశనిష్క్రమణల సంధి దశలో కర్తవ్యాన్ని ప్రబోధిస్తూ దిశానిర్దేశనం చేస్తూ రాయబడిన ఈ నవలలు ఆనాటి సంఘర్షణాత్మక అవస్థకు అద్దంపడుతున్నాయి. అయితే వెల్లువలా చొచ్చుకొస్తున్న విభిన్న వ్యవస్థల పరిపూర్ణ స్వరూప స్వభావాల్ని, వాటి లోతుపాతుల్ని అవగతం చేసుకోవడంలో నాటి రచయితలు కొంత సంఘర్షణకు సందిగ్ధతకు లోనైనట్లు ఈ నవలల్ని క్షుణ్ణంగా పరిశీలిస్తే అర్థమౌతుంది. సంస్థానాధీశుల పీఠాలు కదిలిపోతోంటే రాజరికవ్యవస్థమూలాలు కూకటివేళ్ళతో సహా పెకలింపబడడం, యూరోపియన్లరాకతో పెట్టుబడిదారీ వ్యవస్థ చాపకిందనీరులా వ్యాపించడం, రష్యావిప్లవం నేపథ్యంలో సామ్యవాద భావజాలవీచికలు, మరోవైపు మహాత్మాగాంధీజీ అహింసాయుత ప్రజాస్వామ్య ఆకర్షణలనడుమ రచయితలు తమకు అవగతమైన రీతిలో అనుకూల-ప్రతికూల వాదాలను ఈ నవలలముఖంగా చర్చకు పెట్టారు. ఈ నవలలన్నిటిలో విభిన్న భావజాల ప్రభావంతో నడిపింపబడిన పాత్రలద్వారా కథను నడిపించడం అందుకు నిదర్శనం. ఉదాహరణకు మాలపల్లి నవలలో సంగదాసు గాంధీమార్గానికి ప్రతీకయైతే వెంకటదాసు సామ్యవాదవ్యవస్థకు ప్రతినిధిగా నిలుస్తున్నాడు. అతడు-అమె నవలలో శాస్త్రి స్వలాభాపేక్షగల కాంగ్రెసువాది కాగా శాంతం నిస్వార్థమైన స్వాతంత్రసమరయోధురాలిగా ప్రస్థానం ప్రారంభించి అంతిమంగా పారిశ్రామికకూలీలపక్షాన పోరాడుతుంది. కోనంగి నవలలో కోనంగేశ్వరరావు గాంధీవాది కాగా డాక్టరురెడ్డి పక్కా సామ్యవాది. ఇలా ఒక్కొక్కరూ ఒక్కొక్క వ్యవస్థకు ప్రతినిధులుగా కనిపిస్తారు. నిజానికి ఈ నవలా రచయితలందరూ గొప్ప దార్శనికులే. స్వాతంత్ర్యం రావడానికి 25-30 ఏళ్లక్రితమే విభిన్న సైద్ధాంతిక దృక్పథాల మార్గదర్శకత్వంలో భారతజాతి విముక్తిపొందినట్లు, భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినట్లు కథను ముగించారు. అప్పటి సమాజంలోలేని ఆదర్శవంతమైన వ్యవస్థను ఊహించి, అట్టి వ్యవస్థ సంభవించడానికి అవకాశం ఉందని భావించి సంభ్రమించారు. ఈ కారణంగా సగటు పాఠకుడు గాంధీజీ అహింసాధర్మం, పాశ్చాత్యదేశాల పెట్టుబడిదారీవ్యవస్థ, కమ్యూనిస్టుదేశాల సామ్యవాదవ్యవస్థ, స్థానిక రాజరికపు వ్యవస్థల్లోని లోతుపాతుల్ని అర్థం చేసుకుని నచ్చిన పంథాలో ఉద్యమ ఉరవడిలో పడి ఉరకలెత్తాడు.

**వేలూరి శివరామశాస్త్రి - ఓబయ్య :-** అలనాటి జాతీయోద్యమంలో మహాత్మాగాంధీజీ అహింసాయుత భావజాల ప్రభావంతో వెలువడిన నవలయిది. సంప్రదాయ-ఆధునిక భావాల సంధికాలంలో సగటు భారతీయుడి సంఘర్షణాత్మక స్థితికి ప్రతిరూపం ఈ నవల. సమకాలీన సంప్రదాయ సంకుచిత భావాలనుండి పూర్తిగా విముక్తుడుకాని ఓబయ్య ఒఠ్ఠి మందబుద్ధిగల అమాయకుడు. చదువు ఒంటబట్టించుకోవడం పెనుసమస్యయైన తరుణంలో విదేశీవస్తు బహిష్కరణ నినాదం ఓబయ్య చదువును అటకెక్కించింది. బాల్యవివాహాలు సహజమైన నాటికాలంలో తెలిసీతెలియని వయస్సులోనే పెళ్ళైన ఓబయ్యకు స్త్రీవిద్యపై సదభిప్రాయంలేదు. చదువంటే అమితమైన ప్రేమగల ఓబయ్య భార్య వసుమతి పదిమందితోకలిసి బడికివెళ్ళడం ఎంతమాత్రం జీర్ణించుకోలేక నానాటికీ ఎడబాటును పెంచుకుంటాడు.



Scanned with OKEN Scanner

ఈడేరిన స్త్రీ బడికెళ్ళడం ప్రాయశ్చిత్తంలేని అదర్మం, కుటుంబగౌరవానికే భంగమనేది ఓబయ్యతోపాటు ఇంటిల్లిపాదికీ గల నిశ్చితాభిప్రాయం. తండ్రిమరణానంతరం అత్తవారింటికి వచ్చిన వసుమతిని చూడగానే తిరస్కారభావాన్నివహించిన ఓబయ్య తన భార్య ఉన్నన్నిరోజులు ఊరొదిలివెళ్ళిపోయి, ఆమె తన పుట్టింటికి వెళ్ళిపోగానే తిరిగి ఊరికి చేరుకుంటాడు. పుట్టినింటికి చేరిన వసుమతి తనకువాటాగావచ్చిన ఇల్లు అమ్మేసి చెన్నపట్నంచేరి అష్టకష్టాలుపడి వైద్యవిద్యచదివి డాక్టరవుతుంది. జాతీయోద్యమ కార్యకలాపాల్లో ముమ్మరంగా పాల్గొన్న ఓబయ్య మహాత్ముడి గ్రామస్వరాజ్యకాంక్షతో గ్రామాభివృద్ధికార్యక్రమాల్లో తలమునకలైవుండగా వైద్యవృత్తిని ప్రారంభించిన వసుమతి అదే గ్రామానికి వచ్చి భర్తకు సహరించిట్లు కథ సుఖాంతమౌతుంది. మారుతున్న కాలానికనుగుణంగా మారని సమకాలీన భారతీయుడి మనస్తత్వానికి ప్రతీకగా ఓబయ్య నిలుస్తాడు. అయితే స్రీవిద్య ప్రాధాన్యత, స్వతంత్ర సాధనలో సగటు భారతీయ స్త్రీ భాగస్వామ్య ఆవశ్యకతకు ప్రతీకగా వసుమతి పాత్రను తీర్చిదిద్దినట్లు కనిపిస్తుంది. అంతిమలక్ష్యసాధనకై వైరుధ్యభావాలుగల వ్యక్తుల్ని జతకలిపి కథను సుఖాంతంచేయడం గాంధీవాదియైన వేలూరి శివరామ శాస్త్రి భవిష్యద్దర్శనానికి నిదర్శనం.

**ఉన్నవ లక్ష్మీనారాయణ – మాలపల్లి :–** మహాత్మాగాంధీజీ ఆదర్శాలచే ప్రభావితులైన ఉన్నవవారు పరాయిపాలన నుండి విముక్తి పొందినప్పుడే భారతదేశంలో సమసమాజస్థాపన జరుతుందనీ, అటువంటి సమసమాజ స్థాపనకోసం స్వాతంత్రోద్యమం అట్టడుగుస్థాయి వర్గాలనుండే ప్రారంభం కావాలనే దృఢనిశ్చయంతో ఉద్యమ కార్యాచరణ ప్రణాళికగా రాయబడిన నవల మాలపల్లి. ప్రజాస్వామ్యానికి సామ్యవాదాన్ని జతచేస్తూ స్వాతంత్ర్యానంతరం నిజమైన ప్రజాస్వామ్యం, పేదవారి అభ్యున్నతి కోసం పాటుబడే ప్రభుత్వం ఏర్పడాలని ఆకాంక్షిస్తూ రామదాసు–సంగదాసు–వెంకటదాసు పాత్రలను చిత్రించారు. గాంధీజీ భారత జాతీయోద్యమంలో క్రియాశీలకపాత్ర పోషిస్తూ ఉద్యమానికి నాయకత్వం వహించిన తొలి దశలోనే దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించినట్లు, భరతజాతి విముక్తిపొందినట్లు ముగించడం 'భారతీయులు దౌర్జన్యరహితమైన సత్యమార్గమున స్వరాజ్యమును సంపాదించి లోకానికి మార్గదర్శకులైనారు '(మాలపల్లి రెండవ భాగము:333) ఉన్నవవారి స్వతంత్రభారతావని స్వప్నాన్ని రుజువుచేస్తుంది. నవలలో భూస్వామి చౌదరయ్య పెట్టుబడిదారీ వ్యవస్థకు నాటి జమీందారీవ్యవస్థకు ప్రతినిధి. పరమసాత్త్వికుడైన హరిజన దాసరి రామదాసు గాంధీవాదానికి ప్రతీక. కథాగమనంలో రామదాసు చిన్నకొడుకైన సంగదాసు మానవసేవే పరమావధిగా అహింసాయుత మార్గంలో కూలీల సమస్యను పరిష్కరించడానికి ప్రయత్నించి భూస్వామి దౌర్జన్యానికి బలవ్వగా, ఆర్థికంగా స్థితిమంతుడు మరియు అగ్రవర్ణానికి చెందిన చౌదరయ్యను ఎదుర్కోడానికి రామదాసు పెద్ద కొడుకైన వెంకటదాసు విప్లవపంథాను ఎంచుకున్నాడు. రామదాసు, సంగదాసు పాత్రల ద్వారా గాంధీగారి సాత్త్వికభావాల్ని ప్రధానాకర్షణగా ప్రతిబింబిస్తూనే తక్కెళ్ళ జగ్గడి నాయకత్వంలో నడచిన ధర్మదోపిళ్ళ ఉదంతాల నేపథ్యంలో సాంఘిక పరివర్తనా చిత్రాలు, బుర్రకథల ద్వారా సామాన్య ప్రజానీకంలో చైతన్నాన్ని రగిలించడం, ప్రభుత్వానికి పట్టుబడ్డ తర్వాత కోర్టులో కూడా విప్లవభావాల్ని ప్రకటింపజేయడం సామ్యవాద భావజాలంపై రచయితకుగల సానుకూల ధోరణి వెల్లడౌతోంది. అయితే జగ్గడి (మారురూపంలో గల వెంకటదాసు) చర్యలు గాంధీభావాలకు వ్యతిరేకం కాబట్టి గాంధేయవాదియైన ఉన్నవవారు ఈ నవలకు సంగవిజయమనే మరో పేరు కూడా పెట్టారు.

ఆంధ్రదేశంలో అదివరకు లేని వ్యవసాయకూలీల ఉద్యమాన్ని ఊహించి చిత్రించడం ద్వారా 1923 తర్వాత వచ్చిన వ్యవసాయకూలీ ఉద్యమానికి మాలపల్లి నవల మార్గదర్శకమైందనే (డా. గురజాల ఆంజనేయులు నాయుడు) వాదన కూడా లేకపోలేదు. 1922–23 నుంచీ 1935దాకా దాదాపు పదేళ్ళకుపైగా మూడు భాగాలు మాత్రమే (అంటే వెంకటదాసు కోర్టు ఉపన్యాసం, జడ్జిమెంటుతో ఆగిపోయి) అచ్చైన మాలపల్లి వెంకటవిజయంగానే వుండిపోయింది. అందుకే తొలి కమ్యూనిస్టు కార్యకర్తలు దాన్నుండి వుత్తేజాన్ని పొందారు. ప్రేరణ పొందారు. తమ ఉద్యమ ప్రచారానికి వినియోగించుకున్నారు. నాలుగోభాగం అచ్చైన తర్వాతే అది సంగవిజయమైంది. సంగడివైపు అంటే గాంధీ స్వరాజ్యంవైపు పక్షపాతం వున్నదని రమణారెడ్డిగారి వాదన.



Scanned with OKEN Scanner

ఈ వాదనలన్నిటికీ సమాధానంగా వున్నవవారి మాలపల్లి స్వరాజ్యం+కమ్యూనిజం కావాలని కాంక్షిస్తున్నది అని ముక్తాయిస్తారు బంగోరె. (మాలపల్లిపై నిషేధాలు: 40)

**ఆచార్య ఎన్.జి. రంగా – హరిజననాయకుడు :-** ఉన్నవవారివలెనే గాంధీజీ ఆదర్శాలచే ప్రభావితులైన ఆచార్య ఎన్.జి. రంగా జాతీయోద్యమంలో మహాత్ముని ప్రధానాశయమైన హరిజనోద్ధరణను కథావస్తువుగా తీసుకుని ఈ నవలను తీర్చిదిద్దారు. 1932లో రూపుదిద్దుకున్న ఈ నవలలో భారతదేశాభ్యుదయాన్ని ఆకాంక్షిస్తూ, ఆనాటి సమాజంలో లేని ఒక ఆదర్శవంతమైన వ్యవస్థను ఊహించి, అట్టి వ్యవస్థ ఏర్పడడానికి గల అవకాశాలను మార్గదర్శకసూత్రాలను పొందుపరిచారు. మాలపల్లి నవలలోని సన్నివేశాలకు పాత్రలకు సమాంతరంగా కథనడిచే ఈ నవలలో విద్యావంతుడు యువకథానాయకుడైన బసవలింగయ్య కథారంభంనుండి కథాంతంవరకు గాంధీజీ ఆశయాలను మనసావాచాకర్మణా అనుసరిస్తూ గ్రామంలో గల పంచములకు రైతులకు మధ్యగల విభేధాలను సామరస్యపద్ధతిలో పరిష్కరించుకోవడం కనిపిస్తుంది. జాతీయోద్యమం బలహీనపడడానికి భారతీయులందర్నీ స్వతంత్రసాధనదిశగా ఏకతాటిపై నడిపించలేకపోవడానికి గల ప్రధాన కారణం వర్ణవ్యవస్థేననే వాదన ఈ నవలలో గట్టిగా వినిపిస్తుంది. గాంధీజీ పంచములకు హరిజనులని నామకరణంచేసి జాతి జనజీవనస్రవంతిలో వారిని భాగస్వామ్యం చేయాలని చేసిన ప్రయత్నాలు, మహాత్ముడు ఊహించిన ఆదర్శసమాజాన్ని ఈ నవల కూలంకషంగా చర్చించింది. ఆదర్శాలకు ఆచరణకు గల వ్యత్యాసం మాత్రం నవలాదర్శనానికి అతీతంగానే ఉండిపోయింది.

**పుప్పల లక్ష్మణరావు : అతడు–అమె :-** జాతీయోద్యమ నేపథ్యంలోపెట్టుబడిదారీవ్యవస్థ– సామ్యవాదవ్యవస్థల మనస్తత్వచిత్రణకు ప్రతీకగా ఈ నవల నిలుస్తుంది. ఉద్యమతీవ్రతకు అనుగుణంగా అభిప్రాయాలను, అనుబంధాలను, సంబంధబాంధవ్యాల ప్రాధాన్యతను మార్చుకుంటూ పరిస్థితులను సొమ్ముచేసుకోవడానికి ప్రయత్నించే ఫక్తు అవకాశవాది శాస్త్రి. బ్రిటిష్‌పాలనపై అమితమైన గౌరవంతో పదవిపై విపరీతమైన వ్యామోహంతో డబ్బు సంపాదనే ధ్యేయంగా పాకులాడుతూ బతకనేర్చిన పాత్ర శాస్త్రి. కాలక్రమేణా జాతీయోద్యమం విజృంభించే కొద్దీ ఒకవేళ కాంగ్రెస్ సారధ్యంలో భారతదేశానికి స్వాతంత్ర్యం సిద్ధిస్తే తనలాంటి వాళ్ళకు నష్టం సంభవిస్తుందేమోనని ముందుగానే ఊహించి పైగా కాంగ్రెస్ వారితో కూడా మంచి సంబంధాలు పెట్టుకోగలిగితే ముందుముందు స్వతంత్రభారతావనిలో తనక్కూడా మంచి పదవులు హోదాలభిస్తాయని భావిస్తూ అప్పుడప్పుడూ ఖద్దరు ధరిస్తూ కాంగ్రెస్ సభల్లో పాల్గొంటూ కొత్తపాట ఆరంభిస్తాడు.

అంతకుపూర్వం సంప్రదాయాచారాలపై ఏమాత్రంపట్టింపులేని శాస్త్రి నాటినుంచి పదిమందీ గౌరవించేవిధంగా సంప్రదాయాచారాలను పాటిస్తూ జాతీయవాదుల దృష్టిని ఆకర్షిస్తుంటాడు. బారిష్టర్ చదువుతూ కాక్‌టైల్స్ పుచ్చుకున్నా, జంధ్యంవేసుకుని తద్దినాలు పెట్టినా అతనికేం తేడా అనిపించకపోగా రెండిటినీ బాగా సమన్వయం చేసానని మాత్రం అనుకుంటాడు. ధనికులపక్షాన మాత్రమే వాదించి గెలిపించే శాస్త్రి న్యాయం, ధర్మం వంటి ఆశయాలు పెట్టుకుంటే బతకలేమని అనుకుంటాడు. క్లబ్బుల్లో దొరలతో విందులు వినోదాలు, ఇంటికివచ్చాక విభూతిపూసుకుని కాషాయవస్త్రాలు ధరించి పూజలు, భజనలు చేయగల సమర్థుడు. ఇదంతా సనాతనాచారాలపై నిజమైనభక్తి ఉండికాక జాతీయవాదిగా నిలబడడానికి పనికొస్తుందని అతని అభిప్రాయం. క్వీన్ మేరీస్ కళాశాలలో అర్థశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేసే శాస్త్రి భార్య శాంతం వ్యక్తిత్వం, మనస్తత్వం దృష్ట్యా తన భర్తకు పూర్తి వ్యత్యాసమైనది. లోకంలో అన్యాయాలకు, అక్రమాలకు గురై ఆక్రోశించే కర్షకకార్మిక ప్రజానీకం యొక్క దయనీయమైన జీవితాల్ని చూసి చలించిపోయే మనస్తత్వం ఆమెది. జమీందార్లదగ్గర పెద్దమొత్తంలో ఫీజుతీసుకుని భూస్వాములకు అనుకూలంగా రైతుకూలీలకు వ్యతిరేకంగా వాదించే శాస్త్రిని నిలదీస్తుంది. ఇంగ్లండ్‌లో వచ్చిన పారిశ్రామిక విప్లవాన్ని గురించి క్లాసులో అత్యంత ఉత్సాహంతో బోధించిన శాంతం పొగలు కక్కుతున్న యంత్రాలహోరులో చెమటలుకక్కుతూ పనిచేసే కూలీలను, ఆ చాకిరీచేయకపోతే పూటగడవని స్త్రీలను చూసి తాను చెప్పే పాఠాలకూ పరిశ్రమల్లో జరుగుతున్న శ్రమదోపిడీకి ఎంతమాత్రం పొంతనలేని వైనాన్ని



Scanned with OKEN Scanner

చూసి విస్తుపోతుంది. నిస్వార్థంగా సత్యాగ్రహంలో పాల్గొని దెబ్బలుతిని తీవ్రగాయాలపాలైన శాంతంపై పరపతి పెరిగితే, ఆమె పరపతిని వాడుకుని ఎన్నికల్లో కాంగ్రెసు నాయకులతో తనగురించి సిఫారసుచేయమన్న శాస్త్రి అవకాశవాదతత్వాన్ని చూసి మనస్తాపంతో అసహ్యించుకుంటుంది. "ఇలాంటివాళ్ళు కొంతమంది ఉద్యమంలోకి ప్రవేశిస్తే ఉద్యమానికుండే పవిత్రతేపోతుంది. ఉద్యమం అన్న తర్వాత మంచివాళ్ళు వస్తారు. చెడ్డవాళ్ళు కూడా దానిలో ప్రవేశిస్తారు. కానీ చూస్తూ అలాండి వాళ్ళకి గౌరవస్థానాలు ఏరకంగా ఇవ్వడం" అన్నది శాంతం అంతరంగంలోని మథనం. కలకత్తామహానగరంలో నదికి ఒకవైపు జనపనారమిల్లులు నడిపే యజమానుల మహాసౌధాలు, మరోవైపు మురికివాడల్లో అస్తిపంజరాల్లా ఉన్న కూలీలను చూసి "ఈ తల్లక్రిందులు ఎప్పుడైనా మారతాయా? మారకపోతే మోక్షం లేదే? మార్పు తెచ్చేవాళ్ళెవరు? రేపుశాసనసభల్లోకి వెళ్ళబోయే శాస్త్రా? లేకపోతే సర్వసుఖాలూ అనుభవిస్తూ చోద్యం చూడడానికి వచ్చిన నేనా? ఎప్పుడో ఒసారి నాలాగు ఆవేశం చేత రణరంగంలో దెబ్బలు తినడంవేరు – రోజుకు ఇరవైనాలుగుగంటలూ ఈ పరిసరాల్లో బ్రతుకుతూ సాహసం చూపించడం వేరు. ఈ సాహసవంతులే విజయం సాధించాలి. వాళ్ళ అసంతృప్తే వాళ్ళ ఆయుధం. వాళ్ళ సహనమే వాళ్ళ శక్తి. వాళ్ళ ఇక్యతే వాళ్ళ ముక్తి. వాళ్ళ శక్తివల్లే రావాలి శాంతి. ప్రపంచానికీ... వాళ్ళకీ ... నాకూన్నూ (అతడు–ఆమె: 227). వుప్పల లక్ష్మణరావుగారు జాతీయోద్యమంలో పాల్గొన్న వ్యక్తికాబట్టి ఆనాటి వ్యవస్థ స్వరూపాన్ని సవిమర్శక వాస్తవికతా దృష్టితో పరిశీలించి పాఠకుల్ని చైతన్యంచేశారు. ఆనాడు జాతీయోద్యమంలో పాల్గొన్న వారి వెనుక వున్న స్వార్థరహిత – స్వార్థపూరిత ఆవేశాలు, ఉద్దేశ్యాలు, భవిష్యత్ ప్రణాళికలు ఈ నవలలో అత్యంత పారదర్శకంగా చిత్రించబడ్డాయి.

**అడవి బాపిరాజు–కోనంగి :–** మహాత్మాగాంధీ సిద్ధాంతాలకు ఆకర్షితుడై సహాయనిరాకరణోద్యమంలో పాల్గొని జైలుశిక్షను అనుభవించిన రచయిత బాపిరాజు ఈ నవలలో గాంధీవాదుల–సామ్యవాదుల ఉద్యమస్ఫూర్తిని అత్యంత విశాలదృక్పథంతో చిత్రించారు. ఆలోచనలలో స్వతంత్రభావాలుగల కథానాయకుడు కోనంగి గాంధీ మహాత్ముని గురించిన గ్రంథాలు చదువుతోంటే అహింసాయుత మార్గమంత ఉత్తమమైన మార్గం లేదనుకుంటాడు. తన స్నేహితుడైన డాక్టరుగారిచ్చిన సామ్యవాద గ్రంథాలు చదువుతోంటే రష్యామార్గమంత ఉత్తమమార్గం మరొకటి లేనేలేదనుకుంటాడు. జర్మనీవాళ్ళే దేశాలన్నిటికీ రక్ష అనుకుంటాడు. మెయిన్‌కాంఫ్ చదువుతూ, వెంటనే నాజీవాదం సామ్రాజ్యవాద సంఘర్షణ జనితమైన పాశ్చాత్త్యయువకుల ముసలంఅని అనుకుంటాడు. లోకంలోవున్న అన్ని ఆవేదనలకూ, బాధలకూ, కష్టాలకూ, బీదతనానికీ, చలికీ, ఆకలికీ, ఎండిపోయే వాంఛలకూ అఖండ నిస్పృహకూ విరుగుడు రష్యా సామ్యవాదమే అని అనుకుంటాడు. పాశ్చాత్యుల ప్రజాప్రభుత్వవాదం డెమోక్రసీ చెప్పినట్లు వ్యక్తి స్వాతంత్రమే ప్రపంచ రక్షేమో! అది సామ్యవాదమా అని అలోచిస్తాడు. ఆనాటి మిశ్రితభావాల, విభిన్న వ్యవస్థల సంక్లిష్టాత్మకత ఈ నవలలో కనిపిస్తుంది. 1930లో గాంధీజీ ఉప్పుసత్యాగ్రహాన్ని ప్రారంభించినప్పుడు కోనంగి బందరు దగ్గర హంసలదీవినందు ఉద్యమంలో పాల్గొనడం, సామ్యవాదభావాలు గల డాక్టరుగారితోకలిసి మిల్లుకూలీల తదితర సమావేశాలకు వెళ్ళి డాక్టరుగారి ప్రోద్బలంతో ఆయా సంఘాల సభ్యులను ఉత్తేజపరుస్తూ ఉపన్యాసాల్విడం, కమ్యూనిస్టు భావాలు గల డాక్టరుగారితో కలసి ప్రభుత్వంపై కుట్రచేస్తున్నాడనే అభియోగంమీద రాజకీయఖైదీగా నిర్బంధం, పరిశ్రమను గాంధీతత్వం–కార్మికతత్వంతో మేళవింపజేయాని భావించడం, రెండవ ప్రపంచయుద్ధం ముమ్మరంగా జరుగుతున్నకాలంలో దేశరాజకీయాలు, ప్రపంచరాజకీయాలు, పార్టీవిధానాలు సిద్ధాంత రాద్ధాంతాలన్నీ అస్తవ్యస్తమై అల్లకల్లోలవాతావరణం ఏర్పడినప్పుడు జాతిని నూతన దృక్పథంలోకి మళ్ళించడానికి దినపత్రిక ప్రారంభించి ఏఒక్కపార్టీకీ కొమ్ముకాయకుండా, ఏదోఒక్క సిద్ధాంతాన్నే పట్టుకుని వేళ్ళాడకుండా స్వతంత్రదృక్పథంతో సమతౌల్య ధోరణితోనడిపి అన్ని వర్గాలవారికీ చేరువకావడం వంటి సంఘటనలతో సమకాలీన మిశ్రిత వ్యవస్థల నడుమ కథానాయకుడు కోనంగి కడదాకా గాంధీ మహాత్ముని అహింసావాదానికి కట్టుబడివున్న నిక్కచ్చియైన జాతీయవాదిగా తీర్చబడ్డాడు. మరోవైపు రష్యాప్రియుడు, కమ్యూనిస్టువాదియైన డాక్టరు రంగనాయకులురెడ్డి ద్వారా ప్రభుత్వం కమ్యూనిస్టు సంఘాలను నిషేధించడం వలన కాంగ్రెసులోనేవుంటూ సామ్యవాదానికి



Scanned with OKEN Scanner

కట్టుబడివుండి కమ్యూనిజాన్ని ప్రచారంచేసే కాంగ్రెస్ సోషలిష్టులు/ కాంగ్రెసు వామపక్షవాదుల ఉద్యమస్ఫూర్తిని కూడా సమాంతరంగా వర్ణిస్తూ సామ్యవాద భావాలుగల డాక్టరుగారిని ప్రగతిశీలభావాలుగల చౌధురాణి తన భాగస్వామిగా స్వీకరించడానికి అభ్యంతరాలేవీలేవని చెప్పి కథను సుఖాంతంచేయడం, వారి వర్ణాంతర వివాహానికి అభ్యుదయభావాలు గల గాంధేయవాది కోనంగి మార్గదర్శకుడై ఆదర్శవివాహం జరిపించడం వంటివన్నీ రచయిత స్వతంత్ర భారత దార్శనికతకు నిదర్శనంగా నిలుస్తున్నాయి. జాతీయోద్యమంతో ప్రత్యక్షభాగస్వాములైన ఈ రచయితలందరూ సమకాలీన వ్యవస్థను ప్రభావితంచేసిన వైవిధ్యభరితమైన సిద్ధాంతాలలోని అనుకూల ప్రతికూలధోరణుల్ని సాధ్యాసాధ్యాల పరిస్థితుల్నీ బహుముఖీనమైనరీతుల ద్వారా విశ్లేషిస్తూ తమకు తోచిన విధంగా ముక్తాయింపునిచ్చారు. నిజానికి ఈ నవలలన్నీ కాలపరీక్షకు తట్టుకుని నిలబడినవే.

**ఆధారగ్రంథాలు**

1. ఉన్నవ మాలపల్లి నవలపై ప్రభుత్వ నిషేధాలు (1978) – బండిగోపాలరెడ్డి, స్వీయప్రచురణ, విశాలాంధ్ర, విజయవాడ.

2. తెలుగు సాంఘికనవలలు– వాస్తవికత1900–1950 (2004)– డా. పి. భవాని, ఈస్ట్‌వెస్ట్‌రిసర్చ్ సెంటర్,హైద్రాబాద్

3. రంజని రజతోత్సవ సంచిక; జాతీయోద్యమం– నవల (వ్యాసం): డా. గురజాల ఆంజనేయులు నాయుడు.

4. ఓబయ్య (నవల) : వేలూరి శివరామశాస్త్రి, భారతి (1932)

5. మాలపల్లి (నవల) రెండవభాగము : ఉన్నవ లక్ష్మీనారాయణ

6. హరిజననాయకుడు(నవల) : ఆచార్య రంగా

7. అతడు–ఆమె (నవల) : వుప్పల లక్ష్మణరావు.

8. కోనంగి (నవల) : అడవి బాపిరాజు



Scanned with OKEN Scanner

# జాతీయోద్యమం - ఆంధ్రప్రశస్తి

**డా. కానుకొల్లు బాలకృష్ణ,** తెలుగు అధ్యాపకులు, సాంఘిక సంక్షేమ గురుకుల ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాలికలు)
కంచికచర్ల, యన్.టి.ఆర్ జిల్లా, చరవాణి : 9440064705

**పరిచయం :** తెలుగులో తొలి జ్ఞానపీఠ పురస్కార గ్రహీత, మహాకావ్య నిర్మాత, నవలాకారులు, కథకులు, నాటకకర్త, గేయకవి, శతకకర్త, విమర్శకులు, నిఘంటు నిర్మాత, నాటకప్రయోక్త, ఉపన్యాసకులు, వ్యాసకర్త, తెలుగు అధ్యాపకులు, అధ్యాపకసంఘం తొలి అధ్యక్షులు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తొలి ఆస్థానకవి, కేంద్ర సాహిత్య అకాడెమీ పురస్కార గ్రహీత, మహాకవి, కళాప్రపూర్ణ, పద్మభూషణ, కవిసమ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణగారు లోకం పట్టని కవిగా ప్రసిద్ధులు. సంప్రదాయవాది అయిన విశ్వనాథ పద్య ప్రక్రియలకే పరిమితం కాకుండా నవల, కథ, నాటకం, విమర్శ మొదలైన ఆధునిక సాహిత్య ప్రక్రియలు అన్నింటిలోనూ రచనలు చేసి బహుముఖ ప్రజ్ఞాశాలిగా పేరు పొందారు. వారు తెలుగు సాహిత్యంలో చేపట్టని ప్రక్రియ గానీ, చేపట్టి విజయం సాధించని ప్రక్రియగానీ లేదు అనే ఖ్యాతి గడించారు.

విశ్వనాథ రచించిన 'ఆంధ్రప్రశస్తి' అనే లఘుకావ్యంలో ప్రతిఫలించిన జాతీయోద్యమ విశేషాలను ప్రస్తావించడమే ఈ వ్యాసరచనోద్దేశం.

**ఆంధ్రప్రశస్తి–వస్తువు :** ఆంగ్లేయుల దోపిడీ దుర్మార్గాలకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యంకోసం సాగిన జాతీయోద్యమానికి మద్దతుగా తెలుగు సాహిత్యంలో వెలువడిన కావ్యాలలో విశ్వనాథ రచించిన 'ఆంధ్రప్రశస్తి' విశిష్టమైనది. ఆంధప్రశస్తిలో ఆంధ్ర మహావిష్ణువు(14), శాతవాహనుడు(14), గోతమీపుత్ర శాతకర్ణి(14), మాధవవర్మ(16), వేగిక్షేతము(12), ముఖలింగము(12), నన్నయభట్టు(17), ప్రోలరాజు(14), ప్రోలరాజువధ(15), కొండవీటి పొగమబ్బులు(10), చంద్రవంక యుద్ధము(20), యమదంష్ట్రిక(22) అనే పేర్లతో 12 ఖండికలు ఉన్నాయి. ఈ కావ్యంలోని మొత్తం పద్యాల సంఖ్య 180.

ఘనచరిత్ర, నాగరికతలు లేవంటూ హేళనచేస్తూ జాత్యహంకారంతో విర్రవీగే ఆంగ్లేయులకు సమాధానంగా జాతి గతవైభవాన్ని వర్ణించడం ప్రధానాంశంగా సాగిన కావ్యరచనల కోవకు చెందినదే ఆంధ్రప్రశస్తి. స్వాతంత్ర్య అమృత మహోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంలో సుమారు వంద సంవత్సరాల కిందట అనగా 1919–24 సంవత్సరాల మధ్యకాలంలో స్వాతంత్ర్యోద్యమం మహోజ్జ్వలంగా సాగుతున్న కాలంలో వెలువడిన ఈ కావ్యం తెలుగుజాతిపై కలిగించిన ప్రభావం, రగిలించిన స్వాతంత్ర్యకాంక్ష అంతా ఇంతా కాదు.

వేలయేళ్ళ చరిత్ర కలిగిన తెలుగుజాతిని వైభవంగా పాలించి, ఆంధ్రుల కీర్తికి ప్రధాన కారకులైన ఆంధ్రమహావిష్ణువు మొదలుకొని శాతవాహనులు, తెలుగు పల్లవులు, తూర్పు చాళుక్యులు, కళింగ గాంగులు, కాకతీయులు, రెడ్డిరాజులు, పల్నాటివీరులు, విజయనగర రాజుల ప్రజారంజక పాలనను, అనితరసాధ్య విజయాలను గురించి విశ్వనాథ ఆంధ్రప్రశస్తిలో అపూర్వంగా వర్ణించారు. ఈ ఖండికలలో మహారాజుల వైభవాలతోపాటు తెలుగులో ఆదికవి అయిన నన్నయభట్టుకు చోటు కల్పించడం విశేషం.



Scanned with OKEN Scanner

**దైవానికి విన్నపం :** కృష్ణాతీర శ్రీకాకుళాన్ని రాజధానిగా చేసుకొని తెలుగుజాతిని పాలించిన మొదటి చక్రవర్తి అయిన ఆంధ్రమహా విష్ణువు పాలనా వైభవాన్ని వర్ణించిన ఈ ఖండికలో గిరిజనులు నిశుంభుడనే రాక్షసుని దుశ్చర్యలను తెలిపి అతని బారినుంచి తమను కాపాడమని వేడుకుంటారు.

**"జో! సామీ! మము గన్న యేలిక! యిదో జోహారు! జోహారు! మా**
**శ్రీశైలంబున, బెద్దకొండ దరి, గర్వీభూత చేతస్కుడై**
**యీశా రాధన లబ్ధ దోర్బలుడు దైత్యేంద్రుండు లేడా! బుభు**
**క్షా సంపూర్తికి నోచుకోము గద, కక్కా! వాని దుశ్చేష్టలన్"** (ఆంధ్ర మహావిష్ణువు-1)

'ఓ రాజా! శ్రీ శైలంలోని పెద్దకొండ దగ్గర ఈశ్వరుని కృపవల్ల కలిగిన బలంతో విర్రవీగే రాక్షసుని దుర్మార్గాలకు అంతులేకుండా ఉన్నది. మా పొట్ట కొడుతున్న వాడి బారినుంచి మమ్మల్ని కాపాడు' అని భావం.

ఆంధ్రుల గతవైభవ వర్ణనమే ప్రధాన ఆశయంగా సాగించిన ఈ కావ్యంలోని ప్రతిఘట్టాన్నీ లోనారసి గమనిస్తే జాతీయోద్యమం స్ఫురిస్తుంది. ప్రజలు రాక్షసుని బారినుంచి కాపాడమని రాజుకు మొరపెట్టుకున్న ఈ పద్యంలోని కింది పదప్రయోగాలద్వారా దుర్మార్గులైన ఆంగ్లేయులనుంచి తమను కాపాడమని పరాయిపాలనలో మగ్గుతున్న భారతీయులు తమ ఇష్టదైవానికి మొరపెట్టుకున్నట్టు స్ఫురించడం విశేషం.

శ్రీశైలం = పర్వతం/సంపదలకు నెలవైన దేశం
గర్వీభూత చేతస్కుడు = గర్వి/ జాత్యాహంకారధోరణి
ఈశారాధన = శివుణ్ణి/సంపదలను ఆరాధించే
దోర్బలుడు = దేహబలం/ఆయుధబలం కలవాడు
దైత్యేంద్రుండు = రాక్షసుడు/ ఆంగ్లేయ పాలకుడు
బుభుక్షా = ఆకలి

సంపదలను దోచుకోవడమే ధ్యేయంగా వ్యవహరిస్తూ, జాత్యాహంకారాన్ని ప్రదర్శిస్తూ, భారతీయులను మాతృదేశంలోనే బానిసలను చేసి, ఆకలిచావులకు కారకులై, మారణహోమాన్ని సృష్టించిన ఆంగ్లేయ ప్రభుత్వ దౌష్ట్యాలనుంచి తమను కాపాడమని భక్తులు తమ దైవానికి విన్నవించుకున్నారు అనే భావం ఈ పద్యంలో స్ఫురింపజేశారు కవిసమ్రాట్. అంతేగాక శ్రీకాకుళనగరం ఎత్తైన ప్రాకారాలతో, విజయధ్వజాలతో, వీరులను, శిల్పాచార్యులనూ తయారుచేసే విద్యాలయాలతో శోభిల్లుతూ వేదకాలంనాటి ముత్తైదువులా ఉన్నదని వర్ణించి తెలుగురాజ్యాల ప్రాచీనతనూ, కళా సంపదలనూ వర్ణించారు.

**సామ్రాజ్యాధినేత :** శాతవాహనులు సువిశాల భారతదేశాన్ని పాలించిన మొదటి తెలుగు రాజులు. వీరి పుట్టుపూర్వోత్తరాల గురించి చరిత్రకారులలో భిన్న అభిప్రాయాలు ఉన్నాయి. దీపకర్ణి మహారాజు భార్య అయిన శక్తిమతీదేవి పాముకాటుకు మరణించడం, రాజు కల, వేట, అడవిలో సింహరూపంలో శాతుడు అనే గంధర్వుడు, దానిపైన బాలుడు ఉండడం అనే సన్నివేశాలలో శాతుడు ఆ బాలుణ్ణి రాజుకు అప్పగిస్తున్న సందర్భంలో చెప్పిన పద్యంలో ప్రయోగించిన రెండుపాదాల సమాసం ద్వారా శాతవాహనుల సుదీర్ఘ పాలనా వైభవాన్ని ధ్వనింపజేశారు విశ్వనాథ.

**"నీ వాంధ్రేశ్వరు (డౌదు, శాపవిధ మంతే! శాతుడన్ నేను, నీ**
**కై వీనిం గని బెద్ద( జేసితిని రాజా! వీడు కోదండ బా**

**హా విధ్వస్త దిగంత రాహితధరా ప్రాణేశ చూడామణి**
**గ్రీవా మంజుల హార రత్న రుచిర శ్రీపాద కంజుం దగున్"** (శాతవాహనుడు-3)

అంతేగాక తూర్పున బంగాళాఖాతం, పశ్చిమాన అరేబియా సముద్రం, దక్షిణాన కృష్ణానది, ఉత్తరాన గంగానది సరిహద్దులుగా రాజ్యాన్ని పాలించమని గంధర్వుడు శాతవాహనుణ్ణి ఆశీర్వదించాడు.

**ఈ నిఖిలాంధ్ర రాజ్య రామ కేలిక వౌదువు, దీపకర్ణి సం**
**తానము గాగ నిన్గొలుచు ధాత్రిజనావళి, ప్రాక్సముద్ర మం**
**డావిన నీరు పశ్చిమ మహాంబుధి( ద్రావుము, కృష్ణనీరు గం**
**గా నది జేర్చు మాంధ్రసతి కంఠ లస న్నవహారమో యనన్!"** (శాతవాహనుడు-10)

వేలయేళ్ళనాడే సువిశాలదేశాన్ని పాలించిన ఘనత ఆంధ్రశాతవాహనులదని ఈ వర్ణనద్వారా కవి నిరూపించారు.

ఆంగ్లేయ రాజ్యానికి వ్యతిరేకంగా వారి పాలనలోని డొల్లతనాన్ని నిరూపించే రచనలను నిషేధిస్తూ, కవులనూ రచయితలనూ జైళ్ళల్లో బంధిస్తూ సాగించిన దుశ్చర్యలవల్ల నాడు ఎంతోమంది ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొన్నారు. సత్యాంజనేయ కవులుగా కొంతకాలం విశ్వనాథవారితో కలిసి జంటకవిత్వం సాగించిన కొడాలి ఆంజనేయులుగారు 'అవతార పరివర్తనం' అనే నాటక రచన, ప్రదర్శనల వల్ల ప్రభుత్వంనుంచి విచారణను ఎదుర్కొన్న విషయం తెలిసిందే. ఇటువంటి భయానక వాతావరణంలో కవులు సందేశాత్మక, ధ్వనిగర్భిత కావ్యరచనామార్గాన్ని ఎంచుకోవడం విశేషం.

**రక్షకులు-భక్షకులు :** సామాన్యులకు సైతం న్యాయవ్యవస్థను చేరువ చేసి, ధర్మఘంటను ఏర్పాటు చేసి, ప్రజాసేవలో తరించిన తెలుగు పల్లవరాజు మాధవవర్మ గురించి వర్ణిస్తూ రాకుమారుని రథచక్రాల వేగానికి బలైన యువకుని తల్లి అడిగిన ప్రశ్నలు పరాయి పాలకులకు ఎక్కుపెట్టిన బాణాలలాగా భాసిస్తాయి.

**"ఇంతకుమించి యాపద లికేమని కల్గు? రథంబు చేత ద్రొ**
**క్కింతు రటయ్య భూప్రజల? నెంతగ యున్న సిరుల్ భుజింత్రు, పా**
**లింతురు, రాజులైన నదలింతురు, తప్పులు కల్గినన్ విచా**
**రింతురు కాక, చంపుట సరే ప్రజల నిట్టు లకారణంబుగన్"** (మాధవవర్మ-8)

ఒకపక్క పాలన అంటే ఏమిటో నిర్వచిస్తూ, మరోపక్క పాలకులు ప్రజలపట్ల ఎట్లా ప్రవర్తించాలో తెలియజెప్పూ, తనకు జరిగిన ఆపదను గురించి రాజుని ప్రశ్నిస్తూ సాగిన ఈ పద్యం కులమత విద్వేషాలను రగిలిస్తూ, మారణహోమం సృష్టిస్తూ, ఆకలి రాజ్యం చేస్తూ లక్షలాది మందిని కబలిస్తున్నా తమకు పట్టనట్లు వ్యవహరిస్తూ, దోపిడీయే పరమావధిగా సాగిన దుర్మార్గపాలనకు చెంపపెట్టువంటిది. ఒక సామాన్య స్త్రీ మహారాజును సైతం ప్రశ్నించగలిగిన మహోన్నత నాగరిక సమాజాన్ని వర్ణించడం మనిషిని మనిషిగా చూడకుండా హోదా, సంపద ఆధారంగా గుర్తించే అనాగరిక ఆంగ్లజాతి అహంకారానికి గొడ్డలిపెట్టువంటిది. అంతేగాక ఒక సామాన్యుని మరణానికి కారణమైన తన కుమారునికి మరణశిక్షను విధించిన మాధవవర్మ ధర్మదీక్షకు దేవతలు కనకవర్షం కురిపించారు.

**'...పుత్ర విరహోగ్ర భరాత్ముడ గాని న్యాయ కా**
**ర్య చరణ భార దుఃఖ వివశాత్ముడ గానని పల్కె వెండియున్"** (మాధవవర్మ-14)

అంటూ తనకు పుత్రునికంటే న్యాయపాలనే ముఖ్యమని మాధవవర్మ పలికిన పలుకులు నాటి పాలకులకు గుణపాఠాలు.



Scanned with OKEN Scanner

**శౌర్య పరాక్రమాలు :** "ఏ రాజు పంచెనో యిచట శౌర్యపు బాయ సమ్ములు నాగుల చవితినాళ్ళ!?.." అంటూ వేగిదేశ ప్రజల శౌర్యపరాక్రమాలను వర్ణించిన కవి "అచట పుట్టిన చిగురు కొమ్మైన చేవ" అన్నట్లు అక్కడి బాలురు జెడుగుడు, గోడీబిళ్ళ, చెఱ్ఱాట, కోతికొమ్మచ్చి వంటి ఆటలనుంచే యుద్ధవిద్యలు నేర్చుకుంటున్నట్లు వర్ణించడం ఆంధ్రులలో ఆత్మస్థైర్యాన్ని నింపడమేకాక ఆబాలగోపాలం స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొనాలనే సందేశంతో పాటు పరాయి పాలకులకు హెచ్చరికకూడా.

**సీ. "వేగి రాజ్యపు పల్లెవీథుల జెడుగుళ్ళ రిపుల గవ్వించు నేరుపులు తెలిసి**
**ఎగురు గోడీబిళ్ళ సొగసులో రిపు శిర స్సుల బంతులాడు శిక్షలకు దాసి**
**చెఱ్ఱాడి యుప్పు తెచ్చిననాడె శాత్రవ వ్యూహముల్ పగిలించు వొరపు గఱచి**
**కోతి కొమ్మచ్చిలో గోట గోడల కెగ బ్రాకి లంఘించు చంక్రమణ మెఱిగి**

**తే.గీ. తెనుగు లంతప్డె యవి నేర్చుకొనియ యుందు**
**రెన్నగా దెల్గుతల్లులు మున్ను శౌర్య**
**రస మొడిచి యుగ్గు( బాలతో రంగరించి**
**బొడ్డు కోయని కూనకే పోయుదురట** (వేగిక్షేత్రము-5)

**ముగింపు :** మహావీరుడైన అళియరామరాయలు కళ్యాణి దుర్గాన్ని జయించే సందర్భంలో యమదంష్ట్రిక అనే మహిమాన్విత ఖడ్గాన్ని కోటలోకి విసిరివేసి దానిని తీసుకొనిరమ్మని సైనికులను ఆదేశించే కింది పద్యం లక్ష్యం స్వాతంత్ర్యోద్యమంకోసం జాతిని జాగృతం చేయడమే.

**"మీలో నెవ్వరు సాహసుల్ కదలుడీ, మీ మీ ప్రతాపాగ్ని తే**
**జో లంకారము గాగ శత్రుజన కల్యాణంబు ఖడ్గాన కు**
**ద్దాలించం జనుడీ, తెలుంగుముని విద్యారణ్య సన్న్యాసి ద**
**త్తాలంకారము బుక్కరాజు నసి తెండా! పోయి, సైన్యాధిపుల్"** (యమ దంష్ట్రిక-9)

శ్రీకాకుళం మొదలుకొని ఎంతో వైభవంగా సాగిన ఆంధ్రుల పూర్వరాజ్యాల పెరుచేబితేనే మనసు పులకరించిపోయేటంతటి దేశభక్తిని నరనరాల్లో నింపుకున్న విశ్వనాథ కలంనుంచి జాలువారి, దేశీయులలో జాతీయోద్యమకాంక్షను పెంచిపోషించిన ఆంధ్రప్రశస్తి కావ్యం ఆధునిక తెలుగు కావ్యాలలో విశిష్టమైనది.



Scanned with OKEN Scanner

# జాతీయోద్యమ సాహిత్యభూమిక

**డా. పి.ఎ. సత్యనారాయణ,** అసిస్టెంట్ ప్రొఫెసర్, తెలుగు విభాగము, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం
**డా. డి. నాగేశ్వరరావు,** అసిస్టెంట్ ప్రొఫెసర్, అర్థశాస్త్ర విభాగము, ప్రభుత్వ కళాశాల (అ), రాజమహేంద్రవరం.

ఆసేతు హిమాచలం, చుట్టూ మూడు సముద్రాలు కలిసి ద్వీపకల్పంగా, ఉపఖండంగా ఒక భౌగోళిక సమగ్రతను, అఖండతను సంతరింపజేసాయి. ఈ ప్రాదేశిక ఏకత్వం భిన్నసాంస్కృతిక మూలాలు, విభిన్న సమాజాలు, విపరీతమైన ఆర్థిక అంతరాల, కలనేతగా ఉన్న విశాల భూభాగాన్ని రాజకీయంగా ఒక గొడుకు కిందకు రావటానికి దోహదపడింది.

విభిన్న నైసర్గిక స్వరూపాలు, పరిమితరవాణా వ్యవస్థల కారణంగా పాలనా పరమైన సమస్యలు తలత్తే నేపథ్యంలో లోంచి ఈ అఖండ ఉపఖండం, రాజకీయంగా చిన్న చిన్న ముక్కలుగా విడిపోయి వందలాది సామంతరాజ్యాలుగా ఉనికిలోకి వచ్చింది.

పాశ్చాత్యంలో వెల్లువెత్తిన పారిశ్రామిక విప్లవం అపరిమితమైన అభివృద్ధి కాంక్ష, దురంహంకార జాతీయవాదం లాంటివి అపరిమిత రాజ్యం విస్తరణ వాంఛకు దారితీసి చిన్న పెద్ద భూభాగాలనేకాకుండా ఏకంగా ఖండాలనే ఆక్రమించుకునేలా చేసింది.

యూరప్ ఖండంలో ఆయా జాతులలో వ్యాపించిన ఈరాజ్య విస్తరణ కాంక్ష వలసవాదానికి దారితీసింది. ఈవలస వాదం ప్రాచ్యంలో అంతకుముందు కనపడని శాస్త్ర సాంకేతికప్రగతికి, నూత్న ప్రగతిశీల భావజాల వ్యాప్తికి దోహదపడింది.

అంటే రాజ్య విస్తరణకాంక్ష శాస్త్రసాంకేతిక, రంగాలేకాదు, సామాజిక మానవీయ శాస్త్రాల అభివృద్ధికి సాయపడింది. అంతేకాదు ఈ శాస్త్రాసాంకేతిక విజ్ఞానం సామాజిక మానవీయ శాస్త్రాల అభివృద్ధి భూగోళంమీద అన్ని ఖండాలకు వ్యాపించిందన్నమాట.

శాస్త్ర సాంకేతిక రంగాల ప్రగతి పరిశ్రమలు, మౌలిక సదుపాయాల కల్పన, ప్రసారమాధ్యమాల రూపాల్లో వలసవాదంవల్ల యూరపేతర ఖండాల్లో ఆవిష్కృతయ్యాయి. విజ్ఞానశాస్త్రాల సామాజిక మానవీయ శాస్త్రాల ప్రగతి క్షేత్ర స్థాయిలో ఫలవంతం కావటం అనేది వలసవాద ప్రయోజనాల కోసమే అయినప్పటికీ అవి స్థానిక జాతుల్ని చీకటిలోంచి వెలుగులోకి తీసుకురావటానికి పరోక్షంగా దోహదపడ్డాయి. వలస రాజ్యాలు స్థానికులను వాళ్ళ వనరులను ముడిసరుకుగా వాడుకుని సంపదను తరలించుకుపోవడం అంతిమ లక్ష్యం అయినప్పటికీ ఆక్రమిత భూభాగాల్లో పారిశ్రామికీకరణ, మౌలిక సదుపాయాల కల్పన, యంత్రాలను సమర్థంగా నడపడానికి స్థానిక సుశిక్షిత మానవవనరుల తయారీ లాంటి చర్యలు అనివార్యం అయ్యాయి. ఈ క్రమంలో స్థానిక సమాజాల్లో నూతన వర్గాలు వృత్తులు ఆవిష్కృతమయ్యాయి.

ఈ పారిశ్రామికీకరణ, నూతన సామాజిక వర్గాలు, వృత్తుల ఏర్పాటులో భాగంగా సమాజాల్లో వృత్తి నిపుణుల విద్యావంతులు ఉనికి లోకి వచ్చాయి. ఈ విజ్ఞానశాస్త్రాలు, సామాజిక, మానవీయ శాస్త్రాల అభివృద్ధి స్థానిక సంస్కృతి, నాగరికతలను ప్రభావితంచేశాయి.

విజ్ఞాన శాస్త్రాల అభివృద్ధివల్ల నూత్న వస్తుజాలం, సామాజిక మానవీయ శాస్త్రాల అభివృద్ధివల్ల నూత్నభావజాలం, పరభాషల అధ్యయనం ప్రసారమాధ్యమాలు, ముద్రణయంత్రాలు వల్ల భావజాల ప్రసారం దాని లావాదేవీలు వేగవంతమయ్యాయి.



Scanned with OKEN Scanner

సంపదను తరలించుకుపోవటానికి వలసరాజ్యాలు స్థానిక భూభాగాల్లో ఏర్పాటు చేసిన పారిశ్రామీకరణ, రవాణావ్యవస్థ, ప్రసారమాద్యమాలు, పాలనా విధానాలు స్థానికుల్లో ఏకత్వాన్ని జాతీయభావనను పెంచిపోషించడానికి ఉపకరించాయి. ఆమాటకొస్తే అవే భూమికగా నిలబడ్డాయి.

పాశ్చాత్య వస్తు జాలమేకాదు ఆ వస్తు జాలం ఆధారంగా అఖండభారతంనలుదిశల వ్యాపించిన పాశ్చాత్య భావజాలం, సమకాలీన ప్రంపచ స్థితిగతులు స్థానికులకు దిశానిర్దేశం చేశాయి. ఆటవికత నుండి ఆధునికత దాకా పాశ్చాత్య వస్తు జాలం, పాశ్చాత్యభావజాలాల పరోక్ష సేవ విస్మరించజాలనిది. ఒకవేళ పాశ్చాత్యులకు సామ్రాజ్యవాదం, దురంహకార జాతీయవాదం, అపరిమిత అభివృద్ధి, ఆక్రమణకాంక్ష లేకపోయినట్టయితే ప్రపంచం నైసర్గిక పరిమితుల్లోనే కునారిల్లిపాకలు ఉండేది. ప్రపంచంలోని వేనవేల సమాజాల విభిన్న సంస్కృతులు ఆటవికతలోనే మగ్గిపోయి ఉండేవి. బానిసబతుకుల్ని తరతరాలకు పంపిణీచేసే మందబుద్దులకు స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వ భావనలు పరిచయం అయ్యి ఉండేవికావు. ఆయా సంస్కృతుల ఆసరాగా ఆధిపత్యాన్ని యధేచ్ఛగా పారంపర్యంగా కొనసాగించే రాచరిక నియంతృత్వాలకు ప్రజాస్వామిక సంస్కరణలు తెలిసి ఉండేవికావు. విస్తరణ వాంఛే చుట్టుప్రక్కల వనరుల్ని కొల్లగొట్టే క్రమంలో సంక్లిష్ట దుర్భరనైసర్గిక పరిమితుల్ని అధిగమించి వాయు, జల, భూమార్గాల్లో రవాణా వ్యవస్థను నిర్మించి వస్తుజాలమే కాకభావజాలం కూడా ఎక్కడి నుండి ఎక్కడికైనా భూగోళం అన్ని అంచులు దాకా బట్వాడా అయ్యేలా చేసింది.

చీకటి తరువాత వెలుగు, చక్రభ్రమణ ఛందంగా పరిణామవికాసం కార్యకారణ సంబంధాన్ని అనుసరించిందిఈ ఆధిపత్యవర్గాల లాభాపేక్ష ప్రజాస్వామిక తత్వానికి లోబడి ప్రపంచీకరణగా రూపాంతరం చెందుతుంది. శాస్త్ర విజ్ఞానం వస్తుజాలం దాని ఆధారిత భౌతిక సదుపాయాలను సమకూర్చితే, వాటి నిర్వహణకు చౌకగా లభించే స్థానిక మానవవనరుల ఆవశ్యకత అనివార్యంకాబట్టి వాటిని సుశిక్షితులను చేసే క్రమంలో విద్య అవసరమైంది. అదికూడా పరాయి భాషా నైపుణ్యాల సముపార్జనకు దారితీసింది.పరభాష ఉద్యోగ ఉపాధి కల్పన అవసరమే కాకుండా అది ప్రతిష్టావసరం కూడా అయ్యింది. కాబట్టి అది వ్యామోహంగా మారింది. ఈ పరభాషల మీద మోజు పరాయి భాషలు అంటే విదేశీభాషల అధ్యయనాకికే కాకుండా వాటిలో ప్రచురించబడే భావజాలం కూడా వంటబట్టింది. ఇంతకుముందు కంటే సౌకర్యవంతమైన వస్తుజాలం, అంతకు ముందు కంటే మెరుగైన సామాజిక నిర్మాణ ఉపకరణాలు, జీవన విధానం సునాయాసంగా ఆకర్షించడం సర్వ సాధారణం.

ఈ నేపథ్యంలో నూత్న భాష, నూత్న భావజాలం నూత్న వస్తుజాలం, సరికొత్త సామాజీకరణ, అంతకు ముందు ఎన్నడూ లేని జాతీయ భావన, ఐక్యత, భిన్నత్వంలో ఏకత్వభావన, సమష్టిపోరాటతత్వం, ప్రజాస్వామిక పంథా, సామూహిక నిరసన, ఉమ్మడి వారసత్వ అనుభూతి స్వదేశీ, విదేశీ విచక్షణల స్థానిక జాతుల్లో పురివిప్పటం ప్రారంభించాయి.

విదేశీ శాస్త్రసాంకేతిక విజ్ఞానం దాని ఆవిష్కరణలతో పాటు విదేశీసామాజిక మానవీయశాస్త్రాల నుంచి అందిపుచ్చుకున్న భావజాలం, అభివ్యక్తి స్థానిక భాషల్లోకి చొచ్చుకునివచ్చాయి. ఈ క్రమంలో విదేశీ సామాజిక, మానవీయ శాస్త్ర అధ్యయనాల పర్యవసానంగా స్థానిక భాషలలో, స్థానిక అభివ్యక్తుల సమ్మిళితంగా సాహిత్యం జాతీయోద్యమ వాహికగా సృజించబడింది.

ఈ నూత్న బావజాలం పద్యగేయాల్లాంటి పాత అభివ్యక్తులలోనే కాకుండా నవల, వచన కవితలాంటి నూత్న అభివ్యక్తులలో వెలువడిన సాహిత్యం జాతీయోద్యమానికి ఊపిరిపోయటమేకాదు జవసత్వాలను ఇచ్చింది.

**ఆధార గ్రంథాలు :**

1) ఆధునిక సాహిత్య విమర్శసూత్రం – ఆచార్య కొలకలూరి ఇనాక్

2) భారతదేశ చరిత్ర సంస్కృతి – తెలుగు అకాడెమీ ప్రచురణలు



Scanned with OKEN Scanner

# మాతృభూమి నవలా జాతీయోద్యమం

**డా. వింధ్యవాసినీ దేవి,** తెలుగు అధ్యాపకురాలు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, క్లస్టర్ యూనివర్సిటీ, కర్నూలు
చరవాణి : 9440543860

ఆంగ్లంలో లాంబర్టు మాస్కరినస్ 1950 లో రచించిన Sorrowing Lies of My Land నవలను ప్రతాప రామసుబ్బయ్య గారు 1957లో తెలుగులో "మాతృభూమి" నవలగా అనువదించారు. నవల ఉపశీర్షిక 'గోవా ప్రజల జీవితాన్ని చిత్రించే నవల'గా ముద్రింపబడింది. ఇరవైయ్యవ శతాబ్ది తొలి దశాబ్దాలలో గోవా ప్రజల సామాజిక జీవితంతో పాటూ, గోవా జాతీయోద్యమాన్ని, రాజకీయ, ఆర్థిక, సాంస్కృతిక పరిస్థితులను ఈ నవల సమగ్రంగా చిత్రించింది. అంతేకాకుండా గోవాను ఆక్రమించుకొని దౌర్జన్యంగా పాలన సాగించిన పోర్చుగీసు పాలకుల ఆగడాలను,గోవా ప్రజల బలమైన స్వాతంత్ర్యకాంక్షను చిత్రించిన నవలిది. గోవాలో పుట్టిపెరిగిన లాంబర్టు మాస్కరినస్ పత్రికారచయితగా ఉద్యోగజీవితాన్ని ప్రారంభించిన తర్వాత గోవా ప్రజల స్వాతంత్ర్యకాంక్షను, పోర్చుగీసు పాలకుల పైశాచిన చర్యల గురించిసమాజానికి తెలియపరచడానికి పూనుకున్నాడు. స్వాతంత్రోద్యమకాలంలో గోవాలో చోటుచేసుకున్న పరిణామాలన్నింటిని యధార్థదృష్టితో ఈ నవల ద్వారా వ్యక్తీకరించాడు. గోవా స్వాతంత్రోద్యమ చరిత్రనుఈ నవల ప్రతిబింబించింది. "మాస్కరినస్ మొదటి నవల ఇదే అయినా, గోవా ప్రజల యధార్ధ స్థితిగతులను – వారి ఆచారవ్యవహారాలు, పోర్చుగీసు పైశాచికపాలన, ఈ పైశాచిక శక్తిని నిర్జించి ముందుకు పోతున్న స్వాతంత్ర్య ఉద్యమం–వీటిని చక్కగా చిత్రించాడు. సామాన్య ప్రజలలోనుండి పాత్రలనెన్నుకొని, వారి భిన్న మనస్తత్త్వాలను చక్కగా చిత్రించాడు" **(మాతృభూమి నవల –ప్రకాశకులు– ముందుమాట)**

గోవా రాష్ట్ర ఆధునిక చరిత్రను పరిశీలిస్తే 1498 లో నూతన సముద్రమార్గం ద్వారా భారతదేశానికి చేరిన పోర్చుగీసు వాళ్లు మొదట కేరళ రాష్ట్రం కోజికోడ్‌లో అడుగుపెట్టి అక్కడి నుండి గోవాకుచేరుకున్నారు. వ్యాపార నిమిత్తం వచ్చిన వాళ్లు నెమ్మదిగా స్థానిక రాజకీయాల్లో తలదూర్చి పాలనను హస్తగతం చేసుకున్నారు. బ్రిటీష్‌పాలకులు క్రమంగా భారతదేశాన్ని ఆక్రమించినప్పటికీ గోవా మాత్రం పోర్చుగీసుల పాలనలోనే ఉండిపోయింది. క్రమంగా గోవా ఇంక్విజిషన్ కింద చాలామంది ప్రజలు బలవంతంగా క్రైస్తవమతంలోకి మార్చబడ్డారు. పోర్చుగీసువారు స్థానికులను వివాహమాడటం ద్వారా గోవాలో స్థిరనివాసం ఏర్పరచుకొని స్థిరపడ్డారు. 1947లో భారతదేశం స్వతంత్ర్యదేశంగా అవతరించినప్పటికీగోవా మాత్రం పోర్చుగీసుల పాలనలోనే ఉండిపోయింది. గోవాను వదులుకొనడానికి పోర్చుగీసువారు సమ్మతించలేదు. 1961 డిసెంబరు12న భారతసైన్యం సైనికచర్య ద్వారా గోవాను ఆక్రమించింది. 1974వరకు కూడా పోర్చుగీసు ప్రభుత్వం గోవాను భారతదేశంలో భాగంగా అంగీకరించలేదు. 1987 మే 30న గోవాను ప్రత్యేకరాష్ట్రంగా ఏర్పరచారు. తద్వారా గోవా ప్రజల చిరకాలకోరిక ఫలించి భారతదేశంలో అంతర్భాగమైంది. ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు, త్యాగాల అనంతరమే గోవా భారతదేశంలో విలీనమైంది.

మాతృభూమి నవల గోవా ప్రజా జీవితాన్ని ప్రతిబింబిస్తూ రాయబడింది. ఇందులో భాగంగా ప్రజల దేశభక్తి, విదేశీ పాలకుల చేతుల్లో బందీ అయిన మాతృభూమి విముక్తి పట్ల గాఢమైన వాంఛ ఒకవైపు ప్రకటితమైతే, మరోవైపు పోర్చుగీసు పాలకుల పట్ల ఆరాధ్యభావాన్ని పెంచుకొని,వారిని దైవ సమానులుగా భావించే కొన్ని వర్గాల ప్రజల దృక్పథం వ్యక్తమైంది. ఆనాడు



Scanned with OKEN Scanner

ఇరువర్గీయుల మధ్య నెలకొన్న దృక్పథ వైరుధ్యాన్ని నవల సంపూర్ణంగా చిత్రించింది. పోర్చుగీసుల కుటిల రాజకీయాలనెండగడుతూ, గోవాలో నెలకొన్న సామాజిక, ఆర్థిక, రాజకీయ మత స్థితిగతులతో పాటూ భారతదేశంలో ప్రబలంగా కొనసాగుతున్న జాతీయోద్యమాన్ని సైతం రచయిత స్పష్టంగా వ్యక్తీకరించారు. మాతృభూమి నవలలో వ్యక్తమైన జాతీయోద్యమ భావాలను పరిశీలించడమే ఈ వ్యాస ఉద్దేశ్యం.

ఈ నవల ఉత్తమపురుషలో, రచయిత దృక్కోణంలో కొనసాగుతుంది.ప్రధాన పాత్ర టాబ్. టాబ్ కుటుంబ నేపథ్యంలో కథా, కథనం కొనసాగుతాయి.నవలలో కథకుడు టాబ్ కుమారుడు. టాబ్ పాత్ర ద్వారానే రచయిత గోవా ప్రజల దేశభక్తిని, జాతీయోద్యమాన్ని దర్శింపజేశారు.వారి కుటుంబంలో చోటుచేసుకున్న అనేకానేక సంఘటనల నేపథ్యంలో కథ ముందుకు సాగుతుంది.టాబ్ గోవాలో భూస్వామ్యవర్గానికి చెందిన దేశభక్తుడు. భూస్వామ్య వార్గానికి చెందినప్పటికీ, ఏ కోశానా భూస్వామ్య భావజాలం లేని వ్యక్తి. సామాన్యరైతుగానే జీవితం గడిపే దేశభక్తుడు.తన పిల్లలు సైతం దేశప్రేమను కలిగి ఉండాలనేది అతని అభిమతం. “నా మాదిరిగా నా పిల్లలందరూ కష్టించి పొలం పనులు చేసుకోవాలని మనస్సుంటే నేను మరీ సంతోషిస్తాను. పోర్చుగల్ పోయి నిరంకుశాధికార్లుగా తర్ఫీదై వచ్చే బదులు,వ్యవసాయం చేసి జీవిస్తూ, దేశానికింత సేవ చేయడమే నా అభిమతం. అసలు బ్రిటీష్ నిరంకుశాధికారం కిందఉద్యోగం చేయడమే ఘోరం. అంతకన్నా అతినీచమైన పోర్చుగీసు అధికారిగా నౌకరీ చేయడం మరింత ఘోరం. **(మాతృభూమి నవల-పుట: 67)** అనేది టాబ్ ఆలోచన.

దేశభక్తిభావాలను మెండుగా కలిగి ఉన్న టాబ్ పోర్చుగీసుల పాలనలో గత నాలుగు శతాబ్ధాలుగా మగ్గుతున్న గోవా స్వాతంత్ర్యం కోసం పరితపిస్తుంటాడు.పోర్చుగీసు పాలకులే గోవా అభివృద్ధికి కారకులని విశ్వసించే గోవాప్రజల అమాయకత్వాన్ని తీవ్రంగా ద్వేషిస్తాడు. వారి స్వామిభక్తిని, మూర్ఖపు ఆలోచనా విధానాన్ని నిస్సంకోచంగా వ్యతిరేకించే మనస్తత్వమతనిది.“పోర్చుగీసు సామ్రాజ్యవాదులు పెట్టే ఘోరావమానాలను సహించి,ఆత్మాభిమానం వదిలి బతుకుతున్నామని ఆయన ఆవేదన (పు: 184). ఏనాటికైనా గోవాకు పోర్చుగీసుల పీడ వదిలిపోవాలని, గోవా ప్రజలంతా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలతో విముక్త జీవితాలను గడపాలని తపిస్తుంటాడు. అయితే టాబ్ ఆశయాలకు అతని భార్య నుండే వ్యతిరేకత వ్యక్తమవుతుంది. మూఢ క్రైస్తవభక్తురాలైన ఆమె పోర్చుగీసుల వలనే గోవా ప్రజాజీవితం సుఖంగా ఉందని గుడ్డిగా నమ్ముతుంది.మతగురువులను, మతాచారాలను ప్రగాఢంగా ఆరాధిస్తూ కుటుంబమంతా ఆ విధంగానే ఉండాలని తపించే శుద్ధ అమాయకురాలు. ఆమెసమాజం చాలా చిన్నది. భర్త, పిల్లలే సర్వస్వంగా భావిస్తూ, వారి బాగుకోసం నిత్యం చర్చిలో ప్రార్థనలు చేస్తుంది. భర్త ఆలోచనలను చాదస్తపు మాటలుగాభావిస్తుంది. టాబ్‌కు అతని భార్యకు మధ్యన జరిగే చర్చలు, వాదోపవాదాల్లో ఒకనాటి గోవా ప్రజల స్వేచ్ఛాయుత జీవితాన్ని కళ్ళముందుంచుతాడు రచయిత. గోవాలో సరైన ఉపాధి అవకాశాలు లేక భారతదేశానికి వలసవచ్చే ఎంతోమంది ప్రజల దుస్థితికి పోర్చుగీసుల అసమర్థపాలనే కారణమనీ ప్రగాఢంగావిశ్వసిస్తాడు.“ఈ పోర్చుగీసు దుర్మార్గులు మన గోవాకేమాత్రమైనా మేలుచేసి ఉంటే మన బిడ్డలీనాడు దేశాలు పట్టి పోవలసిన దుర్గతి ఎందుకు పట్టేది ? (పుట:148) అని భార్యను ప్రశ్నించడంలో పోర్చుగీసు పాలన పట్ల టాబ్‌లో గూడుకట్టుకున్న అసహనం వ్యక్తమవుతుంది.“మన తాత ముత్తాతల కాలం నుంచీనాగరికతతో, సమస్త సంపదలతో తులతూగిన మనదేశాన్ని పోర్చుగీసు నరహంతకులు తక్షణం విడిచిపోవాలనీ, మన గోవా ప్రజలే మన యిష్టం వచ్చిన విధంగా మనదేశాన్ని పరిపాలించుకోవాలనీ (పుట:162) టాబ్ ప్రగాఢ ఆశయం.ఈ దిశగా గోవా పౌరులను చైతన్యవంతం చేయడానికి కృషి చేస్తుంటాడు.

‘ప్రపంచంలో పోర్చుగల్ గొప్పదేశమనీ, వాళ్ల సహాయమే లేకపోతే గోవా ప్రజలంతా ఆటవికులుగా బ్రతికేవాళ్ళని,వాళ్ళ బోధనలు లేకపోతే మతభ్రష్టులమయ్యేవారమని’ నమ్మే తన పిల్లలకుటాబ్ గోవా చారిత్రక వైభవాన్ని తెలుపుతూ వారిలో మాతృభూమి యెడల మమకారం కలిగించే ప్రయత్నాలు చేస్తాడు.ఒకనాడు గోవాను పరిపాలించిన అశోకున్ని గురించి, సముద్రతీరం వరకూ

విస్తరించిన అతని సామ్రాజ్యం గురించి ఏడు శతాబ్దాలు పరిపాలించిన కదంబుల్ని గురించి,వారి పాలనలో గోవా ప్రజలనుభవించిన వైభవాన్ని పిల్లలకు చెబుతూ, వారి మనసులలో జాతీయభావాలను పాదుకొల్పేందుకుయత్నిస్తుంటాడు. తండ్రి ఆశయాలను కొంత అర్థం చేసుకున్న పిల్లలు టాబ్ భావాలను గౌరవిస్తారు. గోవా ప్రజల మాతృభాష కొంకణి. కానీ పోర్చుగీసుల పాలనలో పోర్చుగీసు భాషనే అధికార భాషగా చలామణి అవుతుంది.పాఠశాలల్లో పోర్చుగీసునే బోధిస్తారు. అధికార వర్గామంతా పోర్చుగీసుల చరిత్రనే గోవాచరిత్రగా లిఖించే ప్రయత్నం చేస్తుంటారు. వీటన్నింటిని టాబ్ తీవ్రంగా వ్యతిరేకిస్తాడు. పోర్చుగీసుల యెడల ప్రభుభక్తిని చాటుకోవడానికి మెజార్టీ ప్రజలు సైతం పోర్చుగీసు భాషకే అగ్రతాంబూలమిస్తారు.గోవా భూస్వామ్యవర్గం సైతం పోర్చుగీసు పాలకుల అనుయాయులుగానే ప్రవర్తిస్తారు. సామ్రాజ్యవాదుల విభజించి-పాలించు సూత్రానికనుగుణంగా గోవా ప్రజల మధ్య పొడసూపిన భేదాభిప్రాయాలు, జాతీయభావాలు నశించడం, రాజకీయ చైతన్యం లేకుండా స్తబ్దుగా జీవిస్తూ, పోర్చుగీసు అధికారుల బానిసలుగా మారడం ఇవన్నీ టాబ్‌ను విపరీతంగా కలవరపరుస్తాయి. “ఈ దోపిడీగాండ్రు మన జాతీయచైతన్యాన్ని కుంగదీశారు.మనల్ని మచ్చిక చేసుకొని మనమీద సవారీ తీస్తున్నారు. మనకు ఆత్మాభిమానమే నశించిపోయింది.” (పుట:183), అని టాబ్ వాపోవడం ఆనాటి జన జీవనస్థితిని తెలుస్తుంది.

టాబ్ తన జీవితకాలమంతా గోవా స్వేచ్ఛా, స్వాతంత్ర్యాల కోసం యత్నిస్తూనే ఉంటాడు. ప్రజల్ని కూడగట్టి వారిని ఉద్యమోన్ముఖులను చేయడానికి , వారిలో పోరాట స్ఫూర్తిని రగిలించడానికి, వారిని స్వాతంత్ర్యోద్యమానికి సమాయత్తం చేయడానికి,బానిస బతుకుల నుండి విముక్తులను చేయడానికి ప్రయత్నిస్తుంటాడు. భారతదేశంలో జరిగే స్వాతంత్ర్యోద్యమ పోరాటాలు టాబ్‌లో నూతనోత్తేజం కలిగిస్తుంటాయి. ఏదో ఒకరోజు గోవాలోనూ ఉద్యమాలు మొదలవుతాయనీ, పోర్చుగీసుల పాలనకు ప్రజలు చరమగీతం పాడుతారని ఆశిస్తాడు.

పోర్చుగల్ దేశంలో చోటుచేసుకుంటున్న పరిణామాలకనుగుణంగా గోవాలో ప్రజాజీవితం మార్పులకు గురౌతుంది.రాజరిక పాలనలో, రిపబ్లిక్ ప్రభుత్వంలో, నియంతృత్వ పాలకుల పాలనలో పోర్చుగల్ పాలించబడుతున్నప్పుడు తదనుగుణంగా గోవాలో సైతం మార్పులు చేర్పులూ జరుగుతుంటాయి.1926లో పోర్చుగల్‌లో సైనిక విప్లవం తలెత్తి రిపబ్లిక్ ప్రభుత్వమంతరించి, నియంతృత్వ ప్రభుత్వమేర్పడినప్పుడు గోవాలో పరిస్థితులు మారిపోతాయి.రిపబ్లిక్ ప్రభుత్వంలో అనుభవించిన కొద్దిపాటి హక్కులు హరించబడే చట్టాన్ని పోర్చుగల్ ప్రభుత్వం ఆమోదించడంతో గోవా ప్రజలు తీవ్ర వ్యతిరేకతను వ్యక్తపరుస్తారు.ఈ చట్టం ప్రకారం ‘గోవాలో రెండు తరగతుల ప్రజలు సృష్టించబడ్డారు. హక్కుదారుడు అతనికి లోబడి ఉండే బానిసలూ, ఈ బానిసల్లో మళ్ళ రెండు తరగతులు సృష్టించబడ్డాయి.పోర్చుగీసు భాష నేర్చుకొని, పోర్చుగీసు నాగరికతను,సాంప్రదాయాలను అలవర్చుకొని ఆ జాతిలో మిళితమై ఇమిడిపోయేవాళ్ళంతా ఒక తరగతి. పోర్చుగీసు భాష తెలియని గోవా ప్రజలంతా మరొక తరగతి.దీంతో తెల్లజాతికి చెందిన పోర్చుగీసు వాళ్ళంతా వాళ్ళ జాత్యహంకారాన్ని, ఆధిక్యతనూ ప్రకటించుకోవడం మొదలు పెట్టారు. గోవా ప్రజల్ని తమతో సమానంగా పరిగణించడం ఆనాటి నుండి మానేసారు. ఈ విషయాన్ని అర్థం చేసుకున్న ప్రజలు తమ ఆత్మగౌరవానికి, జాతీయాభిమానానికి ప్రమాదం వాటిల్లిందని గుర్తిస్తారు’. క్రమంగా ప్రజల్లో జాతీయాభిమానం పొడసూపడం ప్రారంభమవుతుంది. అంతవరకూ లేని కొత్త చైతన్యమేదో ప్రజల ఆలోచనలకు తోడవుతుంది. ఈ పరిస్థితులలో ముందుండి ఉద్యమాన్ని నడిపే నాయకుడు లేక పోవడం టాబ్‌ను కలవరపరుస్తుంది.

గోవా ప్రజల పక్షాన పోర్చుగీసు పార్లమెంటులో ఇద్దరు ప్రతినిధులను ఎన్నుకోవడానికి ఎన్నికలు ప్రకటించినప్పుడు ప్రభుత్వ అభ్యర్థిని కాకుండా స్వతంత్ర్య అభ్యర్థిని గెలిపించడానికి టాబ్ ఎంతో శ్రమిస్తాడు. కానీ పోర్చుగీసు తొత్తులుగా మారిన కిందిస్థాయి అధికారుల ద్రోహం వలన స్వతంత్ర్య అభ్యర్థి గెలవలేకపోతాడు. కానీ ప్రజల్లో చైతన్యం వెల్లివియడానికి, వారిలో జాతీయ భావాలు పెంపొందింపజేయడంలో టాబ్ సఫలీకృతుడవుతాడు. అయితే భారతదేశంలో కొనసాగుతున్న

సత్యాగ్రహోద్యమాలుగోవాలో పనిచేయవనీ,విప్లవపోరాట మార్గమే సరైనదన్న నిర్ణయాన్ని వ్యక్తం చేస్తారు గ్రామీణ రైతాంగమంతా." తుపాకులివ్వండి బాబు ! ఈ పోర్చుగీసు తెల్లపందుల్నీ,వాళ్ళ తొత్తుల్నీ యేరి యేరి యెలా కాల్చి పారేస్తామో! (పుట:311) ప్రజల్లో వచ్చిన మార్పు, వాళ్ళ ఆలోచనలు టాబ్ కు ఎంతో ప్రేరణనందిస్తాయి. ఏనాటికైనా గోవా స్వేచ్ఛాస్వాతంత్ర్యాలను పొందగలదన్న నమ్మకం కలుగుతుంది. రెండవ ప్రపంచయుద్ధం కారణంగా గోవా ప్రజల జీవితాలు అస్తవ్యస్తమై అల్లకల్లోలానికి గురైనా పట్టించుకోని ప్రభుత్వ అధికారుల పట్ల ప్రజల్లో ఆగ్రహావేశాలు పెల్లుబుకుతాయి.

"నేను రాజకీయవేత్తను గాను, గోవా పరిస్థితులు యెంత దారుణంగా ఉన్నా, నా వంటివాడికెంత ఆవేదన కలిగించినా,నేను నా డాక్టరు వృత్తికట్టిపెట్టుకొని ఉండవలసినవాడినే.దానికి భిన్నం రాకూడదు.రాదు, నిజమే! ఆత్మాభిమానం కలిగిన ఏ పౌరుడూ నేటి పరిస్థితుల్ని హర్షించి ఊరుకోలేడు. మన జాతీయ గౌరవాభిమానాల యెడల పోర్చుగీసు పాలకులు అమానుషంగా ప్రవర్తించినా,దానిగ్గూడ నేనంతగా లక్ష్యం చేయను.కాని ఈ ఘోరాన్ని మాత్రం సహించలేం! ప్రజల్ని ఆకలిబాధకు గురిచేసి, ప్రాణాలతో చెలగాటమాడే పోర్చుగీసు రాక్షసత్వాన్ని ప్రత్యక్షంగా చూస్తున్న నాబోటి వాడిక్కూడా పిచ్చెత్తి పోతున్నది.తినడానికి ధాన్యం లేదంటున్నారు.బ్లాక్‌మార్కెట్లో చూడండి !ఎంత పుష్కలంగా ఉందో ధాన్యం! ఇతర జీవితావసర వస్తువులు గూడా బ్లాక్ మార్కెట్లో యెక్కడి తొక్కిడిగా ఉన్నాయి.వ్యాపారస్తులు, అధికార్లూ లాలూచీ అయి ప్రజల రక్తమాంసాలు పీల్చుకొని తింటున్నారు.పందులనైనా పాపం దలచవచ్చుగాని యీ రాక్షసమూకను మాత్రం క్షమించలేం. ఈ ఘోర పరిస్థితిని చూస్తుంటే,నాకు శివమెక్కిపోతున్నది" (పుట:352) ఈ మాటలు పోర్చుగీసుల దురహంకార చేష్టలకు దర్పణం పడుతున్నాయి. భవిష్యత్తులో గోవాలో తలెత్తబోయే ఉద్యమాన్ని సూచిస్తున్నాయి.

భారతజాతీయ కాంగ్రెస్ నేతృత్వంలో తలెత్తిన క్విట్ ఇండియా ఉద్యమం గోవా ప్రజలపైన పెను ప్రభావాన్ని చూపింది. భారత ప్రజల వీరోచిత కార్యక్రమాలు టాబ్‌లో కొత్త ఆశలు చిగిరించడానికి కారణమవుతాయి. భారత సోదరుల అండదండలతో త్వరలోనే పోర్చుగీసు పాలనను తుదముట్టించగలమన్న ఆకాంక్ష మొదలవుతుంది."దేశవ్యాపితంగా చెలరేగుతున్న జాతీయ విప్లవోద్యమం మా ప్రజల్లో నవచైతన్యం కలిగించడం ప్రారంభించింది. ముఖ్యంగా గోవాలో ఉన్న హిందువులు కాంగ్రేసు కొనసాగిస్తున్న ప్రజాపోరాటాన్ని చూసి మరింత ఉత్తేజం పొందుతున్నారు. బ్రిటీష్ పాలనలో భారతదేశంలో అంతరించబోతున్నట్లే, గోవాలో పోర్చుగీసు నియంతృత్వం గూడా నశించగలదని ఆశిస్తున్నారు" (పుట:366) అయితే భారతీయులు ప్రదర్శించే ధైర్యసాహసాలు గోవా ప్రజల్లో లేకపోవడమన్నది టాబ్‌ను కలవరపరిచే విషయం. భారతీయులు కనబరిచే అసమానధైర్య సాహస పరాక్రమాలు గోవా ప్రజలెందుకు ప్రదర్శించలేకపోతున్నారు? ఎందుకు నిర్లిప్తంగా ఉన్నారు? ఎందుకు ముందుకు రావడంలేదన్న టాబ్ ఆలోచనలకు స్వస్తి పలుకుతూ గోవాలోనూ ఉద్యమ వాతావరణం ఊపందుకుంటుంది. ఇందుకు భారతదేశంలో సాగుతున్న జాతీయోద్యమం ప్రేరణగా నిలుస్తుంది.

"భారతదేశం నుండి వినవస్తున్న సింహగర్జనలు మా ప్రజల చెవుల్లో గింగురుమంటున్నాయి.మా ప్రజలు ఆత్మపరిశోధనకు పూనుకున్నారు.తమ పిరికితనానికి, కర్తవ్యతా మూఢతకూ కారణం కనుక్కున్నారు.నాలుగు శతాబ్దాల పోర్చుగీసు నిరంకుశ పాలన, బానిస జీవితమూ తమ నైచ్యస్థితికీ, తమ బలహీనతకూ కారణమని గ్రహించారు." (పుట;369) కొద్ది మంది అధికారమదంతో, దురహంకారంతో, దురాశతో అధిక సంఖ్యాక ప్రజల్ని పీడించడం ఎంత వరకు సబబన్న ఆలోచనను కలగజేస్తాడు టాబ్. ఈ దోపిడీని ఎదిరించాలని పిలుపునిస్తాడు.

భారతదేశ ప్రజలు చేసిన వీరోచిత పోరాటాలతో అలుపెరుగని ఉద్యమాల దాటికి నిలవని బ్రిటన్ ప్రభుత్వం భారతదేశానికి స్వాతంత్ర్యం ప్రకటించడానికి సమాయత్తమైన వార్త గోవా ప్రజలకు ఆనందాన్ని కలిగిస్తుంది. తొందరలోనే గోవాలోను ఉద్యమాలు



Scanned with OKEN Scanner

తీవ్రస్థాయి దాల్చి పోర్చుగీసుల నిష్క్రమణం జరగాలని భావిస్తాడు. పటిష్ట నాయకత్వం ఏర్పడాలని ఆశిస్తాడు టాబ్. 1942 క్విట్ ఉద్యమ నాయకుల్లో ఒకరైన డాక్టర్ రామమనోహర్ లోహియ భారతదేశం నుండి గోవాకు వచ్చి,ప్రజల్ని చైతన్యవంతుల్నిచేయడానికి ప్రయత్నిస్తాడు. టాబ్ ఆ సభలో ఉత్సాహంగా పాల్గని జైహింద్ నినాదమిచ్చినందుకు పోర్చుగీసు పోలీసులచేత తీవ్రంగా దండనకు గురౌతాడు. బలవంతంగా లోహియాను పోలీసులు అరెస్టు చేసినప్పుడు గోవా ప్రజలలో ఆవేశం పెల్లుబుకుతుంది. "నిరాశా, నిస్సహాయతలతో, కర్తవ్యతామూడులై ఉన్నమా ప్రజల్ని ఉత్సాహపరిచి కార్యరంగంలోకి దూకేటట్లు చేయడానికి ప్రయత్నించాడు లోహియా" (పుట:410) జైహింద్ నివాదం గోవా ప్రజల తారకమంత్రమైంది. ఆందోళనలు, ఉద్యమాలు, తిరుగుబాట్లతో గోవా ప్రజలు ఎన్నడూ లేని నూత్న చైతన్యాన్ని సంతరించుకొని కదనరంగంలో పోరుకు సిద్ధపడాతారు. మార్గోలో వెలిగిన స్వాతంత్ర్యజ్యోతి క్రమంగా గోవా అంతటా విస్తరించింది. ప్రజల చైతన్యం టాబ్ ను పరవశింపజేసింది. ఎన్ని ఎదురుదెబ్బలు తగిలినా, ఎంతగా అణచివేయబడినా నానాటికీ టాబ్‌లో తీవ్రమవుతున్న స్వాతంత్ర్య కాంక్షకొక రూపం ఏర్పడింది. ప్రభుత్వమెంత అణచివేస్తున్నా ప్రజలు మాత్రం తీవ్రమైన స్వాతంత్ర్యోద్యమకాంక్ష ఊరేగింపులూ, సభలూ, సమావేశాలు, జాతీయ పతాకావిష్కరణతో వ్యక్తమవుతూనేఉంది. పోర్చుగీసుల అధికారుల మోసాలను అనతికాలంలోనే గ్రహించిన గోవన్లు జాతీయోద్యమాన్ని తీవ్రతరం చేస్తారు. జాతీయోద్యమం కొనసాగుతూనే ఉంటుంది. టాబ్ కలలు గన్న స్వేచ్ఛాజీవితాలకై పోరాటం సాగిస్తూనే ఉంటారు గోవన్లు. టాబ్ జీవిత చరమాంకం వరకూ గోవా స్వేచ్ఛకోసం పోరాటం చేస్తూనే ఉంటాడు. చివరకు గోవా స్వాతంత్ర్యాన్ని చూడకుండానే మరణిస్తాడు. జీవిత పర్యంతం స్వేచ్ఛ కోసం పోరాడిన నిష్కలంక దేశభక్తుడుగా చరిత్రలో నిలిచిపోతాడు. తన జాతి సమైక్యతను గుండె నిండా కాంక్షించిన టాబ్ ఎందరో నాటి స్వాతంత్ర్య సమరయోధుల ప్రతిబింబంలా గోచరిస్తాడు.

**ఆధారగ్రంథాలు :**

1. మాతృభూమి నవల

2. Sorrowing Lies of My Land

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# తెలుగు మొలక సాహితీ రుద్రమ - ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ

**డా. కమ్ముల రవి గంగాధర శేషుకుమార్,** తెలుగు అధ్యాపకులు,
ఎస్.ఆర్.ఆర్ & సి.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, విజయవాడ

భారత స్వాతంత్ర్యోద్యమంలో చురుకైన పాత్ర పోషించి, పదునైన సాహిత్యాన్ని సృష్టించిన వీర మహిళల్లో ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ గారు ఒకరు. ఆ రోజుల్లో ఆంగ్లేయుల దోపిడీ విధానాలనూ, అరాచక పాలనను వ్యతిరేకిస్తూ, స్వాతంత్ర్యం కోసం ఆంధ్ర ప్రాంతంలో జరిగిన పలు ఉద్యమాల్లో పాల్గొనడమే కాకుండా, దేశ భక్తితో కూడిన పలు రచనలను చేసి, సంఘ సంస్కరణకు పాటుపడిన 'విద్యత్కవయిత్రి' గా ఆమె స్థానం చిరస్మణీయం. స్త్రీ విద్య మహిళాభ్యుదయం కోసం తన జీవితాన్ని అంకితం చేసిన తెలుగు మొలక. ఆధునిక యుగంలో కూడా గజారోహణం, స్వర్ణ కంకణంతో పాటు కనకాభిషేకం పొందిన ఆంధ్ర విదుషీకుమారి. ఆమె తన రచనలలో తన పేరును 'లక్ష్మీకాన్తమ్మ' గా పేర్కొనడం విశేషం. 'ఆంధ్ర కవయిత్రులు', 'అఖిల భారత కవయిత్రులు' వంటి పరిశోధనాత్మక గ్రంధాలతో పాటు 'ఆంధ్రుల సంగీత వాఙ్మయం పైన కూడా విశేష అధ్యయనం చేసిన తొలి తరం మహిళా పరిశోధకురాలిగా 'లక్ష్మీ కాంతమ్మ' గారి స్థానం ప్రత్యేకమైనది. లక్ష్మీ కాంతమ్మ జీవితం ఆద్యంతం నేటి తరం మహిళలకు ఆదర్శప్రాయం.

ఆంధ్ర ప్రాంతంలో తన రచనల ద్వారా తెలుగు వారిలో దేశభక్తినీ, సామాజిక స్పృహను పెంపొందింపజేసిన తొలితరం రచయిత్రుల్లో ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గారు 'మధురకవి' గా పేరొందిన శ్రీ నాళం కృష్ణారావుగారి కుమార్తె. సాంఘిక, సాహిత్య రంగాలలో తండ్రి బాటలోనే నడిచి, బహుముఖ ప్రజ్ఞాశాలిగా తండ్రికి దగ్గ తనయురాలిగా మన్నలు పొందిన మహిళామూర్తి. 1917 లో పశ్చిమగోదావరి జిల్లా ఏలూరులో జన్మించి, రాజమండ్రిలో విద్యాభ్యాసం సాగించి 'ఉభయ భాషా ప్రవీణ' కావడంతో పాటు 'వీణావాదన' లోనూ, త్యాగరాయకృతుల గానంలోనూ ప్రావీణ్యం సంపాదించిన 'దేవీ ఉపాసకురాలు'. 13వ సంవత్సరంలోనే 'హయగ్రీవ గుప్త' తో వివాహమైనప్పటికీ, ఇంటికే పరిమితం కాకుండా మదరాసు రాష్ట్రంలోని తెలుగు ప్రజలందరికీ చిరస్మరణీయురాలిగా నిలిచిపోయేంతగా విశేష ప్రతిభను కనబరిచారు.

ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ గారు పదేళ్ళ ప్రాయం నుంచే తండ్రి నాళం కృష్ణారావు గారి పాండిత్య ప్రకర్షణను పుణికి పుచ్చుకుని వెలు సభల్లో ఉపన్యాసకురాలిగా వ్యవహరించారు. విద్యార్థినీ దశలోనే స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారు. స్వాతంత్ర్యోద్యమ సభలలో వందల కొద్దీ ప్రసంగాలు చేశారు. అబలగా కాదు సబలలాగా సాధికారతను సాధించుకోవాలంటే 'స్త్రీ విద్య' ఎంతో అవసరమని చాటి చెప్పారు. 'కృష్ణకుమారి' పేరుతో 'భారతి' పత్రికలో రచనలు చేయడం ఆరంభించారు. తల్లి 'నాళం సుశీలమ్మ' కూడా 'ఆంధ్ర మహిళా గాన సభ' ను స్థాపించిన సంఘ సేవకురాలు కావడం విశేషం. 'జాతిపిత', 'నా తెలుగు మాంచాల', 'భారతదేశచరిత్ర – కొన్ని గుణపాఠాలు', 'చీకటి రాజ్యం', 'నా విదేశీ పర్యటనానుభవాలు', 'లజ్జ కిరీటధారిణి', 'సాహితీ రుద్రమ' అనే ఆత్మకథ, 'అమృతవర్షిణి', 'మహిళా విక్రమసూక్తము' వంటి రచనలన్నీ ఆ రోజుల్లో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తినీ, దీప్తినీ, తద్వారా దేశభక్తినీ పెంపొందింపజేసేవే. 'ఆంధ్ర మహిళ', ప్రబుద్ధాంధ్ర, భారతి, గృహలక్ష్మి, కృష్ణా పత్రిక, నవోదయ మొదలగు పత్రికల్లో ప్రచురింపబడిన వ్యాసాలూ, గేయాలు, రచనలూ, కవితలూ కోకొల్లలు. 'కన్యకా పరమేశ్వరి స్తవం', 'దేవీ స్తవతారావళి'



Scanned with OKEN Scanner

లక్ష్మీ కాంతమ్మ గారి సంస్కృత రచనలు. 1953లో గృహలక్ష్మి – స్వర్ణ కంకణంతో పాటు అనంతపురంలో లలిత కళాపరిషత్తు ద్వారా 1988లో 'కనకాభిషేకం', 'గజారోహణము' వంటి అరుదైన ఘనసన్మానాలను పొందడం ఆమె ఘనతకు తార్కాణం.

ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ గారు సాహితీ, సామాజిక సేవలకు ప్రతిగా 'విద్యత్కవయిత్రి', 'ఆంధ్ర సరస్వతి' వంటి పురస్కారాలతో పాటు తెలుగు మొలక, కవయిత్రి తిలక, ఆంధ్ర విదుషీకుమారి, కళాప్రపూర్ణ, దేవులపల్లి రామనాధరావు గారిచే సాహితీ రుద్రమ మొదలగు బిరుదులను పొందారు. భారత స్వాతంత్ర్యానంతరం ఆంధ్ర రచయిత్రుల సలహా సంఘ అధ్యక్షురాలిగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ, కేంద్ర సాహిత్య అకాడమీలో 'సభ్యురాలి' గా సేవలందించారు. 1965 లో హైదరాబాదులో అఖిల భారత రచయిత్రుల సమ్మేళనాన్ని నిర్వహించారు. ఆంధ్రా యూనివర్శిటీ సెనేట్‌మెంబరుగా, విశ్వహిందూ పరిషత్‌లోను, ఆంధ్రప్రదేశ్ ఆర్య వైశ్య మహాసభ, రాజమండ్రి గౌతమీ గ్రంధాలయం, బాపట్లలోని 'హితైషిణీ మండలి' మొదలగు సంస్థలలో సేవలందించారు. లక్ష్మీ కాంతమ్మ గారు 'ఆంధ్ర కవయిత్రులు' గ్రంథం చాలా సమగ్రమైన పరిశోధనా గ్రంథం స్వాతంత్ర్యానంతరం రచింపబడినది. శ్రీ కృష్ణదేవరాయల వారి కుమార్తె 'మోహనాంగి – కవయిత్రి మొల్ల' ల ప్రస్తావనా ఈ గ్రంథంలో సుస్పష్టంగా పేర్కొనబడింది. ఆరుద్ర గారి 'సమగ్రాంధ్ర సాహిత్యం' గ్రంథం రచనా సమయంలో లక్ష్మీ కాంతమ్మ గారి 'ఆంధ్ర కవయిత్రులు' కూడా ఉపకరించిందని ఆరుద్ర గారు పేర్కొనడం గమనార్హం. శ్రీ కృష్ణదేవరాయల వారికి 'మోహనాంగి' అనే కుమార్తె గలదనీ, 'మరీచి పరిణయం' అనే గ్రంధాన్ని రాసిందన్న పరిశోధక సమాచారాన్ని సుమారు ఆరు పేజీలలో ప్రసావించడం లక్ష్మీ కాంతం గారి పరిశోధనా పతిమకు నిదర్శనం.

స్వాతంత్ర్యోద్యమంలో చక్కని దీక్షాదక్షతలు గల కార్యకర్తగా, నాయకురాలిగా ఎదురు నిలిచి పోరాడిన చతురత, చరిత్ర కలిగిన ధీరవనిత ఊటుకూరి లక్ష్మీ కాంతమ్మ గారు. 'మనం మస్తిష్కం గల మాన్యమూర్తులం. ఈ మాన్య ధరిత్రీ మాత ప్రసవించిన మహా పవిత్రమూర్తులం' వంటి దేశభక్తి వాక్యాలు లక్ష్మీ కాంతమ్మ గారి రచనల్లో చాలానే కన్పిస్తాయి. కేవలం రచనల్లో వాక్యాలకే పరిమితం కాకుండా, త్రికరణశుద్ధిగా గట్టి సంకల్ప బలంతో ఆరచణాత్మకంగా స్త్రీజనోదర్ధరణ, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలలో పోరాటలలో క్రియాశీలంగా పాల్గొని, ఆ కాలంలోని ఎందరో మహిళా మణులకు మణిదీపంలా వెలుగిచ్చి తెలుగు మహిళా లోకానికి మార్గదర్శిగా నిలిచిన ఊటుకూరి లక్ష్మీకాంతమ్మ గారి దేశభక్తి, సేవాతత్పరత తెలుగు వారికే కాదు సమస్త భారతీయులందరికీ స్ఫూర్తిదాయకం.



Scanned with OKEN Scanner

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# చారిత్రిక కావ్యాలు - జాతీయోద్యమ ప్రతిఫలాలు

**డా. కవాడపు లలిత,** తెలుగు అధ్యాపకులు, సెయింట్ జోసెఫ్ డిగ్రీ కళాశాల, సుంకెసుల రోడ్డు, కర్నూలు
చరవాణి : 9959806205, ఇ-మెయిల్ : lalitha.k2014@gmail.com

చరిత్ర జరిగిపోయిన ఒక మహాయుద్ధాన్ని గురించో, శిథిలమైన కట్టడాలను గురించో, గత వైభవానికి చిహ్నంగా మిగిలిన నగరాలను గురించో లేక నాటి ఆర్థిక,రాజకీయ విషయాలను గురించో తేదీలతో సహా చెపుతుంది. నేటి దేశ పరిస్థితులలో భారతీయుడైన ప్రతివ్యక్తీ తన జాతి చరిత్రను గురించి తెలుసుకోవాలి. ఆ చరిత్ర నేర్పిన పాఠాలను వర్తమానానికి అన్వయించుకొని భవిష్యత్తుకు బాటలు వేసుకొవాలి. ప్రపంచంలోని దేశాలలోకెల్లా ఒక విలక్షణమైన సాంస్కృతిక ఔన్నత్యం మన దేశానికి ఉన్నదని అవగతం చేసుకోవాలి. ఆ విధమైన అవగాహన కలిగినప్పుడు యుగయుగాలుగా ఎటువంటి ఒడిదుడుకులనైనా ఎదురొడ్డి నిలిచిన భారతీయ సంస్కృతిని పరిరక్షించుకోవాలనే తపన, పట్టుదల కలుగుతాయి. అందువల్లనే చరిత్రను అధ్యయనం చేయాలి.

పాశ్చాత్య సంస్కృతీ ప్రభంజనంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న నేటి తరం ఈ విషయాన్ని ఆర్థం చేసుకోవటం జాత శ్రేయస్సు దృష్ట్యా అత్యంతావశ్యకం.

**రాణాప్రతాప సింహ చరిత్రము**

"రాణాప్రతాప సింహ చరిత్రమును" రచించిన కవి శ్రీ దుర్భాక రాజశేఖర శతావధాని గారు. గడియారం వెంకటశేష శాస్త్రి గారితో కలిసి అనేక శాతావధానాలు చేసి సన్మానాలు పొందారు. ఈ కవి ఉభయ సాహిత్యవేత్త కడప జిల్లా జమలమడుగులో జన్మించారు. భారత జాతీయతకు జీవగట్టు అయిన స్వాతంత్ర్యానికి సంబందించిన చారిత్రక ప్రభోదం ప్రయోజనంగా కలిగిన "రాణాప్రతాపసింహ చరిత్ర" ఉత్తమ చారిత్రక కావ్యాలలో అగ్రశ్రేణికి చెందినది. "ఇది ఒక అస్వతంత్ర జాతికి స్మృతి గ్రంధము" అని విశ్వానాధ ఈ కావ్యాని గురించి వ్యాఖ్యానించారు. పరులకు తల వంచని స్వాతంత్ర్య దీక్ష మూర్తిబవించిన రాణాప్రతాపుని వీరచరితాన్ని తెలుగులో పద్య కావ్యంగా రచించి స్వాతంత్ర్య ప్రేరణను కలిగించిన కవి రాజశేఖర శాతావధానివారి సాహితిసేవ మహోన్నతమైనది.

కన్నతల్లిని ప్రేమించినట్లే ప్రతి వ్యక్తీ కన్న నేలను ప్రేమించాలి. మాతృఋణాన్ని తీర్చుకోలేకపోతే బాధపడినట్లే మాతృదేశ ఋణాన్ని తీర్చుకోనందుకు బాధపడాలి. తాను పుట్టి పెరిగిన ప్రదేశం. తన వాళ్లు, తన నేలలోని చెట్టు, చేమలు,పర్వతాలు, నదులు మొదలైన వాటి మీద మనసున్న ఏ మనిషికయినా మమకారం ఉంటుంది,ఉండాలి. మేవాడ్‌కు దూరమవుతున్నాననే బాధతో ప్రతాపుడిలా అంటాడు.

సీ. **"పసితనమ్మున లేడివలె లాఘవమ్మున నద్రులకెగంబ్రాకి నట్టిచోట్లు**

**పట్టాభిషేక సంపద్విభూషితుండనై..........**

తే.గీ. **కట్టబట్టయుందినంగూడ గానకున్న**

**నచలభక్తినిన్..................** (పం.శ్వా. 130వ పద్యం)

చరిత్రలో ఎంతోమంది దేశభక్తులు తమ ధన, మాన, ప్రాణాలను దేశమాత సేవకు అర్పించి పునీతులైనవారున్నారు. స్వార్థంతో, ద్వేషంతో తమ నాశనంపాటు భరతమాత దాస్యానికి కారకులైనవారూ ఉన్నారు.

మాతృదేశానికి చేసిన ద్రోహం తన వినాశనానికి కారణమవుతుందనే విషయాన్ని నిరూపిస్తున్నదీ సంఘటన, ఒకప్పుడు సకల సౌభాగ్యాలతో కళకళలాడిన మాతృభూమి శత్రువుల దౌష్ట్యానికి నాశనమైనప్పుడు దేశభక్తుడెవడైనా బాధపడకుండా ఉండలేదు. తనను చూడవచ్చిన అనుచురులతో ప్రతాపుడు అన్న మాటలు కోల్పోయిన మేవాడు వైభవాన్ని తెలియచేస్తాయి.

తే.గీ. **గనుదెఅచి కావురని కూయంగాందెలియని**

**శిశువులాదిగ జగదేక......................**

తే.గీ. **అచతుశ్శాల లాభవ నాంగనమ్ము!**

**లాజయ స్తంభతతులు!................** (ద్వి.శ్వా. 104,105 పద్యములు)

రేయింబవళ్ళు మేవాడు స్వాతంత్ర్యానికి పరితపించిన భక్తుడు ప్రతాపుడు.

సీ. **తనదు కండలును ర క్తము క్రుమ్మరించి మేవాణ్మాత వీరసౌభాగ్యలక్ష్మీ**

**యొక వేయియేండ్లుగా నోర్చి.......................................**

తే.గీ. **నమ్మహామాత గతి తలంపైనయప్పుడొడలు పరవశమై రక్త ముడుకు లెత్తుం!**

**గడుపుచుమ్మలుచుట్టు!.........** (ద్వి.శ్వా. 107,108 పద్యాలు)

తన జాతి గౌరవంతో పాటు ఆత్మగౌరవాన్ని కూడా కోల్పోయిన రాజపుత్ర వీరులను తలచి.

"ధీరుండెవడధీరుండేవండు! వీరనృపులె సిగ్గుచెడి తగ్గుకూటి కాసించినపుడు" అనుకుంటాడు. తన జాతికి,తన నేలకి హాని చేసినవారితో, కించపరిచిన వారితో బాంధవ్యాన్ని నెరిపే వారిని తలచి సిగ్గు పడతాడు. కన్నతల్లికి, మాతృభూమికి బేధం లేదని భావించిన ప్రతాపుడు ఉత్తమ జాతీయ భావ సంపన్నుడు.

స్వాతంత్ర్య దీక్షితుడైన ఒక మహాత్ముని సత్యసంకల్పం తోటివారిలో చైతన్యాన్ని, ఉత్తేజాన్ని కలిగిస్తుంది. సలుంబ్రాధీశుడు, భీమచాంద్, శ్యామసింహుడు, తేజసింహుడు మొదలైన వీరులు అటువంటివారు. సలుంబ్రాధీశుడు ప్రతాపునితో.

తే. **నాదు భటులు దుర్గములు ధనంబు రాజ్య**

**రమయు సర్పింతు మఱియు.............** (ద్వి.శ్వా. 124 పద్యం)

స్వాతంత్ర్యాన్ని సాధించేవరకు తమ జీవితాలను వీరవ్రతంగా గడపాలని అతడు భావించాడు.తన అనుచరులనూ శాసించాడు.

తే.గీ. **రాజ్యలక్ష్మి సేవాలక్ష్మీ రైవ్యలక్ష్మి**

**లంచములు చూపి...........** ( 2-172)



Scanned with OKEN Scanner

ప్రతాపుడు హల్దీఘాటు యుద్ధ సమయంలో సైన్యాధిపతులను యుద్ధానికి పురికొల్పుతూ అన్నమాటలు జాతీయ భావస్ఫోరకాలై ఉన్నాయి. హారావళీ పర్వతసీమ, మేవాడ్, కోనలు,లోయలు, నదులు, పనులు అన్నీ నమవని, ప్రాణమున్నంతవరకు ఈ భూమిని విదేశీయులను అక్రమించనీయవద్దని అన్నాడు. పూర్వులు ఎన్నో యుద్ధాలు చేసి వారి రక్తాలతో ఈ భూమిని తడిపారని స్వాతంత్ర్యేచ్ఛతో యుద్ధం చేసి చిరకీర్తిని పొందుమని అన్నాడు.

ఇరవై సంవత్సరాలు యుద్ధం చేసినా మేవాడ్ స్వాతంత్ర్యాన్ని సాధించలేక పోయినందుకు ప్రతాపుడు అన్న మాటలు అకళంకమైన అతని దేశభక్తికి అద్దం పడుతున్నాయి.

సీ. **హారావళీశైల మనుపమస్వాతంత్ర్య వీరదుందుభులశబ్దించుంగాక**

**గుట్టలు పుట్టలు గుహలు...............................**

తే.గీ. **భానుకుల గౌరవంబు నిల్పంగ నోడి**

**త్యాగమునంగుంటువడి.............** (ప.శ్వా. 134వ పద్యం)

అంటూ మాతృభూమికి నమస్కరించి చారెడు మట్టి తీసి కళ్ళకద్దుకొని రుమాలులో కట్టుకుంటాడు.ప్రతాపుని వ్యక్తిత్వం సమున్నతమైనది. తన అనుచరులకు యుద్ధం చేయటానికి అనుమతిస్తూ ఆత్మవంచన లేకుండా యుద్ధం చేసి స్వాతంత్ర్యాన్ని పొందవచ్చని, ఆత్మబలం ముందు పశుబలం నిలువలేదని అంటాడు. యుద్ధ సమయంలో రాజులు సైనికులను ఉత్సాహపరచటం కద్దు. కాని ప్రతాపుడు ఉత్సాహపరిచే విధానం విలక్షణమైనది. భీరువైనవాడు ఎవరైనా ఉంటే ఆ క్షణమే యుద్ధభూమి నుండి తొలగిపోవచ్చునన్నాడు. సమున్నత పర్వత శ్రేణిలో నన్నెవరు చూస్తారని అనుకోవద్దని, కర్మసాక్షి నిరంతరం గమనిస్తూ ఉంటాడని, శౌర్యాన్ని కోల్పోయి జాతిని దాస్యశృంఖలాలలో మగ్గిపోయేటట్లు చేయవద్దని అర్థించాడు.

**శ్రీ సీతారామ రాజీయము**

శ్రీ మల్లెల గురవయ్య రచించిన 12 అధ్యాయాల పద్యకావ్యం శ్రీ సీతారామ రాజీయము. ఈ కావ్యం 1997 లో ముద్రిత మయింది. రవి అస్తమించని బ్రిటిషు సామ్రాజ్యాన్ని గడగడలాడించిన విప్లవవీరుడు, అల్లూరి సీతారామరాజు, ఈ మహావీరుడు రాణాప్రతాపసింహుడు, శివాజీ మొదలైనవారి కోవకు చెందినవాడు, కొండజాతి ప్రజలను విప్లవవీరులుగా తీర్చిదిద్ది దాదాపు రెండు సంవత్సరాలు తెల్లవారికి సింహస్వప్నమై పోరాటం జరిపినాడు.

సీతారామరాజు అనునచరులతో 1922 ఆగస్టు 15న శరభన్నపాలెంలో సమావేశమయ్యాడు.ప్రభుత్వాన్ని ఎదిరించటానికి అవసరవైన ఆయుధ సామగ్రిని సమకూర్చుకోవటం ప్రథమ కర్తవ్యంగా భావించి 1922 ఆగస్టు 22న చింతపల్లి పోలీస్ స్టేషన్ పై దాడిచేసాడు. అనుచరులకు సత్యం, అహింస, బ్రహ్మచర్యం కలిగి ఉండాలని బోధించాడు. మద్యనిషేధం, ఖద్దరు ధారణ రామరాజు ఏర్పరచిన నియమాలు. దైవభక్తి, ఆత్మ& విశ్వాసం, శౌర్య, ధైర్యాలు, నియమనిష్ఠలు – వీటన్నిటిలో సీతారామరాజుకు రాణాప్రతాపునికి ఎన్నో సామ్యాలు కనుపిస్తాయి.1922లో ప్రారంభమైన విప్లవం 1924 వరుకు సాగింది. రామరాజు అచూకీ చెప్పమని ఆంగ్లేయులు గిరిజనులను హింసించేవారు. ఏ ప్రజలను ఉద్ధరించటానికి తాను ఉద్యమం నడిపాడో ఆ ప్రజలే నరకయాతనలకు గురి అవటాన్ని రామరాజు సహించలేకపోయాడు. అటవీశాఖ అధికారి బాస్టియన్ లేనిపోని నేరాలు మోపి రామరాజును గురించి బ్రిటిషువారికి వ్యతిరేక భావాన్ని కలిగించాడు.రూథర్‌ఫర్డ్ అనే క్రూరుడు ఏజెన్సీ కమీషనర్‌గా వచ్చి గిరిజనులను హింసిస్తుంటే చూడలేక 1924 మే 7న తనకు తానే ఆంగ్లేయులకు



Scanned with OKEN Scanner

లొంగిపోయాడు. రూథర్ ఫర్డ్ కిరాతకంగా సీతారామరాజును కాల్చి చంపాడు. భౌతికంగా సీతారామరాజు మరణించినా నైతికంగా, ఆధ్యాత్మికంగా ఆ మహావిప్లవ జ్యోతి మన హృదయాల్లో వెలుగుతూనే ఉంటుంది.

ఈ కాలంలోని సాంస్కృతిక మూల్యాలు తెలుగుతనంతోపాటు భారతీయతను మేళవించుకొని ఉన్నాయి. సీతారామరాజు తల్లి అతనికి ఉత్తమక్షాత్ర ధర్మాన్ని ఉగ్గుపాలలో రంగరించి పోసింది. తండ్రి కుమారుడు శ్రీరాముని వలె దుర్మార్గులను అంతమొందించాలని స్వాతంత్ర్యేచ్ఛను నూరిపోసాడు.

**స్వాతంత్ర్య పథమె భారత**

**మాత కఠిన దాస్యముక్తి...........** (ద్వితీయ పరిచ్ఛేదం – 11వ పద్యం)

తల్లిదండ్రులు అన్నిటికీ రామచంద్రుడే ఆశ్రయమని, అతని మార్గమే హితమని నమ్మేవారు. 'యాదృశీభావనా తాదృశీ సిద్ధి' అన్నట్లు రామరాజు వారికి తగినపుత్రుడు.

రామరాజు ఆధ్యాత్మిక జాతీయతా భావాలు కటిగినవాడు. ఆంగ్ల విద్యావిధానం అనతికి నచ్చలేదు అందుకే.

**ఆత్మవిద్యగాని అకలంకమైనట్టి**

**దేశ విద్యగాని...............** (తృతీయ పరిచ్ఛేదం – 77వ పద్యం)

సీతారామరాజు సత్యధర్మవిషుడు, ఆధ్యాత్మిక భావసంపన్నుడు, దయార్ద్ర హృదయుడు.తెలుగు తేజానికి నిదర్శనం. అందుకే కవి ఆ వీరుని గురించి చెపుతూ

**దైవభక్తికి తోడుగా భావమందు**

**దేశభక్తియు నెలకొన్న.........** (పంచమ పరిచ్ఛేదం – 69వ పద్యం)

ఈ విధంగా స్వాతంత్ర్య సిద్ధిని, అత్మగౌరవాన్ని చాటిచెప్పిన కావ్యం.

**అంధ్రపురాణం**

ఈ విధంగా తెలుగు స్వాతంత్ర్య సిద్ధిని, ఆత్మగౌరవాన్ని చాటిచెప్పేకావ్యం సీతారామ రాజీయం.

అంధ్రపురాణ కర్త మధునాపంతుల సత్యనారాయణ శాస్త్రి గారు ఐలెండ్ పోలవరంలో జన్మించారు. కవి ఇరవై ఏళ్ళు వచ్చేసరికి చక్కని పద్య గద్య రచన చేశారు. వీరి తొలి గురువు తండ్రి గారే. లచ్చమ్మ, సత్యనారాయణమూర్తి వీరి తల్లిదండ్రులు. ఆంధ్రపురాణం ఆంధ్రుల చరిత్రను మహా కావ్యంగా కవి తీర్చిదిద్దారు. ఈ గ్రంధానికి ఆంధ్ర సాహిత్య అకాడమి పురాస్కారం లభించింది. ఈ కవి రచనలలో అడుగడుగున ఆంధ్రాభిమానం దేశభక్తి, భారత జాతీయత, ధర్మానురక్తి, స్వతంత్రత దర్శనం ఇస్తుంటాయి.కవి ఒక్కొక్క పర్వంలో ఆంధ్రజాతి అభిమానాన్ని ప్రకాశింపజేశారు.

కాకతీయ పర్వాన్ని ఆంధ్రదేశాభిమానంగ తీర్చిదిద్దారు. రుద్రమదేవి మహాదేవరాజు రాయబారిగ పంపిన విప్రుని కంటికి.

"కోటి మన్మదమూర్తుల కూటమందు గనికరముతొాచి మూడవ కన్ను ..మహాదేవరాజు తెంపరితనానికి కినిసిన రుద్రమాంబ"

"కానీ యానరాకసురుండు తన సంగ్రామ.... గరున నర్తింపన్ క్షమామూర్తినై" (కాకతీయపర్వం – 88వ పద్యం)

పై పద్యాన్ని బట్టి రుద్రమదేవి కనబరిచిన యుద్ధ, ధర్మ, దయ వీరాలు కనిపిస్తాయి.



Scanned with OKEN Scanner

రాజులు ప్రజలపట్ల అనురక్తులై ఉండాలి. కాని ప్రభువు ఒక తాటి మీద ప్రజలను నడపడానికి ధర్మమార్గంలో నడిపించడానికి కొంత కఠినత్వం అవసరం.

"భిన్న రుచికమగుచు...రాచతీకపు బదను వలయు" (శ్రీకృష్ణదేవారయ పర్వం - 22వ పద్యం)

ఆంధ్రపురాణం తెలుగుజాతీ ఆత్మాభిమాననికి,ధర్మానికి సౌర్య పరాక్రమాలు, సంస్కృతి సాంప్రదాయలు మనోహరంగా దర్శనం ఇస్తాయి. 1922 సంవత్సరంలో శాస్త్రి గారు మరణించిన వారు రచించిన ఆంధ్రపురాణం ఆంధ్రాభిమానాన్ని నిత్యం చైతన్యం చేస్తునెవుంటుంది.

**శివభారతం**

శ్రీ గడియారం వెంకటశేష శాస్త్రి గారు చారిత్రక కావ్య శిరోమణి శ్రీ శివభారత కావ్యమును భారతదేశ ప్రజలకు జాతీయోద్యమ కావ్యాన్ని అందించారు.

గురువైన దాదోజి శివాజిని తన స్నేహితులతో కలిసి ప్రజల యోగక్షేమాలు విచారించమని పల్లెలు పట్టణాలకు పంపాడు. ధర్మ రక్షణార్థం శివాజి మవాళ వీరులకు తగిన శిక్షణ ఇచ్చాడు. పర్వత ప్రాంతంలో ఉన్న మవాళ వీరుల స్థితి గతులకు శివాజి చలించిపోయాడు. దాదోజి ఈ విషయం తెలుసుకొని తానోకందుకు పంపితే శివాజి వేరొక విధంగా కార్యసాధకుడై -నందుకు చింతించాడు. వెంటనే దాదోజి శివాజిని తిరిగిరమ్మని కబురు పంపెను. గురువాజ్ఞతో శివాజి తిరిగి వచ్చాడు. దాదోజి మందలించి హితవు చెప్పాడు. కాని శివాజి ఇలా వినయంగా తాను భోగ భాగ్యాలను కోరడంలేదని ఇతరుల అభివృద్ధిని చూసి బాధపడటంలేదని కూటికి గుడ్డకు లేని పేదలకు,నశించె మతాన్ని చూసి ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాని అన్నాడు.

**శా. నేనేకా, దొక దేశబంధు వెడున్ నే దైన రేపైన ని**
**ట్లే నిర్ధాదణ సేయ గావలయు నిట్లే పోరు సాగించి దీ.....** (2-294)

ఎంత కాలమని వారికి భయపడి అణిగిమణిగి ఉండి మన ప్రజలు బ్రతుకవలెను. దేశ భక్తుదేవరైనా తన లాగనే చేస్తాడన్నాడు. ఆత్మగౌరవాన్ని కోల్పోయి జీవించుట తనకు ఇష్టంలేదని స్వాధర్మ రక్షణ కోసం పరితపిస్తున్నానని శివాజి తన దృఢనిశ్చయాన్ని దాదోజికి వెళ్ళడించాడు.

**తే. అనెడు యువరాజు దృఢనిశ్చయంబు దెలిసి**
**ప్రాత పలుకుల మరలించపరామి దలంచి,....** (2-304)

పతి మానవుడు దేశప్రజలకోసం సత్కార్యాలు చెయాలనుకున్నపుడు దృఢ నిశ్చయంతో ఉండవలెను ఇది శివాజిలో చిన్న వయసులోనే కనిపించింది. ఇదే తర్వాతి కాలంలో స్వరాజ్య స్థాపనకు దృఢపరిచింది.

**ఆధార గ్రంథాలు:**

1. రాణాప్రతాప సింహ చరిత్ర - శ్రీ దుర్భాక రాజశేఖర శతావధాని
2. శ్రీ సీతారామ రాజీయము - శ్రీ మల్లెల గురవయ్య
3. ఆంధ్రపురాణము - శ్రీ మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి
4. శ్రీ శివభారతము - శ్రీ గడియారం వేంకటశేషశాస్త్రి



Scanned with OKEN Scanner

# జాతీయోద్యమ కథాసాహిత్యం - పరిశీలన

**డా. రాచపూడి జయ సుశీల,** తెలుగు అధ్యాపకులు, కె.వి.ఆర్.ప్రభుత్వ మహిళా కళాశాల, కర్నూలు
చరవాణి : 9959587946, Email : rachapudijaya1973@gmail.com

ఆధునికాంధ్ర సాహిత్యంలో జాతీయోద్యమానికి విశిష్టమైన స్థానముంది. సాహిత్యములో సామాజిక చైతన్యం ప్రతిఫలిస్తుంది. ఉద్యమాల వల్ల సమాజం పరిణామశీలమై మారుతూ ఉంటుంది. పరాయి పాలనలోని భారతదేశాన్ని స్వతంత్ర దేశంగా చేసి స్వదేశీయుల పాలనలో ఉంచడమే జాతీయోద్యమ ముఖ్యోద్దేశంగా కనిపిస్తుంది. భారతదేశం బ్రిటిష్ పాలనలో ఉన్నప్పుడు అనేకమైన రాజకీయ సామాజిక మార్పులకు లోనైంది. ఇది స్వదేశీల్లో విదేశీ పాలనపై ఆదరణ తగ్గి పోరాట పటిమను పెంపొందించింది జాతీయవాదులు దేశభక్తితో జాతీయభావాన్ని తమ రచనల ద్వారా అభివ్యక్తం చేయటం ఉంది.

తెలుగు సాహిత్యంలోనూ జాతీయోద్యమానికి సంబంధించిన కొన్ని కథలు కనిపిస్తాయి. వీటిలో ఈ క్రింది అంశాలు స్పష్టంగా కనిపిస్తాయి.

1. సహాయ నిరాకరణ
2. సత్యాగ్రహం
3. విదేశీ వస్తు బహిష్కరణం
4. నూలు వడకడం, ఖద్దరు కట్టడం
5. విద్యావిధానములో భారతీయ సంస్కృతి ప్రధానంగా బోధించడం
6. హరిజనోద్ధరణం
7. సర్వమత సమన్వయం
8. స్త్రీ జనాభ్యుదయం
9. నిరక్షరాస్యతా నిర్మూలనం
10. మద్యపాన నిషేధం
11. వయోజన విద్య
12. జైళ్లకు వెళ్ళడం ... మొదలైనవి

తెలుగు కథలపైన జాతీయోద్యమ ప్రభావం ఉంది. గురజాడ రచించిన "మీ పేరేమిటి" కథలో మత సమన్వయ ప్రస్తావనతో పాటు జాతీయోద్యమం కూడా కనిపిస్తుంది. రాయసం వెంకట శివుడు రచించిన "పార్వతియనుతాపం" అనే కథలో పార్వతి విజయనగరం సమీపంలో ఉండే ఒక దివాన్ గారి కూతురు. కొండవీటికి చెందిన విశ్వనాథం ఆమె భర్త. వీరు ఇరువురు ఒకరినొకరు అపార్థం చేసుకుని విడిపోగా, పార్వతి స్వచ్ఛంద సేవికగా కాంగ్రెస్‌లో చేరుతుంది. విశ్వనాథం శాంతినికేతనంలో రవీంద్రనాథ్ ఠాగూర్ దగ్గర ఉంటాడు. కాకినాడలో జరిగిన దేశీయ మహాసభ విశేషాలతోపాటు జాతీయోద్యమ సమకాలీన పరిస్థితులు కూడా ఇందులో కనిపిస్తాయి.



Scanned with OKEN Scanner

1935లో బుర్రా వెంకట సుబ్రహ్మణ్యం "జ్యోతిష్యం" అనే కథ రాశారు. ఒక బెంగాల్ యువకుడు ఆంగ్లాధికారిని చంపిన విషయం ఇందులోని కథా వస్తువు. తీవ్రవాదుల గమ్యం కూడా స్వరాజ్యసాధనమే కాబట్టి మార్గం వేరైనా జాతీయోద్యమంలో భాగంగానే ఇది ఉంది. 1940లో ముద్దుకృష్ణ రచించిన "నా మంత్రి" అనే కథ నూటికి నూరుపాళ్ళు జాతీయోద్యమాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ కథలోని దాసు అంటే ఊర్లో వారందరికీ అభిమానం, గౌరవం. గాంధీ గారి సహాయ నిరాకరణోద్యమం ప్రారంభమైనప్పటి నుండి దాసు గాంధీ దాసుడయ్యాడు కాంగ్రెస్ వాళ్ళంతా వనభోజనాలు చేస్తుంటే దాసు జాతీయ పతాకాన్ని పట్టుకొని నిలబడతాడు. అప్పుడు పోలీసులు వచ్చి లాఠీ చార్జీ చేస్తారు. దాసు మాత్రం ఉన్నచోట నుండి కదలడు. చివరికి జైలు శిక్ష పడుతుంది. జైల్లో అందరికీ దాసు తలలో నాలుకలా ఉంటాడు. కాలక్రమంలో దాసుకు జైలులో చాలా సన్నిహితుడుగా ఉండే నాయకుడికి మంత్రి పదవి వస్తుంది. అయితే మారిన అతని వైఖరిని దాసు నిరసిస్తాడు. ఇందులో జాతీయోద్యమ కాలంలో ఉండే పరస్పర సహకారం, అభిమానం స్వాతంత్రం వచ్చాక పదవులే పరిమితమైన ప్రజాపాలకుల స్థితిని స్వచ్ఛంద కార్యకర్త ఆవేదనను వ్యక్తం చేస్తుంది.

చలం రచించిన "అప్పుడు – ఇప్పుడు" అనే కథలో ఒక సంపన్నమైన కుటుంబం జాతీయోద్యమ ప్రభావం వల్ల ఎలా ఛిద్రమైందో తెలుస్తుంది. దేశానికి స్వాతంత్రం సంపాదించడానికి ప్రజలు ఎన్ని త్యాగాలు చేశారో అవగతమవుతుంది.

రాయసం వెంకట శివుడు "నీలవేణి"అనే కథ రాశాడు ఇందులో నీళ్లు వాడలో నీలవేణి అనే యువతి సముద్రం ఒడ్డున ప్రసాదరావు అనే జాతీయవాది అరెస్టు అయిన సన్నివేశం చూస్తుంది. తను గాంధీ సిద్ధాంతాలని, సత్యాగ్రహ విషయాలను, కల్లు తాగవద్దని, అందరికీ విద్య ఉండాలని చెబుతూ నినాదాలు చేస్తుంటాడు. నీలవేణి అతని ప్రేమిస్తుంది. మద్రాస్ జైలులో ప్రసాదరావు ఉన్నప్పుడు అతని కార్యకలాపాలను కొనసాగిస్తుంది. చివరికిద్దరూ పెళ్లి చేసుకుంటారు. ఈ కథలో జాతీయ ఉద్యమానికి అంకితమైన పాత్రల విషయాలు తెలుస్తాయి. "బారిష్టర్ కేత రాజు కథ" లో స్త్రీ విద్యావశ్యకత, కుటుంబ సమస్యల పరిష్కారం,జాతీయ సేవాభావం వంటి అంశాలు కనిపిస్తాయి. శ్రీపాద వారి "ఇలాంటి తవ్వాయి" వస్తే కథలో జాతీయోద్యమ కాలం నాటి మతం మార్పిడి విషయం వ్యక్తమవుతుంది. ఈ కథలో హిందువులు, క్రైస్తవులు, ముస్లింలు అనే వారి మనస్తత్వం తెలుస్తుంది. మనిషి కన్నా రాజకీయమని మనిషి మిన్న అనే భావం కూడా ఏర్పడుతుంది.

మల్లాది రామకృష్ణ శాస్త్రి "కైంకర్యం" అనే కథలో వెంకటస్వామి అసలైన కాంగ్రెస్ వాది. ఖద్దరు తప్ప మరొకటి కట్టడు. పొద్దున్నే కొట్టు తెరవడంతోటే మహాత్ముడి బొమ్మకు హారతి ఇస్తాడు. ఇలాంటి వాడిని ఉన్నట్లుండి పోలీసులు అరెస్టు చేసి కేసు పెడతారు. తాగే దినుసు నొకటిని తయారు చేసినట్లు వెంకటస్వామి ఒప్పుకుంటాడు. అందరి ఎదుట కోర్టు వారు ఒక మనిషి చేత ఆ పానీయం తాగిస్తే,అది చాలా బాగుందని చెప్పి హాయిగా నిద్రపోతాడు. అది మాదక ద్రవ్యమని అధికారులు నిర్ధారణకు వస్తారు. నేరాన్ని ధ్రువ పరుస్తూ శిక్ష విధించే సమయంలో వెంకటస్వామి ఒక రహస్యం వెల్లడిస్తాడు. మద్యపాన నిషేధం వల్ల నిషాకు అలవాటు పడ్డ మనిషికి సుభిక్షం జరుగదు. మత్తుకు మత్తు బలానికి బలం ఇచ్చే పానీయం ఒకటి, తరవాణి తయారు చేసి గోప్యంగా బుడ్ల కెక్కించాడు. ఇది జాతీయోద్యమ కాలానికి చెందింది. ఈ కథలోని ఖద్దరు ధరించడం గాంధీ మద్యపాన నిషేధం ఇవన్నీ జాతి ఉద్యమం అంశాలే.

జి.వి. కృష్ణారావు రచించిన "అనిర్వచనీయ ఖ్యాతి" కథలో జాతీయోద్యమంలో పాల్గొన్న యువతి తన కుటుంబం నుంచి ఎలాంటి కష్టాలు ఎదుర్కొందో తెలుస్తుంది. ఉషా రెండు సంవత్సరాలు జైలులో కఠిన శిక్షను అనుభవిస్తుంది. గాంధీ మహాత్ముని స్వాతంత్ర్య సందేశం ఆలకించినందుకు తను జైలు నుండి విడుదలయ్యే రోజున భర్తో, బంధువులో వస్తారనుకుంటుంది. ఆమె ఆశ నిరాశ అవుతుంది. ఆమె ఇంటికి పోతే ఎవ్వరూ పలకరించరు, సరికదా ఆమె ఎప్పుడో చచ్చిపోయిందని తండ్రి తద్దినాలు పెడుతున్నాడట. ఇంట్లో వాళ్ళు గెంటేస్తే మొరాయిస్తుంది. ఆమెను అమానుషంగా కొట్టి చంపడానికి కూడా బంధువులు వెనుకాడరు.



Scanned with OKEN Scanner

ఈ కథలో నాయకురాలిగా, ఉద్యమకర్తగా, స్త్రీ ఎదగడాన్ని ఆ కాలంనాటి మధ్యతరగతి సమాజం ఆమోదించ లేదనే విషయం తెలుస్తుంది.

బందాం కనక లింగేశ్వరరావు రచించిన "గుక్కెడు నీళ్లు" కథలు హరిజనోద్ధరణం, జాతీయోద్యమ ప్రభావం స్పష్టంగా కనిపిస్తాయి. వెంకటప్ప అనే అతను హరిజన తలారి. ఆ ఊరి కరణం బ్రహ్మయ్య అతని ఇల్లాలు మహాలక్ష్మి.ఒకానొక సందర్భంలో మాహాలక్ష్మి నీళ్లు తీసుకుని రాగా వెంకటప్ప పక్కకు తొలగిపోలేదని కోపంతో "మాయా స్వరాజ్యం వచ్చింది అందరినీ చెడగొడుతూ ఉంది "అని గట్టిగా అంటూ జరిగిన విషయాన్ని భర్త చెప్పి వెంకటప్పను పిలిపించి కొట్టిస్తుంది. కలరా సోకి కరణం బ్రహ్మయ్య చనిపోతే బంధువులు ఎవరు శవాన్ని మోయడానికి రారు. మహాలక్ష్మి వెంకటప్పను పిలిపించి ప్రాధేయ పడగా బ్రహ్మయ్య కు దహన సంస్కారాలు చేస్తాడు. దానితో అతనికి కలరా సోకగా కు వైద్యం చేయిస్తుంది. వెంకటప్పను కొడుకుగా భావించి తన ఆస్తిని రాసి ఇచ్చి ఆ ఊర్లో స్కూలు, ఆసుపత్రిని కట్టించడానికి సగమాస్తిని వినియోగించాలంటూకోరుతుంది. మహాలక్ష్మి అంటరాని వారు కూడా చదువుకోవాలని పలుకుతూ దాహం అంటుంది వెంకటప్ప నీళ్లు పోస్తే అవి సేవిస్తూ ఆమె మరణిస్తుంది. ఇందులో కొంత ధర్మ కర్తృత్వం కనిపిస్తుంది.

అడవి బాపి రాజు "ద్వేషం" అనే కథలో జాతీయోద్యమ ఛాయలు లోతుగా కనిపిస్తాయి. అహింసా మహాయజ్ఞం ప్రారంభించిన రోజుల్లో విశ్వేశ్వరుడు పదేళ్ల బాలుడు. అతని హృదయం ఆంగ్లజాతి ద్వేషంతో నిండిపోయింది. 1930లో బి. ఏ పూర్తి చేశాడు. మహాత్ముని ఉప్పు సత్యాగ్రహం ప్రారంభించగానే ఇతను కదనరంగంలోకి దూకాడు.ఒక వర్తకపు దొర మీద చేసిన హత్యా ప్రయత్నంతో అతనికి 20 సంవత్సరాల ద్వీపాంతర వాస శిక్ష పడుతుంది. అతను అండమాన్ ద్వీపాలలో చాలా జైళ్లు చూశాడు. అతని హృదయంలో శ్వేత జాతి మీద ద్వేషం ఎక్కువగానే ఉంది. ఒకసారి ఆంగ్ల స్త్రీలు బొంబాయి రేవులో దిగుతారు.వారు గాంధీని భారత దేశంలో శిల్పాలను, ప్రకృతిని దర్శించాలని వస్తారు. వారిలో మేరీ టెంపిక్ ఇరవై ఏళ్ల సుందరి. రామప్ప గుడిలో బొమ్మలు గీస్తున్న విశ్వేశ్వరుడు మేరీను చూసి ఈసడించు కుంటాడు.కానీ వారు అతనూహించిన తెల్లవారి కన్నా భిన్నంగా ప్రవర్తిస్తారు. సంస్కార హృదయం కలవారిని చూసి విశ్వేశ్వరుడు మనసు మరలించు కుంటాడు. మేరీ మీద మరలుగొన్నాడు. ఆమెకు అతనిపై ప్రేమ భావన కలుగుతుంది. రచయిత విశ్వేశ్వరరావు పాత్ర ద్వారా జాతీయోద్యమ ప్రభావాన్ని చూపించారు.

**రాజకీయోద్యమ కథా సాహిత్యం :**

జాతీయోద్యమ కాలంలోను రాజకీయ ప్రభావానికిలోనైన కథలు కొన్ని కనిపిస్తాయి. సమాజ స్వరూపంలో రాజకీయ వ్యవస్థ కూడా ఒక అంతర్భాగం కాబట్టి సమకాలీన సాహిత్యంలో దాని ప్రభావం ప్రతిబింబిస్తుంటుంది. మొదట ప్రపంచ యుద్ధం తర్వాత వచ్చిన తెలుగు కథల్లో రాజకీయ ప్రభావ చిత్రణ మొదలవుతుంది. రెండవ ప్రపంచ యుద్ధం తరువాత అదే అభివృద్ధి పొందింది. దేశం స్వాతంత్ర్యాన్ని పొందిన తర్వాత విస్పష్టమైంది. స్వాతంత్ర్య అభిమానానికి తోడు భాషాభిమానం కూడా కనిపిస్తాయి.

శ్రీపాద సుబ్రమణ్య శాస్త్రి "ఏ- క్ష - ద- లంగరందరు" కథలో కలకత్తాలో జరిగిన జాతీయ కాంగ్రెస్ మహాసభల ఆవరణం, ఇతర విశేషాలు మూలంగా ఉన్నాయి. చింతా దీక్షితులు "సూరీ- సీత- వెంకీ"పాత్రలతో కొన్ని జాతీయోద్యమ రాజకీయోద్యమ కథలు రాశారు. కప్పగంతుల సత్యనారాయణ " సత్యాగ్రహం" అనే పేరుతో కథ రాశారు. త్రిపురనేని గోపీచంద్ తనదైన రీతిలో "దేశం ఏమైయ్యేట్టు" ,"పీడిత హృదయం" "పిరికివాడు" అనే కథలను చక్కని రాజకీయ స్పృహతో రచించాడు. 1948 ప్రాంతాల్లో తెలంగాణా రైతాంగం జరిపిన తిరుగుబాటు ఫలితంగా కమ్యూనిస్టులకు వారి అనుయాయులకు ఎదురైన పరిస్థితుల్ని గంగినేని వెంకటేశ్వరరావు "ఎర్రజెండాలు" కథ రచించారు.

జాతీయోద్యమ ప్రభావంతో అభ్యుదయ భావాలు కలిగిన కథలను పెద్దబొట్ల సుబ్బరామయ్య రచించారు. మీరు రచించిన "కళ్ళజోడు", "ముసలమ్మ మరణం", "అలజడి" వంటి కథల్లో కనిపిస్తాయి. ఈ కథల్లోని తీరుని చూస్తే స్వాతంత్రం వచ్చిందా?



Scanned with OKEN Scanner

ఎవ్వరికి వచ్చింది పాల్గొన్న వారి పరిస్థితి ఎలా ఉంది ? "కళ్ళజోడు" కథలో విప్లవ భావాలు కలిగిన ఒక వ్యక్తి జాతీయోద్యమంలో గాంధీ పిలుపుతో ఉద్యమంలో పాల్గొని మరణిస్తాడు. ఇతని భార్య మారెమ్మ భర్త ఆస్తిపాస్తులను దానం చేసి మరణించిన తర్వాత మారెమ్మ దిక్కులేనిదైంది. చివరికి తిండి లేక, కళ్ళు కనపడక, అద్దాలు లేక లోకాన్ని చూడలేకపోయింది. చివరికి కొడుకు అవధాని కళ్ళజోడిపిస్తే లోకాన్ని చూసి ఆశ్చర్యపోతుంది. రచయిత జాతీయోద్యమ కార్యకర్తలకు తిండి లేని పరిస్థితుల్లో ప్రభుత్వం ప్రశంసా పత్రాలు ఇస్తే ఏమి లాభమని నిలదీసే తీరు ఉంది. ఈ దేశాన్ని స్వార్థపరులు భోంచేస్తున్నారని రాజకీయ ఆలోచనతో తెల్పడముంది.

రాజకీయ ప్రభావంతోనే సమకాలీన సామాజిక స్వరూపాన్ని కొన్ని కథల్లో చిత్రించడముంది. అల్లం రాజయ్య రాసిన "మధ్యవర్తులు కథ", తిలక్ రచించిన "ఆశాకిరణం", చలం "సుశీలకథ", శ్రీపాద సుబ్రమణ్యశాస్త్రి "ఇల్లు పట్టిన వెధవాడపడుచు, అరికాళ్ళ కింద మంటలు, తల్లి ప్రాణం "మొదలైనవి జాతీయోద్యమ భావంతో పాటు రాజకీయ ప్రభావాన్ని తెలుపుతాయి అభ్యుదయ భావాలు గల కొడవటిగంటి కుటుంబరావు నువ్వులు– తెలగపిండి కథ రాజకీయపరమైన ఆర్థిక ఆలోచనలు కలిగిస్తుంది.

గోపీచంద్ రాసిన "మమకారం" రైతుకు భూమికి మమకారం, సింగమనేని నారాయణ రచించిన" అడుసు, జూదం" కథలు కాళీపట్నం రామారావు రాసిన "యజ్ఞం" కథ రాజకీయ ఆర్థిక పరిస్థితిని వ్యక్తం చేస్తాయి. 1952లో సార్వత్రిక ఎన్నికలు జరిగాయి. ఈ ఎన్నికల్లో ఏ ఏ శక్తులు ఏ ఏ యుక్తులతో ఎత్తుపై ఎత్తులు ఏ విధంగా వేశాయో తెలియచెప్పేదే ముళ్ళపూడి వెంకటరమణ "రాజకీయ భూతాల పంచవింశతి".

రావూరి భరద్వాజ గ్రామంలోని ఎన్నికల తతంగాన్ని గోడల్లేని జైలు కథలా చిత్రించారు. పంచాయతీలు ఏర్పడిన తర్వాత గ్రామీణ ప్రాంతాల్లో రాజకీయ వ్యాసంగం, చైతన్యం పెరిగింది. నాయకుల్లో స్వార్థం, అధికార దర్పం పెరగడం మూలంగా ప్రజాభిమానాన్ని కోల్పోవడం ఉంది. కలువకొలను సదానంద "ఇన్ ఝూండేకేనీచే" మధురాంతకం రాజారామ్ "రాణీ సాహెబు" "రంగయ్యమ్మా రావు" కథల్లో గ్రామీణ జీవనంలోని రాజకీయ పరిణామాలు కనిపిస్తాయి. వల్లంపాటి వెంకటసుబ్బయ్య రాసిన "గాయపడిన దేవత" కథలో రాజకీయక్షుద్ర దేవతోపాసనలో బలిపశువైన వాడి కథ ఉంది. కలువకొలను సదానంద రచించిన "తాత దిగిపోయిన రైలుబండి" కథలో మహాత్ముని మరణానంతరం రాజకీయ నైతికజీవనంలో వచ్చిన కొన్ని పరిణామాలు –

రచయిత్రి డి.కామేశ్వరి రచించిన "గట్టు తెగింది" కథలో పిల్లల తల్లిదండ్రుల మనసుల్లోని భయాందోళనల్ని చిత్రించారు. ఉద్యమ కాలంలోను కొందరు నాయకుల అండదండలున్నా నష్టపోయింది విద్యార్థిలే అనే విషయాన్ని దాశరథి రంగాచార్య రాసిన తెరవెనుక కథ రాజకీయ చదరంగాన్ని తెలుపుతుంది. దేశానికి స్వాతంత్రం వచ్చి ఐదు దశాబ్దాలైనా చెప్పుకోదగిన అభివృద్ధి కానరాదు. దేశంలో ఇంకా పేదరికం విలయతాండవం చేస్తునే వుంది. అమాయకుల అన్యాయాలకు గురవుతున్నారు. శక్తి సామర్థ్యాలు ఉన్న వారికి తగిన ప్రోత్సాహం లేదు అన్ని రంగాల్లోనూ పోటీ అధికమవుతుంది. మరువాడ రాజేశ్వరరావు రాసిన "జెండా" అనే కథలో స్వాతంత్ర దినోత్సవం నాడు పతాకావిష్కరణం జరిగింది. పిల్లలకు మిఠాయిలు పంచితే వారు హుషారుగా ఉన్నారు. అక్కడికి వచ్చిన పిల్లలందరికీ చిన్న చిన్న జెండాలు పంచిపెట్టారు. అందరితోపాటు ఒక పిల్లవాడికి జెండా ఒకటి ఇచ్చారు. పిల్లలందరూ వాటిని చొక్కాలకు గుచ్చుకున్నారు కానీ ఆ పిల్లవాడు తెల్లబోయి చూశాడు. ముచ్చటగా ఆ జెండా కుచ్చుకోవాలంటే ఆ పిల్లవానికి చొక్కాయే లేదు. ఈ కథ దేశంలోని పేదల రాజకీయార్థిక విషయాన్ని తెలుపుతుంది.

వేలూరి శివరామశాస్త్రి రాసిన "అరాచకం" అనే కథ జమీందారులు కాంగ్రెస్ వారు కమ్యూనిస్టులు గ్రామాలలో ఎలాంటి పరిస్థితులు కల్పించారో తెలుపుతుంది. సురవరం ప్రతాపరెడ్డి "సంఘం పంతులు" గత అభ్యుదయపరమైన ఆలోచనలను కలిగిస్తుంది. జాతీయోద్యమ ప్రభావంతో కూడిన కథలలో ఉద్యమం నాటి ప్రజల ఆలోచనా విధానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రజలను చైతన్య పరచిన ప్రక్రియల్లో కథా సాహిత్యం పాత్ర కూడా విశిష్టమైనదని చెప్పవచ్చు.



Scanned with OKEN Scanner

# స్వాతంత్ర్యదీప్తిలో - జాతీయోద్యమ స్ఫూర్తి

డా. జి. శ్రీనివాస్, తెలుగు శాఖాధిపతి, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చింతలపూడి, ప.గో.జిల్లా
చరవాణి : 9440543860

**1. రచయిత పరిచయం**

కాలం మరచిపోయిన కాలగతిలో పుడమి తల్లి పురిటిలో మేలురత్నమై నిలిచిన కవిరాజులు కొందరైతే, తమ కవితాగానంతో పరవశింపజేసి, తమ గేయాల రాగాలతో అలరించి అవనిలో అణువుగా కలిసిపోయి కనుమరుగైన వారెందరో. అటువంటి కాలం మరిచిన కమనీయ కవితామూర్తి. తన గేయాలతో భరతమాతకు హారతులద్దిన మధుర మూర్తి మన డా॥ వక్కలంక లక్ష్మీపతిరావు.

వారు పశ్చిమ గోదావరి జిల్లా అమలాపురం దగ్గర ఉన్న భూపయ్య అగ్రహారంలో జన్మించారు. తమ కవితాగేయాలతో ప్రజలను ఉత్తేజపరిచిన స్ఫూర్తి ప్రధాత. "స్వాతంత్ర్య దీప్తి" అనే శీర్షికతో చక్కని దేశభక్తి గేయాలు రచించి తన దేశభక్తిని చాటుకున్న నిజమైన భారతీయుడు. దేశ స్వాతంత్ర్య ఫలాలను పదిమందికి పంచాలని, దేశభక్తి గేయాలను రచించి. విస్తృతంగా ప్రచారం చేశారు. ఈ సంపుటిలో వారు అనేక ఉపశీర్షికల ద్వారా నాటి దేశకాల పరిస్థితులను ఎంతో చక్కగా హృద్యంగా వివరించారు. వారి "స్వాతంత్ర్య దీప్తి"లో మనం కూడా నడుద్దాం రండి.

**2. స్వాతంత్ర్య దీప్తి – విశ్లేషణ**

"స్వాతంత్ర్య దీప్తి" అనే గేయ సంపుటిలో వారు దేశభక్తి, సంస్కృతి, సాంప్రదాయాలు, మతం, జాతీయత, జెండా విశిష్టత, త్యాగధనుల జీవితాలు, హిమాలయ పర్వతాలు, విశ్వశాంతి వంటి ఎన్నో అంశాలను తన గేయాలలో చూపించారు.

**2.1 మన జెండా ఎగరాలి**

జాతీయ జెండా గొప్పతనాన్ని గురించి

"ఎగరాలి యెగరాలి మువ్వెన్నె జెండా" అనే గేయంలో మన జెండా యొక్క గొప్పతనాన్ని వివరించారు.

**"ఎగరాలి యెగరాలి మన జాతి జెండా!**
**ఎగరాలి యెగరాలి మువ్వెన్నె జెండా !**
**స్వాతంత్ర్య సమరయోధుల త్యాగములు కనుల**
**కట్టించు నీ పతాకములోని మెరుపు !**
**సస్యామలం బౌచు సుశ్యామలంబైన**
**మనపంట పొలము బొలెదు ఆకుపసుపూ!**
**శాంతి పావుర మౌచు జగమెల్ల విహరించు**
**భారతీయతకు అద్దము పట్టు ఆ తెలుపు**



Scanned with OKEN Scanner

**ఎగరాలి యెగరాలి మువ్వన్నె జెండా!**
**భారతీయుల కలలు పండించు జెండా!** [1]

ఈ గేయంలో త్రివర్ణ పతాకంలోని మూడు రంగులలో 'ఎరుపు' స్వాతంత్ర్య కోసం రక్తం చిందించిన సమర యోధుల గుర్తు, 'తెలుపు' శాంతి, అహింసా మార్గాలకు నిలయమని, 'పచ్చ' మన దేశ పచ్చని పసిడి పంటలకు ప్రతీకయని అంటారు. ఈలాంటి ఈ మూడు రంగుల జెండా మన భరతజాతి కోరుకున్న కలలను సాధించి తీరుతుందని మన విజయానికి జాతీయ జెండా చిహ్నమని, లక్ష్మీపతిగారు ఎంతో గొప్పగా వివరించారు.

**2.2 అమర వీరులు – త్యాగ ఫలం**

దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన ఎందరో అమర వీరులను గురించి తన గేయాలలో ఎంతో హృద్యంగా చెప్పారు.

**"స్వాతంత్ర్య సమర దీక్షాసక్తి యెద పొంగి**
**తమ సర్వమిచ్చిన త్యాగులకును**
**చిఱునవ్వు మోమున చిందించి లాఠీకి**
**తనువులర్పించిన ధన్యులకును"** [2]

అంటూ సాగే వారి గేయంలో స్వాతంత్ర్యం కోసం దీక్షబూని ప్రాణాలర్పించిన వారి ముఖాలలో చిరునవ్వులు చెదరకుండా దేశం కోసం ప్రాణాలర్పించి త్యాగం చేశారని ఎలుగెత్తి చాటి వారిని స్మరించుకున్నారు.

**"నిప్పువంటి మనిషి అతడు**
**నిజాయితీ వీడలేదు**
**పదవులకై చూడలేదు**
**పైస నిల్వ చేయలేదు"** [3]

దేశం కోసం ఆనాడు దేశభక్తులు నిజాయితీతో, నీతితో జీవించారన్నారు, వారు పదవుల కోసం ఆశపడలేదని, ధనాన్ని ఆశించి పనిచేయలేదని అదే నిస్వార్థమైన దేశ సేవ అంటారు.

**2.3 భరతమాతకు వందనం**

"భరతమాత" స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో జీవించాలనీ అందుకోసం మనం త్యాగాలు చేయాలనీ, మనం మన దేశాన్ని ఎలా గౌరవించాలో దానికోసం ఏమి చేయాలో తన గేయాలలో రచయిత ఎంతో హృద్యంగా వివరించారు.

**"భారత జనయిత్రీ**
**హే భారత జనయిత్రీ**
**ప్రియతమ భరత ధరిత్రి**
**నవ శిరీష సుమగాత్రీ"** [4]

అంటూ సాగిన వారి గేయం ప్రతి భారతీయుని హృదయాలను కదిలిస్తుంది. ఆలోచింపజేస్తుంది. కర్తవ్య బోధన చేస్తుంది.

**"అందాల హరివిల్లు మన భారతం!**
**నందనోద్యాన మీ నవ భారతం!**



Scanned with OKEN Scanner

**పలు జాతి పూలు కలనవనందనం**
**అందాల రాశిరా మన భారతం"** [5]

అని భరతమాతను గురించి చెప్పిన తీరు వారిలోని దేశభక్తికి నిదర్శనం.

**"మమతాశంఖము పూరించండీ**
**సమతా జ్యోతులు వెలిగించండీ**
**స్వతంత్ర్య భారత పతాక నీడల**
**'జయహిం'దంటూ సాగండీ"** [6]

నరాల బిగుతున రక్తం మరిగే రీతిన, ఆవేశం ఉప్పొంగేలా సాగిన ఈ గేయం భరతమాతకు కైదండలు పెట్టి అమర వీరుల గుండెల్లో విప్లవనాదమై ప్రజ్వలిస్తుంది. అమరగానమై ప్రభవిస్తుంది. ఇలా ఎన్నో గేయాలలో వారు భరతమాతకు శోత్ర గీతాలు పాడారు.

### 2.4 భానిసత్వం నుండి – భావితరం వైపు

ఈ దేశ బానిసత్వపు శృంఖలాలను తెంచుకుని నవభారతాన్ని సృష్టించాలనీ వారు కలలు కన్నారు. ఆ భావాన్ని ఈ గేయంలో చూపారు.

**"అది కాఱుచీకటి నల్లాడు భారతా**
**వని కెల్లా వెలుగొసంగిన యషస్సు!**
**అది ధర్మదేవత వదనమ్ము లేతన**
**వ్వుల తోడ విరబూయు పుణ్యదినము!"**[7]

తెల్లదొరల పాలనలో కారు చీకట్లు కమ్ముకొని గాఢాంధకారంలో మ్రగ్గిపోయి నిద్రాణమైయున్న ఈ జాతిని ఈ గేయం మేల్కొపుతుందని వారు ప్రగాఢంగా విశ్వసించారు.

**"మాతృదాస్యము తలగద్రోసిన**
**మానధనుల మహోత్సవం**
**భారతీయ మహా జనావళి**
**బ్రతుకు పండిన ఉత్సవం"**[8]

ఈ గేయంలో బానిసత్వంతో మ్రగ్గిపోయి దాస్యవృత్తిలో జీవితాలను నరకం చూస్తున్న భారత పౌరులారా! మేల్కొనండి అని ఎలుగెత్తి పాడి చాటారు. పదిమందికి ఆదర్శంగా నిలిచారు.

### 3. "స్వాంతత్ర్య దీప్తి" గేయ సంపుటి – సందేశం

ఈ గేయ సంపుటిలో సుమారు 33 గేయాలున్నారు. ఇవన్నీ అపురూపమైనవి. స్వాతంత్ర్య దీప్తులను నలుదిశలా చాటగల సత్తా ఉన్నవి. ఆనాడు ఆంధ్రదేశమంతా ఈ గేయాలు ప్రజలలో స్వాతంత్ర్య కాంక్షను పెంచాయి.

1. ఈ దేశం ! మా దేశం !
2. నీ పాటలు పాడనా!



Scanned with OKEN Scanner

3. భారత జనయిత్రీ!
4. భారతం! భారతం!
5. అన్నపూర్ణ యీ దేశం!
6. అందఱమూ ఒక్కటే!
7. అది కాఱు చీకటి
8. జయ జవాన్! జయ కిసాన్!
9. నవ భారతనందనానీ!
10. భారతీయ బాలలం! [9] వంటి గేయాలు ఈ గేయ సంపుటికి మంచి గుర్తింపును తెచ్చాయి.

డా॥ వక్కలంక లక్ష్మీపతిరావు గారి కలం నుండి జాలువారిన ఈ గేయ సంపుటిలోని ప్రతిగేయం ఇప్పటికి మన మనసు పొరల్లో గుండెలోతులలో అనాటి జాతీయోధ్యమ స్ఫూర్తిని, చైతన్య దీప్తిని మనలో ప్రతిధ్వనించేలా నిలబడిపోయాయి.

కవిని ప్రపంచం మరిచిపోయిన వారి కవిత్వం ఎప్పుడు సజీవ శిల్పమై నిలచే ఉంటుంది. దేశభక్తి, త్యాగం, ధైర్యం, ఐకమత్యం, విప్లవాలు, ప్రాణత్యాగాలు, పోరాటాలు, నిరసనలు, విప్లవాలు, సత్యాగ్రహాలు, బానిసత్వం, నిరక్షరాస్యత, పేదరికం, పరాయి పాలకుల దౌర్జన్యాలు, కుల, మత, వర్గ, భాషావిభేదాలు, వైషమ్యాలు, పరాయి పాలనలో భారతీయులు పడిన ఆవేదనలు, ఆక్రందనలను లక్ష్మీపతిగారు తన "స్వాతంత్ర్య దీప్తి" గేయాలలో ఒక్కొక్క శరముగా సంధించి ప్రజల గుండెలను కదిలించి జాతీయోధ్యమ స్ఫూర్తిని నింపి తన దేశభక్తిని త్యాగనిరతిని చాటుకున్న ఈ మహోన్నత కవి పుంగవుని పాదపద్మములకు శతకోటి వందనాలు. భరతమాత దాస్య శృంఖలాలను తెంచడానికి తన కవిత్వాన్ని ఆయుధంగా మలచిన అక్షర యోధుడికి అక్షరాంజలులు...!

**ఆధార గ్రంథాలు**

1. జాతీయ గీతాలు – గురజాడ రాఘవశర్మ – ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ – హైదరాబాద్.
2. జానపదగేయాలు – డా॥ ఎ.అనసూయదేవి అకాడమీ ప్రచురణ – హైదరాబాద్.
3. దేశభక్తి గేయాలు – గురజాడ అప్పారావు.

**పుట సంఖ్యలు :**


| | | | | | | |
|---|---|---|---|---|---|---|
| 1. | స్వాతంత్ర్య దీప్తి | – | డా॥ వక్కలంక లక్ష్మీపతిరావు | – | పుట సంఖ్య – | 13 |
| 2. | స్వాతంత్ర్య దీప్తి | – | డా॥ వక్కలంక లక్ష్మీపతిరావు | – | పుట సంఖ్య – | 06 |
| 3. | స్వాతంత్ర్య దీప్తి | – | డా॥ వక్కలంక లక్ష్మీపతిరావు | – | పుట సంఖ్య – | 30 |
| 4. | స్వాతంత్ర్య దీప్తి | – | డా॥ వక్కలంక లక్ష్మీపతిరావు | – | పుట సంఖ్య – | 22 |
| 5. | స్వాతంత్ర్య దీప్తి | – | డా॥ వక్కలంక లక్ష్మీపతిరావు | – | పుట సంఖ్య – | 24 |
| 6. | స్వాతంత్ర్య దీప్తి | – | డా॥ వక్కలంక లక్ష్మీపతిరావు | – | పుట సంఖ్య – | 48 |
| 7. | స్వాతంత్ర్య దీప్తి | – | డా॥ వక్కలంక లక్ష్మీపతిరావు | – | పుట సంఖ్య – | 14 |
| 8. | స్వాతంత్ర్య దీప్తి | – | డా॥ వక్కలంక లక్ష్మీపతిరావు | – | పుట సంఖ్య – | 21 |
| 9. | స్వాతంత్ర్య దీప్తి | – | డా॥ వక్కలంక లక్ష్మీపతిరావు | – | పుట సంఖ్య – | 8,9 |




Scanned with OKEN Scanner

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# దళిత తలరాత తిరగ రాసిన పాలేరు

**డా. మెండా దేవానంద్ కుమార్,** తెలుగుశాఖాధిపతి, డా. లక్కిరెడ్డి హనిమి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మైలవరం
చరవాణి : 9440781819

శ్రవ్య, దృశ్య కావ్య భేదాల్లో నాటకం దృశ్యకావ్యానికి చెందినది. నిరాక్షరాస్యులకు మార్గనిర్దేశం చేయగల శక్తి నాటకానికి ఉంది. అందువల్లనే 'కావ్యేషు నాటకం రమ్యం', 'నాటకాంతం సాహిత్యం' అన్నారు. సంగీతం, నృత్యం, అభినయం, వేషధారణం, సాహిత్యం, శిల్పం మొదలైన అనేక లలితకళలు ఆధారముగా నాటకం ఏర్పడింది. కవి గొప్పతనం తాను ఎన్నుకున్న ప్రక్రియ మరియు చెప్పదల్చుకున్న దృక్పథం పై అధారపడును. మనం చెడ్డ అనుకున్న దానిలో కూడా మంచిని వెదకగల్గిన ఓర్పు, సహనం, ఉన్నపుడే కవి రాణించగల్గుతాడు. అతని రచనలు సాహితీ జగత్తులో అజరామరంగా వెలుగొందుతాయి.

పాలేరు నాటక కర్త పద్మశ్రీ బోయి భీమన్న దళిత వర్గంలో పుట్టి తాను ఎన్ని కష్టాలు, అవమానాలు, చీదరింపులు అనుభవించినా నిరాశ చెందకుండా, ఆశావాద దృక్పథంతో జీవితాన్ని ప్రారంభించారు. నిరంతరం నిత్యసంతోషంగా జీవిస్తూ, అభిమానులను పదిలపరుచుకుని, కులతత్వాన్ని ఎదిరించి, సంప్రదాయాలకు ఎదురీదిన సవ్యసాచి భీమన్న కవి.

**"నా సుఖాలు, సంతోషాలు**
**సమస్తమూ సరస్వతీ ప్రీత్యర్థం**
**నాకష్టాలు, నష్టాలూ, దురదృష్టాలూ**
**అన్నీ దైవానికి అంకితం......."** అన్న రసాద్వైతాచార్యుడు భీమన్న

సమస్త రుగ్మతలకు చదువు ఒక్కటే మందు అని నమ్మి అట్టడుగువర్గాలకు చదువును నిషేధించిన రోజుల్లో చదువుకోవాలని పట్టుబట్టి చదివారు. తొమ్మిదవ తరగతిలో ఉన్నప్పుడే "నిషావస్తువులు నిషేధించాలి" అనే వ్యాసం రాసి భవిష్యత్ కార్యాచరణను ప్రకటించారు. జీవితయాత్రను కొనసాగించడానికి ఉపాధ్యాయునిగా, ఆంధ్రప్రదేశ్ అనువాద విభాగం డైరెక్టర్‌గా, రిజిస్ట్రార్ ఆఫ్‌బుక్స్‌గా వివిధ హోదాల్లో పనిచేసి నా, తనకు ఎంతో ఇష్టమైన రచనా వ్యాసాంగాన్ని మాత్రం ఎప్పుడూ నిర్లక్ష్యం చేయలేదు. "గతాన్ని విస్మరించినవాడు చరిత్రను సృష్టించ లేడు" అన్న అంబేద్కర్ తాత్త్వికతను తలకెక్కించుకుని, తనజాతి ఉద్ధరణకు అక్షరాలను ఆయుధములుగా చేసుకుని కార్యరంగంలోకి దూకిన స్థితప్రజ్ఞుడు భీమన్నగారు.

**రాజు మరణించె నొక తార రాలిపోయే**
**సుకవి మరణించె నొక తార గగన మెక్కె**
**రాజు జీవించె రాతి విగ్రహములందు**
**సుకవి జీవించె ప్రజల నాల్కలయందు** అని జాషువా కవి చెప్పిన విధంగా

కవి తాను అనుభవించిన సమకాలీన అంశాన్ని ఇతివృత్తంగా తీసుకుని రచన చేసినప్పుడుమాత్రమే ప్రజల మన్నన పొందును. పంతొమ్మిదివందలయాబై దశకములో ఆంధ్రదేశమున పాలేరు వ్యవస్థ వేళ్ళనూకుని వుంది. నిరుపేద దళిత కుటుంబాలకు



Scanned with OKEN Scanner

చెందిన పురుషులు భూస్వాముల పాలేరు వ్యవస్థ సాలెగూటిలో బందీలయ్యారు. దుర్భర దుర్గంధమునుండి తామర పూవ్వు ఉద్భవించినట్లు భీమన్న గారు పుట్టి ఎంతో ఉన్నత స్థితికి చేరినా తనవారిని మరచిపోలేదు. అక్షరంతో చైతన్యపరిచారు. వీరి రచనల్లో శిఖరాయమానమైన పాలేరు నాటకం ఆంధ్రరాష్ట్ర మంతటా ఉర్రూతలూపింది. ఈ నాటకాన్ని నేర్చుకోవడానికి ప్రతి పల్లెలోని దళితులు చదువుకున్నారంటే ఈ నాటకం ఎంత ప్రభావితం చేసిందో ఊహించవచ్చు. పాలేరు నాటకం ఆడని పల్లె లేదు.

పాలేరు నాటకం చూసి పాలేరు పనిమాని చదువుకుని కలెక్టర్లుగా, ఉన్నతోద్యోగులుగా, చదువుల కమ్మదనం రుచిచూసి తమ సంస్కృతిని పున: ప్రతిష్టచేసిన దళిత వర్గ యువకులు అనేకం. సమైక్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఐ.ఎ.ఎస్. అధికారి శ్రీకాకి మాధవ రావు గారి మాటల్లో " నేను పాలేరుని.పాలేరు నాటకం చూసి చదువుకోవాలని అక్షరాలు నేర్చుకొని, చదివి కలెక్టరయ్యాను. పాలేరు నాటక ప్రభావం నామీద నా ప్రజల మీద ఎంతగానో ఉంది. ఈ నాటకం రాకపోతే నేను పాలేరుగానే, చరిత్ర గర్భంలో కలిసిపోయేవాడిని. బోయిభీమన్నగారి ఋణం జన్మజన్మలకూ తీర్చుకోలేనిది." అంటూ గద్గద స్వరంతో ఎన్నోసార్లు చెప్పారు. పాలేరు నాటకం సాధించిన సాంఘిక విప్లవానికి ఇంతకన్నా గొప్ప సాక్ష్యం అవసరం లేదేమో!

బోయి భీమన్న ఉత్తమ వ్యక్తిత్వం కల ధీరోదాత్తుడు. నాటి సమాజం, కులవ్య వస్థ, తనను, తనజాతిని ఏదో చేసిందని శాపనార్థాలు పెడ్తూ రంధ్రాన్వేషణ చేయలేదు. పాలేరు నాటకంలో ప్రతిపాత్రను స్ఫూర్తినిచ్చే విధంగా తీర్చిదిద్దారు. ప్రతిపాత్ర ప్రబోధాత్మకమే. కన్యాశుల్కం నాటకంలో సౌజన్యరావు పంతులుగారు మధురవాణిని ఉద్దేశించి "మనం చెడ్డ అనుకున్న దాంట్లోను మంచివుంటుంది అంటారు. అదేవిధంగా కుబేర్రావు, పుల్లయ్య పాత్రలు మొదటిలో చెడ్డస్వభావం కలిగి ఉన్నా చివరకు మారిమంచివారవుతారు. పాలేరు నాటకంలో పాత్రలు – కథానాయకుడు – వెంకన్న, వనబాల, ఉపకారి మాస్టారు, కుబేర్రావు, సుందరం, రామం, పుల్లయ్య , వీరేసు, సీతమ్మ.

పాలేరు నాటకంలో కథానాయకుడు వెంకన్న. ఇతడు కుబేరయ్య పాలేరు. వెంకన్నకు పాటలంటే ప్రాణం. కోడి కూతతోనే లేవాలి. కొట్టంలో బాగుచెయ్యాలి ఇంటిలో పాచి పనులు చెయ్యాలి. దూడల్నిమేపటానికి పొలంపనికి పోవాలి. చదువుతానంటే తమ ఇంటావంటా లేదు అని తండ్రి పుల్లయ్య చావ బాదేవాడు. దీనికితోడు వెంకన్న అంటేనే కుబేర్రావుకు మా అలుసు. చీటికీమాటికీ తన్ని బూతులు తిట్టేవాడు. కానీ కొన్ని సందర్భాలలో తన తండ్రికంటే కుబేరయ్య మేలుగా వెంకన్నకు అనిపించేది. భావి జీవితాన్ని ఊహించుకుని ఉత్తేజితుడై వెంకన్న తరచు ఈ పాట పాడుకునేవాడు.

**బానిసతనమును – బాపుమురా**
**భారత భూమికి – భాగ్యము తేరా!**
**సకల దేశముల – సర్వమానవుల**
**సామ్యము – సాధింపుమురా**
**ఒకడు తినుచు – మరి యొకడు – పస్తుపడి**

**2**

**కూడు, గుడ్డ , కొంపయు సమానముగ**
**కూర్పుమురా లోకమున**
**ప్రభువు సేవకుడు లేని సంఘమును**
**పదిలముగా నిర్మింపుమురా!**

సౌఖ్యము, సంతోషము మానవులకు సమకూర్చుమురా! వీరా! వెంకన్న దృఢచిత్తం కలిగినవాడు. వాస్తవ పరిస్థితిని



Scanned with OKEN Scanner

నిశితంగా గమనించిన అపరమేధావి. సంపన్నురాలైన వనబాల ప్రేమిస్తున్నాను అని వెంటబడినా పొంగిపోలేదు. తమలాంటి వారికి సరిపడవని తేల్చిచెప్పాడు. తన లక్ష్యమైన డిగ్రీ సాధించి డిప్యూటీ కలక్టరై, వనబాలను వివాహమాడెను. పాలేరు నాటకంలో కథానాయిక వనబాల సంపన్నురాలు. అభ్యుదయ భావాలు కలిగి ఆచార సంప్రదాయాల ముసుగులో సాటిమనిషిని తక్కువ చేసి చూడటం నచ్చని వీర వనిత. తాను ఇష్టపడిన వ్యక్తి పాలేరు మరియు నిమ్న కులస్థుడని తెలిసినా, అధైర్యపడలేదు. వెంకన్న పాటను మనస్సును ఇష్టపడింది. వెంకన్న బాగాచదవాలని ప్రోత్సహించింది. అంతేకాకుండా తన అన్న సుందరం పాడే పాటలు నేర్చుకోమని వెంకన్నను ప్రోత్సహించింది. వెంకన్నకష్టంలో ఉంటే తాను బాధ పడింది. వెంకన్న తన తండ్రి, కబేరయ్యల హింసలను తట్టుకోలేక తనువు చాలించాలని ప్రయత్నిస్తే అడ్డుకుని ధైర్యం చెప్పింది వనబాల.

వెంకన్నను కుబేర్రావు చిత్తుగాకొడితే ప్రాణం మీదకి వచ్చింది. ఎంతమంది చెప్పినా మందు తాగడంలేదు. విషయం తెలిసి వనబాల మాలపల్లి వచ్చి వెంకన్నను పరామర్శించి, నీకోసమే వచ్చానని చెప్పింది. వెంకన్న కోరికతో చక్కని పాటపాడి జన స్రవంతిలో కలిపింది. వెంకన్న ఉన్నత చదువుల కోసం డబ్బు అవసరమైతే తన కాసులపేరు ఇచ్చిన త్యాగమయి వనబాల. దిక్కులేని వెంకన్న తండ్రి పుల్లయ్యకు తన ఇంటివద్ద ఆశ్రయము కల్పించింది. వనబాల వెంకన్నను ప్రేమించిందన్న సంగతి తెలియని వనబాల అన్న సుందరం తన మిత్రుడైన రామంతో వివాహం కుదిర్చాడు. చివరకు వారి ప్రేమ కథ సుఖాంతమయ్యింది. బంధువుల ఆశీస్సులతో వనబాల, దళితుడైన వెంకన్నను కులాంతర వివాహం చేసుకుని జాషువా కవి చెప్పినట్లు

**"కులమతాలు గీచుకొన్న గీతల జొచ్చి**

**పంజరాన గట్టు వడను నేను"** అన్నరీతిలో వనబాల ఆది నుండి అంతము వరకు అభ్యుదయాన్నే శ్వాసగా, ధ్యాసగా బ్రతికింది. తన ఆదర్శ వివాహంతో సంఘానికి గొప్ప విప్లవ మార్గాన్ని చూపింది. తన గొప్ప వ్యక్తిత్వంతో చరిత్ర పుటలలో శాశ్వతముగా నిల్చిపోయి ఎందరికో ఆదర్శంగా నిల్చింది వనబాల.

పాలేరు నాటకంలోని ప్రధాన పాత్రలలో ఉపకారి మాస్టారి పాత్రకు విశేష ప్రాధాన్యముంది. బెల్, బిల్ కి ప్రాధాన్యత ఇవ్వకుండా సమాజాన్ని చైతన్యవంతం చేయాలనే దృఢచిత్తము గల వ్యక్తి ఉపకారి మాస్టారు. వీరు వెంకన్న గ్రామమైన రైతు వాడలో పనిచేస్తున్న ఆదర్శోపాధ్యాయుడు. కేవలం పిల్లలను మాత్రమే కాక, రైతులనూ, కూలీలను ప్రోత్సహించి వారికి విద్యాప్రా

ముఖ్యాన్ని బోధించి రాత్రిపాఠశాలలు నడిపిన సంఘసంస్కర్త. ఉపకారి ప్రజలను ముఖ్యముగా, వెంకన్నను చదువు పేరుతో చెడగొడుతున్నాడని ఉపకారి మాస్టారును నానా ఇబ్బందులకు గురి చేసినా కుబేర్రావు పై కక్షసాధింపు చేయలేదు. అతనిలోను మార్పుకు ప్రయత్నించారు. ముఖ్యంగా కథానాయకుడైన వెంకన్నను బడికి రమ్మని ప్రోత్సహించి, కావలసిన పుస్తకాలిచ్చి డబ్బులుసర్ది, వెంకన్నను తండ్రి కుబేర్రావు కబంధ హస్తాలనుండి రక్షించి, కాకినాడ అనాధశరణాలయానికి పంపించి, వెంకన్నను గ్రాడ్యుయేట్‌గా చేసిన ఘనత ఉపకారి గారికే దక్కుతుంది. ఒకనాడు మనదేశం విజ్ఞా సంపదకు ఆలవాలం అనీ, అది నేడు పొట్ట చింపినా అక్షరజ్ఞానం లేని ప్రజలతో నిండిపోయిందనీ, అది ఘోరం అనీ, చదువులు లేక జాతి శక్తిహీనమై పోతున్నదనీ, తల్లిదండ్రులు గాఢ నిద్రలో ఉన్నారనీ, చదువే శక్తికి మూలమనీ,కాబట్టి పిల్లల్ని తప్పక బడికి పంపండనీ,ఉపకారి మాస్టారు నిత్యం తల్లిదండ్రులకు చేసిన ప్రబోధ చైతన్యం బట్టి ఉపకారి మాస్టారు వ్యక్తిత్వాన్ని అంచనా వేయవచ్చు.

పాలేరు నాటకంలో సంఘసంస్కార ప్రియత్వాన్ని కోరుకున్న వ్యక్తి సుందరం. రైతువాడ గ్రామంలో ఒక సంపన్న గృహస్థుల కుమారుడు. పల్లెలకు పోదామని, పల్లెటూర్లే భారత భాగ్యమనీ నమ్మిన వ్యక్తి. చీకటిలో సృష్టి నిద్రపోయినా విరామం లేకుండా సంచరించే సూర్యుని వలె ప్రజలు కార్యాసక్తులు కావాలని సుందరం ఆకాంక్షిస్తూ పాటలు పాడేవాడు. సుందరం మంచి పాటగాడు. సుందరం గొప్ప సంఘసంస్కార భావాలు గల యువకుడు. కుబేర్రావు ఇంటి పక్కవాడైనా,ఒకే కులంవాడైనా అతడి నీచభావాలను

సుందరం ఎప్పుడూ మెచ్చుకోలేదు. ఆదర్శ ఉపాధ్యాయుడైన ఉపకారి మేష్టారి విద్యా ప్రబోధాన్ని, ఆయన నిరంతర కృషిని సుందరం ఎల్లప్పుడు మెచ్చుకునేవాడు.పల్లెలో విద్యా, వైద్య, నివాస సౌకర్యాలు కల్పించినపుడు మాత్రమే ప్రజలు పల్లెలకు పరుగుదీస్తారని సుందరానికి గట్టి నమ్మకం.

తన చెల్లి వనబాల ఆటరానివాడితో అంటకాగుతున్నా సహించగల పరిపక్వత కల్గిన అసాధారణ వ్యక్తి సుందరం. వెంకన్న బాగా పాడతాడని చెల్లిచెప్పగా వెంకన్నను అడిగి మరీపాట పాడించుకుని ఉప్పొంగి పోయాడు.వెంకన్న చదువుకోసం కాకినాడ అనాధశరణాలయానికి వెళ్ళాడని సహాయం చేయమని వనబాల తన అన్న సుందరాన్ని కోరినప్పుడు సుందరం దగ్గరుండి వెదికిమరి వెంకన్నను అనాధశరణాలయంలో చేర్పించాడు. శరణాలయం మేనేజరు రామంతో ప్రత్యేకంగా మాట్లాడి ప్రయివేటుగా వెంకన్నచే మెట్రిక్ కట్టించాడు. తర్వాత గ్రాడ్యుయేట్ అయి డిప్యుటీ కలక్టరు కావడంలో, రామం, సుందరంల కృషి చెప్పలేనిది. క్రమంగా సుందరానికి వనబాల ప్రేమ విషయం తెలిసింది. సంఘుసంస్కార భావాలుకల ఆదర్శ వంతుడైన సుందరం అస్పృశ్యుడైన వెంకన్నకు తన ముద్దుల చెల్లిలిని ఇచ్చి కులాంతర వివాహం జరిపించిన ఘనుడు.కులమతాలు మంటకలిపి, భిన్నత్వంలో ఏకత్వమైనప్పుడు, ఉత్తమ వ్యక్తిత్వాలతో వెంకటేశ్వరరావు, వనబాల కలిసి పాడిన పాటలాగ వుంటుంది.

**"సుందరముగ, ఆనందముగా**
**శోభాకరముగ జీవితము**
**పీయూషముగా గ్రోలుదమే!"**

మెల్లి మెల్లిగా తెర జారుతుంది. ప్రేక్షకులు నూతన ఉత్తేజంతో, శక్తితో, ఉత్తమ వ్యక్తిత్వంతో చదువుపై ఆసక్తితో ముందుకు సాగిపోయారు.

**ఉపయుక్త గ్రంధాలు :**

1. పాలేరు నాటకం : బోయి భీమన్న : దేశి కవితా మండలి, విజయవాడ, 1940.

# తెలుగు కవిత్వంలో అల్లూరి సీతారామరాజు

**డా. హరీష్ కుమార్ శ్రీధర,** సహాయాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కోరుట్ల, జగిత్యాల
చరవాణి : 9491366356, 8919563503

భారతదేశ స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో తెలుగునాడు నుండి వినిపించే నాదం అల్లూరి. ఈ ప్రాంత పౌరుషానికి, పరాక్రమానికీ ప్రతీక. భారత జాతిని పరదేశీయుల నుండి విముక్తి పొందించడానికి పూరించిన సమర శంఖం సాహసికుడైన వ్యక్తి మహాజ్ఞానిగా, యోగిగా, వైద్యుడిగా, సేవకుడిగా, సంఘ సంస్కర్తగా, స్వాతంత్ర్య యోధునిగా, ఉద్యమ నాయకునిగా, విప్లవ వీరుడిగా నేటి తరానికీ, భవిష్యత్ తరాలకు ఆదర్శం అల్లూరి. ఇలాంటి ఒక వ్యక్తి భరతమాత నేలపై నడయాడటం అందునా తెలుగు నేలపై పుట్టడం మనందరికీ గర్వకారణం.

ఈ స్వాతంత్ర్యోద్యమ కారుడు వస్తువుగా అనేక రకాల సాహిత్య ప్రక్రియల్లో స్థానం సంపాదించుకొన్నాడు. అఖిల భారత జాతికి ఆదర్శప్రాయుడైన అల్లూరిని స్మరించడంలో నవల, నాటకం, జీవిత చరిత్రలు, కవితలు, ఖండకావ్యాలు, గేయాలు ఇలా పోటీ పడని ప్రక్రియ లేదంటే అతిశయోక్తి కాదు. ఇంకొకరితో పోలిక అని కాదు గానీ ఉత్తర భారతదేశంలోని రాజ్‌గురు, సుఖ్‌దేవ్, భగత్‌సింగ్ వంటి క్రాంతి కారులు, చైతన్య మూర్తుల వంటి కోవకు చెందిన వాడే ఇతను కూడా.

తెల్లవారి గుండెల్లో నిదురించి పీడిత పక్షపాతియై ప్రజల విముక్తికై అహరహం శ్రమించిన శ్రామికుడు. స్వాతంత్ర్య స్వాప్నికుడు. అల్లూరి పోరాటం, జీవితం నిరంతర స్ఫూర్తి మంత్రం. 'హితేన సహితం సాహిత్యం' అన్నారు పెద్దలు. అందుకే ఇలాంటి స్ఫూర్తి మంతుల చైతన్యాన్ని తదుపరి యుగాలకు అందించాలన్న తపనతో అల్లూరి పోరాటాన్ని, జీవితాన్ని ప్రధాన వస్తువుగా ఎంచుకొని తెలుగు సాహిత్యానికి సార్థకతను చేకూర్చారు. అనేక ప్రక్రియల్లో అల్లూరిపై సాహిత్యం వచ్చినా, కవిత్వంలో అల్లూరి ప్రస్తావనకు పరిమితం చేయాలని అనుకుంటున్నాను. సాహితీ ప్రక్రియల్లో కవిత్వానిది పెద్ద పాత్ర దాదాపు అన్ని అంశాలపై పద్య రూపంలోనో, వచన రూపంలోనో కవిత్వం వచ్చింది. అలాగే అల్లూరి జీవితం, పోరాటం పైన కూడా. వీటిల్లో బండ్ల సుబ్రహ్మణ్యం, బూదరాజు రాధాకృష్ణ, కాకర్లపూడి వెంకటరాజు, మల్లెల గురవయ్య, గుర్రం ధర్మోజిరావు గార్ల పద్యకావ్యాలు కుందుర్తి, ముదివేడు ప్రభాకర్‌రావు, అద్దేపల్లి వంటి వారి ఆధునిక వచన కవితలు ఉన్నాయి.

**ఆంధ్రమహాభ్యుదయం – బండ్ల సుబ్రహ్మణ్యం**

ఆంధ్ర మహాభ్యుదయ కావ్యాన్ని బండ్ల సుబ్రహ్మణ్యం గారు 12 ప్రకరణములలో రచించారు. రామరాజు జీవితాన్ని విప్లవ పోరాటాన్ని బాల్యం నుండి వీరమరణం వరకు అద్భుతంగా వివరించారు.

**సీ. సిద్ధ నాగార్జున – బౌద్ధ ధర్మజ్యోతి / యజ్ఞాన తిమిరంబు – నణచెనచట....**

అంటూ ఆంధ్రుల ధర్మ స్వరూపాన్ని పవిత్ర భూమిని గూర్చి గానం చేస్తారు. రామరాజుని కథానాయకుడిగా నిరూపిస్తూ దేశభక్తిని ఇలా వర్ణిస్తారు.



Scanned with OKEN Scanner

**"ధర్మ కర్మా భరతి శౌర్య - ధైర్యమహిమ**
**సమద శాత్రవ భంజవ - సాహసమును**
**భక్తి దత్తిల సచ్ఛక్తి - వఱులుచుండ**
**నక్కాలంబున నల్లూరి - యవ్వనంబ"** (1)

యవ్వనపు తొలికాలంలోనే విదేశీ విద్య వలన లాభం లేదని, అంది కేవలం ఆంగ్లేయులకు బానిసలుగా ఉండటానికి మాత్రమే ఉపయోగపడుతుందని గుర్తించాడు. అందుకే భారత వీరుల సాహస గాథలు, యోగాభ్యాసం వంటి అంశాల పట్ల మక్కువ పెంచుకొన్నాడు. వివిధ పుణ్యక్షేత్రాలను సందర్శించి బాలయోగిగా మారి 'శ్రీరామ విజయనగరం' నిర్మించుకుంటాడు. బ్రిటిష్ వారు నిరక్షరాస్యులైన చెంచులు, కోయలు, గిరిజనులు మొ॥గు వారిని పెడ్తున్న హింసలకు చలించి పోతాడు.

కం. **"కుటిలాత్ములు గ్రవర్తను**
**లటవీ శాఖాధికారులందరు నొకటై**
**కటకట యియ్యాట వికుల**
**బటు బాధలు పెట్టుచుంట పాపం బరయ** (2)

ఒకవైపు గాంధీజీ హరిజనాభ్యుదయం కొనసాగుతున్న సమయంలో ఇక్కడ అల్లూరి గిరిజనులకు దైవంలా మారాడు పంచాయితీల స్థాపన, గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం, చిన్న చిన్న వాటికి వైద్యం చేయుట, జ్యోతిష్టం ఇలా రక రకాల అంశాలతో గిరిజనులతో మమేకమైనాడు.

మన్యం ప్రాంతానికి బాప్టియన్‌ను తహసీల్దార్‌గా నియమించుట, అతడి అకృత్యాలు రామరాజుని విప్లవ కారుడిగా మారడానికి కారకాలైనాయి. నానా విధాలుగా అల్లూరిని లొంగదీసుకునే ప్రయత్నాలనంతరం బ్రిటిష్ ద్రోహిగా పరిగణిస్తారు. జాతీయ చైతన్యములో భాగంగా కుల మత వర్గ బేదాలను మరచి సంస్కరణాభిలాష గురించి చెబుతూ

మ. **"కుల భేదంబుల క్రుళ్లి కలెవిగయుటన్ - గుర్తించి కుత్కీలముల్"**... అంటారు.

గాంధీజీ అనుసరిస్తున్న శాంతి, సామరస్యము, సహాయ నిరాకరణోద్యమము గురించి

తే.గీ. **"సత్య వాఙ్నిధి గాంధి ప్ర-శాంతి కంది**
**తాన హింసా విధానంబు - బూని గాని**
**ప్రభుత యున్మదగజయది - పాటిసేయ**
**దంకు శంబున నద్దాని - నణచవలయు"** అంటారు.

రామరాజు క్రమేణా ప్రజాసేవ పెంపొందిస్తాడు. దీంతో బ్రిటిష్ వాళ్లకు శత్రువౌతాడు. అల్లూరి తన వెంట ఒక బలమైన సైన్యాన్ని తయారు చేసుకుంటాడు. దానికి గంటం సోదరుల సహకారం తీసుకుంటాడు. ఆధునిక 'యుద్ధ' సామాగ్రి ఉన్న బ్రిటిష్ సైన్యాన్ని ఎదుర్కోవడానికి తగినంత చైతన్యాన్ని ప్రజల్లో నింపుతాడు. మన్యం వీరుల ఆత్మదీక్ష, యుద్ధ నైపుణ్యత, ఖడ్గయుద్ధ విద్య ఇలా వారు నేర్చుకుంటున్న అంశాలపై కవి ప్రశంసలు కురిపిస్తాడు. స్వాతంత్ర్యకాంక్షతో మనసులో కోరికలు ఫలించేటట్లు ప్రతిజ్ఞ చేసుకొని కార్యాచరణను ప్రారంభిస్తారు.

వీటి తర్వాత అల్లూరి చేసిన పోరాటాలను గురించి చక్కగా చిత్రించారు. ఈ రచనలో శ్వేతచ్ఛత్ర బంధాన్ని, నాగబంధాన్ని, ఖడ్గబంధాన్ని ఉపయోగించారు. బ్రిటిష్ వారితో పోరులో అసువులు బాసిన అమరులకేదీ గుర్తింపు అని కవి వాపోతాడు.



Scanned with OKEN Scanner

**తే.గీ. ఆంగ్ల వీరులతో గూడి - యాసువులిడిన**
**భారత భటులకు గోలీల - ప్రాప్తి లేదు**
**రుద్ర భూమిని గూడద - ద్రౌద్రమేమో**
**తెలుపు నలుపుల చేధంబు - దెలిపి రౌరా!!**

రామరాజు వీరత్వం గురించి దేశమంతా వ్యాపిస్తుంది తెలియజేస్తూ ......

**తే.గీ. "రాజు సాహస కృత్యముల్ - రాష్ట్రమెల్ల**
**బత్రికలు దెల్పుచుండె ని-ర్భయము తోడ**
**సరగ జక్రాన విప్లవ - జ్వాలరేగు**
**ననెడి భీతి హూణుల కాత్మ - నధికమయ్యె"** అంటారు.

తర్వాత రామరాజు గారి నిర్యాణాన్ని అత్యంత విషాదకరంగా వివరించారు. భరతమాత శోకాన్ని కరుణరసంలో వివరిస్తారు.

**శ్రీ సీతారామరాజీయము - మల్లెల గురువయ్య**

రెండు వేల పద్యాల మహాకావ్యం. 12 పరిచ్ఛేదాలు. వంశ చరిత్ర, జననం, విద్యాభ్యాసం అంతా మొదటి పరిచ్ఛేదంలో చేప్తారు. స్వాతంత్ర్య సమర ప్రేరితుడు కాడానికి కారణమైన రాజమండ్రిలో స్టూడియోను ప్రారంభిస్తాడు. అందులో

**ఆ.వె. "బిపిని చంద్రపాలు వీరేశలింగము - భీకర కలియుగ భీముడైన**
**కోడె రామ మూర్తి గురజాడయును తిలక్ ఆదిభట్ల దాసునార్యులుగన"**

మొదలగు వారల చిత్రాలనుంచుతాడు. రామరాజుకు తల్లి సూర్యనారాయణమ్మ ఉగ్గుపాలతోన దయ, జాలి, కరుణ వంటి గుణాల్ని, ప్రహ్లాద ప్రవర్తనల్ని, భక్తి వేదాంతాలను నూరిపోశారు. తండ్రి నుండి సేవానిరతిని, దేశభక్తిని అలవాటు చేసుకొన్నాడు. రామరాజు తండ్రి చిన్న వయసులోనే చనిపోవటం, పెద్ద కొడుకుగా బాధ్యతలన్ని రామరాజుపై పడుతాయి. ఈ సందర్భంలో కవి,

**'చదువని పుత్రుడు జనకుని శత్రుడన్విబుధుల వాక్యంబు'** అంటాడు.

రామరాజు తన విద్యాభ్యాసాన్ని ఆపే సందర్భంలో

**"దేశ విద్యయే విద్యగా దెలియవచ్చె"** నంటాడు.

రామరాజు దేశాటన చేసి మహామహుల నెందరినో కలుసుకుంటాడు. అనుభవ పాఠాల్ని నేర్చుకుంటాడు. లోకజ్ఞానాన్ని అలవర్చుకొన్న పిదప తపస్సు చేసుకోవడానికి తగిన ప్రదేశాన్ని ఎంచుకుంటాడు. అదే క్రమేణా తన కార్యశాల అవుతందని ఊహించి ఉండడు. ఒకవైపు దైవభక్తి, మరొకవైపు దేశభక్తి గల రామరాజును గూర్చి

**తే.గీ. "దైవ భక్తికి తోడగా భావమందు**
**దేశభక్తి నెలకొన్న ధీరవరుడు**
**రామరాజు విప్లమార్గ గామి యగుట**
**సహజ సిద్ధమతుండు రాజర్థిమౌళి"** (3) అని కీర్తిస్తాడు.

గిరిజనుల కోసం గ్రంథాలయాల స్థాపన, సాహితీ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించుట చేసి చైతన్యవంతుల్ని చేశారు. తర్వాత ప్రభుత్వ ద్రోహిగా గుర్తించడం, విప్లవకారుడిగా ముద్ర వేయడం ఇవన్నీ చక్కగా వర్ణించారు.



Scanned with OKEN Scanner

అల్లూరికి గాంధీజీపై, స్వాతంత్రోద్యమంపై మమకారాన్ని తెలియజేస్తూ....

**తే.గీ.** **"చింతపల్లిపై దాడిని చేసినపుడు**
**జయనినాదమ్ము గాంధీజికి జై యటంచు**
**పలుకు రామరాజుకు గాంధీపైన కలుగు**
**భక్తి గౌరవముల కద్ది ప్రజల ఋజువు"** (4) అంటారు.

శత్రువులకు నిద్ర లేకుండా చేసిన వీరుడు తదనంతరం బ్రిటిష్ సైన్యం కాల్పుల్లో వెనుదిరుగుతాడు. అతని ఉనికి, సమాచారం దొరకలేదు. తదనంతరం పరిణామాల్లో తనకు తానుగా లొంగి అస్తమయీ పొందినట్లుగా వివరించారు.

**అశ్రుధారలు – బూదరాజు రాధాకృష్ణ**

ఈ కావ్యాన్ని బూదరాజు రాధాకృష్ణ "అశ్రుధారులు" (2) గత స్మృతి (3) అతడు ఆమె అని మూడు శీర్షికలుగా రాశారు. 290 పద్యాలు రామరాజు బాల్యంలో తండ్రికి గల స్వాతంత్ర్య పిపాసను చూసి ఆకర్షితుడవ్వటము గురించి చక్కగా వర్ణించాడు. తదనంతరం ఉత్తర భారతదేశ యాత్ర, తదనంతరం జీవన విశేషాలను స్థూలంగా వివరించారు. మన్యం ప్రజల గుండెల్లో దైవత్వాన్ని పొందిన గురువుగా మారిన సందర్భాన్ని వివరిస్తూ.....

**"ప్రజకు స్వేచ్ఛా నిరోధక ప్రభువులొక్క**
**ప్రక్క భూస్వాములొక ప్రక్క 'ఫాదరీ' మ**
**త ప్రచారకుల్ వేఱొక తట్టు బాధ**
**వెట్ట విప్లవ భావముల్ పెనుచు రాజు"** అని మన్యం దీన స్థితిని తెలియజేశాడు. ఈ కావ్యంలో రామరాజును ఆధ్యాత్మిక గురువుగా, యోగిగా, తపస్విగా, స్వాతంత్ర్యపోరాట యోధునిగా, శాంతి కాముకుడిగా, మన్యం ప్రజల్లో ఒక దైవ స్వరూపుడిగా చిత్రీకరించాడు. రామరాజు మంప సమీపంలో మలబారు సైనికుల దగ్గరకు వెళ్లి స్వచ్ఛందంగా లొంగిపోయాడు.

**"సచ్ఛాత్రులైన కోయలు**
**స్వచ్ఛంద మరణము బొందసాగిరి, మరునా**
**డిచ్ఛా మరణ వ్రతుడై**
**స్వచ్ఛ గతిన్ రాజు "మంప" వద్దకు బోయెన్"** అని లొంగిపోతాడు.

**ఉదయశ్రీ – జంధ్యాల పాపయ్య శాస్త్రి**

పూర్తిగా అల్లూరిని గురించే రాసిన కావ్యం కాకపోయినా, సీతారామరాజు గురించి "9" పద్యాల్లో వివరిస్తాడు. అతడి ధైర్య సాహసాల్ని తెలియజేస్తూ..

**"క్షాత్రము రూపుగైకొనిన సాహసికునిను గాంచి భారత**
**క్షేత్రమునందు పొంగి పులకించినదోయి త్రిలింగ జాతి సు**
**క్షత్రియ వీర! నీ విజయ శంఖము బ్రద్దలు సేసె శాత్రవ**
**శ్రోత్రముల్ భవత్పదము సోకుట మన్యము ధన్యమయ్యెరా!"** (5) అంటారు.

రామరాజుని ప్రశంసిస్తూ.....

**"పౌరుషము పట్టుదల, దేశభక్తి, ధైర్య**
**సాహసమ్ములనన్యాదృశ్యములు గాగ**
**తెలుగు గుండెలు వెలిగించితిని. స్వతంత్ర**
**యజ్ఞమున నిండు బ్రతుకు 'స్వాహా' మొనర్చి** (6) అంటారు.

రామరాజుని భద్రాద్రి రామునిగా కొల్చుట, తెలుగు వీరుడి 'మిరపకాయటపా' గురించి ప్రత్యేకంగా ప్రస్తావిస్తారు.

**అల్లూరి సీతారామరాజు ఉదాహరణ కావ్యం - గుఱ్ఱం ధర్మోజి**

7 విభక్తుల మీద 7 పద్యాలు, సంబోధనా ప్రథమా విభక్తిపై ఒక పద్యము ప్రతి విభక్తి పద్యాల్లో, ఒక వృత్తము, ఒక కృత్తిక, ఒక ఉత్కళిక ఉంటాయి

మొదటి శ్లోకంగా **'శ్రీశ్రీ విప్లవ కారణం బలయుతం శ్రీ మద్య సంచారిణం**
**అల్లూర్యాఖ సువంశజాత కిరణం సత్క్షాత్ర శౌర్యాంచితం**
**సీతాయుక్తి సునాయ భూషిత తనుం శ్రీరామరాజం శుభం**
**వందే సాయుధ యోదినం శుభాయనం శ్రీ సాంద్ర రోషాకృతం"** (7) అల్లూరిని వర్ణిస్తాడు.

కావ్యం చిన్నదే అయినా దాదాపుగా అన్ని అంశాలనూ స్పృశిస్తూ గొప్పగా రచించారు.

**ఆంధ్రవీర - కాకర్లమూడి వేంకటరాజు**

**"పలికెడిది వీర చరితము / పలికించును భరత శౌర్య భావోద్ధతులే**
**పలికిన జన్మము ధన్యము / పలికెద మన యాంధ్రజాతి పౌరుషగాథన్"** (8) అంటూ ఆంధ్ర పౌరుషానికి నిలువెత్తు నిదర్శనమైన అల్లూరిని వర్ణిస్తాడు. మద్దూరి పూర్ణయ్య కాకినాడ కళాశాలలో స్నేహితుడవుట గురించి, పరవిద్యల యందనాసక్తిని గురించి, దేశభక్తి గురించి అద్భుతంగా ఈ కావ్యంలో వివరించబడింది. రామరాజు చైతన్యాన్ని కలిగించడంలో చూపిన నేర్పరితనం, ఉద్యమ సహచరులు వారి జీవితాల్ని గురించి, అల్లూరి వ్యూహాలు, యుద్ధ విద్యలు, గిరిజనులను చైతన్యవంతుల్ని చేయుట, వారికి తగిన సేవ చేయుట ఇలా అనేకాంశాలను గురించి గొప్పగా ప్రస్తావించారు. చివర్లో తాను లొంగిన క్రమంలో భారతమాత గొప్పదనాన్ని, ఆంగ్లేయుల మోసపూరిత విధానాల్ని చక్కగా వివరించారు.

**వచన కవిత్వం** : వచన కవితల్లో "రక్తాక్షికి రారాజు అల్లూరి సీతారామరాజు" అని ములివేడు ప్రభాకర్‌రావు గారు రచించారు.

**"రక్తాక్షరాలతో లిఖించాడు రాజు / ఈ రక్తాక్షి సంవత్సరాన్ని!**
**ఇప్పటికీ శేష ప్రశ్నలుగానే మిగిలిపోయాం"** అంటారు.

అద్దేపల్లి రామ్మోహన్‌రావు గారు "అల్లూరి సీతారామరాజు" వచన కవితా విప్లవ వీర కథకావ్యం రాశారు. ఈ విప్లవ వీర కథలో చైతన్యం ఉరకలెత్తుంది. దేశభక్తి, ఉద్యమాలు, పోరాటాలు, కరుణ, రౌద్ర, భయానక, భీభత్స, ప్రణయ వంటి నవరసాలు ద్యోతకమయ్యేలా తన రచనను కొనసాగించారు. మూడు సంవత్సరాల పాటు సుదీర్ఘంగా పోరు సల్పిన ఆ యోధుని చారిత్రకతకు ఏ మాత్రం భంగం కలుగకుండా సమగ్రంగా, సూక్ష్మంగా, సాధికారికంగా ఈ రచన చేశారు. యువతలో దేశభక్తి పెరగాలనీ, ఎందరో త్యాగమూర్తుల త్యాగఫలాల్ని మనం ఆనందిస్తున్న విషయాన్ని మరిచిపోవద్దని కోరుతాడు (1) ప్రాతఃకాలం (2) ఉదయం (3) మధ్యాహ్నం (4) సాయంత్రంగా విభజించిన కథాకావ్యం ఇది.



Scanned with OKEN Scanner

"నాదేశమంటే నాదేహమే / నా దేహంలో / ఎన్ని రోగాలున్నా / నా దేహం నాకు గొప్పది / నా దేశంలో ఎన్ని లోపాలున్నా / నా దేశం నాకు స్వర్గతుల్యం" (9)

కథానాయకున్ని వివరిస్తూ

"ఒక ప్రజాయోధుడు / ఒక మహావిప్లవ కారుడు / ఒక శాత్రవ సంహారి / ఈ నేలపై అవతరిస్తా అతడే అల్లూరి అంటాడు. తదనంతర పరిణామాల్ని వివరిస్తూ, చైతన్య వంతులైన మన్యం ప్రజల గురించి,

"మన్యం ప్రజలంతా మౌనంగానే ఉంటారు / కానీ ఆ మౌనం / ఏదో మాట్లాడుతున్నట్లు / అధికారులు ఉలిక్కిపడుతుంటారు. అంటే నిశ్శబ్దం వెనుక రామరాజు వ్యూహాల పట్ల భయాన్ని చూపిస్తారు.

"మన్యంలో ఆకు కూడా రాజుకి వ్యతిరేకంగా చెప్పదు / సాక్ష్యం లేకపోతే న్యాయం ఎవడిమాటా. ఇలా ఉద్యమ స్ఫూర్తిని రగలించడం చూస్తాము.

**ఉపసంహారం**

ఆంధ్ర పౌరుషానికి నిలువెత్తు నిదర్శనంగా ఉన్న అల్లూరిని గురించి కవులు తమ కవిత్వంలో అత్యంత చైతన్య స్వరూపునిగా, ఉత్తేజభరితంగా వివరించారు.

జైహింద్

**ఉపయుక్త గ్రంథాలు**

1. ఆంధ్ర మహాభ్యుదయం బండ్ల సుబ్రహ్మణ్యం
2. ఆంధ్ర మహాభ్యుదయం బండ్ల సుబ్రహ్మణ్యం
3. సీతా రామరాజీయము – మల్లెల గురవయ్య
4. సీతా రామరాజీయము – మల్లెల గురవయ్య
5. ఉదయశ్రీ – జంధ్యాల పాపయ్య శాస్త్రి
6. ఉదయశ్రీ – జంధ్యాల పాపయ్య శాస్త్రి
7. ఉదాహరణ కావ్యం – గుఱ్ఱం ధర్మోజి
8. ఆంధ్ర వీర – కాకర్లపూడి వెంకటరాజు
9. అల్లూరి సీతారామరాజు – అద్దేపల్లి



Scanned with OKEN Scanner

# స్వాతంత్ర్యోద్యమంలో తెలుగు సాహిత్యం

**డా. నేలటూరి అనిత మార్గరేట్,** తెలుగు అధ్యాపకులు, ఎస్.ఆర్.ఆర్. & సి.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజయవాడ

భారతదేశాన్ని సుమారు 200 సంవత్సరాల పాటు బ్రిటీష్ ప్రభుత్వం పరిపాలించింది. దేశ స్వాతంత్ర్యం కోసం సుధీర్ఘకాలం భారతీయులు పోరాటం కొనసాగించారు. ప్రజలలో జాతీయభావన క్రమేణా ప్రజ్వరిల్లసాగింది. ఆంగ్లేయుల పాలన నుండి విముక్తి పొంది స్వాతంత్ర్యాన్ని సంపాదించి స్వేచ్ఛావాయువులు పీల్చాలన్న ఆకాంక్ష అధికమవుతూ వచ్చింది. వివిధ భాషలలో కవులు కళాకారులు రచయితలు తమవంతు కృషిగా తమ రచనల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేసి స్వాతంత్ర్యోద్యమంలో నడవడం ప్రారంభించారు. బెంగాల్‌లో ప్రారంభమైన జాతీయోద్యమ పోరాటం ఆంధ్రలో ఊపందుకుంది. బకించంద్ర ఛటర్జీ రాసిన వందేమాతరం నినాదం అందరిని చైతన్నవంతుల్ని చేసింది. రవీంద్రనాథ్ ఠాగూర్ రాసిన జనగణమణ, ఇక్బాల్ రాసిన సారేజహాసె అచ్ఛా వంటి గేయాలు ప్రజల్లో ఎంతో ప్రభావాన్ని చూపి స్వాతంత్ర్యోద్యమంలో దూకేలా చేశాయి. భారతీయులంతా ఒకతాటి మీద నడిచి విభిన్న కులాలు, మతాలు, వర్గాలు, వర్ణాలు మొదలైన వాటిని విస్మరించి జాతీయోద్యమంలోకి అడుగులు కలిపారు.

తెలుగు సాహిత్యంలో కథ కవిత కథానిక నవల గేయం నాటకం అనే ప్రక్రియల ద్వారా స్వాతంత్ర్యోద్యమానికి ప్రముఖులు, పెద్దలు చేసిన కృషి బహుప్రశంసనీయం. బ్రిటీష్ ప్రభుత్వం ద్వారా ఎదురయ్యే ఇబ్బందులు, కష్టాలు ఆంక్షలు, అరెస్టులు, నిషేధాలు ఏవీ వారిలోని సృజనాత్మక శక్తిని ఆపలేకపోయాయి. సాహిత్యం ద్వారా ప్రజలలో వచ్చిన చైతన్యాన్ని నిలవరించలేకపోయాయి. బిపిన్ చంద్రపాల్ 1902లో ఆంధ్రప్రదేశ్‌లో పర్యటిస్తూ రాజమండ్రిలో చేసిన ఉపన్యాసంలో ఆంగ్ల ప్రభుత్వాన్ని దుయ్యబట్టారు. ఆ ప్రసంగం విన్న చిలకమర్తి లక్ష్మీనరసింహం గారు ఆవేశ పూరితులై అశువుగా ఈ పద్యాన్ని చదివారు.

**"భరత ఖండంబు చక్కని పాడియావు**
**హిందువులు లేగదూడలై యేడ్చుచుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవారు**
**పితుకుచున్నారు మూతులు బిగియగట్టి"**

ఈ పద్యం విన్న సభలోని వారందరూ కరతాళధ్వనులతో చిలకమర్తి ని అభినందించారు. దీనితో దేశభక్తి పెల్లుబికిన మరొక కవి ప్రతిధ్వనిగా 1905లో "హిందువులారా ఎన్నాళ్లీ గతి, దూడనోరు గొట్టి ద్రోడుంపు గొల్లలు - పాడిసమస్తమూ పరులకమ్ముగతి, కూడులేనినాడు కూలగాదని, ఏడికోనాధన మెల్ల పోయెడి " అనే రచన ప్రకటింపబడింది. ఇటువంటిదే మరొక గేయం 1909లో వెలువడింది.

**"మేలుకొనుమా భరత పుత్రుడ**
**మేలుకొనుము సుజన పుత్రుడ**
**మేలుకొనుము సచ్చరిత్రుడ**
**మేలుకొనవయ్యా వత్సా మేలుకో**
**వేడుకను జాతీయతను వేగుచుక్క పొడిచెనదిగో**
**కూడి వందేమాతరమ్మను కుక్కుటములరచెన్ "**

అని జాతీయతా భావస్ఫూర్తితో తెలుగు కవిగళం నుంచి వెలువడింది. 1910లో గురజాడ అప్పారావు సర్వమానవ సౌభ్రాత్రము విశ్వమానవ ప్రేమ కలగలిపి ప్రగాఢ దేశభక్తితో

**"దేశమను ప్రేమించుమన్నా**
**మంచియన్నది పెంచుమన్నా**
**వట్టిమాటలు కట్టి పెట్టోయ్**
**గట్టి మేల్ తలపెట్టవోయ్ "**

అని జాతీయతా ముద్రతో జాతి చైతన్యానికి దోహదం చేసే గీతం రాశారు.

**"దేశాభిమానం నాక కద్దని**
**వట్టి గొప్పలు చెప్పుకోకోయ్**
**పూని యేదైనాను వొకమేల్**
**కూర్చి జనులకు చూపవోయి"** అని ప్రజలలో చైతన్యాన్ని రగిల్చి దేశమంటే మట్టి కాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని ఎలుగెత్తి చాటాడు. రాయప్రోలు సుబ్బారావు 'జన్మభూమి' అనే గేయంలో

**"ఏ దేశమేగినా ఎందుకాలిడినా,**
**ఏ పీఠమెక్కినా ఎవరెదురైనా**
**పొగడరా నీ తల్లి భూమి భారతిని,**
**నిలపరా నీ తల్లినిండు గౌరవము**
**లేదురా ఇటువంటి భూదేవి యెందు,**
**లేదురా మనవంటి పౌరులింకెందు"**

అని జాతీయాభిమానం చాటుకున్నారు.

మహాత్మాగాంధి 1920లో భారత జాతీయ స్వాతంత్ర్య పోరాటానికి నాయకత్వం స్వీకరించి దేశమంతా సంచారం చేయటం ప్రారంభించిన తర్వాత ఆ ఉద్యమానికి ప్రభావితులైన కవులు, రచయితలు మరింత ఉత్సాహంగా, ఉద్యమ స్ఫూర్తితో రచనలు చేసి సమాజాన్ని తట్టిలేపి జాగృతం చేసి ముందుకు నడిపించారు. తమ ప్రాణాలు పణంగా పెట్టేందుకు కూడా వారు వెనుకడుగు వెయ్యలేదు. ఈ స్ఫూర్తి తో ప్రచార గీతాల ద్వారా సామాన్య ప్రజలలో స్వాతంత్ర్య శంఖారావం చేసిన కవులలో గరిమెళ్ళ సత్యనారాయణ అగ్రగణ్యుడు. ఈయన రాసిన 'మా కొద్దీ తెల్ల దొరతనము' అనే పాటను 1921–22 సంవత్సరాల మధ్య పాడని యువకుడు లేడు. ఆనాటి దేశభక్తులకు ఈ పాట తారకమంత్రమయింది. బ్రిటీష్ పాలకులకు ఆగ్రహాన్ని కలిగించింది.



Scanned with OKEN Scanner

**"మా కొద్దీ తెల్లదొర తనము, దేవ**
**మా కొద్దీ తెల్ల దొర తనము**
**మా ప్రాణాలపై పొంచి**
**మానాలు హరియించె**
**పన్నెండు దేశాలు పండుచున్న గాని**
**పట్టెడన్నమె లోపమండి**
**ఉప్పు ముట్టుకుంటే దోషమండి**
**నోట మట్టి గొట్టి పోతాడండి**
**అయ్యో కుక్కలతో పోరాడి కూడు తినమంటాడు".**

అని సాగే ఈ గేయం ఆనాటి యువకులలో గొప్ప ఉత్సాహాన్ని కలుగజేసింది.

తెలుగు సాహిత్య ప్రక్రియ లో ఒకటైన తెలుగునాటకం కూడా ప్రజలలో ఆమూలాగ్రం చొచ్చుకొని పోయి జాతీయోద్యమ భావనను స్వాతంత్ర్య కాంక్షను స్వేచ్ఛా పిపాసను కలిగించి స్వరాజ్యాన్ని సాధించే మార్గాన్ని చూపెడుతూ విప్లవాత్మకమైన ప్రజాచైతన్యాన్ని తీసికొని రావడానికి ప్రయత్నించింది. ఆనాటి బ్రిటీష్ ప్రభుత్వ నిరంకుశ పాలనను, అన్యాయాలను, దుర్మార్గాలను, నియంతృత్వ పోకడాలను వీటన్నిటి వలన ప్రజలు అనుభవించే కష్టనష్టాలను తెలిపే అనేక అంశాలతో నాటకకర్తలు నాటకాలను సృష్టించి ప్రజలను చైతన్యవంతులను చేయడానికి ప్రయత్నించారు. తద్వారా దేశభక్తిపరులు సమాజంలో ఉద్భవించి బానిసత్వ విముక్తి కొరకు, దేశమాత స్వేచ్ఛకొరకు ఊపిరి ఉన్నంతవరకు పోరాడారు. ప్రభుత్వానికి కంటిమీద కునుకు లేకుండా చేశారు. ఇటువంటి ప్రభుత్వ వ్యతిరేక చర్యలను ఉపేక్షిస్తే చివరకు తమ ఉనికే ప్రశ్నార్థకమవుతుందని బ్రిటీష్ ప్రభుత్వం భావించి భయపడింది. తమ అధికారాన్ని ఎవరు ఏ రూపంలో వ్యతిరేకించినా కఠినంగా శిక్షించాలనుకుంది. తెలుగు నాటక రచయితలు అనేకమంది ఈ ఆగ్రహానికి లోనయ్యారు. అట్టివారిలో ముఖ్యులు దామరాజు పుండరీకాక్షుడు.

స్వాతంత్ర్యోద్యమ కాలంలో నిద్రాణమైవున్న జాతిని మేల్కొల్పడానికి జాతీయోద్యమాన్ని ఉద్దీపింప చేయడానికి రచనలు చేసి ఎనలేని సేవ చేశారు. భారతదేశ దాస్య వృక్షాన్ని కూకటి వేళ్ళతో పెకిలించడానికి దామరాజు కలం నుండి జాలువారిన సాహిత్యం చాలావరకు తోడ్పడింది. గాంధీ అవేశాన్ని గంభీర రణ శంఖారావంలా భావించి నాటకాలు వేసి బ్రిటీష్ ప్రభుత్వాన్ని భయభ్రాంతం చేసిన ప్రచండ వీర మార్తాండుడు ఈ కవిధీరుడు. ఈయన రాసిన గాంధీ విజయం (1921) నాటకం నాటి ప్రభుత్వాన్ని దద్దరిల్లజేసింది. పాంచాల పరాభవం (పంజాబ్ దురంతాలు) (1922) అనే నాటకంలో గవర్నర్ జనరల్ డయ్యర్ ను 'డైరాసురా ' అని సంబోధించడం పై బ్రిటీష్ పార్లమెంట్‌లో ఈ నాటకం పై చర్చ జరిగింది. అనంతరం ఈ నాటకాలను ప్రభుత్వం నిషేదించింది. ఉద్యమ నాయకుల పేర్లమీద, ఉద్యమాల పేర్లమీద నాటకాలు రాసి ప్రదర్శిస్తుంటే ఆంగ్లేయ పాలకులకు సులభంగా దొరికిపోవడం జరుగుతుందని భావించి ఆయన హరిశ్చంద్ర, రాయభారం, చింతామణి వంటి నాటకాలు ప్రదర్శిస్తున్నట్లు ప్రచారం చేసి 'రణభేరి', క్విట్ ఇండియా, నవయుగారంభం (గాంధీమహోదయం) లాంటి నాటకాలు ప్రదర్శించేవారు.

స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తితో నాటకాలు రచించి ప్రదర్శించిన ముఖ్యులలో మరొకరు శ్రీపాద కృష్ణమూర్తి శాస్త్రి గారు. ఈయన 1921లో ' తిలక్ మహారాజు ' నాటకం రచించి ప్రదర్శించారు. ఇందులో నటి 'సుజలాం సుఫలాం' అంటూ వందేమాతర గేయం పాడుతూ ప్రవేశిస్తుంది. ఈయన 1924లో ' గాంధీ విజయ ధ్వజం ' అనే నాటకాన్ని రచించారు. ఇందులో నాగపూర్ కాంగ్రెస్ వరకు నడిచిన రాజకీయ చరిత్రను పొందుపరిచారు. ఇంకా 'స్వరాజ్యోద్యయం' అనే నాటకాన్ని కూడా రాశారు.



Scanned with OKEN Scanner

1921లో డి.సీతారామయ్య గారి 'స్వరాజ్య ధ్వజం', జంధ్యాల అయ్యవారి శాస్త్రి గారి ఆలీ ప్రభువుల నిర్బంధం, బుద్ధవరపు పట్టాభిరామయ్య గారి ' చిచ్చుల పిడుగు ' పేర్కొన దగిన స్వాతంత్ర్యోద్యమ నాటకాలు. చిచ్చుల పిడుగు 1857 నాటి విప్లవవీరుడు మంగళ పాండ్యే కథ. యలవర్తి శ్రీనివాసరావు గారి "పీష్వా నారాయణ రావు వధ", ముద్దరాజు సుబ్బారావు గారి చంద్రగుప్త, కోటమర్తి చిన రఘుపతి గారి 'చిత్తోడు పతనం' మొదలైన నాటకాలు వెలువడినాయి. ఇవేకాక ఇంకా గుండిమెడ సుబ్బారావు గారి 'మేవాడ పతనం', ఖిల్జీ రాజ్యపతనం, పురిపండ అప్పలస్వామి గారి 'ఉత్కల పతనం', శ్రీపాద కామేశ్వరరావు గారి 'కాలా పహాడ్', మంచిరాజు దుర్గా శంకరామాత్య గారి "శంభాజి నిర్యాణం" మొదలైన అనువాద నాటకాలు రచించబడి, ప్రదర్శించబడి సమస్త భారతీయుల సమైఖ్యానికి, స్వాతంత్ర్య సముపార్జనకు ఉపకరించాయి. స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నింపి చైతన్యవంతులను చేశాయి. తెలుగు సాహిత్య ప్రపంచంలో కవులు, కళాకారులు, రచయితలు జాతీయోద్యమ భావజాలాన్ని ప్రజలలో చొచ్చుకొని పోయేలా చేసి జాతి ఐక్యతకు ఎనలేని కృషిచేశారు. స్వాతంత్ర్య సముపార్జనకు, దేశభక్తి ప్రదర్శించడానికి, తమవంతు పాత్ర పోషించి తెలుగు నేలను పులకింపచేశారు.

**ఉపయుక్త గ్రంథాలు**

1. తెలుగు సాహిత్య చరిత్ర – డా॥ ద్వా.నా.శాస్త్రి
2. తెలుగు సాహిత్య సమీక్ష – డా॥ జి. నాగయ్య
3. దృశ్యం – గుంటూరు కళాపరిషత్ ప్రత్యేక సంచిక
4. రూపిక – నాటకరంగ విశేష సంచిక
5. సాహిత్యామృతం – ఆచార్య ఎస్. గంగప్ప



Scanned with OKEN Scanner

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# ఉన్నవ లక్ష్మీనారాయణగారి సాహిత్యోపన్యాసములలో స్వాతంత్ర్యపోరాటం

**డా. యన్. బేబీరమణి,** తెలుగు అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సదాశివపేట
చరవాణి : 9440543860

**ఉపోద్ఘాతము :** ఉన్నవ లక్ష్మీనారాయణగారి సాహిత్యోపన్యాసములను ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి ప్రచురించినది. ఈ సాహిత్యోపన్యాసములలో వారి స్వాతంత్ర్యపోరాటములను గూర్చిన వివరణ ఉన్నది. ఇందు వారి జీవన విశేషములు వివరముగా తెలుపబడ్డాయి. శ్రీ ఉన్నవ లక్ష్మీనారాయణగారు గాంధీజీ అడుగుజాడలలో నడిచి భారత జాతీయోద్యమం నిర్వహించిన స్వాతంత్ర్య సమరయోధులు. జంకుగొంకు లెరుగని దేశభక్తులు. తాను పేదరికంతో నలిగిపోయినా మాతృదేశ సేవాచరణంలో సర్వస్వం సమర్పించిన మహనీయుడు. కష్టాలనే సుఖాలుగా మార్చుకొన్న దేశభక్తుడు.

**బాల్యంలోనే జీవన పరమార్ధమును తెలుసుకొనుట:** తండ్రి శ్రీరాములుగారి సంస్కారం, కులమతాల విభేదం చూపకపోవడం వంటి విశాలభావాలు ఉన్నవగారికి సంక్రమించి ఉత్తమ సంఘసంస్కర్తగా తీర్చిదిద్దాయి. చిన్ననాడు చదివిన తిక్కన భారతములోని 'ఒరులేయవి యొనరించిన, నరవర! అప్రియము తన మనంబునకు' అను పద్యము, నీతిమంజరిలోని 'ఉపకారికి నుపకారము విపరీతముగాదు సేయ వివరింపంగా' అను పద్యము ఆయనకు జీవిత పరమార్ధము బోధించినవి. విద్యార్థిగా ఉన్నప్పుడే రాజారామ్మోహనరాయలు, దయానంద సరస్వతి, అనీబిసెంట్ మొదలయినవారిని గూర్చి తెలుసుకున్నాడు.

**న్యాయవాదిగా సంఘసంస్కరణ ఉద్యమం కొనసాగించడం :** 1903 నుండీ గుంటూరులో న్యాయవాదిగా ప్రాక్టీసు ప్రారంభించడంతో వారి సంఘ సంస్కరణ ఉద్యమం నిరాటంకంగా కొనసాగింది. 1913వ సంవత్సరంలో బారిస్టర్ చదవడానికై ఐర్లండు దేశం వెళ్ళారు. అక్కడ ఉన్న రోజులలో ఆయనకు ఐర్లండు స్వాతంత్ర్యోద్యమ నాయకుడైన 'డి నెరరా'తో సన్నిహిత పరిచయమేర్పడినది. ఐరిష్ ప్రజలు స్వాతంత్ర్యంకోసం సాగిస్తూ వచ్చిన పోరాటాలు ఆయన మనస్సులో అంతకుపూర్వమే నాటుకొనియున్న స్వాతంత్ర్య భావాలను మరింతగా ఉద్దీప్తం చేశాయి. 'బాన్సుబరీ' సభలో ఒకదొర ప్రసంగిస్తూ నల్లకూలీలను తీవ్రంగా విమర్శిస్తున్నాడు. సభ మధ్యలోనుండి ఒక తలపాగా వ్యక్తిలేచి 'నేను నల్లవాడినే, నల్లవాళ్ళను అవమానిస్తూ మాట్లాడినందుకు క్షమాపణ చెప్పక తప్పదు' అంటూ ప్రసంగించాడు. ఆ యువకుని మానవతాదృక్పధానికీ, నిర్భీక చిత్తవృత్తికీ సభలోని వారికి ఎంతో వాత్సల్యం కలిగింది. ఆ తలపాగా వ్యక్తే ఉన్నవ లక్ష్మీనారాయణగారు.

**ప్రత్యేక రాజకీయసంఘ కార్యదర్శిగా ఉన్నవ :** 1916లో వారు స్వదేశానికి తిరిగివచ్చి మద్రాసు హైకోర్టులో న్యాయవాదవృత్తి ప్రారంభించారు. అక్కడ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులుగారి వంటి ఆంధ్ర ప్రముఖులతో కలసి ఆంధ్రులకు ప్రత్యేక రాజకీయసంఘం ఏర్పడడానికి కృషి చేశారు. ఆ సంఘానికి కార్యదర్శిగా ఎన్నికైనారు.

**రాజకీయోద్యమకర్తగా ఉన్నవ :** ఉన్నవవారికి సంస్కరణోద్యమం, రాజకీయోద్యమం రెండూ రెండు కళ్ళు. రాజకీయంగా స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు లేనిదే సంఘసంస్కరణ సాధ్యం కాదని వారు గ్రహించారు. దేశభక్త కొండా వేంకటప్పయ్య పంతులు, ఆంధ్రరత్న దుగ్గిరాల గోపాలకృష్ణయ్య, విశ్వనాథ కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు మొదలైనవారితో కలిసి గ్రామగ్రామాలలో పర్యటించేవారు.

జాతీయ నిర్మాణ కార్యక్రమాలను గిరించి ప్రచారంచేసి జాతిని జాగృతం చేశారు. 1912 మేలో నిడదవోలులో కృష్ణా, గుంటూరు సంయుక్త సభలు ఏర్పాటు చేశారు. మద్రాసు, మైసూరు, హైదరాబాదు, మహారాష్ట్ర, ఒరిస్సా ప్రాంతలలో ఉన్న ఆంధ్రప్రాంతాలను కలిసి జొన్నవిత్తుల గురునాథంగారు, ఉన్నవవారు 'విశాలాంధ్ర' దేశ పటాన్ని తయారుచేసి ప్రదర్శించారు. రేపల్లెలో జరిగిన గుంటూరు జిల్లా సంఘసంస్కరణ మహాసభ అగ్రాసనాధిపతిగా, కొవ్వూరులో జరిగిన కృష్ణామండల సంఘసంస్కరణ మహాసభకు అధ్యక్షుడిగా ఉన్నవవారు ప్రజాహృదయాలను రంజింపజేశారు. 1918లో సత్తెనపల్లిలో జరిగిన గుంటూరు మండల రాజకీయసభకు ఆహ్వాన సంఘాధ్యక్షులు లక్ష్మీనారాయణగారే. అదే సంవత్సరం కాశీనాథుని నాగేశ్వరరావు పంతులుగారి అధ్యక్షతన సత్తెనపల్లిలో గుంటూరుజిల్లా అవసరాంధ్ర రాష్ట్రీయ మహాసభ జరిగింది. ఆ సభలో మాంటేగ్సు మంత్రి ప్రతిపాదించిన రాజకీయ సంస్కరణలు కేవలం నేతిబీరకాయవంటివని, ఈ ప్రణాళికవల్ల ప్రజలకు కట్టు గుడ్డ, తిన తిండి లభించదనీ నిర్భయంగా చాటి చెప్పారు. తరువాత వారు గుంటూరుజిల్లా కాంగ్రెసు సంఘానికి అధ్యక్షులైనారు.

1921లో పాత పొన్నూరులో జరిగిన సభ చిరస్మరణీయమైనది. పాత పొన్నూరు చెరువుగట్టు ప్రక్కనే పందిళ్ళు వేయించారు. ఈ సమావేశంలోనే శాసనధిక్కారం చేయాలనీ, సత్యాగ్రహోద్యమాన్ని నడపాలనీ దుగ్గిరాల గోపాలకృష్ణయ్యగారు వాదించారు. గొల్లపూడి సీతారామశాస్త్రిగారు మొదలైనవారు సత్యాగ్రహోద్యమానికి దేశమంతా తయారుగా లేదని, అఖిలభారత కాంగ్రెసు ఆమోదముద్రకూడా లభించలేదని, ప్రస్తుతానికి వాయిదా వేద్దామని ప్రతిపాదన చేశారు. మన గుంటూరు మండలం రాజకీయంగా సంపూర్ణ చైతన్యం పొందిందని, వెంటనే సత్యాగ్రం ప్రారంభించుదాననీ గోపాలకృష్ణయ్యగారు పట్టుపట్టడంతో సభ జయజయ ధ్వానాలతో తీర్మానాన్ని ఆమోదించింది. ఆ సభలోనే దుగ్గిరాల గోపాలకృష్ణయ్య గారిని 'ఆంధ్రరత్న' బిరుదుతో ఉన్నవవారు సత్కరించారు.

1920లో మహాత్ముని రాజకీయ ప్రవేశంతో భారత స్వాతంత్ర్య సమరచరిత్రలో మహోజ్వలఘట్టం ఆరంభమైనది. జాతి స్వాతంత్ర్యానికై చతుర్విధ బహిష్కరణోద్యమం ప్రారంభమైనది. అవి విదేశీ వస్తు బహిష్కరణ, సహాయ నిరాకరణోద్యమం, కోర్టులను బహిష్కరించుట, స్కూళ్ళు, కాలేజీలను బహిష్కరించుట. యంత్రసహాయముతో వస్త్రములు మొదలైన వస్తువులు తయారుచేసి దేశీయ చేతిపరిశ్రమలను, వృత్తులను నశింపజేస్తున్నారు. కాబట్టి భారతీయులు విదేశీ వస్తువులను బహిష్కరించాలని సత్యాగ్రహోద్యమాన్ని ప్రారంభించారు. దేశీయ విద్యలను దేశీయ భాషలను విధ్వంసం చేస్తున్న బ్రిటిషు పరిపాలనకు తమ తోడ్పాటు ఇవ్వరాదని విద్యావేత్తలను యువకులను ఆయన ఉద్బోధించారు. ఖద్దరు ఉత్పత్తి శారదా నికేతనములోని నిర్మాణ కార్యక్రమాలలో ముఖ్యమైన శాఖ అయినది.

**పుల్లరి సత్యాగ్రహము :** పల్నాడు అడవి ప్రదేశము. అక్కడి ప్రజలు చిరకాలంనుంచీ కట్టెపుల్లలు ఏరుకొని, ఆకులు కోసుకొని స్వేచ్ఛగా జీవిస్తుండేవారు. ఆ అడవుల్లో పశువులను మేపుకొంటూ కొందరు కాలం గడుపుతున్నారు. ఈ స్థితిలో నాటి బ్రిటిషు ప్రభుత్వము పుల్లరి అనే పన్ను వసూలుచేయడం ప్రారంభించింది. అడవిలోకి ఎవరినీ పోనీయక, స్థానికోద్యోగులు బీదప్రజలను హింసిస్తూ, అక్రమంగా వారిపై కేసులు పెడుతూ, వారి పశువులను బందెలదొడ్డికి తోలుతూ నానాబీభత్సం సృష్టిస్తున్నారు. అటవీశాఖ ఉద్యోగులు తాము పట్టిన కేసులకు తప్పుడు సాక్ష్యాలు సృష్టించేవారు. ప్రజాజీవితం దుర్భరమైపోయినది. ప్రజలు ఎదురుతిరిగి పుల్లరి చెల్లించమని తిరుగుబాటు చేశారు. ఇదే పల్నాటి పుల్లరి సత్యాగ్రహం.

ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసు సంఘమువారు సమావేశమై 1921 జులైలో ఉన్నవ లక్ష్మీనారాయణగారిని, మాడభూషి వేదాంతం నరసింహాచార్యులు గార్లను సభ్యులుగా నియమించి, పలనాడు వెళ్ళి పుల్లరి సత్యాగ్రహం విషయమై సమగ్రంగా విచారించి నివేదిక సమర్పించమని తీర్మానించారు. వారిద్దరు పల్నాడులో ప్రవేశించి విచారణ ప్రారంభించారు. ఆ సమయంలో వారిపై 107వ



Scanned with OKEN Scanner

సెక్షను క్రింద నోటీసు వారెంటును జారీచేశారు. నోటీసులోని సారాంశమేమనగా 1. పల్నాటి ప్రజలను అడవుల చట్టములను అతిక్రమించు నిమిత్తము మీరు పురిగొల్పుచున్నారని 2. మీరు అడవి ఉద్యోగులను సంఘబహిష్కారము చేయించుటకును, వారిని బెదరించుటకు పురిగొల్పుచున్నారని, 3. పల్నాటి శాంతికి భంగము గలుగజేయుచున్నారని నేరారోపణలు చేసి లక్ష్మినారాయణగారికి, నరసింహాచార్యులుగారికి చెరో సంవత్సరము శిక్ష విధించిరి. జైలుశిక్ష అనుభవించుటకు రాయవెల్లూరు సెంట్రలు జైలుకు పంపుటకుగాను రైలులో గుంటూరు తీసుకొని వస్తున్న సమాచారం తెలియగానే ప్రజాసమూహం ఒక మహాసముద్రంలా స్టేషనుకు వచ్చి పూలవర్షం కురిపించినారు. వీరోచితమైన స్వాగతమిచ్చినారు.

**'వీరగంధము తెచ్చినారము వీరులెవ్వరొ తెల్పుడీ,**
**పూసిపోదుము మెడనె వైతుము పూలదండలు భక్తితో'**

ఉన్నవగరు పల్నాటివీరచరిత్ర 'నాయకురాలు' అనే నాటకములో బానిసత్వ భావన భరించుట కష్టమని తెలిపారు.

**'పరతంత్ర ప్రజలపాలి దు:ఖములు**
**చెప్పంగ శక్యమే శివునకునైన'**

**ఉప్పుసత్యాగ్రహం :** మహాత్ముని పిలుపునందుకొని 930లో దేశమంతటా ఉప్పుసత్యాగ్రహం జరుగుతున్న రోజుల్లో గుంటూరులో ఆ మహోద్యమానికి సారధ్యం వహించినవారు ఉన్నవ లక్షీనారాయణగారే. బ్రహ్మాండమైన స్వరాజ్యప్రభను 30 అడుగుల ఎత్తున కట్టించారు. దానినిండా భరతమాత, కాంగ్రెసు నాయకుల చిత్రపటాలు అంటించారు. 4 ఎద్దులతో కట్టిన బండిమీద నిలబెట్టినారు. ఉన్నవవారు వారి శిష్యబలగంతో నావెళ్ళ కృష్ణయ్య మొదలైనవారు ఆ ప్రభకుముందు నిలచి ఉన్నవవారు రచించిన స్వరాజ్యదండకం, కాంగ్రెసు బుర్రకథ, స్వరాజ్య సోదె మొదలగు రచనలను మహోత్సాహంతో చదివారు.

**ముగింపు :** ఈ విధంగా మహాత్ముని ఉద్యమాలకు గుంటూరు మండలంలో అండగా నిలచి స్వాతంత్ర్యసిద్ధికై స్థిరసంకల్పంతో కృషిచేసిన మహనీయుడు లక్షీనారాయణగారు.



Scanned with OKEN Scanner

# జాతీయోద్యమ చైతన్యప్రతిఫలనం - అనిశెట్టి అగ్నివీణ

**శ్రీకాంత్ నామ,** తెలుగు అధ్యాపకులు, ఎస్.ఆర్.ఆర్. & సి.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విజయవాడ
చరవాణి : 9985138335, namasrikanth002@gmail.com

మన దేశాన్ని రెండు శతాబ్దాల పాటు పరిపాలించిన బ్రిటీషు వాళ్లు తమ అవసరాల కోసం మన ప్రయోజనాలను ఫణంగా పెట్టి దోపిడి పాలనకు తెరతీశారు. వీరికి వ్యతిరేకంగా 1857లో ప్రథమ స్వాతంత్ర్య పోరాటం జరిగింది. దీనినే కొందరు చరిత్రకారులు (సిపాయిల తిరుగుబాటు)గా అభివర్ణించారు.

1857 తరువాత బ్రిటీషు వారి ప్రత్యక్ష పాలన కిందికి మన దేశం వెళ్లడంతో వారి సామ్రాజ్యవాద వైఖరి మరింత విస్తృతిని పొందింది. ఆంగ్లేయుల అణచివేత, విభజించు పాలించు వ్యూహం, దోపిడీ విధానాలను నిరసిస్తూ ప్రజలు వివిధ రూపాల్లో తమ స్వేచ్ఛా కాంక్షను ప్రకటించారు. భారత జాతీయ కాంగ్రెసు 1885లో ఏర్పడిన తరువాత జాతీయోద్యం నిర్మాణాత్మకంగా సాగింది.

స్వాతంత్ర్య ఉద్యమ చైతన్యాన్ని సజీవంగా ప్రజల్లో నిలిపేందుకు ఆనాటి సాహిత్యం కూడా దోహదపడింది. పుంఖాను పుంఖాలుగా వెలువడిన జాతీయోద్యమ సాహిత్యం ఉద్యమానికి ఊపందించింది. జాతీయోద్యమ కాలం నాటి కవులు స్వయంగా స్వతంత్ర పోరాటంలో పాల్గొనడమేగాక పరాయి బానిస సంకెళ్లను చేదించేందుకు తమ కలం నుండి అక్షర తూణీరాలను సంధించారు.

1930 దశాబ్దంలో తెలుగు సాహిత్యంలో వచ్చిన అభ్యుదయ ధోరణి స్వతంత్రోద్యమ భావాల వ్యాప్తికి దోహదపడింది. స్వాతంత్ర్యోద్యమం ఉచ్ఛస్థితిలో ఉన్నపుడు అభ్యుదయ సాహిత్యోద్యమం ప్రజలలో చైతన్యాన్ని పురిగొల్పింది. అభ్యుదయ సాహిత్య లక్ష్యాన్ని గురించి కంచెనపల్లి చినవెంకటరామారావుగారు క్రింది విధంగా వివరించారు. "సాహిత్యంలో సామ్యవాద వాస్తవికత (సోషలిస్టు రియలిజం) సాధించడం దాని అంతిమ ఆశయం కానీ, తక్షణ ఆశయం మాత్రం ఆనాటికి జాతీయ స్వాతంత్ర్యాన్ని సాధించడం" (ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు) చూపుట ; 111) అభ్యుదయ కవులు ప్రధానంగా సామాన్యుని వైపు నిలిచి వారిలో అన్యాయాన్ని, పాలకుల అక్రమ విధానాలను ప్రశ్నించే చైతన్యాన్ని నింపారు.

స్వతంత్ర పోరాట ఘట్టాన్ని అక్షరీకరించిన తెలుగు కవులలో అనిశెట్టి సుబ్బారావుకి ఒక ప్రత్యేకత ఉంది. వీరి అగ్నివీణ (1949) కవితలలో గతాన్ని, వర్తమానాన్ని మాత్రమేగాక భవిష్యత్తును సైతం దర్శించారు. అనిశెట్టి సుబ్బారావుగారు కాలం (1922 – 1981) అభ్యుదయ సాహిత్య ధోరణిలో చేసిన రచనలు, 1942లో నరసరావుపేటలో స్థాపించిన నవ్య కళాపరిషత్తు నాటి సమాజాన్ని అభ్యుదయం వైపుకు నడిపినవి. వీరు కవిగా, నాటక కర్తగా, స్వతంత్ర సమరయోధుడిగా, సినిమా రచయితగా భిన్న రంగాలలో బహుముఖీనంగా వారి ప్రతిభను చాటుకున్నారు.

**వచ్చాను వచ్చాను :** అనే కవితలో వెళ్ళిపోయిన కోటి కోట్ల జీవుల విడిచి కుళ్ళిపోయే నేటి కోట్ల జీవుల కొరకు పొర్లి వచ్చే కోటి కోట్ల జీవుల కొరకు వచ్చాను అని ప్రకటించడాన్ని బట్టి గతాన్ని స్మరించడం కంటే బానిసత్వంలో మగ్గిపోతున్న తన సమకాలీన ప్రజానీకం స్వేచ్ఛ కలిగి ఉండాలని, భవిష్యత్తరాల వాళ్ళు స్వాతంత్ర్య ఫలాలను అనుభవించాలనే కోరిక వ్యక్తమౌతుంది. "పరతంత్రతలో



Scanned with OKEN Scanner

మగ్గ బానిసలముక్తికై – కదిలి వెళ్ళే మీకు అడుగడుగునా నేనె అండగనిలుస్తాను !" అని కవిగా ఒక స్వతంత్ర సమరయోధుడిగా తన బాధ్యతను ప్రకటిస్తాడు.

పరాయి పాలనలో మగ్గిపోతున్న దేశ ప్రజలు కాల స్పృహ, మారుతున్న పరిస్థితుల పట్ల అవగాహన కలిగియుండాలని అపుడే శతృవును ఎదిరించగలరనే విషయం వెల్లడి చేశారు.

**భూత, భవిష్యత్తులను వ్యాఖ్యానిస్తూ ....**

"వెనుక : బంగరుపండు అమర ప్రజం?! ముందు: సమధర్మ సంఘ సంస్థాపనోత్సవము రా! సాగురా స్వాతంత్ర్య యోధుడా!" గతంలో ఉన్న స్వతంత్రతను, అమరవీరుల త్యాగ నిరతిని హృదయంలో నిలుపుకొని బంగారు భవిష్యత్తును నిర్మించాలని ప్రబోధించారు. స్వతంత్ర యోధుడు కదిలి వెళితే అడుగడుగునా శత్రువు అణిగిపోతాడని పోరాట వీరుల శౌర్యాన్ని కవి కొనియాడతాడు.

అలాగే గతంలో జరిగిన సామ్రాజ్యాలు శాశ్వత సమాధులైనాయని, కనుక స్వాతంత్ర్య యోధుడు తన ముందున్న శత్రువును ఎలా ఎదుర్కోవాలో చెబుతూ.....

"శత్రు క్రూర మృగము తుత్తునియలై అడుగడుగు మంటలెగసే కంఠ ఘోషతో సాగురా స్వాతంత్ర్య యోధుడా!" అని కర్తవ్యబోధ చేశారు. కవి, "మీ ఒకే గుండెగా మ్రోగుతున్నానురా"! అని అంటూ ప్రజల్లో ఎన్ని వైవిధ్యాలు ఉన్నా అందరూ ఒక్కటిగా కలిసి ఉండాలని సూచించాడు.

రండులేచి! రండులేచి అనే కవితలో జైలు బంధనాలకు, జరామరణ భయాలకు వెరవ కూడదని స్వతంత్రత కోసం అన్ని వర్గాల ప్రజలు స్థబ్ధతను విడిచి చైతన్యం పొందాలని పీడిత పాలన నుండి విముక్తికై ఉద్యమించాలని.....

"చిరబంధన జరామరణ చింతయేల! రండులేచి!

పరుల ఇంటి అరుగుపైన పవళించిన పాంధ సఖా! ఊరి చివర నడబావిలో జారిన ఓ అంధసఖా! రండులేచి!" అని అనిశెట్టి వారు పిలుపునిచ్చారు. దేశ నిర్మాణంలో శ్రమించినా మనకి రక్షణ లేని స్థితిని కొమ్మలేని చెట్టుకింద కుమిలి పోతున్న వాడిలా మారిందని నాటి ప్రజల దీనతను కళ్ళకు కట్టాడు కవి.

**"నేనుగూడ నడుస్తాను"**

కవితలో కవి స్వతంత్ర సమరోత్సాహంతో సాగే ప్రజలను శాంతి కోసం, జగత్తును దాస్య శృంఖలాల నుండి విముక్తి గావించి వారిని శత్రువులను తుత్తునియులుగా చేయగల శక్తి గల తమను నడిపించే సమిష్టి సాధనాలను ప్రస్తావించాడు. ఇక్కడ నేను కూడా! నడుస్తానంటే నేనెవరు ? అన్న ప్రశ్నకు సమాధానంగా ...

"నేనెవరా ? మా స్వాతంత్రోద్యమాన్ని ముందుకు నడిపే జెండా ! మా నిర్భయ జీవితాన్ని మ్రోగే స్వేచ్ఛా గీతం!" అని తన దేశభక్తి ప్రకటించాడు. దీర్ఘకాలంగా కొనసాగిన అణచివేతకు జ్వలించిన ఉద్యమ స్ఫూర్తిని ఈ క్రింది వాక్యాల్లో కవి ప్రకటించారు.

"మూడు శతాబ్దాల నుండి దూకేచిచ్చుల పిడుగు నా దేహం!" పై వాక్యాన్ని మనం పరిశీలించినపుడు పరాయితనాన్ని ఏమాత్రం అంగీకరించని కవి యొక్క తత్వం మనకు బోధపడుతుంది.

భారత ప్రజల మధ్య సయోధ్యను సాధించే అంతస్సూత్రమైన సహోదర భావనను బలపరిచే విధంగా వీరు రాసిన "అయ్యో! మన బెంగాల్ ప్రజ" అనే కవిత బెంగాలీయులు ఎదుర్కొన్న కరువు పరిస్థితులను సాక్షాత్కరింపజేసింది. కవి.....



Scanned with OKEN Scanner

"అయ్యో ! మన బెంగాల్ ప్రజ అహుతై నశిస్తున్నది. కన్నులున్న కరుణవున్న అన్న లార మేలుకోండి !"

అని సౌభ్రాతృత్వ భావనను ప్రకటించారు. యుద్ధం, క్షామం, ఆకలి, వ్యాధి వలన మృత్యు ఒడికి చేరే బెంగాల్ ప్రజలను కాపాడుకోవాలనే స్పృహను కలిగించాడు. బెంగాల్ కరువు తీవ్రతను ప్రముఖ చరిత్రకారుడైన బిపన్ చంద్ర మాటల్లో చెప్పాలంటే "1943లో సంభవించిన బెంగాల్ కరువు రక్కసి దాదాపు 30 లక్షల మందిని బలిగొన్నది" బెంగాల్ వాసుల కష్టాన్ని తమదిగా భావించి సహాయం చేయాలని కవి ఇచ్చిన పిలుపు సహానుభూతిని వ్యక్తం చేసి, జాతి ఐక్యతకు దోహదపడింది.

మద్రాసు మహానగరంలో ఉద్యమాన్ని వర్ణించిన తీరు కవి దార్శనికతను తెలియజేస్తుంది. ఉద్యమ తీరును గురించి కవి....

"ఎప్పుడో మరణించిన వీరులు ఇప్పుడు బలిఅయ్యే పౌరులు అప్పుడు జన్మించేబిడ్డలు అంతా ఇప్పుడే ఇక్కడే వున్నారు? అంతా పాడుతూనే పోరాడుతూనే వున్నారు!" అనడాన్ని బట్టి మరణించిన వీరత్వాన్ని పొంది, పౌరులు పోరాడుతు అమరులౌతుంటే అపుడు జన్మించే బిడ్డలు కూడా ఇక్కడే ఉన్నారనడమంటే భావి భారతాన్ని ఉద్యమంలో ఐక్యం చేసినట్లు మనం అర్థం చేసుకోవచ్చు. జాతీయోద్యమంలో పాల్గొన్న అన్ని వర్గాలను, తరాలను అనుసంధానిస్తూ ఐక్యతను అనిశెట్టి వారు చాటారు. "ఆద్యంతాలీ యాత్రకు పరిధులు అనంతమే దీనికి అవధి !" అనడం ద్వారా పీడిత ప్రజలున్నంత కాలం ఉద్యమం ఏదో ఒక రూపంలో, ఏదో ఒక పేరుతో కొనసాగుతుందని కవి ఉద్దేశ్యం.

"లేవండి! లేవండి! లెండి మానవులార !" అనే కవితలో క్విట్ ఇండియా సమయంలో గాంధీజి ఇచ్చిన (Do or Die) నినాదాన్ని స్ఫూర్తిగా తీసుకుని విజయమో, స్వర్గమో విక్రమించండి! అని ఉద్యమంలో ముందుకు దూసుకు పోవలసిన ఆవశ్యకతను ఉద్ఘాటించాడు అనిశెట్టి.

"గుండె గుండెకు చిచ్చుమండించి లేవండి! గుడిసె గుడిసెకు కోట నిర్మించి లేవండి !" అని ఒకరికి ఒకరు తోడుగా నిలిచి ఉద్యమ స్ఫూర్తిని గ్రహించి ముందుకు సాగాలని ప్రజా వాహినిని ఆహ్వానించారు.

**పాలకుల దోపిడికి వ్యతిరేకంగా పోరాడవలసిన విధానాన్ని చెబుతూ....**

"ఒక్క శిశువేడ్చినా, ఒక గింజదోచినా ఉరిమి పిడుగుల్లాగ విరుచుకుపడండి!" అని బ్రిటీషు వాళ్ల దౌర్జన్యాలను గర్హించమంటారు. మానవ మేధస్సును ఒక సర్చ్ లైట్‌తో పోల్చిన కవి అది భవిష్యత్ అనే సముద్రంలో ఒక మణి కోసం, భవిష్యత్ అనే ఎడారిలో మంచి ఒయాసిస్ కోసం బాహ్యాంతర పరిశోధన కొనసాస్తుందని చెప్పడాన్ని బట్టి వీరి ఆశావాద దృక్పథం ద్యోతకమౌతుంది.

**ఒక్క అడుగు మన తల రాతలని నిర్ణయిస్తుందని అది ఎటువైపు వేయాలో తేల్చుకోమని....**

"నీముందున్నది ప్రజ! నీ వెనకున్నది రుజ! ముందడుగొక్కటి వేస్తే మూల విరాట్టును విడిచి, వెనుకడుగొకటే వేస్తే ప్రాణదాతలను మరిచి అదే అదే ఆ అడుగే నీ విలువకు కొలమానం!" సూచించడంతో పాటు నిర్ణయంతో పొరపాటు చేయవద్దంటాడు. అనిశెట్టి సుబ్బారావుగారి మాతృ దేశభక్తికి 'మాతృ సంగీతం' ఒక చక్కని ఉదాహరణ.

"పాలపొదుగు నాతల్లీ! ప్రాణ దాత నా తల్లీ!" అని మాతృదేశాన్ని స్తుతిస్తూ బానిసత్వం నుండి విముక్తి పొందమని మాతృ భూమి పిలుస్తుందని నిస్తేజంగా ఉండకుండా ఉద్యమించాలంటారు.

"పుడమినిండ నీనెత్తురు పుష్కలముగ చిమ్మరా! పురాదాస్య పరాభవము పూర్తిగ కడిగేయరా !" అని దేశ రక్షణలో ప్రాణాలైన ఫణంగా పెట్టవలసిన సమయం ఆసన్నమైనదని అనిశెట్టి ప్రబోధించారు.



Scanned with OKEN Scanner

తన గీతానికి బతికి చచ్చిన వాడిలాగా నిస్తేజంగా ఉండేవారి హృదయాలను చీల్చే శక్తి ఉందని, తనది నలభై కోట్ల ప్రజ విప్లవకంఠమని ప్రకటిస్తాడు. "వద్దు ! నాకు వర్గాలుగ నరులను చీల్చే న్యాయం!" అని బ్రిటీషు వారు పాటించిన మతపరమైన విభజన విధానాన్ని, "వద్దు నాకు, భూమికి సరి హద్దులు కొలిచే న్యాయం!" అని భౌగోళికంగా విభజించే విధానాన్ని నిరసించాడు. స్వాతంత్ర్యం సిద్ధించే నాటి పరిస్థితిని తెల్లవారి దౌర్జన్యాలకు బలియైన పీడిత జనం స్పందించవలసిన తీరును.... "పామరుల శిరస్సులతో బంతులాడు పాలకులను ప్రగతి చక్రఘట్టనతో సంహరించవలెనురా!" అని ఉద్ఘాటించాడు.

"మతంతాగి నగరాల్ నర రక్తంలో నాట్యమాడు, సడలిన మనపల్లెబడుగు నడుము విరుగదొక్కెనురా" అంటు కవి పరాయి పాలన ఫలితంగా ఒకప్పుడు సిరి సంపదలతో వర్ధిల్లిన మన దేశంలో మత ఘర్షనలు, కునారిల్లిన పల్లెలు వంటి పరిస్థితులు దాపురించాయని తెలియజేశాడు.

ఈ విధంగా నాటి అమరవీరుల త్యాగ ఫలమైన స్వాతంత్ర్య స్ఫూర్తి అగ్ని వీణ కవితా సంపూటిలో ప్రతిఫలించింది. కమ్యూనిజం వైపు ఆకర్షితుడైన అనిశెట్టి వారి (అగ్నివీణ) కవితలలో నాటి రైతాంగ పోరాటాలు, శ్రామిక తిరుగుబాట్లు వంటి అంశాలు కూడా మనకు దర్శనమిస్తాయి. వీరి రచనలలో ఉద్యమ స్ఫూర్తిని వెల్లడి చేయడానికి అభ్యుదయ కవిత్వం దోహదపడింది. "అభ్యుదయ కవిత్వం అంతవరకూ ఉన్న సర్వ కవితా ప్రాతిపదికల్ని తిరస్కరించిన విప్లవాత్మక కవిత్వమైంది. ఆ తర్వాత వచ్చిన విప్లవకర కవిత్వానికి అంతటికి వర్తించే ప్రాతిపదికలు అభ్యుదయ కవిత్వమే సమకూర్చింది" (తెలుగులో కవితా విప్లవాల స్వరూపం – పేజి : 78) పై విధంగా అభ్యుదయ కవిత్వం ఆ తరువాత వచ్చిన ధోరణులకు ఏ విధంగా స్ఫూర్తి నిచ్చిందో వివరించారు వెల్చేరు నారాయణరావుగారు.

స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా జైలుకు వెళ్లిన ఒక సమరయోధుడి కలం నుండి జాలువారిన భావాలను స్మృతిపథంలో నిలుపుకొని నాటి జాతీయోద్యమ పోరాట స్ఫూర్తిని నిరర్థకం కానివ్వకుండా ముందుకు తీసుకుపోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందనడం అతిశయోక్తి కాదు.

**ఆధార గ్రంథాలు**

1. అగ్నివీణ – అనిశెట్టి సుబ్బారావు
2. ఆధునిక తెలుగు సాహిత్యంలో విభిన్న ధోరణులు – సంపాదకులు : కె.కె. రంగనాథాచార్యులు
3. తెలుగులో కవితా విప్లవాల స్వరూపం – వెల్చేరు నారాయణరావు
4. ఆధునిక భారతదేశ చరిత్ర – బిపన్ చంద్ర – ప్రజాశక్తి ప్రచురణ (తెలుగు – వి. వాసుదేవ దీక్షితులు, కొమ్మారెడ్డి కేశవరెడ్డి)



Scanned with OKEN Scanner

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) UGC Care List Approved Journals
హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# భారత స్వాతంత్రోద్యమంలోసాహిత్యం పాత్ర

**తోట నరసింహారావు,** చరిత్ర అధ్యాపకులు, ఎ.జి & ఎస్.జి సిద్ధార్థ డిగ్రీ కళాశాల

భారతదేశంలో స్వాతంత్రోద్యమం జరుగుటకు ప్రధాన కారణం మేధావి వర్గం యొక్క రచనలు. భారతదేశ కురువృద్ధుడు అయిన *ధాదాభాయ్ నౌరోజీ* తన గ్రంధమైన "డ్రైన్‌తీరి" లో భారతదేశ సంపద ఏ విధంగా ఇంగ్లాండ్ తరలిపోతుందో అంకెలతో సహా వివరించెను. ఇది తెలుసుకున్న భారతీయులు ఆంగ్లేయులపై పోరాటం ప్రారంభించెను. ఈ క్రమంలోనే జాతీయ నాయకులు అయిన *రవీంధ్రనాథ్ ఠాగుర్* తన "గీతాంజలి" అను నవల ద్వారా *బంకింగ్ చంద్ర చటర్జీ* "ఆనందమఠం" అను నవల ద్వారా ప్రజలో దేశభక్తిని ప్రేరేపించగా ఆనంద మఠం నవలలోని వందేమాతర గేయంను బెంగాల్ విభజనకు వ్యతిరేఖంగాఆలపించి ఉద్యమం నడిపెను. ఇదే "వందేమాతర ఉద్యమం" గా 1905 నుండి 1911 వరకు జరిగెను. 1911లో రెండోవ హర్డింజ్ బెంగాల్ విభజనను రద్దు చేయుటతో భారత స్వాతంత్ర్య ఉద్యమంలో ఆంగ్లేయులపై భారతీయులు సాధించిన మొదటి విజయంగా వందేమాతర ఉద్యమం నిలిచెను. అందువల్లనే బెంగాల్ మేధావులకు పుట్టినిల్లుగా ప్రసిద్ది చెందెను. ఈ బెంగాలీల రచనలు అయిన వందేమాతరం, జనగణమనలు భారతదేశ జాతీయ గేయం, జాతీయగీతంగా భారత రాజ్యాంగంచే గుర్తించబడెను.

తరువాత వచ్చిన తిలక్ తన పత్రికలు అయిన కేసరి, మరాతాల ద్వారా తన భావాలను ప్రజలకు అందేలా చేసి గణపతి ఉత్సవాలు, శివాజి జయంతులు నిర్వహించి ప్రజలలో ఐక్యతాభావాన్ని కలిగించి స్వతంత్రోద్యమంలో విజయం సాధించెను. విదేశీ వనిత అయిన అనిబిసెంట్ కూడా భారతీయ జాతీయ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్ళడం కోసం "న్యూ ఇండియా", "కామన్‌వీల్" అను పత్రికలను స్థాపించెను.

తిలక్, అనిబిసెంట్‌ల యొక్క పత్రికల వల్ల వారు నడిపిన హెూమ్‌రూల్ లీగ్ విజయవంతం అయ్యెను. భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీగారి ప్రవేశంతో నూతన అధ్యాయం ప్రారంభమయ్యెను. గాంధీ గారు కూడా సహాయనిరాకరణ ఉద్యమం (1920), శాసనోల్లంఘన ఉద్యమం (1930), క్విట్ ఇండియా ఉద్యమం (1942) వంటి ఉద్యమాలు విజయవంతంగా నిర్వహించుటకు "హరిజన్", "నవజీవన్" అను పత్రికలను ఉపయోగించుకునెను. గాంధీ తన భావాలను"మై ఎక్సఫర్‌మెంట్ విత్ ట్రూత్" అను గ్రంధం ద్వారా ప్రజలకు వ్యాప్తి చెసెను. ముస్లీం రచయితలు కూడా తమ సాహిత్యం ద్వారా జాతీయ ఉద్యమంను ముందుకు నడిపించెను.

**"సారే జహాసే అచ్చా**
**హిందూస్తాన్ హమారా"** – మహ్మద్ ఇక్బాల్

అను పద్యం ద్వారా హిందు ముస్లీం ఐక్యతను చాటెను.

ఈ క్రమంలోనే ఆంధ్రాలో కూడా స్వాతంత్ర్య ఉద్యమం కొనసాగుటకు తెలుగులో వెలువడిన పత్రికలు, తెలుగులో వ్రాయబడిన గ్రంధాలు ఎంతో ఉపయోగపడెను.



Scanned with OKEN Scanner

స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆంధ్ర దేశంలో సామాన్య ప్రజలు 90% నిరక్షరాశ్యులుగా ఉన్నారు. అందువల్ల వారిని అక్షరాశ్యులుగా తీర్చిదిద్ది ఉద్యమంలో భాగస్వాములను చేయడానికి కొమర్రాజు లక్ష్మణరావు లాంటి కొందరు సాహిత్యాభివృద్ధికి కృషి చేశారు. వీరి కృషి వల్ల అనేక రకాలైన గ్రంధాలు రాయబడి గ్రంధాలయాలు స్థాపన జరిగింది. అవి చదివినవారు జ్ఞానాన్ని పొంది బ్రిటీషువారు భారతీయులను ఏవిధంగా దోపిడి చేస్తూన్నారో తెలుసుకొని తద్వారా బ్రిటీష్‌వారికి వ్యతిరేకంగా పోరాడేందుకు స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారు.

కొమర్రాజు లక్ష్మణరావు ఏ వ్యక్తి అయినా గ్రంధాలను పఠించుట ద్వారా జ్ఞానాన్ని పొంది తన భావి జీవితానికి పునాదులు వేసుకోవచ్చు అని చెప్పాడు. స్వాతంత్ర్య సమర యోధులు మొదటిగా గ్రంధాలయ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఇందులో భాగంగా చారిత్రక గ్రంధాలు అవసరం అని గ్రహించిన "ఆంధ్ర చరిత్ర పరిశోధనా పితామహుడు" అయిన కొమర్రాజు లక్ష్మణరావు గారు రావిచెట్టు రంగారావు మైలవరపు నరసింహాశాస్త్రి లతో కలసి "గ్రంధాల ఉద్యమాన్ని" ప్రారంభించారు. మొదట హైదరాబాదులో 1901లో "శ్రీకృష్ణదేవరాయ ఆంధ్రభాషా నిలయం" స్థాపించారు. ఇందులో భాగంగా ఆదిరాజు వీరభద్రరాజు చారిత్రక గ్రంధాలు, శాసనాలు, తాళపత్ర గ్రంధాలు వంటి వాటిని పరిశీలించి సేకరించారు.

ఈ క్రమంలోనే కొమర్రాజు లక్ష్మణరావుగారు, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, అయ్యదేవర కాళేశ్వరరావులతో కలసి 1906 లో "విజ్ఞాన చంద్రిక మండలి" ని స్థాపించారు. దీని ద్దారా అనేక గ్రంధాలు వెలువడ్డాయి.

1. "అబ్రహం లింకన్ – జీవిత చరిత్ర"
2. అచంట లక్ష్మిపతిగారి – జీవశాస్త్రరా కలరా, మలేరియా అను గ్రంధాలు
3. విశ్వనాధశర్మగారి – రసాయన శాస్త్రం
4. వీరభద్రరావుగారి – "ఆంధ్రుల చరిత్ర"
5. కట్టమంచి రామలింగారెడ్డి గారి – అర్ధశాస్త్రం
6. పేరాల సుబ్బారావుగారి – రాణి సంయుక్త వంటి గ్రంధాలు వెలువడ్డాయి.

తెలుగు సాహిత్య రచనలలో గద్యతిక్కనగా పేరొందిన కందుకూరి వీరేశలింగం గారు కూడా 1876 లో "వివేక వర్ధని", "హాస్యసంజీవని" 1883 లో "సతీహీత బోధిని" అనే పత్రికల ద్వారా ప్రజలు జ్ఞానాన్ని పొందారు. ఈ క్రమంలోనే ఆంధ్ర దేశంలో మొదటి బాలికా పాఠశాలను ధవళేశ్వరంలో స్థాపించి ఎందరినో విద్యావంతులుగా తీర్చిదిద్దారు. ఇలా చదువుకున్నవారే 1907లో ఆంధ్రాలో బిపిన్ చంద్రపాల్‌గారు పర్యటించినప్పుడు వందేమాతర ఉద్యమంలో పాల్గొని విజయం సాధించారు.

వందేమాతర ఉద్యమ కాలంలో బిపిన్ చంద్రపాల్ గారి ఉపన్యాసాలను తెలుగులో అనువాదం చేసిన చిలకమర్తి లక్ష్మినరసింహంగారు తన రచనల ద్వారా ప్రజలలో దేశభక్తిని పెంపొందించారు.

**"భారతఖడంబు చక్కని పాడి ఆవు**
**హిందువులు లేగదూడలై ఏడ్చుచుండు**
**తెల్లవారు అను గడుసరి గొల్లవారు**
**పితుకుతున్నారు మూతులు బిగియగట్టి"**

అను కవిత ద్వారా చిలకమర్తి లక్ష్మినరసింహంగారు బ్రిటీష్ వారి దోపిడి విధానాన్ని ప్రజలకు వివరించారు. శ్రీరంగం శ్రీనివాసరావుగారు తన కవితల ద్వారా ప్రజలను ఉద్యమం వైపు నడిపించారు. శ్రీశ్రీ గారు సమాజంలో అసమానతలను గూర్చి **"ఏ దేశ చరిత్ర చూచిన ఏమున్నది గర్వకారణం నరజాతి చరిత్ర సమస్తం పరపీడన పరాయణత్వం"** అని విమర్శించారు. తన



Scanned with OKEN Scanner

మహాప్రస్థానం అను గ్రంథంలో **"ఈ రాజ్యం మీదేనండి మీ రాజ్యం మీరే ఏలండి"** అని **"మరో ప్రపంచం మరో ప్రపంచం, పిలిచింది పదండి ముందుకు పదండి త్రోసుకుపోదాం పైపైకి"** అను సూక్తులద్వారా ప్రజలలో చైతన్యం నింపి వారిని స్వాతంత్ర్య ఉద్యమం వైపు నడిపించింది. ప్రజలలో దేశభక్తిని ప్రేరేపిస్తూ రాయప్రోలు సుబ్బారావు గారు, రవీంద్రనాథ్ ఠాగుర్ గారి సాహిత్యంలో కొన్ని కవితలు వ్రాశారు.

**"ఏ దేవమేగినా ఎందు కాలిడినా**
**ఏ పీఠమెక్కినా ఎవ్వరెదురైనా**
**పొగడరా నీ తల్లి భూమి భారతిని**
**నిలుపరా నీ జాతి నిండు గౌరవము**
**లేదురా ఇటువంటి భూదేవి యెందు**
**లేరురా మనవంటి ధీరులింకెందు."**

అను గేయం ద్వారా భారతదేశం గొప్పతనాన్ని భారతీయుల యొక్క ధైర్యసాహసాలను వివరించి స్వాతంత్ర్య ఉద్యమంలో ప్రజలను పాల్గొనేలా చేశారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలో ప్రజలను చైతన్యపరచి వారిలో దేశభక్తిని పెంపొందించిన మరొక సాహిత్యవేత్త గురజాత అప్పారావుగారు.

**"దేశమును ప్రేమించుమన్నా**
**మంచి యన్నది పెంచుమన్నా**
**వట్టి మాటలు కట్టిపెట్టోయ్**
**గట్టి మేల్ తలపెట్టువోయ్."**
**"సొంతలాభం కొంత మానుకుని**
**పొరుగువారికి తోడు పడవోయ్**
**దేశమంటే మట్టి కాదోయ్**
**దేశమంటే మనుషులోయ్**
**తిండి కలిగితే కండ కలదోయ్**
**కండ గలవాడేను మనిషోయ్."**

అని దేశభక్తిని ప్రేరేపపిచెను. కన్యాశుల్కం అను నాటకం ద్వారా పుత్తడి బొమ్మ పూర్ణమ్మ; ముత్యాల సరాలు అను గేయ నాటకాలు ద్వారా సమాజాన్ని మేల్కొలిపినారు. జాతీయస్థాయిలో కూడా కొందరు తమ రచనల ద్వారా ప్రజలను జాతీయోద్యమం వైపు నడిపించారు.

**<u>ఆధార గ్రంథాలు</u>**

1. శ్రీశ్రీ – మహాప్రస్థానం
2. రవీంద్రనాథ్ ఠాగూర్ – గీతాంజలి
3. బంకించంద్ర ఛటర్జీ – ఆనందమఠం
4. వీరేశలింగం – వివేక వర్ధని
5. గురజాడ అప్పారావు – కన్యాశుల్కం



Scanned with OKEN Scanner

ISSN 2457-0796
UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# జాతీయోద్యమంలో దేశభక్తి గేయం

**డా. జి. భాస్కర్ రావు,** తెలుగు అధ్యాపకులు, ది హిందూ కళాశాల, మచిలీపట్టణం
చరవాణి : 8019572737, chowdari2008@gmail.com

**పరిచయము :**

బానిసత్వపు బందిఖానాలో మగ్గుతున్న భారతజాతి జనులను జాగృతం చేస్తూ పరతంత్ర సంకెళ్ళు తెంచుకుని స్వాతంత్ర్యం సాధించుటకు జనులలో చైతన్యాన్ని నింపుటకు నాటి కవులు సాహిత్యాన్ని వారధిగా చేసుకొని కలాలను ఝుళిపించారు. భారతదేశ సాహిత్యానికి ఎనలేని కావ్య సంపదను కూర్చారు. ఒకవైపు స్వాతంత్ర్య సమరం చేస్తూ మరొక వైపు సాహిత్య సేవను చేశారు. ఈ క్రమంలో తెలుగు సాహిత్యంలో అనేక ప్రక్రియలు వచ్చి చేరి ఆధునిక కవిత్వానికి మార్గం ఏర్పరిచాయి. ప్రాంతీయ భాషలలో కవులు కలాలను తుపాకులుగా చేసి తెల్లదొరల ప్రభుత్వంపై ఎక్కు పెట్టారు. ఒక వైపు జాతీయోద్యమంను నడుపుతూ మరొక వైపు సంఘంలోని దురాచారాల నిర్మూలనకు ఉద్యమాలను నడిపారు. ప్రాంతీయ భాషల్లో వచ్చిన కొన్ని సాహిత్య ప్రక్రియల్లో గేయ ప్రక్రియ ఒకటి. ఈ గేయ ప్రక్రియనుపయోగించి రాయప్రోలు, గురజాడ, వడ్డాది వంటి ప్రముఖ కవులు ఎన్నో గేయాలు రచించారు.

**లక్ష్యము :** తెలుగు గేయ రచనలలో జాతీయోద్యమ స్ఫూర్తిని విశ్లేషించుట

ఆంగ్లేయుల పాలనలో మగ్గుతున్న భారతీయుల్లో స్వాతంత్ర్య కాంక్షను రగిల్చేందుకు ప్రాంతీయ ఉద్యమాలు దోహదపడ్డాయి. జాతీయోద్యమంలో 1905 నాటి వందేమాతర ఉద్యమం సాహిత్య చరిత్రలో ప్రముఖ ఘట్టంగా చెప్పవచ్చు. ఈ ఉద్యమాలే దేశభక్తి కవిత్వానికి అంకురార్పణ చేశాయని పేర్కొనవచ్చు.

జాతీయోద్యమంలో భాగంగా బిపిన్‌చంద్రపాల్ దక్షిణ భారతదేశంలో ప్రముఖమైన పట్టణాల్లో ప్రేరణాత్మక ప్రసంగం చేసి ప్రజలను ఉత్తేజపరచి, జాతీయోద్యమ స్ఫూర్తిని రగిలించారు. దీనిలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రిలో జరిగిన ఉపన్యాసాన్ని ప్రముఖ కవి చిలకమర్తి నరసింహారావుగారు తెలుగులోకి అనువదించారు. అప్పటి బ్రిటీష్ ప్రభుత్వ దురాగతాలను దోపిడీ విధానాన్ని ఆశువుగా భరతఖండంబు అనే పద్యం ద్వారా జాతీయతా స్ఫోరకంగా, చైతన్యం కలిగేలా చెప్పి తొలి జాతీయోద్యమ కవిగా నిలిచారు.

**"భరతఖండము చక్కని పాడియావు**
**హిందువు లేగదూడలై యేడ్చుచుండ**
**తెల్లవారను గడుసరి గొల్లవాడు**
**పితుకుచున్నారు మూతు బిగియగట్టి**

అనే చిలకమర్తి వారి పద్యం జనుల నాలుక మీద నాట్యమాడింది."

భారత మాతను చక్కని పాడియావుతో, భారతమాతతో, భారతీయ సంపదను పాడితో, హిందువులను లేగదూడలతో, దేశప్రజలు అనుభవించు కష్టాలను లేగదూడల ఏడ్పుతో తెల్లదొరల కాఠిన్యాన్ని గడసరి గొల్లవారనుటలో తెలుసుకోవచ్చు. మూతులు బిగియగట్టి అనే వాఖ్యం నాటి భారతీయుల సాతంత్ర్య దుస్థితిని తెలియజేస్తుంది.



Scanned with OKEN Scanner

జాతీయోద్యమంలో పాల్గొన్న దేశభక్తులను బ్రిటీష్‌వారు ఖైదు చేయగా చిలకమర్తి వారు "భరతఖండంటే ఒక గొప్ప బందిఖానా. అందులోనున్న ఖైదీలు హిందూ జనులు అంటూ నాటి భారతీయ ప్రజలు పడిన బాధను వర్ణించారు. 1920లో స్వాతంత్ర్యోద్యమంలో భాగంగా సత్యాగ్రహోద్యమాన్ని చేయదలచిన తరుణంలో నాటి కవులు దేశభక్తిని వస్తువుగా తీసుకొని కవితలు గేయాలు రాసి, ప్రజల్లో చైతన్యాన్ని నింపారు.

దేశభక్తి కవిత్వంలో వచ్చిన గేయం దండాలు దండాలు భారతమాత

"మూడు వందలేండ్ల క్రింద – భారతమాత
అలకుంపినోడు దిగినాడె – భారతమాత
దిగియూరకున్నాడా – భారతమాత
మా దేశమంత దోసుకెల్లి – భారతమాత"

అంటూ కంపెనీ వారి రాకను, దేశ సంపదను కొల్లగొట్టడం గురించి రచించారు.

"భూమి దున్ని బ్రతుకపోతే – భారతమాత
ఎంతో పెద్ద పన్ను వేసినాడె – భారతమాత
అదిసందరమంత తవ్వినట్లు – భారతమాత
ఉప్పు మీద పన్నంటూ – భారతమాత
కన్నబిడ్డలె శత్రులైరి – భారతమాత"

అంటూ నాటి పన్నుల విధానాన్ని నిరసించారు. స్వదేశీయులే సంపదలకు, పదవులకు ఆశపడి విదేశీయులతో చేతులు కలిపిన నాటి దేశద్రోహుల గురించి, వారు చేసిన మోసాలను గురించి చెబుతూ శత్రువులుగా చిత్రించారు.

బాలకవి వద్దాది సీతారామాంజనేయులు, పూడిపెద్ది కాశీ విశ్వనాథశాస్త్రిగార్లు కలిసి రాసిన స్వరాజ్య గీతము అనే పుస్తకాన్ని అలనాటి బ్రిటీష్ ప్రభుత్వం నిషేధించింది.

ప్రజల్లో దేశభక్తిని ప్రభోదించి, దేశాభివృద్ధికై ప్రజలను ఎంతగానో ఉత్తేజపరచిన మరొక గేయం

**"దేశమును ప్రేమించుమన్న**
**మంచియన్నది పెంచుమన్న**
**వొట్టిమాటలు కట్టిపెట్టోయ్**
**గట్టిమేల్ తలపెట్టవోయ్"** ......

అంటూ ఒక్క భారతదేశానికే కాకుండా ఏ దేశం వారికైనా దేశభక్తిని ఈ గేయం ద్వారా గురజాడ ప్రభోదించారు. సమాజ సంస్కరణ, మానవత్వం వంటి గొప్ప అంశాలను సులభమైన వాడుక భాషలో జనులు హృదయాల్లో నాటుకునేలా గేయాలుగా మలిచారు.

**"చెట్టపట్టాల్ పట్టుకొని**
**దేశస్థులంతా నడువవలెనోయ్**
**అన్నదమ్ముల వలెను జాతులు**
**మతములన్నీ మెలగవలెనోయ్**
**మతం వేరైతేను ఏమోయ్**
**మనసు ఒకటై మనుషులుంటే**



Scanned with OKEN Scanner

**జాతియన్నది లేచి పెరిగే**
**లోకమున రాణించునోయ్"**

అంటూ దేశాభివృద్ధిలో ప్రజలను భాగస్వాములుగా చేస్తూ పలు మతాలకు, జాతులకు నిలయమైన దేశప్రజల మధ్య సోదరభావం ఏర్పడి, కులం మతం అనే గోడలు కూలి ప్రజలు సయోధ్యతో మెలిగి దేశం పట్ల అభిమానం కలిగి ఉండాలని ఈ గేయం ద్వారా గొప్ప సందేశం ఇచ్చి తెలుగు సాహిత్యంలో అమరకవిగా నిలిచారు.

తెలుగునాట కూడా ప్రతి వారిలో స్వాతంత్ర్య జ్వాలను రగిలించిన కవులలో రాయప్రోలు సుబ్బారావుగారు ముఖ్యులు.

**"ఏ దేశమేగినా ఎందు కాలిడినా ఏ పీఠమెక్కినా**
**ఎవ్వరేమనినా పొగడరా నీ తల్లి భూమి భారతిని**
**నిలుపరా నీ జాతి నిండు గౌరవము ... "**

అంటూ తెలుగుదనం జాతీయాభిమానం, గత వైభవాన్ని తిరిగి ప్రజలకు ప్రభోదించారు.

భిన్నమతాలు, కులాలు, భాషలు ఎన్ని ఉన్నా ఒక దేశంగా భారతీయులంతా ఒక్కటే. భారతమాత పేరు వినగానే మనసు ఉప్పొంగని భారతీయుడు ఉండడు. అలా మనసు ఉప్పొంగేలా, నిండైన దేశభక్తితో దేవులపల్లి కృష్ణశాస్త్రిగారు రచించిన గేయం.

**"జయ జయ జయ ప్రియభారత జనయిత్రీ దివ్యధాత్రి**
**జయ జయ జయ సహస్ర నరనారీ హృదయ నేత్రి ..."**

వంటి గేయాలు ఎందరినో స్వాతంత్ర్య సమరం వైపు అడుగులు వేయించి, స్వాతంత్ర్యోదమానికి బలం చేకూర్చాయి. స్వాతంత్ర్యోదమ్యంలోనేకాక స్వాతంత్ర్యానంతరం కూడా దేశభక్తితో కూడిన అనేక రచనలు తెలుగు సాహిత్యంలో వెలిశాయి.

స్వలాభాన్ని ఆశించక దేశప్రజలకు స్వాతంత్ర్యం తెచ్చిపెట్టాలనే సంకల్పంతో తమ ఆస్తిపాస్తులు, ప్రాణాలను సైతం త్యాగం చేసిన ఎందరో కవులు నేటి తరానికి తెలియకపోవచ్చు. కానీ మనం పూజించవల్సిన దేవుళ్ళతో సమానమైనటువంటి స్వాతంత్ర్య సమరయోధులు ఎందరో ఉన్నారు. వారందరినీ మనసాస్మరించుకుంటూ నేటి తరం వారు కూడా వారి భాటలో నడిచి, దేశఖ్యాతిని నలుదిశలా వ్యాపింపచేయాలని ఆశిస్తూ ..... జైహింద్.

**ఆధార పుస్తకాలు**

1. స్వీయ చరిత్రము – చిలకమర్తి లక్ష్మీ నరసింహం
2. స్వరాజ్య గీతము – వడ్డాది సీతారామాంజనేయులు, పూడిపెద్ది కాశీ విశ్వనాధశాస్త్రి
3. ముత్యాల సరాలు – గురజాడ అప్పారావు
4. జన్మభూమి – రాయప్రోలు సుబ్బారావు
5. జయ జయ ప్రియభారత జనయిత్రి – దేవులపల్లి కృష్ణశాస్త్రి, కృష్ణశాస్త్రి గేయ సంపుటి



Scanned with OKEN Scanner

# ఆధునిక తెలుగు సాహిత్యంలో దేశభక్తి

**ఈశ్వరరావు రేపల్లె,** విద్యార్థి, మహారాజా ప్రభుత్వ సంస్కృత డిగ్రీ కళాశాల, విజయనగరం
చరవాణి : 7569351363

ఎందరో మహానుభావులను కన్న పుణ్యభూమి. ఎన్నో దివ్యమైన వనరులను కలిగిన జీవధాత్రి. సాహిత్య సంపదలైన పురాణాలకు, వేదాలకు శాస్త్రాలకు ఇతిహాసాలకు నిలయమైన జ్ఞానభూమి. మరెన్నో ఆచార సంస్కృతి సంప్రదాయాలకు మధుర భూమి ఈ భరత భూమి. అటువంటి ఈ భూమిపైన జన్మించడం మన పూర్వజన్మ సుకృతం. ఎందరో మహనీయులు అసువులు బాసి, నెత్తురు చిందించి ప్రాణాలను సైతం త్యజించి, తెచ్చిన, మనకు ఇచ్చిన స్వాతంత్రం.ఈ దేశాన్ని పద నాలుగు వందల శతాబ్దం మొదలు ఇతర దేశస్తులు ఆక్రమించడం పరిపాలించడం జరుగుతుంది. ఒకప్పుడు మన పల్లెలు, గ్రామాలు సుసంపన్నంగా చక్కగా ఉండేవి. అప్పుడు మనలో ఐక్యత లేనందువల్ల వేరొకరు మనపైన వారిపెత్తనం చెలాయించేవారు. ఒక్కసారి జరిగింది మనం మరలా జరగడానికి అవకాశం ఇవ్వకూడదు. మన దేశ సంపదను, వనరులను జ్ఞానాన్ని, సాహిత్య సంపదను మనం వదులుకోకూడదు. మన భారతదేశ స్వాతంత్ర్యంలో తెలుగు ఆధునిక సాహిత్యం చాలా గొప్పదైన పాత్రపోషించింది. దేశభక్తిని, దేశాభిమానం వట్టి మాటల్లో కాకుండా ఎందరో కవులు వారిరచనల్లో చూపించారు. అటువంటివారిలో గరిమెళ్ళ సత్యనారాయణ "మాకొద్దీ తెల్లదొరతనము" అని వారిగళం ఎత్తి పాడిన పాట ఆంధ్రరాష్ట్రంలో ఎందరో ఉద్యమకారులను ఉత్తేజపరిచేలా తోడుపడింది. విశ్వ మానవ ప్రేమను ఆకాంక్షించే అడుగుజాడ గురజాడ దేశభక్తిగేయం. ఏ దేశంలో అడుగుపెట్టిన నీ భరతమాతను పొగడరా అని చెప్పిన రాయప్రోలు దేశభక్తి శ్రీలు పొంగిన జీవన ధాత్రి. భారతదేశంను పాడిఆవుతో పోల్చి హిందువులను లేగ దూడలు అని ఆశు కవితను రాసిన చిలకమర్తిలక్ష్మీ నరసింహంగారి దేశభక్తి తాను ఉపాధ్యాయుడుగా పనిచేస్తుండగా పిల్లలతో దేశభక్తిపై పాట పాడించాలన్న ఆకాంక్షతో కృష్ణశాస్త్రినోట ముత్యాలా రాలిన జయ జయ ప్రియ భారత జనయిత్రీ దివ్యధాత్రి వీర గందం తెచ్చి నారు వీరుడెవ్వడు అని చాటిచెప్పిన దేశం అన్నా దేశభక్తి, వీరాభిమానం చూపేత్రిపురనేని రామస్వామి. తమ ప్రాణాలను త్యాగం చేసేవీర జవాన్లపై తిలక్ కవితలు రాశారు. వారు పడేదాన్ని వారికవిత్వం ద్వారా వివరించారు. "సైనికుడి ఉత్తరం" మనకు అందేలా చేశారు. తిలక్ జాతీయవాది. స్వాతంత్ర్యం కోసం పోరాడిన గాడిచర్ల హరిసర్వోత్తమరావును మనం మరువగలమా. ఇటువంటి మహనీయులు, మహానుభావులు ఎందరో మన దేశ స్వాతంత్ర్యం కోసం పాటుపడినారు. చేతిలో కత్తి పట్టిన సైనికుడిలా మన ఆధునిక తెలుగు సాహితీ కవులు వారిచేతులలో కత్తి అనేకలంతో వారి దేశభక్తిని చాటి ప్రజల్లో చైతన్యం తెచ్చారు.

## పరిచయం

దేశభక్తి అంటే జండా వందనం, జైహింద్, భారత్ మాతాకీ జై అని అనడం దేశభక్తి అనిపించుకోదు. దేశం అంటే ఏంటి? అని తెలుసుకోవాలి. దేశమంటే ఎవరు? మన దేశానికి ఎలా ఏ విధంగా సేవ చేయాలి? అనే విషయం తెలుసుకోవాలి. ఎవరెవరు మన దేశాన్ని ఏ ఏ విధాలలో సంరక్షించారు? మన దేశం కోసం పాటుపడ్డారో తెలుసుకోవాలి. వారి త్యాగాలను దేశం పట్ల వారికి ఉన్న దేశభక్తిని స్వతంత్ర స్ఫూర్తిని మనం తలుచుకోవాలి. వారి ఆశయాలకు మనం మన చేతిని అందించాలి, అందుకోవాలి. వారి స్ఫూర్తి కాంతులను, ధైర్య సాహసాలను, పోరాడిన శక్తిని మనం ప్రసరించేలా ఉండాలి. ఆధునిక తెలుగు



Scanned with OKEN Scanner

సాహిత్యంలో దేశభక్తి కవులు ఎన్నో గొప్ప రచనలు చేశారు. గురజాడ, రాయప్రోలు, గరిమెళ్ళ, జాషువా, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, తిలక్, చిలకమర్తి, త్రిపురనేని రామస్వామి, కృష్ణశాస్త్రి ఇలా ఎందరో కవులు గొప్ప రచనలు స్వర్ణ రత్న మకుటాలలా సమాజానికి అందించారు. ఎందరినో వారి రచనా పారిజాత సువాసనలతో ముగ్ధులను చేశారు. తెలుగు సాహిత్య కవులు. అన్ని మతాలు, మనుషులు, జాతులు, కులాలు ఒక్కటే అని అందరం సమానమని, అన్నదమ్ములు వలె మతాలు అన్నీ మెలగాలని, దేశభక్తి అంటే దేశాన్ని ప్రేమించడం, దేశమంటే మనుషులు, ఊరకనే మాటలాడకుండా మన కర్తవ్యాన్ని సాధించాలి అని విశ్వ మానవ ప్రేమను చాటి చెప్పిన మహాకవి గురజాడ వెంకట అప్పారావు గారు వారు రచించిన దేశభక్తి గీతం మనకు అనునిత్యం స్ఫూర్తిదాయకం. మన హక్కుల కోసం, మన స్వేచ్ఛ స్వాతంత్రం కోసం ఎవడొచ్చినా, ఎంతవాడైనా ఎదురెళ్లి, ఎదిరించాలి అని మూసుకుపోయిన మన నోరులను ,మన గొంతుకలను కత్తుల వర్షం తూటాల తుఫాను కురిపించిన మాకొద్దీ తెల్ల దొరతనం అని ఒక్క మాటతో ఎందరో ఆంధ్రుల స్వతంత్ర ఉద్యమానికి ఉరికెత్తించిన, కుక్కలతో పోరాడి కూడు తింటామని తెల్ల దొరల చేసిన అన్యాయ అక్రమాలను తన గళం విప్పితన దేశభక్తి కై, ప్రజల హక్కుల కోసం పోరాడిన గరిమెళ్ళ సత్యనారాయణ గారి మాకొద్దీ తెల్లదొరతనం మనకు చెప్తుంది దేశభక్తి గురించి పీడిత, తాడిత వర్గాల అభ్యున్నతికై తను కవితలు రాసి దాంట్లో దేశం కోసం అహర్నిశం పాటుపడుతున్న, నిస్వార్థంగా తమ ప్రాణాల సైతం త్యాగం చేసిన, చేస్తున్న వీర సైనికుల పైన కవితలు రాసిన దేవరకొండ బాలగంగాధర తిలక్ తన దేశభక్తిని సైనికుడి ఉత్తరం ద్వారా మనకు అందేలా చేశారు. భారతదేశాన్ని చక్కని ఆవు అని లేగదూడలు హిందువులు అని మన దేశ సంపదను బ్రిటిష్ వారు ఎత్తుకెళ్లిన విషయాన్ని మనందరికీ తన దేశభక్తిని ఆసువుగా పద్యాల రూపంలో ఎంతో అర్థాన్ని కలిగిన పద్యాలని అందించిన చిలకమర్తి దేశభక్తి గురించి తెలుసుకోవాలి. ఏ దేశం కు వెళ్లినా, ఎక్కడ అడుగుపెట్టినా నిన్ను కన్న భరతమాతను మరువకు, పొగడరా నీ తల్లి భూమి భారతిని, జన్మభూమి గౌరవం నిలుపుర అని మనం ఏ స్థాయిలో ఉన్నా, ఏ స్థానంలో ఉన్నా, ఎక్కడ ఉన్నా, ఎలా ఉన్నా నీడనిచ్చిన తల్లి లాంటి భరతమాత నువ్వు మాతృభూమిని మరువకూడదు అని భారతదేశాన్ని, భారతమాత గౌరవాన్ని నిలిపే విధంగా ఉండాలని. చెప్పిన రాయప్రోలు దేశభక్తి శ్రీలు పొంగిన జీవధాత్రి. భారత జనయిత్రీ దివ్యధాత్రి. భరతమాతను మాతృమూర్తిగా, భారత దేశాన్ని దివ్య భూమిగా, చిత్రీకరించిన జయ జయ అంటూ జయభేరి మోగిస్తూ తన దేశభక్తిని చాటి చెప్పిన దేవులపల్లి కృష్ణశాస్త్రి జయ జయ ప్రియ భారత జనయిత్రీ చూపిస్తుంది మనకు దేశభక్తిని. స్వాతంత్ర భారత సంగ్రామంలో, దేశంలో, ఏ వీరుడు వీరగంధం తెచ్చినాడని, వీర గంధము తెచ్చినారము వీరుడెవ్వడు తెలుపుడి, అని తెలుగువాడి ధైర్యలను, ఎదురెళ్లి, ఎదిరించి సాధించే తెలుగు వాడి వీర చరిత్రను వివరించి తెలుగువాడు ఎక్కడా తక్కువ కాదు, తగ్గడు అని తేల్చి చెప్పిన తెలుగు వాడి శక్తిని చాటి చూపించిన కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి దేశభక్తి గురించి తెలియాలి. తనదైన శైలిలో తెల్లదొరల నిర్బంధాలకు కూడా తన జీవితాన్ని సర్వనాశనం చేసుకొని తన రచనల ద్వారా స్వాతంత్ర్యపోరాట స్ఫూర్తిని మనలో నింపిన గాడిచర్ల హరి సర్వోత్తమరావుని మనం మరువగలమా!

**ముగింపు**

మనం ఎప్పటికైనా తెలుసుకోవలసిన ముఖ్య విషయం ఏమిటంటే !దేశభక్తి నాకు ఉంది అని గర్వంగా చెప్పుకోవడం కాదు, ఆ దేశానికి మనం ఏం చేశాం, ఏం చేస్తున్నాం, ఎంత చేసాం, ఎంత చేస్తున్నాం తెలుసుకొని నడవాలి. దేశభక్తి అంటే దేశ నాయకులను, దేశ సంపదను పొగడడం కాదు. స్వాతంత్రం ఎలా వచ్చింది, ఎవరు తెచ్చారు, ఎవరు ఇచ్చారు, ఎలా తెచ్చారు అని తెలుసుకోవడం. మనం దండలేస్తామనీ, జేజేలు కొడతామని, విగ్రహాలు కట్టిస్తామని, లేదా వారి గురించి గొప్పలు చెప్పుకుంటామని మన స్వాతంత్ర సమరయోధులు దేశభక్తి కవిత ఉద్యమం నడిపిన కవులు ప్రాణత్యాగం చేయలేదు. భారతదేశ బావిభారత పౌరులుగా వారు కన్న కలలను మనం నెరవేర్చుతామని, దేశాన్ని అభివృద్ధి పథంలో నడుపుతామనె ఆకాంక్షతో నాడు వారు ప్రాణత్యాగం చేశారు చివరిగా ఒక్క మాట దేశానికి సేవ చేయడమే నిజమైన దేశభక్తి.



Scanned with OKEN Scanner

ISSN 2457-0796
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) UGC Care List Approved Journals హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# జాతీయోద్యమ కథలు - అంశ విశ్లేషణ

**డా. ఎన్. సుభాషిణి,** తెలుగు సహాయాచార్యులు, డా. బి.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
జడ్చర్ల, మహబూబ్‌నగర్

భారత జాతిఖ్యాతిని పెంచిన ప్రధాన ఉద్యమాలలో ప్రముఖ స్థాయిని నిలిచినవి సంఘసంస్కరణ ఉద్యమం, జాతీయ ఉద్యమం. ఇవి చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఉద్యమాలు. కుల మతాల కోసమో, ఒక ప్రాంతీయత ప్రాధాన్యంగానో, సాగిన ఉద్యమాలు కావు. ఈ ఉద్యమాలకూ తనవైన పరిమితులు లేకపోలేదు. దేశీయ చిచ్చులకు, పరాయి దోపిడీ పరిపాలనకు సమైక్య తిరుగుబాటు ఎగరేసిన ఉద్యమాలు. అయితే సంఘసంస్కరణోద్యమం ప్రజల కోసం సంస్కర్తలు, మేధావులు నడిపించిన ఉద్యమం. మరి జాతీయ ఉద్యమం ప్రజావాహిని ఏక స్ఫూర్తితో పరవళ్లు తొక్కుతూ సాగిన ఉద్యమం. ఇది సామాన్య ప్రజల ఉద్యమం. వేలాది ఏళ్ల చరిత్ర గల భారతదేశంలో తొలిసారి ప్రజలు ఒక సమైక్య జాతీయ సమస్యా పరిష్కారంలో పాల్గొన్న ఉద్యమమే జాతీయ ఉద్యమం. జాతీయోద్యమాల ప్రభావంతో అపారమైన సాహిత్యం పుట్టింది. ఈ సాహిత్యంలో అనేక పద్యాలూ,వ్యాసాలూ,నాటకాలూ కథలు ఉన్నాయి. జాతీయ ఉద్యమ స్ఫూర్తి రగిలిస్తూ, ప్రతిఫలిస్తూ వెలువడిన కథల సంకలనమే జాతీయోద్యమ కథలు. ఈ కథా సంకలన కర్త ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి. ఆనాటి ఉద్యమ స్ఫూర్తి, ఉద్యమం పట్ల ప్రజలలోని భావోద్వేగాలు, నిబద్ధత, దేశభక్తిని ప్రతిబింబించే కథలే ఈ జాతీయోద్యమ కథలు. ఈ ఉద్యమంలో పాల్గొన్న యువ కిశోరాల గురించి, తన వాళ్ళని కోల్పోయినా మొక్కవోని ధైర్యంతో కష్టానికి ఎదురొడ్డి నిలిచిన వృద్ధుల గురించి, కన్నతల్లి కన్నా దేశమాత గొప్పదని "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అని నినదించిన బిడ్డలు,బిడ్డల తల్లుల గురించి ఈ కథలు మనకు చెబుతాయి.

ఈ సంకలనంలోని కథలు మన స్వతంత్రానికన్నా ముందు 20వ శతాబ్ది ఆర్థిక రాజకీయ పరిణామాలకు ప్రతిబింబాలు. ఈ సంకలనంలో వలస పాలనను అంతమొందించడానికి జరిగిన ప్రయత్నాన్ని భక్తితో చిత్రించిన కథలు ఉన్నాయి, విమర్శనాత్మకంగా రాసిన కథలూ ఉన్నాయి. సంఘసంస్కరణ, జాతీయ ఉద్యమాల ప్రాధాన్యాలను చర్చించిన కథలూ ఉన్నాయి. జాతీయ ఉద్యమం కన్నా ముందే, వలస పాలకుల దుర్మార్గాలను ఎదిరించి బలైపోయిన వ్యక్తుల జీవిత చిత్రాలు ఉన్నాయి. విముక్తి ఉద్యమంలోని పలు దశలను, ఈ కథలు పట్టి చూపిస్తున్నాయి.

ఈ సంకలనంలో 30 కథలున్నాయి. చాలామంది కథకులు అనామకులు. వారి పుట్టుక, జీవనం చరిత్రకెక్కలేదు. కానీ వాళ్ళు గొప్ప చారిత్రక వాస్తవాన్ని కథనం చేశారు. వారు ఉద్యమ రచయితలు. తమదైన గురుతర సామాజిక బాధ్యతను నిర్భీతిగా నిర్వహించిన వీరులు.

ఈ స్వాతంత్రోద్యమ వజ్రోత్సవ సంబరాల సందర్భంగా అబ్బురపరిచే ఆనాటి భారత పౌరుల మొక్కవోని గుండె ధైర్యాన్ని, దేశమాత పాదాల వద్ద సర్వస్వాన్ని ధారబోసిన యువకిశోరాల అసమాన త్యాగశీలతను, సామాన్య ప్రజ సైతం ప్రదర్శించిన మడమతిప్పని వీరత్వాన్ని, సహనం, అహింసలే ఆయుధంగా, విభిన్న సంస్కృతులు, భాషలు గల కోట్లాది ప్రజానీకాన్ని ఏకతాటిపై నడిపిన గాంధీ మహాత్ముని నాయకత్వ పటిమను, జాతీయోద్యమ కథలు ప్రతిఫలించిన తీరును వివరించుట. తద్వారా ఈనాటి



Scanned with OKEN Scanner

యువతీ యువకులకు భారత జాతి ఔన్నత్యాన్ని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన భారతీయ చరిత్ర సంస్కృతులను గుండెకి హత్తుకునేలా తెలిపి, వారి సమగ్ర వ్యక్తిత్వ అభివృద్ధికి దోహదం చేయడమే ఈ వ్యాస లక్ష్యం.

ఈ సంకలనంలోని కథల్లో ప్రస్తావించబడిన జాతీయోద్యమ అంశాలు.

1. సహాయ నిరాకరణ -దీనినే కొన్ని చోట్ల అసహాయోద్యమంగా పేర్కొన్నారు
2. శాసనోల్లంఘనం
3. విదేశీ వస్తు, వస్త్ర బహిష్కరణం
4. ఖద్దరు ధారణ–నూలు వడుకుట–చరఖా
5. ఉప్పుసత్యాగ్రహం
6. అహింసోద్యమం
7. సత్యాగ్రహోద్యమం
8. సైమను కమీషన్ బహిష్కరణం
9. సాయుధ రైతాంగ పోరాటం
10. తెలంగాణోద్యమం
11. నిజాం వ్యతిరేకత
12. ఉద్యమంలో స్త్రీలు

ఇవేకాక ఆనాటి సామాజిక రుగ్మతలను ఎత్తిచూపిన కథలను కూడా ఈ సంకలనంలో పొందుపరిచారు.

1. బాల్యవివాహాలు
2. స్త్రీ నిరక్షరాస్యత
3. అస్పృశ్యత

“ఈ వత్సరము మా ఇంట నోము నోచుకొను వారు ఖద్దరు వస్త్రములు ధరించియే నోచుకొనవలెను” ఐదు మాసములు ఇరువది దినములు– కనుపర్తి వరలక్ష్మమ్మ, గృహలక్ష్మి మాసపత్రిక నవంబర్ 1931)

సిరిగల ఇంట ఒక ఉన్నత ఉద్యోగి కడుపున పుట్టి, స్వార్థపూరిత రాజభక్తి నరనరానా జీర్ణించుకుపోయిన అతివ రుక్మిణి. ఆమె చీరలు, నగలు, పిండివంటలు, మొదలగు ప్రసంగములు తప్ప పేదసాదల కష్టనిష్ఠురములు, పరాధీన భారతదేశ ఆగచాట్లు చెవిన పడిన స్త్రీ కాదు. అటువంటి యువతి తన భర్త గోపాలరావు ‘స్వదేశీ వస్త్రాలు ధరించండి’ అని చెప్పినందుకే, దొంగలు, దోపిడీదారులకు, హంతకులకు వేసినట్టు బ్రిటీషు దొరలు ఆయనకు కఠిన శిక్ష వేసినారు అని తెలిసి నివ్వెరబోయింది.

‘ఏమీ! మన దేశపు గుడ్డ మనం కట్టుకొనుటకు కూడా తప్పేనా? నేడిదైనది. రేపు, మీకు కావాల్సిన ఆహార పదార్థములను మేమే పచనము చేసి పంపెదముగాని, మీరు తయారు చేసుకొనరాదనినచో, మన ప్రొయ్యిలు తవ్వి వేసుకొనవలసినదేనా? ఎంత అధమపు బ్రతుకు!’ (జాతీయోద్యమ కథలు, రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, పుట .73)

ఐదు మాసాల ఇరవై దినములు అనే కథానికలో రచయిత్రి కనుపర్తి వరలక్ష్మమ్మ స్వతహాగా స్త్రీ అయినందున ఆనాటి స్త్రీల మనోభావాలను కళ్ళకు కట్టినట్టుగా పై వాక్యాల ద్వారా మనకు అందించారు. సున్నితమగు శైలిలో స్వాతంత్ర ఉద్యమ కాలంనాటి పరిస్థితులు, విదేశీ వస్త్ర బహిష్కరణ ఉద్యమం పుంజుకున్న విధానం, ఇంటింటా రాట్నపు నినదం ఎగిసిన తీరును అలతి పదాలతో దృశ్యమానం చేశారు.

రుక్మిణి భర్త గోపాలరావు విదేశీ వస్తు బహిష్కరణ ఉద్యమంలో చురుకుగా లీనమై, తొలి కానుపు అనంతరం దాదాపు సంవత్సరం తర్వాత ఇంటికి వచ్చిన భార్యను, ముద్దులు మూటగట్టే కుమారుని కూడా పట్టించుకోలేదు. కారణం వారు ధరించిన విలాసవంతమైన విదేశీ వస్త్రములు. ఆ క్షణమున రుక్మిణి మానసిక వేదన రచయిత్రి కనపర్తి వరలక్ష్మమ్మ గారి కలము జాలువార్చిన విధము కథ చదివితే గాని తృప్తి కాదు. ఆ రాత్రి పది గంటలకి గోపాలరావుని పోలీసులు తీసుకెళ్ళుట, మెజిస్ట్రేట్ విచారించుట, కొన్ని సంభాషణలలో కనుపర్తి గారు వివరించిన తీరు అమోఘం.

మేజిస్ట్రేట్ – డిఫెన్స్ పెట్టుకుంటావా? గోపాలరావు – ఉహు.

మెజిస్ట్రేట్ – అపాల్జీ?

గోపాలరావు – సత్యాగ్రహ వీరుల

నిఘంటువుల నుండి డిఫెన్స్, అపాలజీ అనే పదాలు తుడిచి వేయబడ్డాయి. (జాతీయోద్యమ కథలు, రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, పుట.72)

ఇక్కడే భారతీయ తత్వం కనుపర్తి వరలక్ష్మమ్మ గారి వివరణలో చూస్తాం.

దృష్ట్వాహిత్వం ప్రవ్యాధితాంతరాత్మ ధృతిం నవిందా మిషమంచ వివిష్ణో అని అర్జునుడు కృష్ణుని విశ్వరూపమును చూసి భయాతుడై వలవలలాడిన చందాన ఇంచుక సేపు లోలోన కొట్టుకాడినది అతని అంతరాత్మ. అయినను కర్తవ్యం తప్పదు. బిడియంతో, భయంతో, గద్గద కంఠుడై ఆరు నెలలు కఠిన శిక్ష సి– క్లాసు అన్నాడు మెజిస్ట్రేట్".

భారత యువత కన్నవారికన్నా, కట్టుకున్నవారి కన్నా, దేశానికే ప్రాధాన్యతనిచ్చి మహాత్ముని అడుగుజాడల్లో అడుగై సాగిన చందం, ఈ వజ్రోత్సవాల సందర్భంగా ప్రతి హృదయాన్ని తాకాల్సిందే.

ఈ సంకలనంలో గుడిపాటి వెంకటాచలం రాసిన ప్రతిష్టాత్మకమైన కథ సుశీల కూడా మానవ హృదయ సంఘర్షణలు ఒడిసి పడుతూనే సమాంతరంగా సహాయ నిరాకరణ ఉద్యమ పూర్ణాహుతిలో దగ్ధమైన వైయక్తిక ఆకర్షణలు, ఆకాంక్షలు, నేటి తరం నేర్వవలసిన ఆవశ్యక విలువలను భద్రంగా అందించింది.

చింతా దీక్షితుల వారి దేశభక్తి కథ పేరులోనే బలంగా ఇతివృత్తాన్ని ఎత్తిచూపుతూ విలక్షణమైన శైలిలో ఏక బిగిన చదివిస్తుంది. సహాయ నిరాకరణ ఉద్యమమే నేపథ్యంగా సాగిన ఈ కథ, కథనం అనన్య సామాన్యం. దీక్షితుల వారి శైలి పాఠకుని చేయి పట్టుకుని అక్షరాల వెంట గొరగొరా గుంజుకు పోతుంది. చివరి అక్షరం తాకిందాక చూపుకి ఊపిరాడదు. దేశభక్తి మాట మాత్రమే కాదని, నిష్కలంక దేశభక్తులు చాలా అరుదని, మనం భారతీయులం అనుకుంటే చాలదని, మనసా వాచా కర్మణా భారతీయత వెల్లి విరియాలని సూక్ష్మంగా చెప్తుంది. (దేశభక్తి – చింతా దీక్షితులు, భారతి, సెప్టెంబర్ 1928)

బసవరాజు వెంకటలక్ష్మిరాజ్యలక్ష్మి విరచిత ఎవరిదదృష్టం అనే కథ కూడా సహాయ నిరాకరణ ఉద్యమ నేపథ్యంతోనే సాగింది. సరళ, కమలలు బాల్యమిత్రులు, ప్రాణ స్నేహితులు. ఈ కథలో ఆనాటి పిల్లల ఆటలు పేర్కొనడం గమనార్హం.

వస్తున్నాము వస్తున్నాము ఈ సాయంకాలము (అని మొదటి వరుస వారు)

ఎవరి కోసం వస్తున్నారు ఈ సాయంకాలము (అని రెండవ వరుస వారు)

కమల కోసం వస్తున్నాము ఈ సాయంకాలము

(ఎవరిదద ృష్టం– బసవరాజు వెంకట రాజ్యలక్ష్మి, భారతి, మే 1931)



Scanned with OKEN Scanner

ఇలా సాగిన ఈ అందాల బాలల బాల్యం

**ఖద్దరమ్మా ఖద్దరు**

**పవిత్రమైన ఖద్దరు**

**భారతదేశపు ఖద్దరు** (జాతీయోద్యమ కథలు, రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, పుట.66)

అని తలపై ఖద్దరు మూట పెట్టుకొని కలవారమ్మాయైన సరళ ఇంటింటికి తిరిగి ఖద్దరు అమ్మడం మనకు జాతీయోద్యమంలో మహిళల పాత్రను పట్టి చూపిస్తుంది.

డిప్యూటీ కలెక్టర్ నారాయణరావు గారు, ఆయన సతీమణి విశాలక్ష్మమ్మలు నూటికి 150 శాతం అధికార వర్గపు అడుగులకు మడుగులొత్తే అనుకూల దంపతులు. వారి కొడుకైన సూరీడు మనసులో చరఖా ప్రవేశించడం, చిన్నవాడైనా నానా తంటాలు పడి రాట్నం కొని ఇంటికి తేవడం, తనదైన శైలిలో వివరించిన బందా కనక లింగేశ్వరరావు కథ చదివి తీరవలసిందే.

సూరీడు అల్లరిని వివరిస్తూ

దబ్బున శనివారం రాలేదని క్యాలెండర్ చింపేసిన బాపతు. రాట్నం కొనడానికి కావలసిన డబ్బు సమకూర్చుకునేసరికి చీకటి అయింది. తెల్లారి దాకా ఆగలేక లాంతరు తీసుకెళ్లి దొడ్లో చూశాడు, తన పేరిటి వాడొచ్చాడేమో అని అంటాడు (జాతీయోద్యమ కథలు, నా ఇంట్లో కూడా ప్రవేశించింది). (రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, పుట.79)

ఈ కథకు చివరి వాక్యంగా

నారాయణరావు తెల్లబోయి నా ఇంట్లో కూడా ప్రవేశించింది అన్నాడు (జాతీయోద్యమ కథలు, రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, పుట.80) ఇదే కథా శీర్షిక కావడం రచయిత ముక్తాయింపు వైచిత్రిని తెలుపుతుంది.

జాతీయ ఉద్యమంలో పిల్లా, పాప, ముసలి, ముతక, చెట్టు, పుట్ట, పిట్ట,గుట్ట, కూడా మేము సైతం అని పాల్గొన్న విధం త్యాగిని కథ ద్వారా మైదవోలు పద్మావతి మన ముందుంచారు. ముసలి తల్లిని వదిలి కొడుకు సత్యాగ్రహ ఉద్యమంలో పాల్గొనడం కష్టమవుతుందని గమనించిన ఆ తల్లి బలవన్మరణం పొందడం పాఠకుల మనసుల్ని మెలిపెడుతుంది. ఆ రాత్రి కలలో ఆ తల్లి పలికిన పలుకులు నేటికీ మనకు శిరోధార్యం.

నాయనా దీర్ఘాయుష్మంతుడవు కమ్ము. భారతీయుడననిపించుకొనుము. నీవు సత్యాగ్రహమునందు పాల్గొనకుండుటకు నేను అడ్డం అని తలచి, నాకన్నా దేశమాతయే ముఖ్యమని నేను నా జీవనములు త్యజించితిని. నాకై విచారింపకుము. ఇక నీవు నిశ్చింతతో భారతమాత నీకు ఏర్పరిచిన ఆజ్ఞను నెరవేర్చుము. (త్యాగిని – మైధవోలు పద్మావతి గృహలక్ష్మి, జనవరి, 1931)

ఈ మాటలతో వృద్ధ వీరమాతకి మైదవోలు పద్మావతి సజీవ రూపకల్పన చేసినారు.

ఖద్దరు, సైమన్ కమిషన్ బహిష్కరణ ఆందోళన, బాల్యవివాహాలు, స్త్రీ విద్య, మొదలగు అనేక అంశాలు స్పృశిస్తూ సాగిన కథ గుమ్మడిదల దుర్గాబాయి రాసిన నే ధన్య నైతిని. (నే ధన్య నైతిని – గుమ్మడిదల దుర్గాబాయి, భారతి, అక్టోబర్,1929)

ఆనాటి సామాజిక దురంతాలలో ఒకటి అస్పృశ్యతా రక్కసి. కరణం బ్రహ్మయ్య ఇల్లాలు మహాలక్ష్మి. ఒకనాడు మాల వెంకటప్ప ఎదురుపడితేనే మైలపడినాను అనుకుంది. అటువంటి మహాలక్ష్మి వెంకటప్పకి ఊరు కట్టుబాట్లను ధిక్కరించి ఎట్లా శుశ్రూష చేసిందో, ఎట్లా కన్న కొడుకు వలె అక్కున చేర్చుకుందో గుక్కెడు నీళ్లు కథలో బందా కనక లింగేశ్వర రావు మానవీయ



Scanned with OKEN Scanner

కథనం చేశారు. అదేవిధంగా సాగిన కథే అరవ వెంకటస్వామి అస్పృశ్యత. (గుక్కెడు నీళ్లు కథ-బందా కనక లింగేశ్వర రావు, భారతి, మే, 1932)

రాయసం వెంకట శివుడు రచించిన నీలవేణి కథలో ఉప్పు సత్యాగ్రహాన్ని ప్రస్తావించారు గాంధీ మహాత్ముడు పన్నిన లవణ వ్యూహం (జాతీయోద్యమ కథలు, రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, పుట.99) అంటారు వెంకట శివుడు. ఈ కథలో ఇర్విన్ ప్రభువును భారత జన శ్రేయోభిలాషిగా పేర్కొనడం గమనార్హం. (నీలవేణి- రాయసం వెంకట శివుడు, భారతి డిసెంబర్ 1934)

బుర్ర వెంకట సుబ్రహ్మణ్యం కథ వ్రాత ఒక విలక్షణ కథ. దీనిలో ఆనాటి అతివాద ఛాయలు గోచరింపజేస్తూనే జ్యోతిష్యం వంటి విశ్వాసాలని పరిచయం చేశారు. (వ్రాత- బుర్ర వెంకట సుబ్రహ్మణ్యం, భారతి, జనవరి- 1935)

విదేశీ వస్తు బహిష్కరణ సహాయ నిరాకరణ గురించి దంపతుల సరస సంభాషణల మధ్య సాగిన అత్యంత హృద్యమైన కథ చదువుల రామచంద్రయ్య రచించిన గృహోద్ధరణమే దేశోద్ధరణము.

ప్రతి ఇల్లు బాగుపడిన గ్రామోద్ధరణము దేశోద్ధారణము జరుగును తమ గృహమును సర్వవిధముల అభివృద్ధికి తెచ్చుటకు పురుషుని కన్నా స్త్రీలు ఎక్కువ సమర్థులు. (జాతీయోద్యమ కథలు, రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, పుట.124)

తాడి నాగమ్మ కథ కాదు లో శాసనోల్లంఘన ఉద్యమం, విదేశీ వస్తు బహిష్కరణం, స్వదేశీ దీక్ష వ్రతముల గురించి నాటి, నేటి యువత ఒడలు గగుర్పొడిచేలా వివరించారు. జాతీయ ఉద్యమంలో భాగమైన తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట కథలు- విశ్లేషణ.

ఈ ఫిర్కాలో పటేళ్లు, పట్వారిలు, దేశముఖులు, జాగీర్దారులు, పోలీసులతో కలిపి అపరిమితమైన దుండగాలు చేస్తున్నారు. కాబట్టి, నేటి నుండి ఏ పోలీసు అధికారి గాని, ప్రభుత్వ ఉద్యోగి గాని, ఇంకెవరైనా గానీ, ప్రజలపై జులుం చేస్తే తగిన శిక్ష అనుభవిస్తారు.

షరా?? ఈ నోటీసు ఎవరు చించుతారో వాళ్ళ పేరు నోటు చేసుకోబడుతుంది జాగ్రత్త!

ఇట్లు

ప్రజారక్షణ సంఘం

(నోటీసు, సి.వి. కృష్ణారావు, విశాలాంధ్ర, జూన్ 1948)

భారత స్వాతంత్రోద్యమంలో భాగమైన తెలంగాణ సాయుత పోరాటం అంటే నిజాం ప్రైవేటు రాక్షసమూక అయిన రజాకారులపై ప్రజలు ఎగరేసిన నిరసన బావుటా. నిజాం హింస నుండి ప్రజలను విముక్తులను చేయడానికి ప్రజారక్షక సంఘాలు ఏర్పడడం, వారి బెదిరింపుకి అధికారం అరచేతుల్లో చెమటలు పట్టడం, కేవలం రెండు పేజీల్లో సూక్ష్మంలో మోక్షంలా వివరించిన కథ సివి కృష్ణారావు రచించిన నోటీసు.

వైరా అనే నిజాం గ్రామంలో ఒక గోడ మీద ఈ నోటీస్ అంటించి ఉంది. పొద్దున ఒక పోలీసు దారిన పోతూ ఈ కాగితం చదువుకున్నాడు. ఆ గోడ యజమానిని బయటకు పిలిచి కాగితం చింపమన్నాడు.

వారి మధ్య సంభాషణ ఈ విధంగా జరిగింది

పోలీసు : ఈ కాగితం ఎవరంటించారు

గోడ యజమాని : ఏమో

పోలీసు : అది చించేయ్

గోడ యజమాని : నీవే చించేయరాదు నాకేం పట్టింది ప్రాణం మీదికి తెచ్చుకోను.

పోలీసు : బద్మాష్ అని గొణుక్కుంటూ వెళ్లిపోయినాడు పోలీస్ (జాతీయోద్యమ కథలు, సంకలనం, రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి, కథ–నోటీసు, రచయిత. సి.వి. కృష్ణారావు. పుట. 225)

మరింత మంది పోలీసులు వచ్చి వడ్డరిని, తాతని, ఎల్లడిని, వీరప్పని, ఎందరినా కాగితం చించమన్నా అదే సమాధానం ఆమీన్ వచ్చి అడిగిన, చివరికి కలెక్టర్ తో మంతనాలు జరిపిన ఏతావాతా తేలింది ఏమిటంటే అధికార వర్గానికి పుట్టిన హడలు వల్ల ఆ పేపరు చింపలేకపోయినారు సామాన్య ప్రజల చేత చింపించలేకపోయినారు.

చివరికి ఒక అనామక కార్యకర్త నైజాం నాజీత్వంపై రాసిన నోటీసు చించే నిమిత్తం కలెక్టర్, అమీన్ ఇద్దరూ బుగ్గన చేతులు చేర్చి ఆలోచించసాగారు.

కలెక్టర్ : అచ్చి బాత్! నేను వరంగల్ నుండి ఒక రజాకార్ని పంపుతాను. అతడు హిందువు లాగా తల గుడ్డ చుట్టుకుని ధోతి కట్టుకొని మీరు అడగంగానే ముందుకొచ్చి చించేట్టు ఏర్పాటు చేస్తాను. కానీ మీరు ఒక పని చేయాలి.

అమీన్ : చిత్తం! ఏంటది?

కలెక్టర్ : వచ్చి చూసే జనంలో ఎవరి వద్ద కాగితం కలం లేకుండా చేయండి!! (నోటిసు, సి.వి. కృష్ణారావు, విశాలాంధ్ర, జూన్, 1948)

విద్య జాతిలో ఆలోచన శక్తిని పురికొల్పుతుంది. విద్య లేని మనిషిని, పశువును మచ్చిక చేసుకున్నట్లు, బెదిరించి బల ప్రయోగంతో తమ తొత్తులుగా చేసుకుని పాలన సాగించిన ఆంగ్లేయులు, నిజాంలు, విద్యావంతుల ప్రశ్నించే తత్వం పట్ల అమితమైన బెదురు కలిగి ఉండేవారని పై సంభాషణ వ్యక్తం చేస్తుంది.

కొత్తగుడా గ్రామపంచాయతీ ప్రభుత్వానికి అదనంగా 200 తుపాకీలు 200 మంది తరిఫీదైన సైనికులు లభించారు. నిజాం నవాబ్ సైన్యంలో కూడా ప్రజా చైతన్యం పాకుతుంది. (కొత్తవార్త, రచయిత. శారద. అభ్యుదయ జూలై 1948)

నిజంగానే కొత్త వార్త కదూ

నిజాం నిరంకుశ సైన్యంలో నూతన చైతన్యం, ప్రజలపై దౌర్జన్యం చెలాయించడానికి, చెలాయించమని అధికారులు ఇచ్చిన ఆదేశాలను పాటించడానికి, విముఖత చూపిన సైన్యం, ప్రజారక్షక సంఘానికి మద్దతు ఇచ్చి సాయిధులుగా గెరిల్లా దళంలో చేరడం అనే ఇతివృత్తంతో శారద రచించిన కథ కొత్త వార్త. (కొత్త వార్త– శారద అభ్యుదయ, జూలై –1948)

తెలంగాణ సాయుధ పోరాట సూర్తిని ప్రతిఫలించిన మరో కథ ఆవుల పిచ్చయ్య రచించిన ఊరేగింపులు. తెలంగాణ రైతాంగ పోరాటంలో అసువులు బాసిన దొడ్డి కొమురయ్య త్యాగాన్ని శ్లాఘిస్తూ సాగిన ఆవుల పిచ్చయ్య కథనం అమోఘం.రైతులు,గొర్రెల కాపరులు, ప్రాణం ఉన్న గొర్రెలు ఆవులు చివరికి ప్రాణంలేని పైరు కూడా దొడ్డి కొమరయ్య త్యాగాన్ని స్మరించుకుంటున్నట్టుగా, అతని వీరమరణ ఊరేగింపులో ప్రజలంతా పాల్గొని కమ్యూనిస్టు పార్టీకి జై కొడుతూ ఎర్రజెండాలను తమ ఇంటిపై ప్రతిష్టించుకున్నట్టుగా సాగిన కథ ద్వారా ఆనాటి ప్రజలలో ఉన్న స్వతంత్రాభిలాషని స్పష్టం చేస్తుంది. (ఊరేగింపులు, ఆవుల పిచ్చయ్య, మీజాన్ 11– 8 –1948)

తుమ్మల వెంకటరామయ్య గారు రచించిన మీరు గెలుస్తారు కథ నేపథ్యం కూడా తెలంగాణ సాయుధ పోరాటమే కావడం గమనార్హం. ఈ కథ కొంతమేరకు మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు రచించిన గొల్ల రామవ్వ కథను గుర్తుకు తెస్తుంది. (మీరు గెలుస్తారు, తుమ్మల వెంకటరామయ్య, అభ్యుదయ, జనవరి, 1948)

కాంచనపల్లి చిన్న వెంకట రామారావు రచించిన దావత్ కథ కాలం చెల్లి పోతున్న నిజాం అధికార ప్రభావం గురించి తెలుపుతుంది. (మన ఊళ్లో కూడానా కథల సంపుటి కాంచనపల్లి చిన్న వెంకట రామారావు -1947)

మనమే నయం కాళోజి కథలలోని ఒకానొక ఆణిముత్యం. తెలంగాణ ప్రజల జీవితం పశువుల కంటే అన్యాయంగా ఉందని ప్రతీకాత్మకంగా కాళోజీ ఈ కథలో వ్యక్తం చేసినారు.

ఈ కథంతా రెండు ఎద్దుల మధ్య సంభాషణగా నడుస్తుంది. తమ పైన దౌర్జన్యం జరిగితే జంతువుల ఎడ జరుగు అన్యాయనిరోధక సంఘం (SPCA) ఉన్నదని, వారు చూస్తూ ఊరుకోరని, లేదా అన్యాయం సహించలేని పరిస్థితి ఏర్పడిన నాడు, కనీసం తల నరికి ఒకేసారి కష్టాల నుండి విముక్తి ఇప్పించునటువంటి కసాయి ఖానాలైనా మనకు ఉన్నాయి కానీ ఈ ప్రజలకు అన్యాయాన్ని ఎదిరించే సంఘము లేదు, జీవితం నచ్చని నాడు ప్రాణం తీసుకునే హక్కు కూడా లేని వెట్టి బ్రతుకు వీరిది, మనమే నయం అని ఎద్దులు మాట్లాడుకుంటునట్టుగా ఈ కథను కాలోజీ రచించారు. (మనమే నయం- రఘువీర్ నారాయణ లక్ష్మీకాంత్ శ్రీనివాస రాంరాజా కాళోజి , కాళోజీ కథలు ఏప్రిల్ 1943)

వట్టికోట ఆళ్వారు స్వామి రచించిన చిన్నప్పుడే అనే కథలో ఆంధ్ర మహాసభ నాయకులు ఒక ఊరి చిన్న పిల్లలను కలుసుకొనుట, కులఅంతరం పాటించక వారి మనసులు గెలుచుకొనుట, ఆ పిల్లల కష్టాలను అడిగి తెలుసుకుని చిన్నప్పుడే వారంతా తమ కుటుంబ కష్టాలను తెలుసుకోవలసిన అగత్యం ఏర్పడిందని గ్రహించి, తర్వాతి తరం జీవితాలు సుఖమయం కావాలంటే ఈ తరం దౌర్జన్యాన్ని ఎదిరించి నిలవవలసిన అవశ్యకతను గుర్తించుట ఈ కథ సారాంశం.

ఈనాడు మనం మన సంతానానికి ఆస్థిగా ఇచ్చేవి అప్పులు రోగాలు, కష్టాలేగా!

మనం ఈరోజు స్వార్థ రహితంగా ధైర్యంగా పనిచేస్తే మన సంతానం అంతా హాయిగా బతుకుతారు. స్వతంత్రం, వ్యక్తిత్వం, గౌరవం, మర్యాద, విశ్వ మానవ సౌభ్రాతృత్వం, సహనశక్తి, పరహితం, ఇది నేటి మానవ సమాజానికి వజ్రవైఢూర్యాలు, దివ్య భవనాలు, నగలు నాణ్యాలు, ఆస్తి ఆదాయం. (చిన్నప్పుడే, వట్టికోట ఆళ్వారు స్వామి, మీజాన్ 18.2.1945)

**మరిన్ని కథలు**

ఇంకా కరుణకుమార (సేవాధర్మం) పొట్లపల్లి రామారావు (ఒంటరి చావు) విశ్వనాథ సత్యనారాయణ (జీవుడి ఇష్టం) జమదగ్ని (గొల్ల హంపన్న) శ్రీ సీతారాం (దేశభక్తులు) అమరేంద్ర (సమర్పణ) పి వెంకటేశ్వర్లు (రహీం భాయ్) ముద్దుకృష్ణ (నా మంత్రి) మొదలగు అనేక ప్రసిద్ధ రచయితల కథలు ఈ సంకలనంలో మనం చదవవచ్చు.

**ముగింపు**

ఈ కథలను చదువుతున్నప్పుడు ఆనాటి తల్లి తన కుమార్తెను ఆశీర్వదించి సత్యాగ్రహమునకు పంపడం, తండ్రి తన కొడుకుని దీవించి సహాయ నిరాకరణోద్యమమునకు ఆహుతి ఇవ్వడం, తాత మనుమని శాసనోల్లంఘానికి పురికొల్పడం, అత్త తన కోడలను ఉత్సాహపరిచి సమరమునకు ఉరికించడం, మామ అల్లునికి ధైర్యం చెప్పి బహిష్కరణ అస్త్రాన్ని ప్రయోగించు బంటుగా పంపడం, భార్య భర్తకు నీతి నేర్పి భారత జాతి దాస్య శృంఖలాలను తెంపు వీరునిగా యుద్ధమునకు పంపడం, మొదలగు దృశ్యములను మనోఫలకములపై దర్శించవచ్చు.



Scanned with OKEN Scanner

మన భారత జాతి త్యాగసహనములను చూసి ప్రపంచము దిగ్భ్రమ చెందిందంటే ఆశ్చర్యమేముంది? ఇటువంటి త్యాగధనులు మానధనులైన భారతమాత బిడ్డలు, మహాత్ముని అడుగుజాడల్లో ప్రపంచానికి ఒక కొత్త సత్యాన్ని చాటి, రక్తపాతరహిత, హింసారహిత, మహోగ్ర ఉద్యమాన్ని సమున్నత స్థాయిలో నిలిపి ఆంగ్లేయుల కబంధహస్తాల నుండి తల్లి భారతి చెర విడిపించి నేటికి 75 సంవత్సరాలు గడిచిన వైనం ఈ కథా వనంలో విహరించిన ప్రతి పాఠకునికి అనుభవంలోకి వస్తుంది.

భారత స్వాతంత్ర వజ్రోత్సవ సంబరాలలో భాగమైన ప్రతి భారత పౌరుడు, ఔదల దాల్చవలసిన అనేక అంశాలను ఈ జాతీయ ఉద్యమ కథలు స్మరణకు తెస్తాయి. ప్రతి ఒక్కరూ చదివి తమతమ గ్రంథాలయాలలో ఈ సంకలనాన్ని భద్రపరచుకోవాల్సిందిగా కోరుతున్నాను.

**ఆకరాలు** (References)

1. మన ఊళ్లో కూడానా – కాంచనపల్లి చిన్న వెంకట రామారావు
2. అభ్యుదయ– జనవరి 1948
3. మీజాన్, 11.8.48
4. విశాలాంధ్ర, జూన్– 1948
5. అభ్యుదయ, జూలై– 1948
6. మీజాన్, 26.05.1956
7. మీజాన్,18.02.1945
8. కాళోజీ కథలు, ఏప్రిల్, 1943
9. భారతి, మే, జూన్, 1948
10. భారతి, ఫిబ్రవరి, 1946
11. ఆంధ్రపత్రిక, ఉగాది సంచిక, 1941–42
12. భారతి, నవంబర్, 1938
13. భారతి, సెప్టెంబర్, 1935
14. గృహలక్ష్మి, ఆగస్టు, 1935
15. భారతి, జనవరి, 1935
16. భారతి, డిసెంబర్, 1934
17. గృహలక్ష్మి, నవంబర్, 1932
18. భారతి, జనవరి, మే, 1932
19. గృహలక్ష్మి మాసపత్రిక, నవంబర్, 1931
20. భారతి, 1931
21. గృహలక్ష్మి, జనవరి, 1931
22. భారతి, అక్టోబర్, 1929
23. భారతి, సెప్టెంబర్, 1928
24. ఆంధ్రపత్రిక, ఉగాది సంచిక, 1924
25. జాతీయ ఉద్యమ కథలు, సంకలనం– ఆచార్య రాచపాలెం చంద్రశేఖర్ రెడ్డి.



Scanned with OKEN Scanner

# తెలుగు నాటకాలు - జాతీయోద్యమం

**డా. ఎం.ఎల్.ఎన్. కుమారి,** తెలుగు అధ్యాపకులు, ఎ.జి & యస్.జి.యస్ డిగ్రీ కళాశాల, ఉయ్యూరు
చరవాణి : 9848547022, E-mail : madalalakshmi9848@gmail.com

నాటకం అనేది ఒక శ్రవణ దృశ్యరూపకం. జానపద కళలు విరసిల్లుతున్న రోజులలో, రాజుల పరిపాలనా కాలంలో ప్రజల వినోదం కోసం అత్యధికంగా ఆదరింపబడిన కళ నాటకం.

నాటకం, సంగీతం, పాటలు, నృత్యాలతో కూడుకొన్న ప్రక్రియ, యక్షగానానికి రూపాంతరమైన నాటకానికి సూత్రధారుడే ఆయువుపట్టు. ఇందులోని పాత్రలన్నీ తమను తామే పరిచయం చేసుకొంటూ రంగప్రవేశం చేస్తాయి. పదహారవ శతాబ్దంలో ప్రారంభమైన నాటక ప్రక్రియను చిందు భాగవతము యక్షగాన నాటకం, వీధి భాగవతం అనీ పిలుస్తారు. వీధి నాటకాలను ఎక్కువ ప్రచారంలో తెచ్చినవారు కూచిపూడి భాగవతులు, కాకతీయుల కాలంలో ప్రదర్శించిన క్రీడాభిరామం కూడా ఒక నాటకమే. తెలుగు నాటకరంగ చరిత్ర, తెలుగులో ఆదికవిగా పేరుగాంచిన నన్నయ్య తన భారత అవతారికలో రసాన్విత కావ్యనాటకముల్ పెక్కుజూచితి అనడాన్ని బట్టి, నన్నయ కాలానికి నాటక ప్రదర్శనలుండేవని అర్థం చేసుకోవచ్చు.

భారత స్వాతంత్ర్యోద్యమ కాలంలో జరిగిన అనేక సంఘటనల్ని నాటక రచయితలు వివిధ నాటకాలుగా మలిచి ప్రజల్ని చైతన్య పరిచారు. ప్రజలు తాము నివసిస్తున్న నేలమీద అభిమానాన్ని ప్రకటించడం, స్వజాతి జనులమీద ప్రేమను పెంపొందించుకోవటం జాతీయతలో కనిపించే కొన్ని ముఖ్యాంశాలు. తరతరాలుగా కొనసాగుతున్న స్థానిక సత్సంప్రదాయాలపై ప్రగాఢమైన అభిమానం; నిర్దిష్ట పాలనా వ్యవస్థకి అనుగుణంగా మనుగడ సాధించే మానసిక స్థితిని కలిగి ఉండటం జాతీయత అనవచ్చు. సర్వసాధారణంగా ప్రజలు తమ అస్తిత్వాలకు తీవ్రంగా భంగం కలుగుతుందని భావించినప్పుడల్లా ఈ జాతీయతా భావాలు ఉద్యమ రూపంలో కనిపిస్తుంటాయి. భిన్న జాతులు, మతాలు, సంస్కృతులు ఉన్నప్పటికీ భారతదేశంలోని ప్రజలంతా తరతరాలుగా కలిసిమెలసి జీవించేవారని చరిత్ర చెబుతుంది. బ్రిటీష్ వాళ్ళు వ్యాపారం కోసం వచ్చి, క్రమేపీ పాలనాధికారాన్ని చేజిక్కుంచుకోవడంలో వాళ్ళకు వ్యతిరేకంగా భారతీయుల్లో జాతీయతా స్ఫూర్తి అంకురించింది.

ఆది ఆంగ్ల విద్యాప్రభావంతో మరింతగా విస్తరిల్లింది. అనేక సాహితీ ప్రక్రియల్లో సాహిత్యం సృజనీకరించబడి ప్రజల్లో జాతీయతా భావాలు వేగంగా వ్యాపించాయి. ఈ పరిస్థితి అన్ని భాషల్లోనూ కనిపిస్తుంది. అలాగే తెలుగులోనూ జాతీయోద్యమ ప్రభావంతో భిన్న ప్రక్రియల్లో సాహిత్యం వెలువడింది. కవిత్వం, నవల, వ్యాసం, నాటకం వంటి సాహిత్య ప్రక్రియలు జాతీయోద్యమాన్ని వేగంగా ప్రసరించడంలో నిర్మాణాత్మకమైన పాత్రను నిర్వహించాయి.

జాతీయోద్యమ ముఖ్య లక్ష్యం పరదేశీయుల్ని పారద్రోలడమే ప్రధాన ధ్యేయమైనప్పటికీ, నాటకాల్లో నాడు జాతీయోద్యమం సామాజిక రంగంలో కనిపించే అనేక సమస్యల్ని పరిష్కరించేదిశగా పయనించిన కోణాన్ని వివరంగా పేర్కొన్నారు. వందేమాతరం, విదేశీవస్తు బహిష్కరణ, సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమం మొదలైన చారిత్రక ఘట్టాలను తెలుగు నాటకాల్లో ప్రతిఫలించిన తీరు కనిపిస్తుంది.

కేవలం 1947 ఆగస్టు 15 వరకు మాత్రమే కాకుండా, 1948 సెప్టెంబరు 17న హైదరాబాదు రాష్ట్రం భారతదేశంలో విలీనం అయ్యేవరకూ చరిత్రను పరిగణలోకి తీసుకొన్నప్పుడు మాత్రమే, ఆంధ్రప్రాంతానికి సంపూర్ణ స్వాతంత్ర్యం సిద్ధించినట్లవుతుంది. తెలుగు నాటకాలపై చూపిన తెలంగాణా సాయుధ పోరాట ప్రభావాన్ని వివరించవచ్చు.

వేదాంతకవి 1948లో రాసిన ఛలో హైదరాబాద్, వాసిరెడ్డి భాస్కరరావు, సుంకర సత్యనారాయణలు కలిసి రాసిన మాభూమి నాటకాలు చదివితే తెలంగాణాలో జరిగిన సాయుధ పోరాటం చాలా వరకూ అవగాహన కొస్తుంది. నిజాం నిరంకుశ పాలనలో అమీనులు, దేశ్‌ముఖ్‌లు సాగించిన దురంతాలపై నాటి సామాన్య ప్రజలు సహితం పోరాడిన సంఘటనలన్ని జాతీయోద్యమంలో భాగంగానే చూడాలనేది ఒక ప్రతిపాదన. తెలంగాణా సాయుధ పోరాటంలో స్త్రీల పాత్రను కూడా చిత్రించిన నాటకాలను, స్త్రీ చైతన్యాన్ని కూడా ఆయా నాటకాల్లో ప్రతఫలించిన తీరు కనిపిస్తుంది.

నాటకాల్లో కనిపించే ప్రధానాంశాలు సంఘ సంస్కరణ, దేశభక్తి, సమగ్ర జాతీయతా భావం, మద్యపాన నిషేధం, విదేశీ వస్తు, శాసనోల్లంఘన, ఖద్దరు వస్త్రాలను ధరించడం, గాంధీజీ సూక్తులు పాటించడం, సత్యాగ్రహం, శాంతి సౌహార్ధభావం, అస్పృశ్యతా నివారణ వంటి వన్నీ జాతీయోద్యమంలో అంతర్భాగంగా కొనసాగిన సంస్కరణలు.

రెండవ అధ్యాయంలో జాతీయోద్యమ నాటక నేపథ్యాన్ని వివరిస్తూ పూర్వపరిశోధనల్ని పేర్కొంటూనే తనదైన ప్రతిపాదనలను పాఠకుల ముందుంచారు. దేశభక్తి పూరితాలైన తెలుగు నాటకాలను పౌరాణిక, చారిత్రక, సాంఘిక నాటకాలుగా విభజిస్తూనే, స్వాతంత్ర్య సమరాన్ని ప్రత్యక్షంగా వ్యాఖ్యానించిన రాజకీయనాటకాలను విభజన కూడా చేస్తే బాగుంటుందన్నారు.

పౌరాణిక నాటకాల్లో ఆయా పాత్రల ద్వారా జాతీయ భావాలను ప్రభోదించారని నిరూపించారు. దౌల్తాబాదు గోపాల కృష్ణారావు 1932లో రాసిన సంపూర్ణ భారతం అనే నాటకంలో అర్జునుడు శివుడిని మెప్పించి పాశుపతాస్త్రం కోరతాడు. ఆ అస్త్రమే కోరడంలో గల ఆంతర్యాన్ని తెలపమన్న శివుడితో అర్జునుడు నిరంకుశ ప్రభువులను దండించి భారతీయుల దాస్యాన్నీ రూపుమాపటానికని చెప్తాడు.

తిరుపతి వేంకట కవుల రచించిన ప్రఖ్యాత నాటకం పాండవోద్యగము (1938) లో ధర్మరాజు వంటి గుణ సంపన్నుడిగా గాంధీజీని కవులు వర్ణించారని చేసిన సమన్వయం బాగుంది. 'అలుగుటయే యెరుంగని మహామహితాత్ముడజాత శత్రువే అలిగిన నాడు...' అనే పద్యంలో ధర్మరాజు పాత్ర చిత్రణలో గాంధీజీ జాతీయోద్యమ స్వభావం ఉందని వ్యాఖ్యానిస్తున్నారు. ఊటకూరు సత్యనారాయణ గారి అభిమన్యు (1938) నాటకంలో భర్తపై ఉండే ప్రేమ కొద్దీ ఉత్తర అభిమన్యుణ్ణి యుద్ధరంగానికి పోవద్దన్నా, తానూ సారధియై వస్తానని పలకడం, భర్త వద్దన్నా, స్త్రీలు కూడా యుద్ధంలో పాలుపంచుకోవాలని వాదించడంలో నాటి స్వాతంత్ర్య సమరంలో స్త్రీలను చైతన్యపరచడమేనంటారు'.

చారిత్రక నాటకాల్లో మహమ్మదీయుల పాలనలో హిందూధర్మానికి జరిగిన హానిని ప్రస్తావిస్తూ వ్రాసిన నాటకాలు అధికంగా ఉన్నాయి. పౌరాణిక పురుషులకంటే చారిత్రక పురుషులు స్వాతంత్ర్య యోధులలో, ప్రజలలో మరింత ఉత్సాహాన్ని నింపారని, ఆ నాటకాలను సోదాహరణంగా వివరించడం జరిగింది.

ముత్తరాజు సుబ్బారావు "చంద్రగుప్త" (1932), శేషబాబు, అశోకరాజ్యము' (1945), ప్రభులింగాచార్యుల పల్నాటి వీరచరిత్రము' (1928), ఉన్నవ లక్ష్మీనారాయణ 'నాయకురాలు' (1926), నండూరి బంగారయ్య "ఆంధ్రతేజము" (1938), వేదం వేంకటరాయశాస్త్రి "ప్రతాపరుద్రీయము" (1897), పోతుకూచి సుబ్బయ్య "ఆంధ్రవాణీ సామ్రాజ్యము" (1944), కోలాచలం శ్రీనివాసరావు "సుల్తాన్ చాంద్ బీ' (1900) కాళ్ళకూరి సాంబశివరావు "రంగరాయి కదన సమవాకారం' (1899), శ్రీపాద



Scanned with OKEN Scanner

కృష్ణమూర్తి “బొబ్బిలి యుద్ధం” (1908), కొప్పరపు సుబ్బారావు “రోషనార’ (1921), పడాల రామారావు ‘అల్లూరి సీతారామరాజు’ (1950) మొదలైన నాటకాల్లో దేశవ్యాప్తంగానూ, ఆంధ్రదేశంలోనూ ప్రజారంజకంగా పాలన అందించిన పాలకుల స్ఫూర్తినీ, వారి పోరాట పటిమనీ, వారు మహమ్మదీయులు, విదేశీయులతో పోరాడిన చారిత్రక సంఘటనలను వర్ణించారన్నారు. ఇవన్నీ జాతీయోద్యమ ప్రభావంతో రాసిన నాటకాలేనని నిరూపించవచ్చు.

సాంఘిక, రాజకీయ నాటకాల్లో గాంధీజీ చేసిన ఉద్యమప్రభావం అత్యధికంగా కనిపిస్తుంది. గాంధీజీ ఒకవైపు స్వాతంత్ర్యం కోసం పోరాటాన్ని కొనసాగిస్తూనే, దేశం సమైక్యంగా ఉండాలంటే అంతర్గతంగా జరగాల్సిన వాటిని గుర్తించారన్నారు. దీనిలో భాగమే ఆయన కొనసాగించిన హరిజనోద్యమం అనీ దీనికి నాటక కర్తలు ఎంతో ప్రభావితులైయ్యారని ఆ నాటకాలను సోదాహరణంగా నిరూపించారు.

ఈ విధంగా నాటకం అనేది జాతీయోధ్యమంలో తన దైన ముద్రవేసి గొప్పతనాన్ని చాటుకుందని చెప్పవచ్చు.

**ఉపయుక్త గ్రంథాలు**

1. తెలుగు సాహిత్య ప్రక్రియలు, నాటకం – డా. తుందు కృష్ణ కౌండిన్య
2. క్రీడాభిరామం – బి.వి.సింగరాచార్యులు
3. వీధి నాటకాలు – తమ్మారపు వెంకటస్వామి
4. జాతీయోధ్యమం – వికీపీడియా
5. నాటకాలు – వికీపీడియా



Scanned with OKEN Scanner

# ప్రజల మనిషి - ఉద్యమ స్ఫూర్తి

డా. డి. ఉమారాణి, ప్రధానాచార్యులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, అవనిగడ్డ

సుదీర్ఘ కాలం సాగిన భారత స్వాతంత్ర్యోద్యమం కేవలం ఒక రాజకీయ పోరాటం మాత్రమే కాదు, ఒక సామాజిక ఉద్యమం కూడా. తరతరాల బానిసత్వంలో మగ్గిపోతున్న బ్రతుకులకు ప్రశ్నించడం నేర్పిన గురువు. మూఢనమ్మకాలు, ఛాందసభావాలతో అనేక అడ్డుగోడల మధ్య ఇరుకు గదులలో నివశించే ఆనాటి సమాజంలో మార్పు ఆవశ్యకతను చాటి చెప్పిన ఒక చైతన్య దీప్తి. పరాయి పాలనలో తామేమిటో మరచిపోయి బ్రతుకుతున్న పౌరులకు భారతీయ సాంస్కృతిక ఔన్నత్యాన్ని గుర్తు చేసిన గురువు. సమూలమైన మార్పుకోసం అనేక కోణాల్లో, అనేక మార్గాలలో సాగిన ఈ పోరాటం అన్ని వర్గాలను ప్రభావితం చేసిందనడం ఎంత మాత్రం అతిశయోక్తి కాదు. ఉద్దేశ్య పూర్వకంగానో, యాదృచ్ఛికంగానో ఆ కాలంలో ప్రతి మనిషి మార్పు బాటలో అడుగుపెట్టాడు. విద్యావంతులైన నగరవాసులైనా, అమాయకులైన పల్లెప్రజలైనా ఉప్పెనలా వస్తున్న సమకాలీన సమాజ చైతన్యాన్ని స్వాగతించక తప్పలేదు. ఈ మార్పు ఆనాటి జీవన విధానంలో కనబడుతుంది. ప్రజల ఆలోచనా ధోరణిలో కనబడుతుంది. దొరల ఆధిపత్య ధోరణిలో కనబడుతుంది. (ఆధిపత్యం రూపు మార్చుకొని కనబడుతుంది, రూపుమాపబడలేదు.) స్వాతంత్ర్య కాలం నాటి ఏ కథయైనా ఈ మార్పులను ప్రతిబింబించక తప్పదు. అలాగే భారత స్వాతంత్ర్య పోరాటంలో ప్రత్యక్షంగా పాల్గొనలేని తెలంగాణా ప్రజల జీవన విధానాన్ని ప్రతిఫలించిన ప్రజల మనిషి కూడా భారత స్వాతంత్రోద్యమ స్ఫూర్తిని అనేక కోణాల్లో ఆవిష్కరిస్తుంది. 1955 లో ప్రచురించబడిన ఈ నవల 1938 కి ముందు, అనగా తెలంగాణాలో కాంగ్రెస్ పార్టీ ఆవిష్కరణకు ముందు సంఘటలను కథావస్తువుగా తీసుకొంది.

వట్టికోట ఆళ్వారు స్వామి తన నవలను ప్రశ్నతో మొదలు పెడతాడు. రైతుకుటుంబంలోని ఒక బాలుడు భూస్వామి ఆధిపత్యం ఎందుకు సహించాలని తన తండ్రిని ప్రశ్నించడం కథ మొదటి అధ్యాయం. ఆ ప్రశ్న ఒక నవ శకానికి నాంది వాక్యం లాగా అనిపిస్తుంది. అయితే ఈ ప్రశ్నించే బాలుడు కథానాయకుడు కాదు. తన ధిక్కార స్వరాన్ని ధీరోదాత్తంగా చివరి వరకు నిలబెట్టుకొనే నాయకవర్యుడు కూడా కాదు. కేవలం అతని ప్రశ్న సమసమాజంలో అనివార్యంగా రాబోతోన్న ధిక్కారాన్ని మాత్రం చూపిస్తుంది. ఈ ప్రశ్నని అతడు తన స్నేహితుడు కంఠీరవంతో పంచుకొంటాడు. కంఠీరవానికి కూడా అనేక ప్రశ్నలు, అతని చిన్న గుండెలో ఎన్నో భయాలు–ఇవన్నీ కూడా పోను పోను అతని వ్యక్తిత్వాన్ని ప్రభావితం చేసి అతన్ని ఒక అన్వేషకుడిగా ఆవిష్కరిస్తాయి. చిన్న తనం నుండే సమాజంలో అతను చూసిన విభిన్నకోణాలు అతని మేధను మధిస్తాయి. అతనిలో రగిలిన అన్వేషణాతృష్ణ అతి తీవ్రమైనది. పుస్తక విజ్ఞానం దాన్ని కొంత వరకు మాత్రమే తీరుస్తుంది. మిగిలిన భాగాన్ని అతను తన చుట్టూ ఉన్న సమాజం చదవడం ద్వారా నేర్చుకొంటాడు. అతని చుట్టూ ఉన్న తెలంగాణా సమాజం భారత దేశానికి ప్రతిబింబం. ఆర్థిక అసమానతలు, సామాజిక కట్టుబాట్లు బీటలు వారే కాలానికి అతను ప్రతినిధి. మానసిక వేదనతో ఉన్న ఇంటిని, కన్న తల్లిని, స్వంత ఊరిని వదిలి వెళ్ళిన అతడు తన తండ్రి కులము, వృత్తి ద్వారానే ఆదరణను పొందుతాడు. కాని కులతత్వానికి అతను అతీతుడు. మానవత్వానికి ప్రతీక అతడు.



Scanned with OKEN Scanner

ఒక విధంగా చెప్పాలంటే కంఠీరవం గాంధీజికి సూక్ష్మరూపం. అతడు పాటించే నిబద్ధత అతని మానవత్వం అహింసా వాదం ఇంకా అనేక కోణాలు గాంధీ రూపాన్ని అతనిలో ఆవిష్కరిస్తాయి. మహాత్మాగాంధీ యుగం నడుస్తున్న కాలంలో గాంధీరూపం నవలలో ఆవిష్కృతమవడం వింత కాదు కదా! గాంధీతత్వమేకాక అతని సిద్ధాంతాలు కూడా కంఠీరవం ఆచరణలో పెట్టలేదు. అతని ప్రేరణతో జరిగే గ్రామస్థాయి ఉద్యమాలు గాంధీజి నడిపిన శాసనోల్లంఘన ఇంకా సహాయనిరాకరణ ఉద్యమాలను తలపిస్తాయి. ఉద్యమ సిద్ధాంతాలను అట్టడుగుస్థాయి ప్రజల వద్దకు తీసుకెళ్ళడంలో కూడా కంఠీరవం గాంధీని తలపిస్తాడు. కులవ్యవస్థను ధిక్కరించడంలోను, పీడిత తాడిత ప్రజలను ఆదరించడంలోనూ కూడా కంఠీరవంలో మహాత్ముడే మనకు కన్పిస్తాడు.

తల్లిని ఎంతో ప్రేమించి, ఆమె తన స్వంత కొడుకు, కంఠీరవానికి అన్న అయిన వెంకట్రావు చేతిలో హింసించబడటం భరించలేక అన్నను ధిక్కరించి ఇంటిని విడిచి వెళ్ళిన కంఠీరవం ఆ తల్లి బాధను కూడా లెక్క చెయ్యకుండా జమిందారుతో కుమ్మక్కయ్యి అన్నచేసిన మోసానికి తగిన శిక్ష పడేటట్లు చేస్తాడు. కొడుకు దూరమై బాధ పడుతున్న తల్లితో తన స్నేహితులను స్వంత బిడ్డలుగా ఆదరించమని చెబుతాడు. కులం కంఠీరవాన్ని ఎప్పుడూ అడ్డుకోలేదు. అలాగే అతని విచక్షణ ఎవరి ఆధిపత్యాన్ని గుడ్డిగా ఆమోదించనివ్వలేదు. రాజరికాన్ని, బూర్జువా వ్యవస్థను ధిక్కరిస్తున్నప్పుడూ, జైలులో చిత్రహింసలను మనోనిబ్బరంతో ఎదుర్కొంటున్నప్పుడూ, తోటి ఖైదీని విడుదల తరువాత తనతో సహపంక్తిలో కూర్చోపెట్టుకున్నప్పుడు, ఇలా అనేక సందర్భాలలో కంఠీరవం ఒక గాంధేయ వాదిలాగే కనిపిస్తాడు. అతను ధిక్కరించింది బ్రిటిష్ వ్యవస్థను కాకపోయినా ఆ ధిక్కరణను ప్రేరేపించిన అధికార వ్యవస్థ దానికి మరోరూపమే.

ఇలా భారత పోరాట చరిత్ర భారత భూభాగంలో అంతర్భాగమై, దేశంలో భాగంకాని తెలంగాణా కథలో మనకు కన్పిస్తుంది. దేశమంతటా ప్రజా చైతన్యం ఉప్పెనలా పెల్లుబుకుతుంది. ఆ కెరటాలు తెలంగాణాకు తాకకుండా ఉండలేవు. తెల్లదొర అయినా నల్లదొర అయినా నిరంకుశత్వానికి చరమగీతం పాడాల్సిందేనని ప్రజలు నిశ్చయించుకొన్న రోజులవి. ఆ ప్రజాచైతన్యాన్ని తన కలంద్వారా చిత్రించే ప్రయత్నంలో రచయిత రూపం మార్చుకొని నిరంతరం బ్రతికే ఉంటానని హెచ్చరిస్తున్న దోపిడి వ్యవస్థను కూడా విస్మరించలేదు. ఈ ప్రకారంగా ప్రజా పోరాటాన్ని ఒక అందమైన చిత్రంగా కాక వాస్తవికత ఉట్టి పడేలా వట్టికోట ఆళ్వారుస్వామి చిత్రించారు.

**ఆధార గ్రంథాలు**

1. ప్రజల మనిషి – వట్టికోట ఆళ్వారుస్వామి, విశాలాంధ్ర పబ్లిషింగ్ హౌస్, 1955.
2. వట్టి కోట నవలలు నిర్దిష్ట వాస్తవికత – కాసుల ప్రతాప రెడ్డి, అక్టోబర్ 2వ తేదిన జరిగిన తెలంగాణా భాషా సాంస్కృతిక మండలి సదస్సులో సమర్పించిన పత్రం. 31 అక్టోబర్ 2014న ప్రచురణ.
3. ప్రజారాజ్యాన్ని కలగనే ప్రజల మనిషి, సాక్షి దినపత్రిక 8 డిసెంబర్ 2013.



Scanned with OKEN Scanner

ISSN 2457-0796 UGC Care List Approved Journals
మూసీ మాసపత్రిక ప్రత్యేక సంచిక సంపుటి -26 : సంచిక - 6 (2) హైదరాబాద్ ఏప్రిల్ - 2023

# స్వాతంత్రోద్యమంలో గ్రంథాలయోద్యమం

(గ్రంధాలయ శాస్త్ర విశారద అయ్యంకి వెంకట రమణయ్య విశేష సేవలు)

**ముప్పరాజు కిశోర్ బాబు,** అకడమిక్ కన్సల్టెంట్, డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైబ్రరీ & ఇన్ఫర్మేషన్ సైన్స్,
శ్రీ వెంకటేశ్వర యూనివర్సిటీ, తిరుపతి. చరవాణి : 95029 61616
**డా. కమ్ముల రవి గంగాధర శేషుకుమార్,** తెలుగు లెక్చరర్, ఎస్.ఆర్.ఆర్ & సి.వి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
విజయవాడ. చరవాణి : 93953 96699.

గ్రంధాలయాలు ఆధునిక దేవాలయాలు. సాహిత్య భాండాగారాలు. భారత స్వాతంత్ర్యోద్యమంలో గ్రంధాలయాల పాత్ర బృహత్తరమైనది. గ్రంధాలయాల సమగ్రాభివృద్ధికి విశేష కృషి చేసిన వారిలో అయ్యంకి వెంకట రమణయ్య గారు ప్రధములు. ముప్పయి సంవత్సరాల సేవనే గొప్ప సుధీర్ఘమైన సేవగా కొనియాడడం పరిపాటి. సుమారు అరవై సంవత్సరాలకు పైగా జాతీయస్థాయిలో గ్రంధాలయాల స్థాపన, అభివృద్ధి కోసం నిర్విరామ కృషి చేసిన చరిత్ర అయ్యంకి గారిది. ఒక వ్యక్తి, శక్తిగా మారితే మొత్తం వ్యవస్థనే ప్రగతిపథంలో నడిపించగలడనేందుకు అయ్యంకి వారి జీవిత చరిత్రే తార్కాణం. 1919 నవంబరు 14వ తేదీన మద్రాసులో ప్రథమ అఖిల భారత గ్రంధాలయ మహాసభను దేశ వ్యాప్తంగా అయ్యంకి వారు నిర్వహించిన తేదీనే జాతీయ గ్రంధాలయ దినోత్సవంగా జరుపుకుంటున్నామంటే ఆయన సేవానిరతి ఎంత గొప్పదో తేటతెల్లమవుతుంది.

తెలుగు రాష్ట్రాల్లో గ్రంధాలయాల వృద్ధి వికాసాల పరిణామక్రమాన్ని పరిశీలిస్తే కొమర్రాజు లక్ష్మణరావు 1901 సెప్టెంబరు 1వ తేదిన హైదరాబాదులోని కోఠి ప్రాంతంలో స్థాపించిన "శ్రీ కృష్ణ దేవరాయ ఆంధ్ర భాషా నిలయం" కీలకమైనది. ఆ రోజుల్లో హైదరాబాదు ప్రాంతంలో ఇదే మొదటిది. 1904లో హనుమకొండలో స్థాపించబడిన 'రాజరాజనరేంద్ర ఆంధ్రభాషా నిలయం', 1905లో హైదరాబాదులో స్థాపించబడిన 'ఆంధ్ర సంవర్ధినీ గ్రంధాలయం', 1906లో 'విజ్ఞాన చంద్రికా గ్రంధమండలి', 1918లో సూర్యాపేటలో 'ఆంధ్ర సరస్వతి గ్రంధనిలయం' మొదలగునవి ఆరోజుల్లో తెలుగు సాహిత్యాన్ని నాటి ప్రజలకు చేరువ చెయ్యడంలో ప్రముఖ పాత్ర పోషించాయి. స్వాతంత్రోద్యమ తొలినాళ్ళలో ఆంధ్ర, తెలంగాణా భేద భావనలు దాదాపు లేవనే చెప్పాలి. అందరి లక్ష్యం స్వతంత్ర భారతమే. ఆరోజుల్లో హైదరాబాదు, సికింద్రాబాదు, హనుమకొండ మొదలగు ప్రాంతాల్లో స్థాపించబడిన గ్రంధాలయాల పేర్లు అధికంగా "ఆంధ్ర" పేరుతోనే స్థాపించబడటమే ఇందుకు నిదర్శనం. భాషా వాచకంగానైనా, ప్రాంతవాచకంగానైనా "ఆంధ్ర"పదం తెలుగు ప్రజలందరిని ఐకమత్యంగా నిలిపేందుకే దోహదపడిందని తెలుస్తుంది. చిలుకూరి వీరభద్రరావు రాసిన "ఆంధ్రుల చరిత్ర" వంటి పలు గ్రంధాలు గ్రంధాలయాల ద్వారానే ఆ రోజుల్లో సాహిత్యాభిమానులకూ, రచయితలకు గొప్ప స్ఫూర్తిని కల్గించాయి. 1872 నాటికే సికింద్రాబాదులో గ్రంధాలయం స్థాపించిన సోమసుందర మొదలియారు మొదలుకొని అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, ముదిగొండ శంకరాచార్యులు వంటి వారెందరో తెలంగాణా ప్రాంతంలో గ్రంధాలయాల వికాసానికి విశేష కృషి చేశారు.

శ్రీ అయ్యంకి వెంకట రమణయ్యగారు 1890 జూలై 24న తూర్పుగోదావరి జిల్లాలోని రామచంద్రాపురం తాలుకా "కొంకుదురు" గ్రామంలో వెంకట రత్నం, మంగమాంబ దంపతుల నోముల పంటగా జన్మించారు. అయ్యంకి వారి కుటుంబమంతా సామాజిక సేవ నేపధ్యం కలిగినదే. అయ్యంకి వారు నర్సాపురంలో 4వ ఫారమ్ చదువుతున్నప్పుడు 1907లో బిపిన్ చంద్రపాల్ గారి ఆంధ్ర ప్రాంత పర్యటన సమయంలో బంధువుల వివాహ నిమిత్తం రాజమండ్రి వెళ్ళడం, బిపిన్ చంద్రగారి సభకు



Scanned with OKEN Scanner

హాజరుకావడంతో అయ్యంకి వారు తొలిసారిగా స్వాతంత్రోద్యమం పట్ల ఆకర్షితులయ్యారు. అనంతరం మచిలీపట్నంలో 'సర్' బిరుదాంకితులు బ్రహ్మర్షి రఘుపతి వెంకటరత్నం నాయుడు, ముట్నూరు కృష్ణారావు వంటి వారితో పరిచయం ఏర్పడింది. అనంతరం మచిలీపట్టణంలోని స్థానిక సాహిత్యాభిమానుల సహచర్యంతో 'ఆంధ్ర సాహిత్య పత్రిక'ను స్థాపించారు.

అయ్యంకి వెంకట రమణయ్య గ్రంధాలయ స్థాపనను ఒక బృహత్కార్యంగా భావించి అందుకు అనువుగా తన నివాసాన్ని విజయవాడకు మార్చి, గ్రంధాలయాల అభివృద్ధికి నడుంకట్టడంతో గ్రంధాలయాల వ్యాప్తి ఉద్యమ రూపాన్ని సంతరించుకుంది. 1911లో విజయవాడలో రామమోహన గ్రంధాలయం స్థాపించబడిన తొలినాళ్ళలో అయ్యంకి వారి పాత్ర కీలకమైనది. వందేమాతర ఉద్యమం ప్రేరణతో అయ్యంకి వారు చేపట్టిన గ్రంధాలయ మహాసభల నిర్వహణ, గ్రంధాలయ సంఘాల స్థాపన, పత్రికల నిర్వహణ వంటి కార్యకలాపాలు ఆ రోజుల్లో ఎందరికో స్ఫూర్తినిచ్చాయి, ఎంతగానో చైతన్యపరిచాయి. కృష్ణా, గోదావరి ప్రాంతాలు మొదలుకొని, ఆంధ్ర ప్రాంతంలోని ప్రముఖ పట్టణాలలో గ్రంధాలయ వికాసయాత్రలు, శిక్షణాతరగతులు, గ్రామ స్థాయి గ్రంధాలయాల స్థాపన వంటి కార్యక్రమాలు గంజాం ప్రాంతం నుంచి బళ్ళారి ప్రాంతం వరకు గ్రంధాలయాల వ్యాప్తికి తోడ్పడ్డాయి. 1914లో ఏర్పడిన 'ఆంధ్ర దేశ గ్రంధ భాండాగార సంఘం' వంటి పలు సంఘాలకు కార్యదర్శిగా, క్రియాశీలక సభ్యునిగా, ప్రోత్సాహకునిగా, నిర్వాహకునిగా పనిచేశారు.

అయ్యంకి వారికి "లోకమాన్య" బాలగంగాధర తిలక్, "జాతిపిత" గాంధీజీ వంటి జాతీయ నాయకులతో పరిచయం ఏర్పడిన అనంతరం జాతీయోద్యమంలో మరింత విస్తృతంగా పాల్గొనడం ప్రారంభించారు. వెళ్ళిన ప్రతీ చోటా విదేశీ వస్త్రాలనూ, విదేశీ వస్తువులను బహిష్కరించాలని పిలుపునిచ్చేవారు.1910లో స్థాపించిన "ఆంధ్ర భారతి" పత్రిక ద్వారా కళలు, సంస్కృతి, సాహిత్యం, శిల్పం, స్వాతంత్రోద్యమం గురించిన వ్యాసాలను, వార్తలను, భావనలను వ్యాప్తి చేశారు. 1915లో "గ్రంధాలయ సర్వస్వం" త్రైమాసిక పత్రిక స్థాపన అయ్యంకి వారి జీవితంలోనే కీలకమైన ఘట్టం. ఈ పత్రిక తర్వాత కాలంలో మాస పత్రికగా రూపాంతరం చెంది గ్రంధాలయ శాస్త్రానికి సంబంధించి అతి ప్రామాణికమైన ప్రాచీన పత్రికగా దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందింది. గ్రంధాలయ శాస్త్ర సంబంధమైన వ్యాసాలే కాకుండా శ్రీశ్రీ, గురజాడ, రాయప్రోలు, తిరుపతి వేంకట కవులు, తాపీ ధర్మారావు, శేషాద్రి రమణకవులు, రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ, రాయప్రోలు వంటి సాహితీ ప్రముఖుల సాహిత్యం ఈ గ్రంధాలయ సర్వస్వంలో ప్రచురింపబడేది. అలాగే 1919లో "అఖిల భారత పౌర గ్రంధాలయ సంఘం" మద్రాసు వేదికగా ప్రారంభించడం మరోమలుపు. ప్రకృతి జీవన విధానం ఆవశ్యకతను తెలియజెప్పేందుకు నారిశెట్టి హనుమయ్య గారి సంపాదకత్వంలో 'ప్రకృతి' పత్రికను 1919 ఆగష్టు 1న ప్రారంభించారు. ఈ ప్రకృతి వైద్య విధాన ప్రచారంలో భాగంగా 'ది ఇండియన్ న్యాచురోపతి' అనే పత్రిక కూడా అయ్యంకి వారి ఆధ్వర్యంలోనే నడిచింది. 1924 జూలైలో "ఇండియన్ లైబ్రరీ జర్నల్"ను ప్రారంభించి జాతీయ స్థాయిలో వ్యాసాలను ప్రచురించేవారు. 1927లో 'కొరడా' పత్రికను స్థాపించి బ్రిటీషు ప్రభుత్వ విధానాలను, దుర్మార్గాలను ప్రశ్నించేవారు.

జాతీయోద్యమంలో కీలకమైన సహకారోద్యమం బలోపేతం అయ్యేందుకు 'సహకారం' అనే పత్రికను నడిపారు. ఆ రోజుల్లో గ్రామీణ గ్రంధాలయాల ఏర్పాటుకు కూడా సహకారోద్యమం ప్రముఖంగా తోడ్పడింది. తిలక్, అనిబిసెంట్ మొదలగువారి సందేశాల ప్రేరణతో 'దివ్య జ్ఞాన సమాజం' వారి కార్యకలాపాలలో పాల్గొనేవారు. 'దివ్య జ్ఞాన దీపిక' అనే పత్రికకు సంపాదకునిగా కూడా వ్యవహరించారు. గ్రంధాలయోద్యమానికి బరోడా సంస్థానం ద్వారా జరుగుతున్న కృషిని గమనించి బరోడా సంస్థానాన్ని సందర్శించారు. గ్రంధాలను పేటికల ద్వారా విభజించి భద్రపరచడం, సూచికల తయారీ వంటి విధానాలను ప్రారంభించారు. గ్రంధాలయాల ద్వారా వయోజనవిద్య, భారతీయ సంస్కృతి పరిరక్షణ, యుద్ధ వీరులకు సాహిత్య పుస్తకాల సరఫరా వంటి కార్యకలాపాలు నిర్వహించారు. ఆయుర్వేదంలోను ప్రకృతి వైద్యంలోనూ ఉచితంగా వైద్య సేవలు అందించేవారు. నోరి వెంకటేశ్వర్లు గారి సహకారంతో 'ఫూల్స్‌క్లబ్' స్థాపించారు. జాతీయోద్యమ కార్యకర్తలతో కలిసి, బ్రిటీషు వారి దోపిడి విధానాలను, నిరంకుశ



Scanned with OKEN Scanner

చట్టాలను ఈ క్లబ్ ద్వారా విమర్శనాత్మకంగా వ్యతిరేకించేవారు. 'ఫూల్స్' ఎవరంటే ప్రపంచమంతా తమ పైనే ఆధారపడి ఉందనే భ్రమించి, గర్వంతో విర్రవీగే బ్రిటీష్ పాలకులే ఫూల్స్‌తో సమానమని ధైర్యంగా ప్రకటించారు. ఈ విధంగా అనేక రంగాలలో నిరుపమాన సేవలందించిన అయ్యంకి వారు చిరస్మరణీయులు.

'గ్రంథాలయ శాస్త్ర విశారద', 'గ్రంథాలయోద్ధారక' బిరుదులతో సత్కరించబడిన అయ్యంకి వారిని 1972లో భారత ప్రభుత్వం 'పద్మశ్రీ' పురస్కారంతో గౌరవించింది. అలుపెరుగని సేవలతో కోట్లాది తెలుగు ప్రజల హృదయాల్లో తెలుగు తల్లి ముద్దుబిడ్డగా కొనియాడబడేటంతటి ఖ్యాతిని ఆర్జించిన అయ్యంకివారు ధన్యజీవి. ఆంధ్రయూనివర్శిటీలో లైబ్రరీ సైన్సు విభాగంలో స్వర్ణపతాకాన్ని అయ్యంకి వారి పేరుతో నేటికీ బహుకరిస్తుండటం గమనార్హం. తెలుగు రాష్ట్రాల్లోని ప్రముఖ గ్రంథాలయాలలో అయ్యంకి వారి ఫోటో లేని గ్రంథాలయాలు అరుదు. గ్రంథాలయోద్యమ చరిత్రలో అయ్యంకి వారిదే సమున్నత స్థానం. మదరాసు రాష్ట్రంలోని మన ఆంధ్ర ప్రాంతం మొదలుకొని దేశవ్యాప్తంగా 'గ్రంథాలయోద్యమ పితామహుని'గా పేరొందిన అయ్యంకి వెంకట రమణయ్య గారి సేవానిరతి తరతరాలకు ఆదర్శప్రాయం.



Scanned with OKEN Scanner







సదస్సునుద్దేశించి ప్రసంగిస్తున్న
డా. డి. ఉమారాణి, ప్రిన్సిపాల్, జి.డి.సి. అవనిగడ్డ

కీలకోపన్యాసం చేస్తున్న తెరసం అధ్యక్షులు
డా. నాళేశ్వరం శంకరం, హైదరాబాదు







పత్ర సమర్పణతో పాటు సదస్సు నివేదికను
చదువుతున్న డా. కె.వి. శాంతకుమారి

సదస్సు సమాపనోత్సవానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన
శ్రీ వాడ్రేవు సుందరరావు, విశ్రాంత అధ్యాపకులు






సదస్సుకు హాజరైన పెద్దలు, విద్యార్థులు,
సదస్సు నిర్వాహకులు

Scanned with OKEN Scanner

# మూసీ ప్రత్యేక సంచిక

**UGC Care List Approved Journals Under Arts and Humanities Category**

## తెలుగు సాహిత్యంలో జాతీయోద్యమ ప్రతిఫలనాలు

## "They Mirrored the Struggle"

8 ఆగస్టు, 2022




Scanned with OKEN Scanner